اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ

# శాంతిబాట

సంతోషమయ జీవనానికి మార్గదర్శి

సంపుటి 3 సంచికలు 4 & 5 నవంబర్ & డిశంబర్ 2011 రూ. 34/-

పరిణామవాదులు కల్పించిన

## రాతి యుగం

ఓ చారిత్రక అబద్ధం

## ముస్లిమ్ మహిళ

కొత్త సీరియల్

అల్లాహ్
ఖుర్'ఆన్
ముహమ్మద్(స)
ప్రత్యేక వ్యాసం

అపార్థం చేసుకోబడిన

## ఆచరణ

لَا يُدْرِكُهُ الْاَبْصَارُ وَهُوَ يُدْرِكُ الْاَبْصَارَ
وَهُوَ اللَّطِيفُ الْخَبِيرُ

**Vision perceives Him not, but He perceives [all] vision; and He is the Subtle, the Acquainted. (Qur'an 6:103)**

సృష్టికర్త

# اللّٰهُ

**అల్-ఖబీర్**

**الْخَبِيرُ**

సర్వం తెలిసినవాడు

**THE ACQUAINTED**

**అల్-లతీఫ్**

**اللَّطِيفُ**

సూక్ష్మగ్రాహి

**THE SUBTLE**

# అల్లాహ్

ఏ చూపులు కూడా ఆయనను అందుకోలేవు. కాని ఆయన (అన్ని) చూపులను అందుకుంటాడు. మరియు ఆయన సూక్ష్మగ్రాహి, సర్వం తెలిసినవాడు

(ఖుర్'ఆన్ 6:103)

# శాంతిబాట

మాసపత్రిక రూ. 34/-

సంపుటి 3 సంచిక 4&5 నవంబర్-డిశంబర్ 2011

2-8-31, కోటబజార్, సామర్లకోట 533 440

www.saanthibaata.net

www.saanthibaata.com

Email:velugubaata@gmail.com

Cell : 9491103017




Saanthibaata


**ఎడిటర్:**

ఎమ్‌డి. అతహరుల్లా

**ఎడ్వయిజరీ బోర్డ్:**

డా॥ సలీమ్ పాషా

డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు

ఎమ్‌డి. అఫ్ఫాన్ ఉమ్రీ

**Editor**

Md. Athaharullah

**Advisory Board**

Dr. Salim Pasha

Dr. Nagireddi Srinivasa Rao

Md. Affan Omri

**Printed by**

Md. Athaharullah

**Published by**

Md. Athaharullah

**Owned by**

Velugubaata Educational Society

(R.No. 569/2008), Samalkot-533440

and

**Printed at**

Saanthibaata Printing House,

19-1-447, Hanuman Statue Center

Samalkot - 533440

and

**Published at**

2-8-31, Kota Bazar,

Samalkot - 533440,

**Editor:** Md. Athaharullah

Phone : 9347046090,

Email: velugubaata@gmail.com

RNI Regd. No. APTEL/2009/29650

**Production Incharge**

T. Srinivasa Rao

(Zakir)


## నవంబర్ - డిశంబర్' 2011

**జిల్ హిజ్జా హి. 1432 - సఫర్ హి. 1433**


**4** **అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం :** ఖుర్'ఆన్ గ్రంథ అధ్యయనానికి ప్రోత్సాహం - సూరహ్ అల్-బఖరా తఫ్సీర్ : 26 - 29 ఆయత్‌లు ...

**8** **ప్రపంచ శాంతిదూత 'ముహమ్మద్(స)' వారి బోధనలు, ఆచరణలు :** సమాజంలోని సమస్యలకు పరిష్కార మార్గం - ఈ నెల ప్రత్యేకం : ఉత్తమ సమాజం - ఆచరణ ...

**11** **ముహమ్మద్(స) వారి జీవిత చరిత్ర :** మొదటి తరం ముస్లిముల లక్షణాలు ...

**15** **రెండవ ఖలీఫా ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) వారి జీవిత చరిత్ర :** బద్ర్ యుద్ధం ...

**19** **హదీస్ విజ్ఞానం :** బుఖారీ(ర) (ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్) ...

**20** **రాతియుగం - ఓ చారిత్రక అబద్ధం**

**29** **ఖుర్'ఆన్‌ను అర్థం చేసుకుంటూ చదువుదాం :** నెలకు 24 అరబీ పదాల చొప్పున 30 నెలలలో ఖుర్'ఆన్‌లోని 80 శాతం పదాలను నేర్పించాలని...

**30** **బాలబాలికలకు ప్రత్యేకం :** దైవ ప్రవక్త హూద్(అ) ...

**32** **జిన్నులు మరియు చేతబడి :** మనిషికుండే బలహీనతలే కొందరికి జీవనాధారం ...

**41** **అల్లాహ్ - ఖుర్'ఆన్ - ముహమ్మద్(స) :** ఖుర్'ఆన్ ఆయత్‌ల ద్వారా సంక్షిప్త వివరణ ...

**56** **ముస్లిమ్ మహిళ :** సమాజ నిర్మాణంలో స్త్రీ పాత్ర ...



**సంవత్సర చందా :**

**రూ. 200/-**

*For online payments, Please contact Dr. N. Srinivasa Rao (Cell: 9491103017)*

M.O. చేయవలసిన చిరునామా:

**వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ**

2-8-31, కోట బజార్,

సామర్లకోట-533440

**మీ ఫోన్ నంబర్ తప్పనిసరిగా వ్రాయండి**

మీ పూర్తి ఎడ్రస్‌ను, ఫోన్ నెంబర్లతో సహా **M.O.** ఫారమ్‌పై వ్రాయండి.

లేదా

క్రింది నెంబర్‌కు

మీ వివరాలను **SMS** చేయండి.

**Cell : 9491103017**

ఇతర వివరాలకై సంప్రదించండి

**డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు,** *M.Sc.,Ph.D.* **Cell : 9491103017**

**M.O. పంపినా లేక బ్యాంక్ ఎకౌంట్‌లో డిపాజిట్ చేసినా, వెంటనే ఫోన్ చేసి చెప్పవలసిందిగా కోరుతున్నాము**

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ (అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో)

# న్యాయం

'చట్టానికి కళ్ళు లేవు' అని కొందరు, "చట్టానికి వేయికళ్ళు" అని కొందరు అంటుంటారు. ఈ రెండూ పరస్పరం ఒకదానికొకటి విరుద్ధం అయినప్పటికీ, రెండూ నిజమేనని సగటు మనిషి అనుభవపూర్వకంగా తెలుసుకున్నాడు. చట్టం కళ్ళు ఎప్పుడు తెరుస్తుందో, ఎప్పుడు మూసుకుంటుందో ఊహించడం పెద్ద కష్టమైన పనేమీ కాదు. ఒక నేరం విషయంలో పేరూ పలుకుబడి ఉన్న ఓ ధనవంతునికి శిక్ష పడితే, న్యాయవ్యవస్థ బ్రతికే ఉంది మరియు న్యాయం జరిగింది అంటూ న్యాయవ్యవస్థపై ప్రశంసల జల్లు కురుస్తుంది.

కాని అటువంటి నేరమే చేసిన మరొక ధనవంతునికి శిక్ష వేయకుండా, క్లీన్ చిట్ ఇవ్వడం జరుగుతుంది. అప్పుడు న్యాయవ్యవస్థ విమర్శకు గురి అవుతుంది. వ్యవస్థలలో ఉన్న లొసుగులను అర్థం చేసుకుని, కోట్లకు కోట్లు సంపాదించే వారెందరో ఉన్నారు. అతి తక్కువ కాలంలో ఐశ్వర్యం సంపాదించుకున్న వారిని ప్రతిభావంతులు అంటారు. వారిని ఆదర్శంగా తీసుకోమని యువతకు బోధిస్తారు. కాని ఈ ప్రతిభావంతులలో ఎక్కువ మంది మన వ్యవస్థలో దాగి ఉన్న లొసుగుల ఆధారంతో పైకి వచ్చినవారే.

కోర్టుల్లో న్యాయం ఏ విధంగా ఓడిపోతుందో, కోర్టులను దోషులు ఏ విధంగా మోసం చేస్తారో అర్థమయ్యేలా ఎన్నో సినిమాలలో తెలియజేశారు. ఇక్కడ సినిమా ప్రస్తావన ఎందుకు వచ్చిందంటే, క్రింది తరగతి వరకూ ప్రజలలోకి వెళ్ళే పవర్‌ఫుల్ మీడియా సినిమా కాబట్టి. నిజాయితీగా ఉంటూ ఏ దోషమూ చేయకపోతే, కోర్టుల్లో న్యాయం లభిస్తుందనే నమ్మకం సామాన్యునిలో కలగాలి. ఆ బాధ్యత న్యాయవ్యవస్థపై ఉంది.

ఈ మధ్యనే న్యాయవ్యవస్థకు సంబంధించి మరో కొత్త అంశం వెలుగుచూసింది. అది తెలుసుకుని సామాన్యుడు ముక్కున వేలేసుకున్నాడు. అదే 'నాట్ బిఫోర్'. ఒక తెలుగు దినపత్రికలో దాని గురించి స్పష్టంగా వివరించారు. ఈ 'నాట్ బిఫోర్' ద్వారా తీర్పును ప్రభావితం చేయవచ్చని చెబుతున్నారు. ఆ పత్రికలో ఇచ్చిన వివరాలు :

> **"ఏమిటీ నాట్ బిఫోర్?!** న్యాయవాదిగానీ, జిల్లా జడ్జి గానీ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన వెంటనే కోర్టులో తనకు సన్నిహితులు, మిత్రులు, జూనియర్లు తదితర న్యాయవాదుల పేర్లను రిజిస్ట్రీకి పంపి, వీరు దాఖలు చేసే కేసులను తమ ముందు విచారణకు రానివ్వవద్దని ఆదేశిస్తారు. ఇలా తమ ముందు ఫలానా న్యాయవాదుల కేసులను విచారణకు వేయవద్దని చెప్పడాన్నే **నాట్ బిఫోర్** అంటారు. ఇటీవలి కాలంలో కొందరు న్యాయవాదులు ఉద్దేశపూర్వకంగానే న్యాయమూర్తులతో అకారణంగా ఘర్షణకు దిగుతూ నాట్ బిఫోర్ జాబితాలో చేరుతున్నారు. తద్వారా సదరు న్యాయమూర్తి ముందు తమ కేసులు రాకుండా చేసుకుంటూ ఆయాచిత లబ్ధి పొందుతున్నారు. **నిబంధనలకు అనుగుణంగా కేసులను విచారించే న్యాయమూర్తుల ముందు తమ కేసులు రాకుండా ఉండేందుకు కొందరు తెలివిగా ఈ నాట్ బిఫోర్ న్యాయవాదులను ప్రయోగిస్తున్నారు.** కొందరు న్యాయవాదులు ఇటీవల కాలంలో నాట్‌బిఫోర్‌ను అడ్డం పెట్టుకుని పెద్ద మొత్తంలో డబ్బు ఆర్జించారు. ఇలా ఓ న్యాయవాది దిల్‌సుఖ్‌నగర్ సమీపంలో ఓ ఇండిపెండెంట్ ఇల్లు, ఖరీదైన కారు కూడా కొనుగోలు చేశారు." (సాక్షి దినపత్రిక, తేది 9.12.2011, పేజి 2)

అక్రమంగా ఆస్తులు ఆర్జించారనే విషయంలో ఈ రాష్ట్రంలో రెండు ప్రాంతీయ పార్టీల నేతలపై కోర్టులో కేసులు నడుస్తున్నాయి. వాటిపై దర్యాప్తు ఒకే విధంగా జరగడం లేదని, ప్రభుత్వం ఇందులో జోక్యం చేసుకుని, తన ప్రత్యర్థి వర్గాన్ని తొక్కేయడానికి చూస్తుందనే విషయాన్ని వివరంగా ప్రజల ముందుకు తీసుకురావడంలో ఆ పత్రిక సఫలీకృతమైందని అనిపిస్తుంది.

డబ్బున్నవాడు చట్టాన్ని తన చుట్టంగా మార్చుకుంటాడని ప్రజల్లో ఓ బలమైన నమ్మకం ఉంది. డబ్బుకు అధికారం కూడా తోడైతే, అప్పుడు వారి ఆటలకు అడ్డు ఏముంటుంది? సామాన్యుడు వీరిని ఆపలేడు. సామాన్యులంతా కలిస్తే ఆపడం అసాధ్యమేమీ కాదు. సామాన్యులు ముందడుగు వేయరని అధికారంగల వారికి తెలుసు.

అన్యాయం కొంత కాలమే ఉంటుంది. అన్యాయం చేసేవాళ్ళు డబ్బు సంపాదించగలరేమో గాని, సంతోషాన్ని ఎంతమాత్రం సంపాదించుకోలేరు. సంతోషంలేని జీవితం జీవమున్న శవం వంటిది.

న్యాయంగా బ్రతికే విశ్వాసులకు సృష్టికర్తయైన అల్లాహ్ రక్షణ ఉంటుంది. అల్లాహుతాలా ఎవ్వరికీ రవ్వంత అన్యాయం చేయరు.

**<u>ప్రపంచంలో ప్రతీ మతానికి ఓ ప్రత్యేక లక్షణం ఉంటుంది. ఇస్లామ్ విషయంలో ఆ ప్రత్యేక లక్షణం : న్యాయం.</u>**

అల్లాహ్ యొక్క సందేశహరులు ముహమ్మద్(స)వారు తన కుమార్తె 'ఫాతిమా(రజి)వారిని' తనలోని ఓ భాగంగా చెప్పేవారు. ఆమె అంటే ఆయన(స)కు ఎంతో ప్రేమ. మఖ్జూమ్ తెగకు చెందిన ఒక ఉన్నత స్త్రీ దొంగతనం చేసింది. దొంగతనం చేసినవారికి ఇస్లామ్‌లో హస్తఖండన శిక్ష విధిస్తారు. ఆ విషయంలో ఖురైష్ తెగవాళ్లు తీవ్ర ఆందోళన చెందారు. వారు అన్నారు : "ఆమె గురించి ఎవరు మాట్లాడతారు?" అంటే ముహమ్మద్(స)వారితో. వారు అన్నారు : "ఎవరు ధైర్యం చేయగలరు, ప్రవక్త(స)వారికి ప్రియమైన ఉసామా బిన్ జైద్(రజి) తప్ప?" కాబట్టి

ఉసామా ఆయన(స)తో మాట్లాడారు మరియు అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : **"ఓ ఉసామా! అల్లాహ్ శిక్షలలోని ఒక దాని గురించి సిఫారసు చేస్తున్నావా?"** తరువాత ఆయన నిలుచుని ప్రసంగించి చెప్పారు :

> **"మీ ముందు వచ్చినవారు (పూర్వపు జాతులు) వారిలో ఉన్నత వంశస్థుడు దొంగతనం చేస్తే, వారు అతనిని వదిలేసేవారు మరియు వారిలో ఒక సామాన్యుడు దొంగతనం చేస్తే, వారు అతనిపై శిక్షను అమలు చేసేవారు. కేవలం అందుకే వారు నాశనమయ్యారు. అల్లాహ్ సాక్షి! ఫాతిమా బిన్త్ ముహమ్మద్(రజి) దొంగతనం చేసినా, నేను ఆమె చేతిని ఖండిస్తాను."**
> (అబూదావూద్, సహీహ్ హదీస్, నెం. 4373, పుస్తకం 37, అధ్యా. 4, సంపుటి 5)

పై హదీస్ ద్వారా స్పష్టంగా తెలిసేది ఏమిటంటే న్యాయం అందరికీ ఒకేలా ఉండాలి. అతడు పేదవాడైనా సరే, పాలకుడైనా సరే తప్పు చేస్తే, దానికి తగిన శిక్ష అనుభవించాలి. అలా ఎక్కడైతే జరగదో, అక్కడ ఉండే జాతి నాశనమౌతుంది. మనం నాశనం కాకుండా ఉండాలంటే న్యాయంగా వ్యవహరించాలి. న్యాయవ్యవస్థ ఉన్నదే సమాజాన్ని కాపాడటానికి.

ముహమ్మద్(స)వారు న్యాయాన్ని బోధించి మరియు దానిని ఆచరించి చూపారు. తన అనుచరులకు మంచి శిక్షణ నిచ్చారు. ఆయన(స) మరణం తరువాత ఆయన ప్రియ అనుచరులలో ఒకరైన అబూ బక్ర్ సిద్దీఖ్(రజి)వారు ముస్లిమ్ రాజ్యానికి తొలి ఖలీఫా అయ్యారు. ఆయన దాదాపు రెండున్నర సంవత్సరాల కాలం పాటు పరిపాలించాక, ప్రవక్త(స)వారి మరో ప్రియ అనుచరులు ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)వారు ఖలీఫా అయ్యారు. ఆయన ఓ దశాబ్దం పాటు పరిపాలించారు. ఆయన పరిపాలన ద్వారా **ఇస్లామీయ పరిపాలన ఎంత ఉన్నతమైనదో, న్యాయానికి ఎంత గొప్ప ప్రాధాన్యత ఇవ్వబడిందో, నిజమైన ప్రజాస్వామ్యం అంటే ఏమిటో ప్రపంచానికి తెలియజేయబడింది.**

గొప్ప ధీరుడు మరియు ఈజిప్టును జయించిన అమ్ర్ బిన్ ఆస్(రజి)వారిని, ఉమర్(రజి)వారు ఈజిప్టుకి గవర్నర్‌గా నియమించారు. అమ్ర్(రజి)వారి కుమారుడు అంటే గవర్నర్‌గారి కుమారుడు అన్యాయంగా ఓ ఈజిప్టు పౌరున్ని కొట్టడం జరిగింది. ఆ యువకుడు ముస్లిముల పాలకుడైన ఉమర్(రజి)వారికి ఫిర్యాదు చేశాడు. ఉమర్(రజి)వారు గవర్నర్‌గారి అబ్బాయిని మరియు గవర్నర్‌గారిని తన సమక్షానికి పిలుపించుకున్నారు. అక్కడే ఫిర్యాదు చేసిన ఈజిప్టు యువకుడు కూడా ఉన్నాడు. గవర్నర్‌గారి సమక్షంలోనే అతడి కుమారుడిని కొట్టమని ఉమర్(రజి) ఈజిప్టు యువకుడికి కొరడా నిచ్చారు. తాను వింటున్నది నిజమేనా అని ఆశ్చర్యపోయిన ఆ యువకుడు గవర్నర్‌గారి అబ్బాయిని కొట్టాడు. గవర్నర్‌గారి అధికారాన్ని దృష్టిలో ఉంచుకుని అతడి కుమారుడు కొట్టాడు కాబట్టి, గవర్నర్ గారి తలపై కూడా కొట్టమని ఉమర్(రజి)వారు చెప్పగా, ఆ యువకుడు అప్పటికే సంతృప్తి చెందానని చెప్పడం జరిగింది. ఇస్లామ్‌లో న్యాయం ఆ స్థాయిలో ఉంటుంది. **ప్రజలకు మరియు పాలకులకు ఒకే న్యాయం.**

> **తీర్పులను తప్పుగా ఇచ్చే జడ్జీలను శిక్షించే వ్యవస్థను ఉమర్(రజి)వారు ఏర్పాటు చేశారు. మొదటి సారిగా పాలకులను జవాబుదారీగా చేశారు. అంటే ఏదైనా జరిగితే, దానికి పాలకులదే బాధ్యత. వర్తక బిడారాలను రాత్రివేళ రక్షించేవారు. "న్యాయంగా పాలించే నాయకులు, రాత్రివేళ నిర్భయంగా పడుకుంటారు"అని చెప్పేవారు. జాతి యొక్క నాయకుడు నిజానికి జాతికి సేవకుడని చెప్పేవారాయన.**

ఒకరోజు ఉమర్(రజి)వారు రోడ్డుపై నడిచి వెళ్తుండగా, ఆయన ఓ వ్యక్తి పక్కగా వెళ్ళడం జరిగింది. ఆ వ్యక్తి ఒక స్త్రీతో సంభాషిస్తున్నాడు. ఉమర్(రజి)వారు అతనిని తన బెత్తం (stick)తో కొట్టారు. అప్పుడు ఆ వ్యక్తి చెప్పాడు "ఓ విశ్వాసుల నాయకుడా! ఈమె నా భార్య". ఉమర్(రజి) చెప్పారు, "మరి నీవు నీ భార్యతో రోడ్డుపై ఎందుకు నిలుచున్నావు. నీకు తెలియదా అటువంటి ప్రవర్తన అనుమానానికి తావిస్తుందని మరియు ఇతరులు నీ వీపు వెనుక మాట్లాడేలా చేస్తుందని?". "ఓ విశ్వాసుల నాయకుడా! ఇప్పుడే మేము మదీనా చేరుకున్నాము మరియు ఎక్కడ విడిది చేయాలోనని మాట్లాడుకుంటున్నాము". ఉమర్(రజి)వారు ఆ వ్యక్తికి బెత్తం ఇచ్చి చెప్పారు "నాపై అదే విధంగా బదులు తీర్చుకో, ఓ అల్లాహ్ దాసుడా!". ఆ వ్యక్తి అన్నాడు, "నేను దీని కొరకు మిమ్మల్ని క్షమించాను, ఓ అమీరుల్ మోమినీన్". కాని ఉమర్(రజి)వారు పట్టుబట్టారు. "దీనిని తీసుకో మరియు నీ బదులు తీర్చుకో". ఈ విధంగా సంభాషణ జరిగాక మూడవసారి ఆ వ్యక్తి చెప్పాడు, "అల్లాహ్ కోసం నేను దీనిని క్షమించాను" చివరిగా సంతృప్తి చెందానని చెప్పారు. ఉమర్(రజి)వారు అన్నారు, "అల్లాహ్ కోసం నన్ను క్షమించినందుకు నీవు అల్లాహ్‌చే అనుగ్రహించుబడుగాక". ఖలీఫాయైన ఉమర్(రజి) అప్పటికి ప్రపంచంలోని దాదాపు సగభూభాగానికి పాలకుడు. అటువంటి ఓ అతిపెద్ద సామ్రాజ్యాధినేత తన పొరపాటుకు నడిరోడ్డుపై ఒక పౌరునిచేత శిక్షింపబడటానికి సిద్ధమయ్యారు.

న్యాయాన్ని నూటికి నూరుశాతం అమలు చేయగలిగేవారు ఎవరంటే, ఎవరికైతే తన సృష్టికర్తయైన అల్లాహ్ పట్ల భయం ఉంటుందో, తాను చేసే అన్యాయం వలన అనంత కరుణామయుడైన సృష్టికర్త కరుణ కోల్పోతానేమోనని భయపడతాడో అతడే! తఖ్వా (అల్లాహ్ పట్ల భీతి) గలవాడే ఏ సమయంలోనైనా, ఏకాంతంలో ఉన్నా సరే అన్యాయానికి ఒడిగట్టడు. ప్రతీ ముస్లిమ్ తఖ్వా కలిగి ఉండి అన్యాయానికి దూరంగా ఉంటే, ఇన్షా అల్లాహ్, అల్లాహ్ కరుణ అతనిపై వర్షించి అతనికి మరియు అతని కుటుంబానికి మేలు జరుగుతుంది.

**- శాంతిబాట టీమ్**

**న్యాయంగా ఉందాం! న్యాయాన్నే ప్రోత్సహిద్దాం! అల్లాహ్ కరుణను పొందుదాం!** (ఆమీన్)



# అరబీ భాషలో
# సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

అనంత కరుణామయుడు, అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

20

## ఖుర్'ఆన్ తఫ్సీర్

2. సూరహ్ అల్-బఖరా

### సూరహ్ అల్-బఖరా (26 నుండి 29 ఆయత్‌లలో వచ్చిన అరబీ) పదాల అర్థాలు

226. తన హోదాకు తగదని భావించడు لَا يَسْتَحْيِي

227. ఉదాహరణ నివ్వడం, పోలికను ఉపయోగించడం يَضْرِبُ مَثَلاً

228. దోమ, చిన్న ఈగ بَعُوْضَةٌ

229. ఏదైనా దాని కంటే ఎక్కువది فَمَا فَوْقَهَا

230. కాబట్టి فَأَمَّا

231. అదే / అతడే أَنَّهُ

232. సత్యం حَقٌّ

233. ఏమిటి مَاذَا

234. ఉద్దేశించాడు, ఇష్టపడ్డాడు أَرَادَ

235. మార్గభ్రష్టత్వంవైపు తీసుకెళ్ళుట يُضِلُّ

236. మార్గదర్శకత్వం చేయుట يَهْدِيْ

237. చాలా మంది كَثِيْرٌ

238. తప్ప إِلَّا

239. దుష్టులు, ఉల్లంఘనకు పాల్పడేవారు فَاسِقِيْنَ (ف س ق)

240. వారు భంగపరిచారు يَنْقُضُوْنَ (ن ق ض)

241. ఒప్పందం, ఒడంబడిక عَهْد

242. దాని తరువాత مِنْ بَعْدِ

243. స్థిరపరచడం مِيْثَاق

244. వారు కోసివేసారు يَقْطَعُوْنَ (ق ط ع)

245. ఆదేశించబడింది أَمَرَ

246. కలిసి ఉండు يُوْصَلُ (و ص ل)

247. నష్టపోయినవారు خَاسِرُوْنَ (خ س ر)

248. ఎలా كَيْفَ

249. చనిపోయిన أَمْوَاتًا (م و ت)

250. మరియు (ఆయన) మీకు జీవితాన్నిచ్చారు فَأَحْيَاكُمْ

251. అప్పుడు / తరువాత ثُمَّ

252. మీరు మరలివస్తారు تُرْجَعُوْنَ (ر ج ع)

253. సృష్టించాడు خَلَقَ

254. మీ కొరకు (బహు) لَكُمْ

255. అంతా / అన్ని جَمِيْعًا

256. (వైపు) మరలించాడు اِسْتَوٰى

257. వైపు إِلٰى

258. రూపుదిద్దాడు سَوّٰى

259. వారిని, వాటిని هُنَّ

260. ఏడు سَبْعَ

261. ఆకాశాలు سَمَآءٌ سَمَاوَات

**ఆయత్ - 26**

**నిశ్చయంగా, అల్లాహ్ దోమ లేక దానికంటే చిన్నదాని ఉదాహరణ ఇవ్వటానికి సంకోచించడు. కావున విశ్వసించిన వారు, ఇది తమ ప్రభువు తరపునుండి వచ్చిన సత్యమే అని గ్రహిస్తారు. కాని సత్య తిరస్కారులు, "ఈ ఉపమానాల ద్వారా అల్లాహ్ చెప్పదలుచు కున్నది ఏమిటి?" అని ప్రశ్నిస్తారు. ఈ విధంగా ఆయన ఎంతో మందిని మార్గభ్రష్టత్వంలో పడనిస్తాడు. మరియు ఎంతో మందికి సన్మార్గం కూడా చూపుతాడు. మరియు ఆయన కేవలం ఫాసిఖ్ (దుష్టు)లనే మార్గభ్రష్టత్వంలో పడనిస్తాడు.**

పై ఆయత్ (26) ఉదాహరణ విషయంలో అవిశ్వాసులు వ్యక్తం చేసిన అభ్యంతరానికి సమాధానం చెబుతుంది.

వారి సందేహం ఏమిటంటే, 'ఈ ఖుర్'ఆన్ అల్లాహ్ యొక్క వచనమే అయితే తుచ్ఛమైన జీవులైన దోమ లేక ఈగ వంటి వాటిని ఉదాహరించడం జరిగి ఉండదని మరియు ఒక హెూదాగల మనిషికే అవి తక్కువగా అనిపించేటప్పుడు ఖుర్'ఆన్‌లో వాటి ప్రస్తావన అల్లాహ్ యొక్క ఘనతకు మరియు వైభవానికి వ్యతిరేకంగా ఉందని'.

అయితే వివేకంగల వారికి ఈ ఉదాహరణ విషయంలో ఎటువంటి సందేహం కలుగదు. ఇటువంటి ఉదాహరణలు ఏ విధంగా అల్లాహ్ స్థాయిని తగ్గిస్తాయి?

ఎవరి హృదయాలైతే వస్తువులను సరియైన దృక్కోణంలో చూడగలిగే శక్తినంతటినీ కోల్పోతాయో అటువంటివారి హృదయాలలోనే ఈ రకమైన సందేహాలు దివ్య ఖుర్'ఆన్‌పై కలుగుతాయి. అయితే అటువంటి శూన్య సందేహాలు ఎన్నటికీ నిజవిశ్వాసుల హృదయాలను తాకలేవు.

### ఖుర్'ఆన్‌లోని సామెతలు : పరీక్ష మరియు మార్గదర్శకత్వం

అటువంటి సామెతలను ఉపయోగించడానికి గల కారణాలను ఖుర్'ఆన్ తెలియజేస్తుంది. అవి మానవులకు ఓ పరీక్షలా పనిచేస్తాయి. ఆలోచించగలిగి అర్థం చేసుకోగలిగే వారికి మార్గదర్శకత్వం కొరకు ఇవి మూలాలు అవుతాయి. అశ్రద్ధ వలన లేక శతృత్వం మరియు మూర్ఖపు పట్టుదల వలన ఎవరైతే అర్థం చేసుకోవడానికి తిరస్కరిస్తారో, వారు మరింత సందేహంలో కూరుకుపోవడానికి మరియు తప్పుదారి పట్టించడానికి ఇవే కారణమౌతాయి.

ఈ ఆయత్‌పై అర్-రబీ బిన్ అనస్ గారు చేసిన వ్యాఖ్యానాన్ని అబూ జాఫర్ అర్-రాజి ఉల్లేఖించారు :

ఇది ఇహలోక జీవితం కొరకు అల్లాహ్ ఇచ్చిన ఉదాహరణ. దోమ దానికి ఆహారం అవసరమైనంతకాలమే జీవిస్తుంది. అది బలిసినప్పుడు చస్తుంది. ఖుర్'ఆన్‌లో ప్రస్తావించబడిన కొందరి వ్యక్తులకు కూడా ఇది ఉదాహరణే. వారు ఇహలోకపు జీవితాన్ని పొందాక, అల్లాహ్ వారిని తీసేసుకుంటాడు. తరువాత ఆయన ఇది పఠించారు.

**"ఆ పిదప వారికి చేయబడిన బోధనను వారు మరచిపోగా, మేము వారి కొరకు సకల (భోగభాగ్యాల) ద్వారాలను తెరిచాము. చివరకువారు తమకు ప్రసాదించబడిన ఆనందాలలో నిమగ్నులై ఉండగా, మేము వారిని అకస్మాత్తుగా** (శిక్షించడానికి) **పట్టుకున్నాము, అప్పుడు వారు నిరాశ పాలయ్యారు** (ఖుర్'ఆన్ 6:44)

అల్లాహ్ ఏదైనా ఒక జీవినో లేక ఓ వస్తువునో ఉదాహరణగా ఇచ్చినప్పుడు అది ప్రాముఖ్యత గలిగినదైనా లేక ఎటువంటి ప్రాముఖ్యత లేనిదైనా సరే, ఆ ఉదాహరణలో ఎంతో వివేకం ఉంటుంది.

22వ సూరహ్‌లోని 73వ ఆయత్‌లో **ఈగ** గురించి మరియు 29వ సూరహ్‌లోని 41 ఆయత్‌లో **సాలెపురుగు** గురించి ప్రస్తావించ బడింది. తమ పరిమాణాలతో మరియు జీవితాలతో దోమను పోల్చుకుని వారు దానిని తుచ్ఛమైన జీవి అన్నారు. మరి భూమితో మానవుడిని పోలిస్తే ?

కంటికి కనిపించని అతి సూక్ష్మ బాక్టీరియాతో మనిషిని పోలిస్తే ఎలా ఉంటుందో, మనిషిని భూమితో పోల్చినా అలాగే ఉంటుంది. మరి ఇంత గొప్ప విశ్వాన్ని సృష్టించిన అల్లాహ్ మనిషి గురించి ప్రస్తావించడం లేదా?

**"ఏమీ? మిమ్మల్ని సృష్టించడం కఠినమయిన పనా? లేక ఆకాశాన్నా? ఆయనే కదా దానిని నిర్మించింది!"** (ఖుర్'ఆన్ 79:27)

కాబట్టి విశ్వాసులు ఆయత్‌లోని వివేకాన్ని అర్థం చేసుకోవడానికే ప్రయత్నిస్తారు. అంతేగాని వారికెటువంటి సందేహమూ కలుగదు.

ఆయన ఈగ, దోమ, చెట్టు, సాలెపురుగు మొదలైన వాటిని మాత్రమే కాకుండా మనిషిని కూడా ఉదాహరణగా చెప్పారు :

**"ఆయన స్వయంగా మీకే చెందిన ఒక ఉపమానాన్ని మీకు తెలుపుతున్నాడు, ఏమీ? మేము మీకు జీవనోపాధిగా సమకూర్చిన దానిలో మీ బానిసలు మీతో సరిసమానులుగా, భాగస్వాములు కాగలరా? మీరు పరస్పరం ఒకరి పట్ల నౌకరు భీతి కలిగి ఉన్నట్లు వారి పట్ల కూడా భీతి కలిగి ఉంటారా?** (ఖుర్'ఆన్ 30:28)

ఈ విధంగా బుద్ధిమంతులకు అల్లాహ్ సూచనలను వివరిస్తూ ఉంటారు.

### ఫాసిఖ్ అంటే ఎవరు?

అల్లాహ్ ఆదేశాలకు విధేయత చూపని అవిధేయుల గురించి వివరిస్తూ దివ్య ఖుర్'ఆన్ ఉపయోగించిన పదం **'అల్-ఫాసిఖీన్'**. దీనికి మూల పదం **'ఫసఖ'**. దీని అర్థం **'బయటకు వెళ్ళుట'** లేదా **'హద్దును దాటి తిరుగుట'**. **'ఫిస్ఖ్'** అల్లాహ్‌కు చూపే విధేయతా పరిధి నుండి దాటి వెళ్ళిపోవడం లేదా అల్లాహ్ యొక్క ఆదేశాలను ఉల్లంఘించడాన్ని తెలియజేస్తుంది.

ఈ ఉల్లంఘన అనేది కేవలం ఒకడు తన ఆచరణల ద్వారా అవిధేయుడుగా ఉండటంతోనే ఆపేయకుండా, వాని చేత బహిరంగంగా సత్యం కాదని చాటేలా చేస్తుంది మరియు వానిని అవిశ్వాసం వైపుకు తీసుకుపోతుంది.

కాబట్టి 'ఫాసిఖ్' అనే పదం అవిశ్వాసికి మరియు సత్యతిరస్కారికి కూడా ఉపయోగపడుతుంది. దివ్య ఖుర్ఆన్‌లో చాలా ఎక్కువగా ఈ పదం ఉపయోగించబడింది.

**పాపం** చేయడాన్ని **అలవాటుగా** చేసుకున్న ముస్లిమ్ కూడా ఫాసిఖ్‌గా పిలవబడ్డాడు.

ఆ విధంగా ఫాసిఖ్ అనేది కాఫిర్‌కు ప్రతిరూప పదమైంది. ఒక వ్యక్తి పెద్ద పాపాన్ని చేసి పశ్చాత్తాప పడకపోయినా, ఒక వ్యక్తి చిన్న చిన్న పాపాలను కొనసాగిస్తూ అదొక అలవాటుగా చేసుకున్నా ఆ వ్యక్తి 'ఫుఖహా' పరిభాష ప్రకారం ఫాసిఖ్‌గా పిలువబడతాడు.

**ఒక వ్యక్తి బహిరంగంగా అందరూ చూస్తుండగా అటువంటి పాపాలను చేస్తూ కూడా సిగ్గుపడకుండా ఉంటే, అటువంటి వాడిని 'ఫాజిర్' అని పిలుస్తారు.** (మజ్‌హరీ)

**ఆయత్ - 27**

**"ఎవరైతే అల్లాహ్‌తో స్థిరమైన ఒడంబడిక చేసుకున్న పిదప దానిని భంగ పరుస్తారో మరియు అల్లాహ్ స్థిరపరచమని ఆజ్ఞాపించిన దానిని త్రెంచుతారో మరియు భువిలో కల్లోలం రేకిత్తిస్తారో! ఇలాంటివారే వాస్తవంగా నష్టపడేవారు."**

**అల్లాహ్‌తో చేసుకున్న ఒడంబడిక ప్రకారం జీవించడం :**

భూమిపై మానవుల ఉనికి ప్రారంభం కాకముందే అల్లాహుతాలా మానవుల ఆత్మలన్నింటిని ఒకచోట చేర్చి వారిని అడిగారు أَلَسْتُ بِرَبِّكُمْ **నేను మీ ప్రభువును కానా?**' మరియు వారు ముక్తకంఠంతో చెప్పారు بَلَىٰ **'ఔను'**.

ఇది అల్లాహ్ మరియు మానవుల మధ్య జరిగిన ఒడంబడిక. ఈ విషయం 7వ సూరహ్‌లో 172వ ఆయత్‌లో చెప్పబడింది.

ఈ అంగీకారం ద్వారా 'అల్లాహ్ తమ ప్రభువు మరియు యజమాని' అని ప్రకటించిన మానవుడు ఏవిధంగానూ ఆయనకు అవిధేయత చూపకూడదు.

మన ఈ ఒడంబడికనే మనకు గుర్తు చేయడానికి, దానిని మరలా కొనసాగించడానికి మరియు దాని ప్రకారం ఆచరణ ఎలా ఉండాలో మనకు సవివరంగా బోధించడానికి అల్లాహ్ గ్రంథాలను మరియు ప్రవక్తలను పంపారు. ఇప్పుడు, సత్యతిరస్కారులు ఆ ఒడంబడికను భంగపరిచారు. ఇక వారు ప్రవక్తల నుండి మరియు అల్లాహ్ గ్రంథాల నుండి నేర్చుకుంటారని ఎలా అనుకోగలం?

**ఇతరులతో ఉండే అనుబంధం గురించి ...**

ఈ ఆయత్‌లో త్రెంచడం అంటే అన్ని రకాల బంధాలను త్రెంచడం. (1) అల్లాహ్ మరియు ఆయన దాసునికి మధ్య ఉన్న బంధం (2) ఒక వ్యక్తికి మరియు అతని తల్లిదండ్రులు మరియు బంధువులకి మధ్య ఉండే బంధం (3) అతనికి మరియు అతని పొరుగువారు మరియు స్నేహితులకి మధ్య ఉండే బంధం (4) ఒక ముస్లిమ్ మరియు మరొక ముస్లిమ్‌కి మధ్య ఉండే బంధం (5) ఒక మనిషి మరియు మరొక మనిషికి మధ్య ఉండే బంధం మొ॥వి.

వాస్తవానికి ఇస్లామ్ అంటే ఈ అన్ని బంధాలకు సంబంధించి మనపై ఉంచిన బాధ్యతలను నెరవేర్చడమే. ఈ బాధ్యతలను నెరవేర్చడంలోని అసంపూర్ణత మానవుల మధ్య అన్ని రకాల కల్లోలాలకు దారితీస్తుంది. మరియు ఆ విధంగా ఉల్లంఘించేవారు తమ పట్ల మరియు ఇతరుల పట్ల వినాశకరంగా ఉన్న స్థితిలోనే ముగించ బడతారు.

ఇటువంటి వారినే దివ్య ఖుర్ఆన్ ఇహలోకంలోనూ మరియు పరలోకంలోనూ నష్టపోయేవారిగా చెప్పింది.

'నష్టపోయేవారి' విషయంపై ఇబ్నె జరీర్ గారు చేసిన వ్యాఖ్యానం చాలా స్పష్టంగా అర్థమయ్యేలా వివరిస్తుంది.

నష్టపోయేవాడు (ఖాసిరున్ خاسِر) అనే పదం, తన కోసం అల్లాహ్ కేటాయించిన కరుణలోని వాటాను అల్లాహ్‌కు అవిధేయత చూపడం ద్వారా తగ్గించుకునే వ్యక్తి గురించి వివరిస్తుంది. ఏ విధంగానంటే ఒక వ్యాపారి తన వ్యాపారం ద్వారా పెట్టుబడిలో కొంత భాగాన్ని కోల్పోయినట్లు.

వ్యాపారికి నష్టం ఎప్పుడు వస్తుంది? తాను పెట్టిన పెట్టుబడి కూడా తనకు దక్కకుండా అది తగ్గిపోతే నష్టం వస్తుంది. అల్లాహ్ కరుణ లేకుండా ఏ వ్యక్తి కూడా స్వర్గాన్ని పొందలేడు. ఈ విషయం ఇదే సంచికలో ఓ వ్యాసంగా అందించాము.

అల్లాహ్ తన దాసులకు పునరుత్థాన దినం కొరకు కేటాయించిన కరుణను ఈ విధంగా కపట విశ్వాసులు మరియు అవిశ్వాసులు నష్టపోతున్నారు. అల్లాహ్‌తో చేసుకున్న ఒడంబడిక గురించి ఖుర్ఆన్‌లో ప్రస్తావించబడిన మరో రెండు ఆయత్‌లు :

**వారే, ఎవరైతే అల్లాహ్‌తో చేసిన వాగ్దానం పూర్తి చేస్తారో మరియు తమ వాగ్దానాన్ని భంగపరచరో! మరియు ఎవరైతే అల్లాహ్ కలపమని ఆజ్ఞాపించిన వాటిని కలుపుతారో! మరియు తమ ప్రభువుకు భయపడతారో! మరియు ఎవరైతే తమ ప్రభువు ప్రీతి కొరకు సహనం వహించి మరియు నమాజ్‌ను స్థాపించి మరియు మేము ప్రసాదించిన ఉపాధి నుండి రహస్యంగా మరియు బహిరంగంగా ఖర్చు చేస్తూ, చెడును మంచి ద్వారా పారద్రోలుతూ ఉంటారో! అలాంటి వారికే ఉత్తమ పరలోక గృహం ప్రతిఫలంగా ఉంటుంది. (ఖుర్ఆన్ 13:20-22)**

**మరియు అల్లాహ్‌తో ఒడంబడిక చేసుకున్న తరువాత తమ వాగ్దానాన్ని భంగం చేసేవారు మరియు అల్లాహ్ కలపండి అని ఆదేశించిన వాటిని త్రెంచేవారు మరియు భూమిలో కల్లోలం రేకెత్తించే వారు! ఇలాంటి వారందరికీ ఆయన శాపం ఉంటుంది. మరియు వారికి (పరలోకంలో) బహు చెడ్డ నివాసముంటుంది.** (ఖుర్ఆన్ 13:25)

**ఆయత్ - 28**

**మీరు అల్లాహ్ పట్ల తిరస్కార వైఖరిని ఎలా అవలంభించ గలరు? మరియు వాస్తవానికి ఆయనే, నిర్జీవులుగా ఉన్న మిమ్మల్ని సజీవులుగా చేశాడు కదా! తరువాత మీ ప్రాణాన్ని తీసి, తిరిగి మిమ్మల్ని సజీవులుగా చేసేది కూడా ఆయనే, చివరకు మీరంతా ఆయన వద్దకే మరలింపబడతారు.**

**ఆయత్ - 29**

**ఆయనే భూమిలో నున్న సమస్తాన్నీ మీ కొరకు సృష్టించాడు, తరువాత తన దృష్టిని ఆకాశాల వైపునకు మరల్చి వాటిని సప్తాకాశాలుగా ఏర్పరిచాడు. మరియు ఆయనే ప్రతి విషయానికి సంబంధించిన జ్ఞానం గలవాడు.**

పై రెండు ఆయత్‌లు మానవునిపై అల్లాహ్ కురిపించిన అనుగ్రహాల గురించి చెబుతున్నాయి.

కొందరు అల్లాహ్ ప్రసాదించిన అనుగ్రహాలను గుర్తించకుండా, తిరస్కారాన్నే కొనసాగిస్తూ ఉన్నారు. అల్లాహ్ మానవుడిని ఉనికిలోకి తీసుకురానప్పుడు అతనికి ప్రాణం లేదు.

ఇక రెండవ ఆయత్ సాధారణంగా మనుష్యులపై మరియు ఇతర జీవాలపై ప్రసాదించబడే అల్లాహ్ అనుగ్రహం గురించి తెలియజేస్తుంది.

మొదటి అనుగ్రహంగా అల్లాహ్ భూమిని మరియు భూమిలో ఉండేదంతా మనిషి కోసం సృష్టించాడు. ఉనికిలోకి రాగానే మనిషి జీవితం వీటిన్నింటిపై ఆధారపడుతుంది. మరియు రెండవ అనుగ్రహం ఆకాశాలు. వాటితో భూమిపైని జీవితం ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి ఉంటుంది.

అల్లాహ్ పట్ల కృతఘ్నత చూపుతూ మరియు ఆయనను తిరస్కరించే వారిపట్ల ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తూ 28వ ఆయత్ ప్రారంభమైంది. అయితే ఇక్కడ ఓ విషయాన్ని మనం గమనించవలసి ఉంది.

అవిశ్వాసులు ఎన్నడూ అల్లాహ్‌ను తిరస్కరించలేదు. కాని ప్రవక్త(స) పట్ల తిరస్కార వైఖరి అవలంభించారు. అటువంటి తిరస్కారం అల్లాహ్ పట్ల వహించే తిరస్కారంతో సమానం చేసింది ఖుర్ఆన్.

మనిషికి ఒకప్పుడు ప్రాణం లేని విషయాన్ని అతనికి జ్ఞాపకం చేస్తుంది ఈ ఆయత్. అల్లాహ్‌యే జీవం పోశాడు. ఇంకనూ ఆ ఆయత్ ఇలా హెచ్చరిస్తుంది, అల్లాహ్ అతని ప్రాణాన్ని తీసేసి మరలా రెండవ సారి తిరిగి ఇస్తాడని. ఈ రెండవసారి ప్రాణం ఇవ్వడం అనేది తీర్పుదినాన జరుగుతుంది.

మొదటి మరణం అనేది ప్రాణం లేకపోవడం. అంటే మానవుడు అల్లాహ్ నుండి జీవితాన్ని పొందక పూర్వానికి చెందిన విషయం. రెండవ మరణం అనేది అతని జీవిత కాలం ఈ భూమిపై పూర్తి అయ్యాక సంభవించేది. రెండవసారి జీవితం లభించేది తీర్పుదినాన.

అంటే మనిషి తిరిగి అల్లాహ్ వైపుకే మరలవలసి వస్తుందని చెబుతూ ఈ ఆయత్ పూర్తయింది. ఇది పునరుత్థాన దినాన్ని వివరిస్తుంది. ఆ రోజు మానవులంతా సమాధుల నుండి లేపబడతారు. మరియు సమావేశ పరచబడతారు వారి ఆచరణల లెక్క చూడటానికి. ఆ తరువాత వారు అనుగ్రహించ బడటమో లేక శిక్షించబడటమో అనేది ఈ ప్రపంచంలో వారు చేసిన కర్మలను బట్టి ఉంటుంది.

ఈ ఆయత్‌ను బట్టి, అల్లాహ్ అనుగ్రహాలలో ముఖ్యమైనది జీవితాన్ని ఇవ్వడమే. ఈ జీవితం లేకుండా ఇతర అనుగ్రహాల నుండి ఎటువంటి లాభాన్ని పొందడానికీ అవకాశం లేదు. అయితే ఈ ఆయత్ మరణాన్ని కూడా అనుగ్రహంగానే గణన చేస్తుంది. ఎందుకంటే ఈ భౌతిక మరణమే పరలోకపు శాశ్వత జీవితానికి ద్వారం వంటిది. అది శాశ్వత జీవితం. కాబట్టి అక్కడ చావు అనేది ఉండదు.

భూమిలో ఉన్నదంతా మానవుల కొరకు అల్లాహ్ సృష్టించాడు. ఈ చిన్న వాక్యమే మనిషి భూమి మరియు భూమియొక్క ఉత్పత్తుల ద్వారా పొందే అన్నిరకాల ప్రయోజనాలను సంగ్రహంగా తెలియజేస్తుంది. తరువాత ఆయత్(నెం.29) ఆకాశం సృష్టించబడటాన్ని మరియు అది 7 ఆకాశాలుగా విభజించబడటాన్ని చెబుతుంది.

## బర్‌జఖ్‌లో జీవితం

(మరణం మరియు పునరుత్థాన దినానికి మధ్య ఉండే కాలవ్యవధి)

● ఒక వ్యక్తి స్పష్టంగా అల్లాహ్‌ను తిరస్కరించడం లేదు. అయినప్పటికీ ముహమ్మద్(స)వారిని అల్లాహ్ యొక్క సందేశహరునిగా స్వీకరించకుండా తిరస్కరిస్తున్నాడు మరియు ఖుర్ఆన్‌ను అల్లాహ్ గ్రంథం కాదని తిరస్కరిస్తున్నాడు. అప్పుడు ఆ వ్యక్తి అవిశ్వాసి అయిపోయాడు.

అరబ్బులు అల్లాహ్‌ను తిరస్కరించలేదు. వారు మామూలు పరిస్థితులలో విగ్రహాలను పూజించారు గాని, కష్టాలు కలిగినపుడు విగ్రహాలను వదిలేసి అల్లాహ్‌ను మాత్రమే వేడుకునేవారు. వారికి అల్లాహ్ పట్ల ఉన్నంత విశ్వాసం నేటి ముస్లిములలోని చాలా మందికి లేదు అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. కాని వారు 'కాఫిర్లు' అని ఖుర్ఆన్ స్పష్టంగా తెలియజేసింది.

ఈ మధ్యకాలంలో మీరు వినే ఉంటారు కొందరు ఇలా చెప్పడాన్ని, 'ఫలానా వ్యక్తి చేత దేవుడు ఒక్కడేనని ఒప్పించాము. అతడు షిర్క్ చేయడం లేదు. అతడికి నరకం తప్పిపోయింది.' అంటే వీరికి ఖుర్ఆన్‌లో ఏమి చెప్పబడిందో కూడా తెలియదని అర్థమౌతుంది. నరకం తప్పేది కేవలం మోమిన్ (విశ్వాసి)కి మాత్రమే. ముహమ్మద్(స)వారిని అల్లాహ్ యొక్క సందేశహరునిగా విశ్వసించాలి. ఖుర్ఆన్ అల్లాహ్ గ్రంథమని విశ్వసించాలి మరియు దాని ప్రకారం ఆచరించాలి. కేవలం అల్లాహ్‌ని తిరస్కరించకపోవడం ఒక్కటే సరిపోదు. ఖుర్ఆన్‌ను తిరస్కరించినా లేక ముహమ్మద్(స)వారిని తిరస్కరించినా అతడు అవిశ్వాసులలోని వాడే అవుతాడు.

● మరణించిన తరువాత లభించే శాశ్వత జీవిత ప్రస్తావన ఉంది ఇందులో. అయితే శాశ్వత జీవితం పునరుత్థాన దినం తరువాత మాత్రమే మొదలౌతుంది.

**(తఫ్సీర్‌లో మరికొంత భాగం ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో)**

ప్రపంచ శాంతి దూత

సన్మార్గ బోధకుడు
నాయకుడు
ఆదర్శనీయుడు

# ముహమ్మద్ (స) వారి

## బోధనలు ఆచరణలు

మంచిగా మానవత్వంతో బ్రతకమనే హితబోధను ప్రతి మనిషి తన ఊహతెలిసిన దగ్గరనుండి వింటూనే ఉంటాడు. అయితే ఏది మంచి? ఏది చెడు? కొంతమంది తమ దృష్టిలో ఫలానా విషయం మంచిది అని సమర్ధిస్తారు. అదే విషయాన్ని మరికొందరు పూర్తి చెడుగానూ తీసుకుంటారు. అంతెందుకు, ఒకే మనిషిలో ఒకే పనిపై, తన జీవితంలోని వివిధ దశలలో వేర్వేరు అభిప్రాయాలు జనిస్తాయి. నిజంగా మంచి చెడులపై మనుషులయొక్క వ్యక్తిగత అభిప్రాయాలనే గనుక పరిగణనలోకి తీసుకుంటే, అన్ని పనులూ మంచి పనులే. అలాగే అన్నీ కూడా చెడ్డపనులే అవుతాయి.

కేజీ బరువున్న వస్తువును, ప్రపంచంలో ఎక్కడకు తీసికెళ్లినా అది కేజీ బరువే ఉంటుంది. అలాగే కొలతలకు కూడా ప్రపంచవ్యాప్తంగా ఒకటే ప్రమాణముంది.

మరి మనిషి జీవనానికి లేదా ఆచరణకు ప్రపంచవ్యాప్తంగా అలాంటి ఓ ప్రమాణం లేదా? ప్రపంచంలోని ఏ మారుమూలలనుండి ఏ వ్యక్తిని తీసుకున్నా, అతని శారీరక నిర్మాణం, అతని అవయవాల పనితీరు తదితర అంశాలన్నీ మిగతా ప్రాంతాలలోని మనుషులలాగే ఒకే విధంగా ఉంటాయి కదా!

మనిషి అనే ఈ జీవయంత్రాన్ని తయారుచేసి, దానికి అవసరమైన ప్రోగ్రామింగ్‌ను చేసిన సృష్టికర్తకే తెలుసు - ఈ మనిషికి ఏది మంచి చేస్తుందో, ఏది చెడు చేస్తుందోనన్న విషయం.

మంచి చెడుల ప్రమాణాలు ఖుర్ఆన్‌లో ఉన్నాయి. అయితే ఆ ప్రమాణాల ప్రకారంగా ఎటువంటి సందేహానికి లోనవకుండా ఉండేందుకు ముహమ్మద్(స) మనందరి శిక్షణకై ఎన్నో విషయాలను ఆచరించి చూపారు. ఖుర్ఆన్ యొక్క ఆదేశాల ప్రకారంగా దైవప్రవక్త ముహమ్మద్ (స)ఆచరించిన పనులను మరియు ఆయన యొక్క ప్రవచనాలను హదీస్‌లు అంటారనే విషయం చాలామందికి తెలుసు. సమకాలీన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, వేల సంఖ్యలో ఉన్న హదీసులలోని కొన్ని హదీసులను ఎన్నుకొని ఈ శీర్షిక ద్వారా ఇన్షాఅల్లాహ్ అందిస్తూ ఉంటాము.

## ఉత్తమ సమాజం 16

( సెప్టెంబర్' 2011 సంచిక తరువాయి భాగం)

**ఈ నెల ప్రత్యేకం : ఆచరణ**

**"మరియు మీరు ప్రజలకు సాక్షులుగా ఉండటానికి మరియు సందేశహరుడు (ముహమ్మద్) మీకు సాక్షిగా ఉండటానికి మేము మిమ్మల్ని ఒక మధ్యస్థ (ఉత్తమ మరియు న్యాయశీలమైన) సమాజంగా చేశాము ....." (ఖుర్'ఆన్ 2:143)**

"And thus we have made you a **median [i.e. just] community** that you will be witnesses over the people and the Messenger will be a witness over you ....." (Qur'an 2:143)

**"మీరే మానవజాతి (హితం) కొరకు నిలబెట్టబడిన ఉత్తమ సమాజం వారు. మీరు మంచిని ఆదేశించే (బోధించే)వారు మరియు చెడును నిరోధించే వారు మరియు మీరు అల్లాహ్ యందు విశ్వాసం కలిగి ఉన్నవారు ..." (ఖుర్'ఆన్ 3:110)**

"You are the **best nation** produced [as an example] for mankind. You enjoin what is right and forbid what is wrong and believe in ALLAH ....." (Qur'an 3:110)



ఒక సమాజం ఉత్తమ సమాజం కావాలంటే జీవనోపాధి గురించి ఇతరులపై ఆధారపడకుండా, ఏ రిజర్వేషన్లు లేకుండానే ఏ విధంగా సాధించవచ్చో జూన్-జూలై'10 సంచికలోనూ, ఆర్థికంగా స్థిరపడిన తరువాత మనపై నున్న బాధ్యతలను తెలుసుకుని మసలుకోవాలని చెబుతూ, ముఖ్య బాధ్యతలను హదీస్‌ల ద్వారా క్లుప్తంగా తరువాయి సంచికలో వివరించడం జరిగింది. వ్యాపారం మరియు వ్యవసాయ ఉత్పత్తులు వాటికి సంబంధించిన విషయాలను, సంపాదన గురించి ఈ శీర్షికలోని గత మూడు వ్యాసాలలో అందించడం జరిగింది. హరామ్(నిషిద్ధ) వ్యాపారాలు చేయకూడదు. హలాల్ (ధర్మసమ్మతమైన) వ్యాపారంలో కూడా ఏ ఏ విషయాలు ప్రవక్త(స)వారిచే నిషేధించబడ్డాయో, ఏవి అనుమతించబడ్డాయో చెప్పడం జరిగింది.

వ్యాపారం గురించి, వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాల గురించి, సంపాదన గురించి ముఖ్య విషయాలను ముహమ్మద్(స)వారి బోధనల ద్వారా తెలుసుకున్నాము. కేవలం బోధనలు వినడం వలన ఉత్తమ సమాజం ఏర్పడదు. వాటిని ఆచరణలో పెట్టాలి. వాటిలో కొన్నింటిని ఆచరణలో పెట్టడానికి నాయకుడు కఠినంగా వ్యవహరించాలి కూడా.

ఇదే శీర్షికలో వెనుకటి వ్యాసంలో జ్ఞానాన్ని 'ప్రాపంచిక జ్ఞానం మరియు ధార్మిక జ్ఞానం' అని వేర్వేరుగా జ్ఞానాలుగా విభజించ నవసరం లేదని, ఇస్లామీయ జ్ఞానమున్నవానికి ప్రాపంచిక జ్ఞానం బాగా ఉంటుందని చెప్పడం జరిగింది. ఇస్లామ్ అంటే కేవలం బోధించబడే ధర్మం కాదు. దానితోపాటు ఆచరణ కూడా ఉండాలి. ఇస్లామీయ జ్ఞానమున్న వ్యక్తి ఏదైతే ప్రజలకు బోధిస్తాడో దానిని అతడు ఆచరణలో పెడతాడు.

## ఆచరణ

ఈ ప్రపంచంలో జీవించే ప్రతీ మనిషి యొక్క లక్ష్యం కేవలం సాఫల్యం పొందడం. ఆ సాఫల్యం మరేమిటో కాదు పరలోకంలో స్వర్గాన్ని పొందడమే! సాఫల్యం ఏ విధంగా పొందవచ్చో ఖుర్'ఆన్ స్పష్టంగా వివరించింది.

అల్లాహ్‌పై సంపూర్ణ విశ్వాసంతో సత్కార్యాలు చేయాలి. అంటే మంచి ఆచరణలు. ఖుర్'ఆన్ బోధించిన ప్రతీ సత్కార్యాన్ని ముహమ్మద్(స)వారు ఆచరించి ప్రజలకు చూపారు. ఆ ఆచరణలనే మనమూ పాటించాలి.

సరిగ్గా ఈ విషయంలోనే ఓ అపోహ ప్రజలలో కార్చిచ్చులా వ్యాపించింది. ఆ అపోహకి కారణం **ఒక హదీస్‌ను అపార్థం చేసుకోవడమే!** ఆ అపోహను దూరం చేయడానికే ఈ ప్రస్తుత వ్యాసం. ప్రజలు తప్పుగా అర్థం చేసుకున్నారని చెప్పడం కంటే, ప్రజలకు ఆ విధంగా 'హదీస్'ను వివరించడం జరిగిందనే చెప్పాలి.

---

అబూహురైరా(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : ''మీలో ఎవ్వరూ స్వర్గంలో ప్రవేశించరు అతని ఆచరణ ద్వారా''. ఒక వ్యక్తి అన్నాడు : ''మీకు సైతం లేదా, ఓ రసూలల్లాహ్?''. ఆయన(స) చెప్పారు : ''నాకు సైతం లేదు **అల్లాహ్ తన కరుణతో నన్ను పరివేష్టించే వరకూ**. కాని మీ శక్తిమేర (ఆచరణలు) చేయండి.'' **(సహీహ్ ముస్లిమ్, 7111, పుస్తకం 50, అధ్యా.17, సంపుటి 7)**

---

మరో ఉల్లేఖనం 7114లో ''**అల్లాహ్ తన క్షమ మరియు కరుణతో నన్ను పరివేష్టించే వరకూ**'' అని ఉంది.

మరో ఉల్లేఖనం 7115లో ''**అల్లాహ్ తన కరుణతో నన్ను రక్షించే వరకూ**'' అని ఉంది. ఉల్లేఖనం 7116లో ''**అల్లాహ్ తన దయ మరియు కరుణతో నన్ను పరివేష్టించే వరకూ**''

పై హదీస్‌ను బట్టి ఎవరైనా సరే అల్లాహ్ కరుణ లేకుండా కేవలం తన ఆచరణల ద్వారా స్వర్గాన్ని పొందలేరు. దీనిని కొందరు ఏ విధంగా అపార్థం చేసుకున్నారంటే మంచి ఆచరణల ద్వారా స్వర్గాన్ని పొందలేమని.

కాబట్టి ఎటువంటి పనులు చేసినా ఫర్వాలేదని, అల్లాహ్ కరుణ లభిస్తే స్వర్గం లభిస్తుందని భావించి చాలామంది మంచి ఆచరణలకు దూరం అయ్యారు. కాని ఈ హదీస్ ద్వారా అర్థం చేసుకోవలసింది అది కాదు. **కేవలం మనం చేసిన మంచి ఆచరణలు మాత్రమే సరిపోవు. వాటితో పాటు అల్లాహ్ కరుణ కూడా ఉండాలి.**

ఒక వ్యక్తి ఒక పాపకార్యం చేస్తే దానికి సమానమైన శిక్ష ఉంటుంది. కాని ఒక వ్యక్తి **ఒక మంచిపని చేస్తే దానికి సరిపడా పుణ్యం లభించదు. అంతకంటే ఎక్కువే లభిస్తుంది.**

> ''ఎవడు ఒక **సత్కార్యం** చేస్తాడో, అతనికి దానికి **పదిరెట్లు ప్రతిఫలం** ఉంటుంది. మరియు ఎవడు ఒక పాపకార్యం చేస్తాడో, అతనికి దానంతటి శిక్షయే ఉంటుంది. మరియు వారికెలాంటి అన్యాయం జరగదు.'' (ఖుర్'ఆన్ 6:160)

- అంటే ఒక పుణ్యకార్యానికి 10 రెట్లు పుణ్యాన్నివ్వడం అల్లాహ్ కారుణ్యం.
- అదే విధంగా ఒక పాపకార్యానికి 10 రెట్లు శిక్షను ఇవ్వకపోవడం కూడా అల్లాహ్ కారుణ్యమే!

అంటే మన ఆచరణలకు తగ్గ ప్రతిఫలం మాత్రమే ఇస్తే ఏ వ్యక్తికీ స్వర్గం లభించదు. ఆ ఆచరణలకు ఎన్నో రెట్లు ప్రతిఫలమిస్తేనే అది సాధ్యమౌతుంది. ఉదాహరణకు రమదాన్ నెలలో చేసే ఆచరణలకు లభించే ప్రతిఫలం మామూలు దినాలలో లభించే ప్రతిఫలం కంటే 70 రెట్లు ఉంటుంది. **ఇది ప్రతీ సంవత్సరం లభించే ఓ ప్రత్యేక అవకాశం.**

అంతేకాకుండా రమదాన్ నెల చివరి పది రోజులలో వచ్చే ఒక ఘనమైన రాత్రి చేసే ఆరాధనలు 1000 నెలల పాటు చేసే ఆరాధనకు సమానం. అంటే కేవలం ఒక రాత్రి (సగం రోజు) చేసిన ఆరాధన 30వేల రోజులకు సమానం చేయబడింది. దీనిని బట్టి మనం చేసే సత్కార్యాలకు మరియు ఆరాధనలకు 10 రెట్ల పుణ్యమే కాకుండా వేలరెట్లు పుణ్యం లభించే అవకాశం కూడా అల్లాహ్ మనకు ఇచ్చారు. ఇదే అల్లాహ్ కరుణ.

క్రింది రెండు హదీస్‌లను గమనించండి.

> అబూహురైరా(రజి) ఉల్లేఖనం ప్రకారం అల్లాహ్ యొక్క సందేశహరులు (ముహమ్మద్-స) ఇలా అన్నారు: ''**ఓ వ్యక్తి దారిన పోతుండగా, మార్గంపై ఓ ముళ్ళ కొమ్మను చూశాడు. దానిని తీసివేశాడు. దానిని (ఆ సత్కార్యాన్ని) అల్లాహ్ మెచ్చుకొని, అతనిని క్షమించాడు.**'' **(సహీహ్ ముస్లిమ్, 6669, సంపుటి 6, అధ్యా.36)**
>
> క్షమించాడు అంటే అతనికి స్వర్గం లభించింది.
>
> అబూహురైరా(రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త(స) ఇలా

చెప్పారు: "ప్రజలకు మార్గంలో ఇబ్బందిని కలిగించే చెట్టును నరికినందుకు గాను, స్వర్గంలో ఆనందిస్తున్న ఓ మనిషిని నేను చూశాను". **(సహీహ్ ముస్లిమ్, 6671, సంపుటి 6, అధ్యా. 36)**

పై హదీస్‌లో ఓ వ్యక్తి చేసిన ఆచరణ అతి చిన్నది. చిన్న పిల్లాడు కూడా అది చేయగలడు. ఆ ఒక్క చిన్న ఆచరణకే స్వర్గం లభించడం అంటే ఆ ఆచరణకు ఎన్ని రెట్ల పుణ్యం లభించి ఉంటుందో!

కాబట్టి మనం చేసే ప్రతీ సత్కార్యానికి 10 రెట్లు పుణ్యం లభించడం వరకూ అల్లాహ్ గ్యారంటీ ఇచ్చారు. అయితే **అంతకంటే ఎన్నో రెట్లు ఎక్కువ పుణ్యం కూడా ఇవ్వవచ్చు**. అది అల్లాహ్ మనపై చూపే కారుణ్యంపై ఆధారపడి ఉంది.

ఆయన ఎవరికీ అన్యాయం చేయరు. ఆయన వాగ్దానం అంటే వాగ్దానమే! అల్లాహ్ కరుణ పొందడానికి ఎన్నో మార్గాలున్నాయి. పై హదీస్ ద్వారా అటువంటి ఒకమార్గంతెలిసింది.

తన తోటివారికి ముళ్ళ కొమ్మ ద్వారా కష్టం కలుగకూడదనే సంకల్పమే అతనికి స్వర్గాన్ని లభింపజేసింది. **ఆచరణ చిన్నదే గాని సంకల్పం చాలా గొప్పది.** కాబట్టి అతి చిన్న సత్కార్యాన్ని కూడా మనం తక్కువగా భావించకూడదు. మంచి సంకల్పంతో వాటిని చేస్తే ఏ అతి చిన్న ఆచరణకు ఎటువంటి గొప్ప ప్రతిఫలం లభిస్తుందో మనకు తెలియదు.

ఉదాహరణకు కొన్ని ఖుర్'ఆన్ ఆయత్‌లు ఇక్కడ అందిస్తున్నాము.

> ఎవరైతే విపత్కరమైన పరిస్థితి ఏర్పడినప్పుడు : "నిశ్చయంగా మేము అల్లాహ్‌కే చెందినవారము! మరియు మేము ఆయన వైపునకే మరలిపోతాము!" అని అంటారో. అలాంటివారికి వారి ప్రభువునుండి అనుగ్రహాలు మరియు **కరుణ** ఉంటాయి. మరియు వారే సన్మార్గం చెందినవారు. (ఖుర్'ఆన్ 2:156-157)

> మరియు మీరు **కరుణింపబడటానికి** అల్లాహ్‌కు మరియు సందేశ హరునికి విధేయులై ఉండండి. (ఖుర్'ఆన్ 3:132)

> ... కావున దీనిని అనుసరించి భయభక్తులు కలిగి ఉంటే, మీరు **కరుణింపబడవచ్చు**. (ఖుర్'ఆన్ 6:155)

> మరియు ఖుర్'ఆన్ పారాయణం జరిగేటప్పుడు దానిని శ్రద్ధగా వినండి మరియు నిశ్శబ్దంగా ఉండండి. అప్పుడు మీరు **కరుణింప బడవచ్చు** (ఖుర్'ఆన్ 7:204)

బోధిస్తే సరిపోదు. ఆచరణ కూడా ఉండాలి. అదే ఇస్లామ్. ఆ విధంగా ఆలోచించని కొందరి ముస్లిమ్ బోధకుల పరిస్థితి ఏమి కాబోతుందో ముహమ్మద్(స)వారు ముందుగానే తెలియజేశారు.

ఉసామా బిన్ జైద్(రజి)వారి ఉల్లేఖనంలోని భాగం :

అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పగా విన్నాను : "ఒక వ్యక్తి పునరుథ్థాన దినమున తీసుకురాబడి నరకాగ్నిలో విసిరివేయబడతాడు. అతని ప్రేవులు వెదజల్లబడతాయి. మరియు అతడు వాటి చుట్టూ తిరుగుతాడు గానుగ చుట్టూ గాడిద తిరిగినట్లు. నరకాగ్ని ప్రజలు అతని చుట్టూ చేరి అడుగుతారు, "ఓ ఫలానా! నీకు ఈ గతి పట్టిందేమిటి? నీవు మాకు మంచిని ఆదేశించి మరియు చెడును నిరోధించే వాడివి కదా" అతడు చెబుతాడు, **"ఔను, నిశ్చయంగా నేను మీకు మంచిని ఆదేశించే వాడిని మరియు నేను దానిని చేసేవాడిని కాదు మరియు నేను చెడును నిరోధించేవాడిని మరియు నేను దానిని చేసేవాడిని."**
**(సహీహ్ ముస్లిమ్, 7483, పుస్తకం 53, అధ్యా.7, సంపుటి 7)**

### మన శక్తి మేర సత్కార్యాలు చేయాలి

అల్లాహ్‌చే కరుణింప బడటానికి అల్లాహ్‌కు మరియు ఆయన సందేశహరుడైన ముహమ్మద్(స)వారికి విధేయత చూపండి. ఖుర్'ఆన్ పారాయణం చేస్తూ ఉండండి.

అబూహురైరా(రజి) ఉల్లేఖనం.

నేను అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పగా విన్నాను, "ఏ ఒక్క వ్యక్తి యొక్క ఆచరణ అతనిని స్వర్గంలో ప్రవేశింప చేయజాలదు." (అంటే ఎవరూ కేవలం అతని మంచి ఆచరణల ద్వారా స్వర్గంలో ప్రవేశించజాలరు). వారు (సహాబీలు) అడిగారు, "మీకు సైతం లేదా, ఓ రసూలల్లాహ్?". ఆయన(స) చెప్పారు, "ఔను. నాకు సైతం లేదు, నాపై అల్లాహ్ యొక్క దయ మరియు కరుణ అనుగ్రహించబడితే తప్ప". కాబట్టి మీరు (ధర్మాచరణలలో) మధ్యస్థంగా ఉండండి మరియు **మీ శక్తిమేర (ఆచరణలు) చేయండి.** మరియు మీలో ఎవరూ చావును కోరుకోకూడదు. అతడు మంచి పనులు చేసేవాడైతే, అతడు తన మంచి ఆచరణలు పెంచుకోవచ్చు. మరియు అతడు చెడుపనులు చేసేవాడైతే, అతడు అల్లాహ్ ముందు పశ్చాత్తాప పడవచ్చు." **(సహీహ్ బుఖారీ, 5673, పుస్తకం 75, అధ్యా.19, సంపుటి 7)**

అల్లాహ్ మనల్ని కరుణించాలంటే, ఆ కరుణ కూడా మనం చేసే సత్కార్యాలు మరియు మంచి సంకల్పాల పైనే ఆధారపడి ఉంటుంది.

**ఆచరణతోనే సాఫల్యముంది.**

*Eemaan (Faith) is both speech and deed*

**ఖుర్'ఆన్ మరియు సున్నత్ ప్రకారంగా మన ఆచరణ ఉండాలి.**

## సకల లోకాలకు కారుణ్యం (రహమతల్లిల్ ఆలమీన్)

13

### మొదటి తరం ముస్లిముల లక్షణాలు
### (సహనం, వేడుకోలు, నిజాయితీ, సత్యంపై స్థిరంగా నిలబడటం)

ప్రవక్త(స)వారు చేసిన ధర్మ సందేశ ప్రచారంలో మొదటి దశ రహస్యంగా జరిగింది. అర్ఖమ్(రజి)వారి ఇంటిలో ప్రవక్త(స)వారు తన అనుచరులతో సమావేశం కావడం కేవలం వారికి బోధన మరియు సలహాలు ఇవ్వడం కోసం మాత్రమే కాదు. వారు బోధకులుగా మరియు నాయకులు కావడానికి అవసరమైన శిక్షణనిచ్చారు. అంతేకాకుండా ముహమ్మద్(స)వారి అనుచరుల జీవితాలను మనం జాగ్రత్తగా పరిశీలించ గలిగితే, ఇస్లామ్‌ను వ్యాపింపజేసే బాధ్యతతో పాటు ఓ ప్రత్యేక బాధ్యత వారిపై ఉంచినట్లు తెలుసుకోగలుగుతారు.

ప్రవక్త(స)వారి మక్కా జీవితంలో ముస్లిమ్ సమాజం చాలా నెమ్మదిగా, జాగ్రత్తగా, అంచెలంచెలుగా అభివృద్ధి చెందింది. ఈ దశ ఎలా ఉండేదో క్రింది ఖుర్ఆన్ వాక్యం ద్వారా తెలుసుకోవచ్చు.

> **మరియు** (ఓ ముహమ్మద్!) **ఎవరు ఆయన ముఖదర్శనం** (ప్రసన్నతను) **కోరుతూ, ఉదయం మరియు సాయంత్రం తమ ప్రభువును ప్రార్థిస్తున్నారో, వారి** (నీ సహాబీల) **సహచర్యంలోనే, సహనం వహించి ఉండు. ఇహలోక ఆడంబరాలను ఆపేక్షించి నీ దృష్టిని వారి నుండి దాటనివ్వకు** (వారిని ఉపేక్షించకు). **మరియు ఎవడి హృదయాన్ని మా ధ్యానం నుండి తొలగించామో మరియు ఎవడు తన మనోవాంఛలను అనుసరిస్తున్నాడో మరియు ఎవడి వ్యవహారాలు (కర్మలు) వ్యర్థమయ్యాయో అలాంటి వానిని అనుసరించకు** (మాటవినకు). (ఖుర్ఆన్ 18:28)

ఈ ఆయత్‌లో ముహమ్మద్(స)వారి పిలుపు విని ఇస్లామ్ వైపు వచ్చిన వారి పొరపాట్ల పట్ల సహనం వహించమని ఆయనను ఆదేశించారు. ఇంకా ప్రత్యేకంగా చెప్పాలంటే వారు వేసే ప్రశ్నల పట్ల అవి అడగకూడనివి అయినప్పటికీ మరియు కొన్ని ఆదేశాలను వారు ఆచరించడంలో మొహమాట పడినప్పటికీ సహనం వహించమన్నారు. అంతే కాకుండా తన అనుచరులలో **సహనం** నాటుకునేలా శాయశక్తులా ప్రయత్నించ మని ఆదేశించబడ్డారు. అది ఎటువంటి సహనం అంటే వారు తమ ప్రజల నుండి ఎదురయ్యే కఠోరమైన వ్యవహార విధానం నుండి తట్టుకొని నిలబడగలిగే సహనం.

**1. సహనం (అస్-సబ్ర్) :** ఈ పదం ఖుర్ఆన్‌లోనూ మరియు హదీస్‌ల లోనూ పదే పదే వస్తుంది. ముస్లిములు స్వయంగా తమంతట తాము సహనం వహిస్తే సరిపోదు. సహనం వహించమని ఇతరులకు కూడా సూచించాలి. సహనం అనేది ఇస్లామ్‌లో చాలా ప్రాముఖ్యత కలిగిన అంశం. **నష్టపోవడం నుండి రక్షించబడే నాలుగు లక్షణాలలో ఇది ఒకటి.**

> **కాలం సాక్షిగా! నిశ్చయంగా, మానవుడు నష్టంలో ఉన్నాడు. కాని (అల్లాహ్‌ను) విశ్వసించి, సత్కార్యాలు చేసేవారు మరియు ఒకరికొకరు సత్యాన్ని బోధించుకునేవారు మరియు ఒకరికొకరు సహనాన్ని (స్థైర్యాన్ని) బోధించుకునే వారు తప్ప.** (ఖుర్ఆన్ 103:1-3)

ఖుర్ఆన్‌లో పైన చెప్పిన ఆయత్‌లను బట్టి మానవులంతా నష్టంలో ఉన్నారు, క్రింది 4 లక్షణాలు కలిగి ఉన్నవారు తప్ప.

- అల్లాహ్‌పై విశ్వాసాన్ని కలిగి ఉండటం
- సత్కార్యాలు చేయడం
- పరస్పరం సత్యాన్ని బోధించుకోవడం
- పరస్పరం సహనాన్ని బోధించుకోవడం

ఏ ముస్లిమైనా సరే తనను తాను సరిదిద్దుకుంటే సరిపోదు, ఇతరులను కూడా అల్లాహ్ పేరుతో సరిదిద్దడానికి ప్రయత్నించాలి.

ప్రతీ ముస్లిమ్‌పై నున్న 'దావా' బాధ్యతను ఈ ఆయత్‌లు చాలా స్పష్టంగా చెప్పాయి. మనం సన్మార్గంలో ఉంటే సరిపోదు. ఇతరులు కూడా సన్మార్గంలోకి రావడానికి ప్రతీ ముస్లిమ్ పాటుపడాలి. ప్రతీ ముస్లిమ్ మరొకరికి బోధించాలి. **ప్రారంభం నుండి శాంతిబాట చెప్పేది ఇదే!** దావా అనేది ప్రతీ ముస్లిమ్‌పైనున్న బాధ్యత. ఖుర్ఆన్ మరియు హదీస్‌లను అర్థం చేసుకున్నవారు ఈ విషయాన్ని అంగీకరిస్తారు.

కేవలం 'దాయీలు'గా పిలవబడే కొందరు వ్యక్తులపై ఆ బాధ్యతను ఉంచి, సత్యాన్ని బోధించడాన్ని మానివేయడం ద్వారా **ప్రతీ ముస్లిమ్ ఖుర్'ఆన్ ఆయత్ ప్రకారం నష్టపోయేవారిలో చేరతాడు.** అంటే స్వర్గాన్ని కోల్పోవచ్చు. సత్యాన్ని పరస్పరం బోధించుకోవాలి అని అల్లాహ్ ఆదేశిస్తున్నారు.

పైన తెలిపిన నాలుగు లక్షణాలు కలిగి ఉండడం ద్వారా అల్లాహ్‌కు మనపై ఉన్న హక్కులను మరియు ప్రజలకు మనపై ఉన్న హక్కులను మనం నెరవేర్చగలుగుతాము.

**2. అల్లాహ్‌ను పదే పదే వేడుకోవడం :** శాంతిబాట ఆగస్టు' 2011 సంచికలో 'దుఆ' ప్రత్యేక వ్యాసాన్ని అందించాము. మరోసారి ఆ వ్యాసాన్ని చదవండి. దుఆ(వేడుకోలు) కూడ ప్రార్థనే! ఎక్కువగా అల్లాహ్‌ను వేడుకునేవారు, ఆ వేడుకోలు విలువ ఏమిటో ఎవరూ చెప్పనవసరం లేకుండా స్పష్టంగా తెలుసు కోగలుగుతారు. ఈ ఆరాధన వలన అల్లాహ్‌ను ఎక్కువగా స్మరించడం వలన మన హృదయాలకు తృప్తి లభిస్తుంది.

**మరియు** (ఓ ముహమ్మద్!) **ఎవరు ఆయన ముఖదర్శనం** (ప్రసన్నతను) **కోరుతూ, ఉదయం మరియు సాయంత్రం తమ ప్రభువును ప్రార్థిస్తున్నారో** ..... (ఖుర్'ఆన్ 18:28)

ప్రతీ విషయంలో అల్లాహ్ సహాయాన్ని అర్థించడం, మార్గదర్శకత్వాన్ని కోరడం వలన అల్లాహ్‌తో మనకు గట్టి బంధం ఏర్పడి అది మనల్ని విజయం వైపుకు తీసుకెడుతుంది. **'వేడుకోలు' అనేది చాలా గొప్ప విషయం.** ఎన్నో అనుగ్రహాలు అల్లాహ్ నుండి మనపై వర్షిస్తాయి. ఈ సంచికలో 'అల్లాహ్'పై ప్రత్యేక వ్యాసం అందించాము. ఈ అంశం కూడా అందులో విపులంగా వివరించడం జరిగింది.

**3. నిజాయితీ :** మన ఆచరణలు స్వీకరించబడటానికి కలిగి ఉండ వలసిన అతి ముఖ్య లక్షణం నిజాయితీ.

**4. సత్యంపై స్థిరంగా నిలబడటం :**

**విశ్వాసులలో అల్లాహ్‌కు తాము చేసిన ఒప్పందం నిజం చేసి చూపిన వారు కూడా ఉన్నారు. వారిలో కొందరు తమ శపథాన్ని పూర్తిచేసుకున్న వారున్నారు. మరికొందరు దానిని పూర్తి చేసుకోవటానికి నిరీక్షిస్తున్నారు. మరియు వారు తమ వైఖరిని ఏమాత్రం మార్చుకోలేదు.** (ఖుర్'ఆన్ 33:23)

**సత్యంపై స్థిరంగా నిలబడాలంటే విశ్వాసం, ధైర్యం మరియు సత్యత ఉండాలి.**

ఇస్లామ్ అనేది మక్కాకు మాత్రమే పరిమితం కాదు. అది ఎల్లప్పుడూ రహస్యంగా ఆచరించవలసిన ధర్మమూ కాదు. సత్యం అందరికీ తెలియాలి. సర్వమానవాళి కొరకు ఇదొక జ్ఞాపిక.

**ఇది సమస్తలోకాల వారందరికీ కేవలం ఒక జ్ఞాపిక** (హితోపదేశం) (ఖుర్'ఆన్ 38:87)

**కాని సర్వలోకాల (వారికి) ఇదొక హితోపదేశం మాత్రమే** (ఖుర్'ఆన్ 68:52)

## రాత్రికి రాత్రే ఇస్లామ్ వ్యాపించేయలేదు

ఒక జాతి అభివృద్ధి చెందినా లేక నాశనమైనా, అది విశ్వ నియమాలకు కట్టుబడే జరుగుతుంది. ముహమ్మద్(స)వారి జీవితం అధ్యయనం చేయడం ద్వారా, ఆయన(స) ఈ నియమాలను ఎంత గొప్పగా అర్థం చేసుకున్నారో మరియు ఎంత వివేకంతో ఆయన వాటిని ఇస్లామ్ మేలు కొరకు ఉపయోగించారో అర్థం చేసుకోగలిగేవారికి తప్పక విస్మయం కలిగిస్తుంది.

ఆ నియమాలు విశ్వానికి, మానవులకు వర్తిస్తాయి మరియు అన్ని కాలాలకు, అన్ని ప్రాంతాలకు కూడా వర్తిస్తాయి.

ఈ ధర్మం యొక్క పురోగతి కోసం దాని వ్యవహారాలన్నీ అల్లాహ్ ఏర్పరచిన నియమాలు మరియు విధులపై ఆధారపడ్డాయి. బహుశా ఇది తరువాయి తరం వారు క్రింది విధంగా మాట్లాడకుండా ఉండటం కోసం అయివుండవచ్చు.

"మొదటి తరం ముస్లిములు విజయాన్ని అద్భుతాల ద్వారా సాధించారు మరియు ప్రవక్త(స)వారి మరణం తరువాత నుండి ఆ అద్భుతాలు జరగడం ఆగిపోయాయి"

పై విధంగా అనే అవకాశం ఇక లేదు.

ఖుర్'ఆన్ ద్వారా అల్లాహ్ తెలియజేసిన నియమాలు గతించిన ఎన్నో శతాబ్దాలకు వర్తించాయి. ప్రస్తుత కాలానికి మరియు భవిష్యత్ కాలానికి కూడా అవి వర్తించేయోగ్యతను కలిగి ఉన్నాయి.

ముస్లిములు ఈ నియమాలను అధ్యయనం చేస్తే వాటిలోని వివేకం అర్థమౌతుంది. సత్ఫలితాన్ని పొందడానికి ఆ నియమాల కనుగుణంగా జీవించాలి. కేవలం ముస్లిములు అయినంత మాత్రాన సుస్థిరత్వం గాని విజయంగాని వారిని వరించదు.

మానవజీవితంలో ఏదీ కూడా క్రమరహితం(random)గా సంభవించదు. ప్రతీదీ అల్లాహ్ ఏర్పరిచిన నియమాల ప్రకారమే సంభవిస్తుంది. ముస్లిములు ఖుర్'ఆన్ మరియు హదీస్‌ల ద్వారా తమ ప్రభువు ఏర్పరిచిన నియమాల గురించి అర్థం చేసుకోగలరు. అవి మనకు అర్థం కావడానికి అల్లాహుతాలా ఖుర్'ఆన్‌ను సులభతరం చేశారు.

ముస్లిములు స్పష్టంగా అర్థం చేసుకోవలసిన విషయం ఏమిటంటే వారికి విజయం విచక్షణపై ఆధారపడకుండా లభించదు లేదా క్రమరాహిత్య విధానంలో లభించదు. అల్లాహ్ ఏర్పరిచిన నియమాల కనుగుణంగా ఎలా జీవించాలో తెలుసుకోగలిగి, దాని ప్రకారం ఆచరిస్తేనే అది సాధ్యమౌతుంది.

**ప్రొఫెసర్ అల్-బన్నాహ్ చెప్పారు :**

**"విశ్వం యొక్క నియమాలతో ఢీకొనకండి. అవి మిమ్మల్ని జయిస్తాయి. బదులుగా ఆ నియమాల విషయంలో నిపుణులుకండి వాటిని ఉపయోగించుకోవడానికి, వాటి ప్రవాహ దిశను మార్చండి. వాటిలోని కొన్నింటిని మరి కొన్నింటి ప్రభావాలకు వ్యతిరేకంగా ఉపయోగించండి. మరియు ఆ తరువాత అల్లాహ్ నుండి సహాయం అందే సమయం కోసం మరియు విజయం కోసం ఎదురు చూడండి. అది మీ నుండి దూరంగా పోలేదు".**

ముహమ్మద్(స)వారి జీవితంపై ఆయనకున్న జ్ఞానం, మరియు ఇస్లామీయ చరిత్ర మరియు సాధారణ చరిత్రపై ఉన్న జ్ఞానం వలన ప్రొఫెసర్‌గారు పై నిర్ణయానికి వచ్చారు.

ప్రవక్త(స)వారి నాయకత్వంలో తొలి తరం ముస్లిములు అల్లాహ్ యొక్క విశ్వ నియమాలకు కట్టుబడ్డారు. వాటిలోని కొన్ని నియమాలు:

- నాగరికత అభివృద్ధికి బలమైన నాయకత్వం యొక్క ప్రాముఖ్యత
- అసత్యవాదం ఖండించే ఓ వ్యవస్థ యొక్క ప్రాముఖ్యత
- విశ్వాసాన్ని అర్థం చేసుకోవడానికి ఓ బలమైన విధానం యొక్క ప్రాముఖ్యత

**అతి ముఖ్యమైన విశ్వ నియమం ఏమిటంటే క్రమబద్ధంగా జరిగే పురోగతి.**

ఒక బలమైన మరియు సుస్థిరమైన జాతిని నిర్మించుకోవడానికి ఈ నియమానికి ముస్లిములంతా కట్టుబడి ఉండాలి.

క్రమబద్ధ పురోగతి వలన మన లక్ష్యాన్ని చేరే దూరం పెరగవచ్చు. ప్రత్యేకంగా చెప్పాలంటే మనం నివశిస్తున్న ఈ కాలంలో ప్రజల మధ్య అజ్ఞానం మరియు చెడుబలంగా పాతుకుపోయింది. ఆ అజ్ఞానాన్ని మరియు చెడును తొలగించాలంటే, ఓ క్రమబద్ధమైన పురోగతి ద్వారా లక్ష్యాన్ని చేరుకోవడానికి మనం పురోగమించాలి.

ప్రవక్త(స)వారి **దావా** తొలి దశలు క్రమబద్ధమైన పురోగతితో కూడిన ఎన్నో ఉదాహరణలతో నిండి ఉన్నాయి. ప్రవక్త(స)వారి దావా తొలి దశలో ముస్లిములు ఎన్నుకోబడ్డారు మరియు శిక్షణ పొందారు. రెండవ దశలో వారు శతృవులతో పోరాడారు. చివరి దశలో వారు విజయాన్ని మరియు సుస్థిరత్వాన్ని సాధించారు.

**ఒక్కసారిగానే వారు ఇదంతా సాధించేయ లేదు.**

ఈ రోజున ముస్లిములు క్రమబద్ధమైన పురోగమన నియమం యొక్క విలువను అర్థం చేసుకోవాలి. మనం ఇప్పుడు చూస్తూనే ఉన్నాము, 'దావా' చేస్తున్నామని చెప్పేవారు రాత్రికి రాత్రే మార్పు సాధ్యం అనుకుంటున్నారు. ఆ విధంగా ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు.

వారు చేసిన పనుల ఫలితాలను చూడకుండానే, ముస్లిముల వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండానే, మనం కోరుకునే సుస్థిరమైన మరియు వాస్తవ మార్పుకు అవసరమైన వాటిని ఏదీ సిద్ధం చేసుకోకుండానే, పరిపూర్ణమైన వేగవంతమైన మార్పును ముస్లిమ్ సమాజం తీసుకు రాగలమనే భ్రమలో ఉన్నారు. ప్రవక్త(స)వారి విధానం వదిలేసి అల్లాహుతాలా ఏర్పరచిన నియమాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. పల్లెటూర్లలో ముస్లిములు వేరే ధర్మంలోకి మారిపోతున్నారని పుకార్లు పుట్టించి, అవివేకంతో డిబేట్‌లు ఏర్పాటు చేసుకుని **ముస్లిమ్ సమాజ విచ్ఛిన్నానికి పాల్పడుతున్నారు.** ఓ సుస్థిరమైన శాశ్వతమైన మార్పు రావాలంటే ప్రవక్త(స)వారి విధానాన్ని అనుసరిస్తేనే ఇన్షాఅల్లాహ్ సాధ్యమౌతుంది.

ఎన్నోసార్లు మన ఆలోచనను అల్లాహుతాలా క్రమబద్ధమైన పురోగమన నియమం వైపు మరలిస్తున్నారని ఖుర్‌ఆన్ చదివేటప్పుడు తెలుస్తుంది. ఉదాహరణకు, అల్లాహుతాలా భూమి మరియు ఆకాశాలను 6 దశలలో సృష్టించారు. కాని ఆయన తలచుకుంటే కనురెప్ప మూసి తెరిచే సమయం లోపలే ఇదంతా చేయగలరు.

అదే విధంగా మనం ఓ పసిబిడ్డగా పుట్టిన తరువాత ఎన్నో దశలు దాటుకుని పూర్తిగా ఎదిగిన వ్యక్తిలా మారుతున్నాము. మనం పుట్టిన వెంటనే ఒక్కసారిగా పూర్తి ఎత్తుకు ఎదిగిపోవడం లేదు కదా!

ఈ విషయం ఇంకా స్పష్టం కావడానికి క్రింది ఖుర్‌ఆన్ ఆయత్‌లు గమనించండి :

> సర్వలోకాలకు హెచ్చరిక చేసేదిగా, ఈ గీటురాయిని తన దాసునిపై **క్రమక్రమంగా అవతరింపజేసిన** ఆయన ఎంతో శుభదాయకుడు (ఖుర్‌ఆన్ 25:1)

> మరియు సత్యతిరస్కారులు అంటారు : "ఇతని మీద ఈ ఖుర్‌ఆన్ పూర్తిగా ఒకేసారి ఎందుకు అవతరించబడలేదు?" మేము ఈ విధంగా **నీ హృదయాన్ని ధృడపరచడానికి. మరియు మేము దీనిని క్రమక్రమంగా అవతరింపజేశాము** (ఖుర్‌ఆన్ 25:32)

> ఇలా అను : "దీనిని నీ ప్రభువు వద్ద నుండి సత్యంతో, **విశ్వాసులను ధృడపరచడానికి** మరియు ముస్లిములకు (అల్లాహ్‌కు విధేయులుగా ఉన్నవారికి) సన్మార్గం చూపటానికి మరియు శుభవార్త అందజేయటానికి, పరిశుద్ధాత్మ (జిబ్రీల్) **క్రమక్రమంగా ఉన్నది ఉన్నట్లుగా** తీసుకుని వచ్చాడు" (ఖుర్‌ఆన్ 16:102)

ఇస్లామీయ శాసనం కూడా ఈ నియమం ప్రకారమే తయారైంది. ఇదంతా ప్రజలకు సులభం కావడం కొరకే. సలాత్, ఉపవాసం, జకాత్ - ప్రతీ తప్పనిసరి బాధ్యత కూడా శాసనం కావడానికి ముందు ఎన్నో దశలను దాటడం జరిగింది.

ఎవరైనా ఖుర్‌ఆన్ మరియు హదీస్‌ల అధ్యయనం కొరకు పరిశోధన చేస్తే, ఆ పరిశోధన ద్వారా అరబ్ భూభాగ ప్రజలలో నెమ్మదిగా మరియు క్రమంగా ఇస్లామ్ ఏ విధంగా పరివర్తన తీసుకు వచ్చిందో అర్థమౌతుంది. అది అర్థమయ్యాక ప్రశంసించకుండా ఉండలేరు.

కాని ఈ రోజున దురదృష్టవశాత్తూ మన ఆలోచనలు ఎలా ఉన్నాయంటే, ఒక రాజుగాని లేదా ఒక పాలకుడుగాని లేదా ఓ పార్లమెంట్‌గాని ఆజ్ఞాపిస్తే ఒక్కసారిగా అంతా జరిగిపోతుందనే భ్రమలో ఉన్నాయి.

క్రమబద్ధమైన పురోగతి ద్వారా ప్రజల ఆలోచనలో మార్పు తీసుకు రావాలి. తద్వారి మనుషులలో అంతర్గత మార్పు వస్తుంది. ఆ మార్పు ఒక క్రమబద్ధంగా సొసైటీ స్థాయి నుండి ప్రారంభం కావాలి.

ఈ విధానం ద్వారానే ముహమ్మద్(స)వారు **ఓ అజ్ఞాన సమాజాన్ని ఉత్తమ సమాజంగా పరివర్తన చెందించారు.** మక్కా నగరంలో ముహమ్మద్(స)వారు ప్రవక్తగా గడిపిన 13 సంవత్సరాల పాటు, విశ్వాసుల యొక్క ఒక తరం శిక్షణపైనే దృష్టి కేంద్రీకరించడం జరిగింది.

ఆ శిక్షణవలన వారు ధర్మ వ్యాప్తిలో ఎదురయ్యే కఠిన పరిస్థితులను ఎదుర్కొని నిలబడగలిగారు. కాబట్టి ప్రవక్త(స)వారి జీవితంలో 'మక్కా' దశ **'శాసన దశ'**గా కాకుండా **'శిక్షణ మరియు అభివృద్ధి దశ'** అని అర్థమౌతుంది.

క్రమక్రమంగా వృద్ధి చెందడం గురించి ప్రాథమిక పాఠశాలలో చదివే పిల్లలు కూడా స్పష్టంగా అర్థం చేసుకోగలుగుతారు. ఎందుకంటే వారికి టీచర్లు ఒక్క రోజులోనో లేక ఒక్క వారంలోనో లేక ఒక్క నెలలోనో పాఠాలు మొత్తం పూర్తి చేసేయకుండా, సంవత్సరం పాటు కొద్ది కొద్దిగా చెబుతారు. **జ్ఞానం అనేది కొద్ది కొద్దిగా వినాలి. కొద్ది కొద్దిగా చెప్పాలి.** అంతేగాని ఒకరోజు ఉదయం నుండి రాత్రి వరకూ ఊకదంపుడు ఉపన్యాసాల ద్వారా జ్ఞానాన్ని పొందలేము. శ్రోతలకు విరక్తి కలగవచ్చు.

(మరికొంత భాగం ఇన్షాఅల్లాహ్ వచ్చే సంచికలో ...)

## విశ్వ నియమాల ప్రకారం సమాజ సంస్కరణ

ఒక సమాజాన్ని సంస్కరించాలని ప్రయత్నించే వారికి ఏయే లక్షణాలు ఉండాలో ఈ వ్యాసంలో ఇప్పటివరకూ చదివారు. ఈ లక్షణాలు అలవరచుకోకుండా ఊకదంపుడు ఉపన్యాసాల ద్వారా సంస్కరణ జరుగుతుంది అని అనుకోవడం మరియు ఎండమావిలో నీరు దొరుకుతుంది అని అనుకోవడం ఒక్కటే!

ఖుర్'ఆన్ ద్వారా మనం తెలుసుకున్న విశ్వ నియమాలు గతించిన కాలానికి వర్తించాయని, వర్తమాన మరియు భవిష్యత్ కాలాలకు కూడా వర్తిస్తాయని తెలుసుకున్నాము. మరియు మొత్తంగా చూస్తే నేటి ముస్లిమ్ సమాజ పరిస్థితి ప్రవక్త(స)వారు ధర్మ సందేశ ప్రచారం ప్రారంభించిన రోజులలోని సమాజ పరిస్థితి కంటే మెరుగ్గా ఏమీ లేదని స్పష్టంగా తెలుస్తూనే ఉంది. ఖుర్'ఆన్ మరియు ముహమ్మద్(స)వారి బోధనల ప్రకారం ఆచరణ గలిగినవారి సంఖ్య నేడు చాలా తక్కువగా ఉంది.

కాబట్టి విశ్వనియమాల ప్రకారం ఈ సమాజాన్ని సంస్కరించ వలసి ఉంది. అందుకొరకు ఓ బలమైన నాయకుడు కావాలి. అసత్యాన్ని నిర్భయంగా ఖండించేవారి అవసరముంది. ధర్మాన్ని బోధించే నిజాయితీ పరుల అవసరం ఉంది. ఈ ప్రయత్నం మస్జిద్ స్థాయి నుండి జరగాలి.

ఒక ఊరిలో 10 మస్జిద్‌లు ఉన్నాయనుకుందాం. ప్రారంభంలో అన్ని మస్జిద్‌లకు కలిపి కాకుండా, మొట్టమొదట విడివిడిగా మస్జిద్ స్థాయి నుండి అంటే ఆ మస్జిద్ పరిధిలో ఉన్న ముస్లిములు ఇప్పటి నుండి సత్యాన్ని తెలుసుకోవడానికి, ఇస్లామీయ జ్ఞానాన్ని నేర్చుకోవడానికి ప్రతీ రోజూ కొంత సమయాన్ని కేటాయించాలి.

ఖుర్'ఆన్‌ను అరబీలో చదవడం మరియు దానిని తమకు అర్థమయ్యే అనువాద భాషలో చదవడం, ముహమ్మద్(స)వారి జీవిత చరిత్ర, హదీస్‌లు, సహాబాల జీవితచరిత్ర, ఖలీఫా వ్యవస్థ, సన్మార్గాన్ని పొందిన ఖలీఫాల కాలంలో జరిగిన అభివృద్ధి మొదలైనవి అన్నీ కొద్ది కొద్దిగా రోజూ కనీసం ఓ అరగంటపాటు శిక్షణ తీసుకోవాలి.

ఇంటిలో ఏ ఒక్కరో కాకుండా ఇంటిల్లపాదీ అందరూ ఈ జ్ఞానాన్ని నేర్చుకోవాలి. అసత్యాలను చెప్పేవాడు ఎంత పెద్దవాడు అయినా సరే, అతని నోరు మూయించి, ఆ అసత్యవాదాన్ని నిర్భయంగా ఖండించాలి. అటువంటి వారిని చేరదీయకూడదు. రాజకీయ ప్రయోజనాల కోసం మిమ్మల్ని ఉపయోగించు కోవాలనుకునేవారి ఆధీనంలో కాకుండా, ఖుర్'ఆన్ మరియు సున్నత్ ప్రకారం మీరు ఆచరిస్తే మరియు ఇతరుల చేత ఆచరింపజేస్తే, ఇన్షా అల్లాహ్ కొన్ని సంవత్సరాలకు మన సమాజంలో మంచి మార్పు వస్తుంది. కష్టపడి పనిచేయగలిగి కూడా పనిచేయకుండా ఇతరులపై ఆధారపడి బ్రతికేవారిని ముందుగా మనం సంస్కరించాలి. వారి వలన సమాజానికి ప్రమాదం. వారిని చూచి మరికొంతమంది పాడయ్యే అవకాశం ఉంది.

సందేశాన్ని అందజేయవలసిన బాధ్యత మనలో ప్రతీ ఒక్కరిపై ఉంది. ఇది బాధ్యత కాబట్టి ఈ బాధ్యతను నెరవేర్చకుండా ఎవరో ఒక వ్యక్తికి జీతమిచ్చి ఈ బాధ్యతను కట్టబెట్టడం మొదలైతే, కొన్ని రోజులకి నమాజ్ చేయడం కూడా మానేసి, మీ కోసం నమాజ్ చేయడానికి మరొక వ్యక్తిని ఏర్పాటు చేసుకోవాలనే తలంపు కూడా రావచ్చు. మన బాధ్యతలు మనం సక్రమంగా నిర్వర్తించాలి. మన శరీరంలోని ప్రతీ అవయవమూ సక్రమంగా పనిచేస్తేనే మనం ఆరోగ్యంగా ఉంటాము. మనం నిద్ర పోయినపుడు కాళ్ళు, చేతులు, కళ్ళు మరియు నోరు విశ్రాంతి తీసుకోవచ్చు గాని, గుండె మరియు మెదడు పనిచేస్తూనే ఉండాలి. అదే విధంగా మనపై కొన్ని ముఖ్యమైన బాధ్యతలున్నాయి. వాటిని మనం విస్మరించకూడదు.

మనపై అల్లాహ్‌కు ఎటువంటి హక్కులున్నాయో తెలుసుకోవాలి. మనపై తల్లిదండ్రులకు, భార్యాబిడ్డలకు మరియు ప్రజలకు ఎటువంటి హక్కులు ఉన్నాయో తెలుసుకోవాలి. వాటన్నింటిని నెరవేర్చాలి. తప్పదు. అదే విధంగా మనకు ఇతరులపై హక్కులున్నాయి. వాటిని మన కొరకు వారు నెరవేర్చాలి.

ఇవన్నీ సవ్యంగా జరగాలంటే ప్రతీ మస్జిద్ ఓ విజ్ఞాన కేంద్రం కావాలి. ఇప్పటి నుండే ప్రయత్నిస్తే, ఇన్షా అల్లాహ్ కొన్ని సంవత్సరాలకు మార్పు రావచ్చు. రాత్రికి రాత్రే మార్పు సంభవించదు.

దాదాపు 23 సంవత్సరాల కాలంలో ప్రపంచంలో ఎంతో వెనుకబడిన ఓ సమాజాన్ని ప్రపంచంలోని చాలా భాగాన్ని పరిపాలించేలా చేసిన ఘనత ఖుర్'ఆన్‌ది. ఆ అద్భుతం చరిత్రకారులను విస్మయపరిచింది.

ఆ అద్భుతం నేటికీ సజీవంగానే ఉంది. 'ఖుర్'ఆన్' మన దగ్గరుంది. ఖుర్'ఆన్‌ను పూర్వీకులు ఆచరించినట్లే నేటి ముస్లిమ్ సమాజం కూడా ఆచరిస్తే తిరిగి ఆ అద్భుతాన్ని ఇన్షాఅల్లాహ్ చూడగలుగుతాము.

**చదువు! నీ ప్రభువైన అల్లాహ్ పేరుతో**

ప్రపంచ పాలకులు మరియు రాజకీయ నాయకులు తప్పనిసరిగా తెలుసుకోవలిసిన ముహమ్మద్(స)వారి ప్రియ అనుచరుని జీవితచరిత్ర

ప్రపంచానికి నిజమైన ప్రజాస్వామ్యాన్ని అందించిన ధర్మం - ఇస్లామ్

రెండవ ఖలీఫా

# ఉమర్ బిన్ ఖత్తాబ్

రజి అల్లాహుతాలా అన్హు

7

● అతి నిరాడంబరుడు

● ప్రపంచంలోని అతి పెద్ద భూభాగానికి నాయకుడు

అవినీతి అధికారులకు సింహస్వప్నం ●

ఓ దశాబ్దంపాటు నూటికి నూరు శాతం ప్రజాస్వామ్య పరిపాలన అందించిన ప్రజానాయకుడు

ఎటువంటి తిరుగుబాటులకు అవకాశం రానివ్వని ఉత్తమ పాలకుడు

ప్రజలకే కాకుండా మూగజీవాలకూ న్యాయం చేకూర్చిన అత్యంత దైవభీతిపరుడు

(సెప్టెంబర్' 2011 సంచిక తరువాయి ...)

## బద్ర్ యుద్ధం ...

యుద్ధం పూర్తయ్యాక చిక్కిన యుద్ధఖైదీలను సంహరించాలని ఉమర్(రజి)వారు పట్టుబట్టారు. బద్ర్ యుద్ధానికి దారితీసిన పరిస్థితులు మరియు వ్యక్తిగత అభిప్రాయాన్ని బట్టి పట్టుబడిన యుద్ధఖైదీలు సంహరించబడాలని ఆయన ఆ విధంగా పట్టుబట్టడం జరిగింది. అయితే ఆయన సూచించినట్లు సంహారమేదీ జరగలేదు.

యుద్ధఖైదీల తరపువారు పరిహారం చెల్లించడం ద్వారా, కొందరు ఖైదీలు విడుదలవ్వగా, ఆ విధంగా పరిహారం చెల్లించలేని వారు మదీనాలోని కొందరు బాలబాలికలకు చదవడం, వ్రాయడం నేర్పడం ద్వారా స్వేచ్ఛ పొందారు.

ప్రవక్త(స)వారి బాబాయి అయిన అబ్బాస్ గారు కూడా ముస్లిమ్ సైన్యానికి ఖైదీగా చిక్కారు. ఉమర్(రజి)వారు ఆయన చేత ఇస్లామ్ స్వీకరింపజేయడానికి ప్రయత్నించారు : **"ఓ అబ్బాస్! ఇస్లామ్ స్వీకరించు. నిశ్చయంగా, అల్లాహ్ సాక్షి, మీ ఇస్లామ్ స్వీకరణ నాకు ఎక్కువ ప్రియమైనది, అల్-ఖత్తాబ్ (నా తండ్రి) ఇస్లామ్ స్వీకరించడం కంటే. అది ఎందుకంటే, అల్లాహ్ యొక్క సందేశహరులు(స) మీరు ఇస్లామ్ స్వీకరించాలని కోరుకుంటున్నారు కనుక".** (తరువాయి కాలంలో ఆయన కూడా ఇస్లామ్ స్వీకరించడం జరిగింది.)

మరొక ఖురేషి ఖైదీ పేరు సుహైల్ బిన్ అమ్ర్. ఇతడు ఖురైషీయుల యొక్క వక్త. అతడు ప్రసంగిస్తుంటాడు. ఆ ప్రసంగాలలో ముస్లిములకు వ్యతిరేకంగా యుద్ధం చేసేందుకు ఖురైషీయులను రెచ్చగొట్టేవాడు. సుహైల్ యుద్ధ ఖైదీగా చిక్కినప్పుడు, ఉమర్(రజి)వారు ప్రవక్త(స)వారితో ఇలా అన్నారు : ''ఓ రసూలల్లాహ్, సుహైల్ ముందరి పళ్ళు తీసేయడానికి నాకు అనుమతి నివ్వండి అతని నాలుక క్రిందకు వ్రేలాడేలా మరియు అతడు ఎన్నడూ మీకు వ్యతిరేకంగా మరలా ప్రసంగించకుండా ఉండేలా''

రసూలుల్లాహ్(స)వారు సమాధాన మిచ్చారు ''నేను అతనిని అవయవ విహీనుడిగా చేయను మరియు ఆ విధంగా నా పైకి స్వయంగా నన్ను అవయవ విహీనుడిగా చేసే అల్లాహ్ శిక్షను తెచ్చుకోను. నేను ప్రవక్తను అయినప్పటికీ ఆ విషయంలో శిక్షను అందుకోవాలి. మరియు బహుశా అతడు (సుహైల్) ఏదైనా (గొప్ప పని) చేయవచ్చు దాని కొరకు నీవు అతనిని మందలించలేక పోవచ్చు''.

ప్రవక్త(స)వారు ఏదైతే పరోక్షంగా సూచించారో అది కొన్ని సంవత్సరాల తరువాత నిజమైంది. ముహమ్మద్(స)వారి చివరికాలంలో సుహైల్ ఇస్లామ్ స్వీకరించారు.

ముహమ్మద్(స)వారు మరణించగానే మక్కావాసులలో కొందరు ఇస్లామ్ నుండి మరలిపోవడం జరిగింది. పరిస్థితి చాలా క్లిష్టంగా మారిపోయింది. మక్కా గవర్నర్ అయిన అత్తాబ్ బిన్ ఉసైద్(రజి) రాబోయే తిరుగుబాటు గురించి భయపడి అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. మక్కాలో నాయకత్వం లేకపోవడాన్ని గమనించి, సుహైల్ బిన్ అమ్ర్(రజి) మక్కావాసుల దగ్గర ప్రసంగించారు. ఆయన అల్లాహ్‌ను పొగుడుతూ మరియు కీర్తించడాన్ని ప్రారంభించారు. తరువాత ఆయన ప్రవక్త(స)వారి మరణాన్ని ఇలా చెబుతూ ప్రస్తావించారు, ''అది ఇస్లామ్‌ను మరింత బలోపేతం చేసింది, కాబట్టి ఎవరైనా మా పట్ల (మా పట్టుదల, బలం మొదలైన వాటి పట్ల) సందేహిస్తే, మేము వాని మెడను ఖండిస్తాము''.

ఆయన చేసిన ప్రసంగం విని అక్కడి వారు మార్గభ్రష్టత్వపు ఆలోచనను విరమించుకున్నారు మరియు అరేబియాలోని ఇతర భాగాలకు ప్రాకిన ఆ గడ్డు పరిస్థితి కనీసం మక్కాలో లేకుండా తప్పిపోయింది.

బద్ర్ యుద్ధం రోజున జరిగిన అద్భుతాలలో ఒకదానికి ఉమర్(రజి) సాక్షిగా ఉన్నారు.

అనస్(రజి)వారు చెప్పారు, ''మేము ఉమర్(రజి)తో మక్కా మరియు మదీనా మధ్యలో ఒకచోట ఉన్నాము. మరిము మేము నెలవంకను చూడటానికి ప్రయత్నిస్తున్నాము. నేను మంచి చూపు కలవాడిని. మరియు నేను దానిని చూడగలిగాను. కాని నేను తప్ప ఇంకెవ్వరూ

దానిని చూసినట్లు అనుకోవడం లేదు. నేను ఉమర్(రజి)వారితో అన్నాను, 'మీరు దానిని చూడలేదా?' ఆయన దానిని చూడలేదు. ఉమర్(రజి) చెప్పారు, 'నేను చాపపై పడుకున్నప్పుడు చూస్తాను'. ఆయన తరువాత మాకు చెప్పడం మొదలుపెట్టారు బద్ర్ యుద్ధంలో పాల్గొన్న వారి గురించి. ఆయన చెప్పారు, 'నిశ్చయంగా (బద్ర్ యుద్ధానికి) ముందు రోజు, అల్లాహ్ యొక్క సందేశహరులు(స) బద్ర్ వారి ఖచ్చితమైన ప్రదేశాలను మాకు చూపించారు. ఉదాహరణకు ఆయన చెప్పారు:

''ఇదే చోట ఫలానా వ్యక్తి రేపు మరణిస్తాడు, ఇన్షా అల్లాహ్''.

ఉమర్(రజి)వారు చెప్పారు: ఎవరైతే ప్రవక్త(స)వారిని సత్యంతో పంపారో ఆయన సాక్షి! రసూలుల్లాహ్(స)వారు (ఆ ముందు రోజు) సూచించిన ఆ స్థలాలను వారు మిస్ కాలేదు. వారు నూతిలో ఒకరిపై ఒకరు వేయబడ్డారు. తరువాత రసూలుల్లాహ్(స)వారు (వారి దగ్గరకు వెళ్ళి) చెప్పారు : **'ఓ ఫలానా! ఫలానా వాని కుమారుడా! ఓ ఫలానా! ఫలానా వాని కుమారుడా! అల్లాహ్ మరియు ఆయన సందేశహరుడు ఏదైతే మీకు వాగ్దానం చేశారో అది యధార్థమైందని తెలుసుకున్నారా? వాస్తవానికి అల్లాహ్ నాకు ఏది వాగ్దానం చేశారో అది సత్యమని తెలుసు కున్నాను'.** (అది విని) ఉమర్(రజి)వారు అన్నారు, ''ఓ రసూలల్లాహ్(స) ఆత్మలు లేని శరీరాలతో మీరు ఎలా మాట్లాడగలుగుతున్నారు? ఆయన(స) చెప్పారు: ''నేను ఏది చెబుతున్నానో మీరు వినలేరు వారంత స్పష్టంగా. మీకూ వారికి మధ్య తేడా కేవలం వారు నాకు ఏ కొంచెం బదులివ్వలేరు'. **(సహీహ్ ముస్లిమ్, 7222, పుస్తకం 51, అధ్యా.17, సంపుటి 7)** పై విషయం ఒక ప్రత్యేకమైన విషయంగా గమనించాలి. ఎందుకంటే ఖుర్'ఆన్‌లో అల్లాహుతాలా ఇలా తెలియజేశారు.

**"నిశ్చయంగా, నీవు మృతులకు విన్పించలేవు"** (ఖుర్'ఆన్ 27:80)

**"మరియు సమాధులలో ఉన్న వారికి వినిపించలేవు"** (ఖుర్'ఆన్ 35:22)

అల్లాహ్ కోరితే తప్ప. ఈ యుద్ధంలో ఓడిపోయాక మక్కా అవిశ్వాసులు ప్రతీకార జ్వాలతో రగిలిపోయారు. దానికి సంబంధించిన ఓ సంఘటన. ప్రతీకార జ్వాలతో రగిలిన వారిలో సఫ్వాన్ ఒకడు. ఈ యుద్ధంలో అతని తండ్రి మరియు సోదరుడు చనిపోయారు. ఈ సఫ్వాన్ స్నేహితుడు ఉమైర్ బిన్ వహ్బ్. వీరిద్దరూ ఓ పథకం పన్నారు.

ఉమైర్ బిన్ వహ్బ్ మదీనా వెళ్ళి మస్జిద్ ముందు తన ఒంటెను కూర్చుండబెట్టాడు. ఉమర్(రజి)వారి దృష్టి అతనిపై పడింది. ఆ సమయంలో ఆయన ముస్లిములతో కలసి కూర్చుని బద్ర్ నాడు అల్లాహ్ బహూకరించిన గౌరవం గురించి, శత్రు సైనికులకు పట్టిన దుర్గతి గురించి మాట్లాడుతున్నారు.

ఆయన ఉమైర్‌ను చూడగానే, ''ఈ కుక్క, అల్లాహ్‌కు విరోధి అయిన ఉమైర్ బిన్ వహ్బ్. ఏదో చెడు ఉద్దేశ్యంతోనే ఇక్కడికి వచ్చాడు'' అన్నారు. ''వీడే మన మధ్య విరోధాన్ని నాటినవాడు.'' వెంటనే ప్రవక్త(స) గారి దగ్గరకు వెళ్ళి, ''ఓ రసూలల్లాహ్! ఇక్కడున్నాడు అల్లాహ్ విరోధి, ఉమైర్ బిన్ వహ్బ్. అతడు కరవాలంతో వచ్చాడు'' అన్నారు. అయినప్పటికీ ఉమర్(రజి)వారితో ప్రవక్త(స)వారు ఉమైర్‌ని లోపలికి తీసుకురమ్మన్నారు.

ముందు జాగ్రత్తలు తీసుకోకుండా ఉమైర్‌ని లోపలకి వెళ్ళడానికి వదలలేదు ఉమర్(రజి). ఉమైర్ తన కరవాలాన్ని వ్రేలాడదీయడానికి వాడే తాడును ఉమర్(రజి)వారు తీసుకుని ఉమైర్‌కి కట్టారు.

తరువాత ఉమర్(రజి)వారు తనతో ఆ సమయంలో అక్కడున్న అన్సారులతో చెప్పారు, ''రసూలుల్లాహ్(స)వారి వద్దకు వెళ్ళండి మరియు ఆయన(స) ముందు ఉమైర్ కూర్చునేలా చేయండి. మరియు ఈ నీచుడి నుండి రక్షణగా ఉండండి రసూలుల్లాహ్(స)వారికి ఇతడు ఏ హానీ చేయకుండా ఉండేలా. ఈ నీచుడు నమ్మదగినవాడు కాదు''.

వారు లోపలకి ప్రవేశించాక రసూలుల్లాహ్(స)వారు ఉమైర్ మెడకి కట్టబడిన తాడును పట్టుకున్న ఉమర్(రజి)వారిని చూచారు. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు: ''అతనిని ఒదిలి పెట్టు, ఓ ఉమర్! దగ్గరకు రా ఓ ఉమైర్''

అతడు ప్రవక్త(స)వారి సమీపానికి వచ్చి 'మీకు శుభోదయం' అన్నాడు. ఇది బహుదైవారాధకుల ఆచారంలో వాడుకగా ఉన్న పలకరింపు. రసూలుల్లాహ్(స) అన్నారు, ''ఓ ఉమైర్, అల్లాహ్ ఒక శుభప్రదమైన పదంతో మాకు గౌరవాన్ని కలుగజేశారు. అది మీ పలకరింపు కంటే మేలైనది. అది సలామ్, స్వర్గవాసుల పలకరింపు'.

''నిన్ను ఇక్కడకు తీసుకు వచ్చిందేమిటి ఓ ఉమైర్?'' ప్రవక్త(స)వారు అడిగారు. ''నేను మీ ఆధీనంలో ఉన్న ఖైదీ గురించి వచ్చాను. అతనిపై కరుణ చూపండి (నాకోసం అతనిని విడుదల చేయండి)''

''అయితే నీవెందుకు కరవాలాన్ని నీ మెడకు వ్రేలాడదీసుకున్నావు?'' ప్రవక్త(స)వారు అడిగారు.

''అల్లాహ్ ఈ కరవాలాలను నాశనం చేయుగాక! ఇవి మాకు ఏమైనా మంచి చేశాయా?''

''నిజం చెప్పు! నీవిక్కడకి ఎందుకొచ్చావు?'' అడిగారు ప్రవక్త(స).

''నేను ఇక్కడకు ఎందుకు వచ్చానో మీకు చెప్పాను'' ఉమైర్ అన్నాడు.

''లేదు! నీవు అల్-హిజ్ర్ (కాబాకు ప్రక్కన ఉండే స్థలం) దగ్గర సఫ్వాన్ బిన్ ఉమయ్యాతో కూర్చుని ఉన్నావు'' చెప్పారు ప్రవక్త(స). ''మరియు మీరిద్దరూ కలిసి ఖురైషులలోని ఖలీబ్‌వారి గురించి చర్చించలేదా?'' (బద్ర్ దగ్గర చంపబడిన బహుదైవారాధకుల శరీరాలు ఖలీబ్‌లోకి విసిరివేయ బడ్డాయి - ఖలీబ్ ఒక పాతబావి). అప్పుడు నీవు చెప్పావు, 'నాకు చెల్లించవలసిన అప్పు మరియు నాపై ఆధారపడిన కుటుంబ సభ్యులు లేకుండా ఉన్నట్లయితే, నేను వెళ్ళి ముహమ్మద్(స)ని చంపేవాడిని'. అప్పుడు సఫ్వాన్ బిన్ ఉమయ్యా నీ అప్పు తీరుస్తానని మరియు నీ కుటుంబ సభ్యులకు పోషిస్తానని వాగ్దానం చేశాడు అతని కొరకు నీవు నన్ను చంపడంలో నెగ్గాలనే షరతు పై. కాని నీకు మరియు నీ లక్ష్య సాధనకు మధ్య అల్లాహ్ ఉన్నాడు.''

ఉమైర్ ఆశ్చర్యంతో పలికాడు ''మీరు వాస్తవంగా అల్లాహ్ యొక్క సందేశహరుడని నేను సాక్ష్యమిస్తున్నాను''. ఇంకా ఇలా కొనసాగించాడు:

''ఓ రసూలల్లాహ్! మీరు మాకు తెలియజేసే ఆకాశవార్తలకు

సంబంధించి అబద్ధాలు చెబుతున్నారని మరియు మీపై అవతరించ బడుతుండే వహీ గురించి మీపై ఆరోపణలు చేసేవారము. మీరు చెప్పిన ఆ సమావేశానికి ఎవరూ హాజరు కాలేదు సఫ్వాన్ మరియు నేను తప్ప. అల్లాహ్ సాక్షి! కేవలం అల్లాహుతాలాయే మీకు దీని గురించి తెలియజేశారని నేను నిజంగా తెలుసుకున్నాను. అల్లాహ్‌కే సమస్త పొగడ్తలన్నీ, ఆయనే నాకు ఇస్లామ్ వైపు మార్గాన్ని చూపారు మరియు ఈ విధంగా ఇస్లామ్‌వైపు నన్ను నడిపారు.''

ఉమైర్‌గారు తరువాత కలిమా పఠించారు.

తరువాత రసూలుల్లాహ్(స)వారు తన అనుచరులతో చెప్పారు : ''మీ సోదరునికి అతని ధర్మం గురించి బోధించండి. ఖుర్‌ఆన్‌ను నేర్పండి మరియు అతని ఖైదీని విడిచిపెట్టండి'' (అంటే ఆయన కోరిన ఖైదీని విడుదల చేయమని).

ఈ సంఘటన ముహమ్మద్(స)వారి రక్షణ విషయంలో ఉమర్(రజి) వారి అప్రమత్తతను తెలియజేస్తుంది. ఉమైర్‌ను చూచిన వెంటనే, ఉమర్(రజి)వారి మనస్సుకు అతడు కీడు చేయడానికే వచ్చాడని తట్టింది. ఎందుకంటే ఉమైర్ గురించి ఆయనకు బాగా తెలుసు. అతడు మక్కాలోని ముస్లిమ్‌లను హింసించిన వారిలో ముఖ్యమైన వ్యక్తి. బద్ర్ దగ్గర ముస్లిములతో బహుదైవారాధకులు తలపడేలా ప్రోత్సహించడంలో ముఖ్య పాత్ర పోషించాడు. అంతేకాకుండా ఖురైష్‌ల తరపున గూఢచర్యం చేసి ముస్లిముల సైన్యాన్ని అంచనా వేయడానికి పంపబడినవాడు.

ఉమైర్ నడవడిక మరియు అతడు పూర్వం చేసిన పనులను ఆధారంగా చేసుకుని అతడు ముహమ్మద్(స)వారికి హాని చేయకుండా ఉమర్(రజి) సాధ్యమైనంత మేర జాగ్రత్త తీసుకున్నారు అతని మెడచుట్టూ ఉమర్(రజి)వారు తాడును కట్టి దానిని బిగుతుగా పట్టుకున్నారు అతని చేయి కత్తిని అందుకోకుండా. అంతేకాదు చాలా మంది సహాబీలను ఉమైర్‌తో పాటు లోపలకి రమ్మని ఆదేశించారు.

ముందరి సంచికలో చెప్పుకున్నాము, ఈ బద్ర్ యుద్ధం ముస్లిములకు మరియు మక్కాలోని బహుదైవారాధకుల మధ్య జరిగిన తొలి యుద్ధమని. దాదాపు 13 సంవత్సరాలపాటు చిత్రహింసలను ఓపికతో భరించి భరించి అల్ప సంఖ్యాకులైన ఈ ముస్లిములు మక్కా బహుదైవా రాధకులతో జరిపిన యుద్ధమిది.

అందువల్లనే ఈ తొలి యుద్ధంలో చిక్కిన ఖైదీలను సంహరించడం మంచిదనే తన అభిప్రాయాన్ని ఉమర్(రజి)వారు వెలిబుచ్చారు. దీనర్థం ఆయన హింసను ప్రేమించేవారని ఎంతమాత్రం భావించకూడదు. మానవుని పట్ల మాత్రమే కాకుండా జంతువుల పట్ల కూడా శ్రద్ధ తీసుకున్న నాయకుడు ఆయన.

## ఉహద్ యుద్ధం

బద్ర్ యుద్ధంలో ఓటమి పాలయ్యాక మక్కా బహుదైవారాధకులు ముస్లిములపై ప్రతీకారంతో జరిపిన రెండవ యుద్ధం ఉహద్ ప్రాంతంలో జరిగింది.

యుద్ధ సమయంలో ఉమర్(రజి)వారు ఎంతో నైపుణ్యం, సామర్థ్యం మరియు పరాక్రమం చూపేవారు. ఆయన ధైర్య సాహసాలతో మాత్రమే కాకుండా, శక్తివంతమైన మాటలతో శతృవుల ధైర్యాన్ని దెబ్బతీసేవారు. దానికొక ఉదాహరణ :

యుద్ధం ముగిసిన తరువాత బహుదైవారాధకులు యుద్ధ రంగాన్ని తమ నియంత్రణలో తెచ్చుకున్నాక, ప్రవక్త(స)వారు మరియు ఆయన సహచరులు(రజి) పర్వత మార్గంలో క్షేమంగా ఉన్నారు. బహుదైవా రాధకులకు వారు కనపడరు. యుద్ధం తరువాత నిశ్శబ్దం నెలకొంది. అబూ సుఫ్యాన్ ముందుకు వచ్చి అరిచాడు ''ముహమ్మద్(స) జీవించి ఉన్నారా? లేక మరణించారా?''

అల్లాహ్ యొక్క సందేశహరులు(స) తన సహచరులతో చెప్పారు:

''అతనికి జవాబు ఇవ్వకండి''

అబూ సుఫ్యాన్ తరువాత అన్నాడు, ''ఇబ్నె అబీ ఖుహాఫా (అంటే అబూ బక్ర్) ప్రజలలో ఉన్నాడా?''

మరలా ప్రవక్త(స)వారు చెప్పారు :

''అతనికి జవాబు ఇవ్వకండి''

అబూ సుఫ్యాన్ తరువాత అన్నాడు, ''ప్రజలలో ఇబ్నె అల్-ఖత్తాబ్ (రజి) ఉన్నాడా?''

ఎటువంటి సమాధానం రాకపోయేసరికి, వారు సమాధానం ఇవ్వలేదు కాబట్టి వారు చనిపోయారని అబూ సుఫ్యాన్ ఊహించుకున్నాడు. కాబట్టి అతడు అన్నాడు, ''నిశ్చయంగా, వీరంతా చనిపోయారు. వారు గనుక బ్రతికి ఉంటే, వారు సమాధానం చెప్పి ఉండేవారు''.

ఈసారి మాత్రం ఉమర్(రజి)వారు ఇక ఆగలేకపోయారు, ఆయన(రజి) అన్నారు : ''నీవు పలికింది అబద్ధం, ఓ అల్లాహ్ యొక్క శతృవా! అల్లాహ్ జీవింపజేసి ఉంచారు. అది మీపై అవమానం తేవడానికి''.

అబూ సుఫ్యాన్ అన్నాడు : ''హుబల్! (వారు పూజించే విగ్రహాలలో ఒకటి)! నీవే పైన ఉన్నావు''.

ప్రవక్త(స)వారు తన అనుచరులకి చెప్పారు :

''అతనికి జవాబు ఇవ్వండి''

''మేము ఏమి చెప్పాలి?'' వారు అడిగారు.

ఆయన(స) చెప్పారు : ''చెప్పండి, అల్లాహ్‌యే ఉన్నతుడు, సమున్నతుడు మరియు గొప్పవాడు.''

అబూ సుఫ్యాన్ స్పందించాడు, ''మేము అల్-ఉజ్జా (ఒక విగ్రహం) కలిగి ఉన్నాము. మీకు 'ఉజ్జా' లేదు''.

ప్రవక్త(స) తన సహచరులతో చెప్పారు:''అతనికి సమాధానమివ్వండి''.

''మేము ఏమి చెప్పాలి?'' వారు అడిగారు. ఆయన(స) చెప్పారు:

''చెప్పండి. అల్లాహ్‌యే మా సహాయకుడు మరియు రక్షకుడు. మరియు మీకు సహాయకుడు మరియు రక్షకుడు లేడు.''

అబూ సుఫ్యాన్ స్పందించాడు, ''ఈ రోజు బద్ర్‌కి బదులు. యుద్ధం

ఒకసారి నెగ్గుతుంది. ఓడిపోతుంది మరోసారి. మరియు (మరణించిన మీ సోదరుల) అవయవాల ఖండనను మీరు చూస్తారు. అవయవాల ఖండనకై నేను ఆదేశించలేదు, కాని వాటిని నేను ఇష్టపడకుండా ఉండను లేదా ఖండించను.'' ఒక ఉల్లేఖనం ప్రకారం, 'వారు సరిసమాన మయ్యారని, ముస్లిములు బద్ర్ యుద్ధంలో గెలిస్తే, ఉహద్ యుద్ధంలో బహుదైవారాధకులు గెలిచారనే' అబూ సుఫ్యాన్ ప్రకటనకు ఉమర్(రజి)వారు స్పందించారు. ఉమర్(రజి)వారు అన్నారు, **''అది సమానం కాదు. మరణించిన మా వాళ్ళు స్వర్గంలో ఉన్నారు మరియు మరణించిన మీ వాళ్ళు నరకాగ్నిలో ఉన్నారు''.**

**(మరికొంత భాగం ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో ...)**

## భార్యలకు దూరంగా వేరే ప్రాంతాలలో బాధ్యతలు నిర్వహించే సైనికుల విషయంలో పాలనాపరమైన విధానం

రాత్రుళ్ళు మదీనా వీధులలో గస్తీ తిరగడం ద్వారా ఉమర్(రజి)వారు సామాన్య ప్రజల ప్రశంసలకు పాత్రులయ్యారు. ఎందుకంటే ఆ విధంగా ఆయన ఎన్నో ప్రజా సమస్యలను పరిష్కరించేవారు.

ఉదాహరణకు ఒక రోజు రాత్రి ఒక ఇంటి ప్రక్కనుండి ఆయన వెళుతున్నారు. ఒక స్త్రీ తన నిరాశ స్థితి గురించి శోకించడాన్ని విన్నారు. దాదాపు దు:ఖపూరితమైన స్వరంతో, తన దు:ఖాన్ని పద్యరూపంలో వ్యక్తం చేసిందామె.

ఆమె స్వరం చాలా విచారంగా ఉంది. ఆమె దు:ఖాన్ని తెలుసుకునేందుకు ఆమె ఏమి పలుకుతున్నదో వినడానికి ఆగారు. ఆమె తన పద్యంలో ఆ రాత్రి అంతం లేకుండా ఎంత సుదీర్ఘంగా ఉందో దాని గురించి చెబుతుంది. ఆమె ఒంటరితనం గురించి మరియు తనతో పాటు ఉండవలసిన తన జీవిత భాగస్వామియైన భర్తపై తీవ్ర వాంఛ గురించి చెబుతోంది. ఆమె ఆ విధంగా ఫిర్యాదు చేస్తుంది. ఆమె భర్త ఓ సైనికుడు. చాలా కాలం క్రితం సైనిక పర్యటనకు వెళ్ళడం జరిగింది. ఆమె ఇంకా తన పద్యంలో వివరిస్తుంది. అల్లాహ్‌పై ఆమెకున్న విశ్వాసమే పరపురుషుడిని తన గృహంలోకి రాకుండా ఆపుతుందని మరియు అల్లాహ్‌పట్ల ఆమెకున్న భయం ఏ విధంగా ఆమెకు వ్యామోహపు ఆలోచన్లు రానివ్వకుండా ఆపుతుందో ఆ పద్యంలో వివరిస్తున్నదామె.

ఆమె ఒక విశ్వాసురాలు. తన ఇంటిలో విరహంతో ఓ పద్య రూపంలో శోకాన్ని వ్యక్తం చేస్తుంది. రోడ్డుపై గస్తీ తిరుగుతున్న ఖలీఫా ఆమె బాధను వింటున్నారని, ఆమెకే కాకుండా ఎందరో తన వంటి మహిళలను దు:ఖం నుండి తప్పించేందుకు ఓ కొత్త పాలసీ ఆయన ఏర్పాటు చేయబోతున్నారని ఆ సమయంలో ఆ స్త్రీకి ఏమాత్రం తెలియదు. అప్పటికే చాలా రాత్రి గడిచింది.

టైగ్రిస్ నది ఒడ్డున ఓ కుక్క ఆకలితో చనిపోయినా ఆ బాధ్యత తనదేనని ప్రకటించుకున్న ఓ గొప్పనాయకుడు ఆమె గోడు వింటున్నారని ఆమెకు అప్పటికి తెలియదు.

ఆ స్త్రీ పద్యాన్ని ముగించాక ఉమర్(రజి) అన్నారు, ''అల్లాహ్ నీపై కరుణ చూపుగాక!'' ఆయన వెంటనే ఆమె బాధను తొలగించడానికి రెండు పనులు చేశారు.

మొదటిది, ఆమెకు దుస్తుల కొరకు మరియు ఖర్చుల కొరకు ధనాన్ని అందజేయమని ఆదేశించారు. అంతకంటే ముఖ్యంగా ఆ స్త్రీ యొక్క భర్తను వెంటనే వెనక్కి పంపమని కూడా ఆదేశించారు.

ప్రతీ ముస్లిమ్ సైనికుడు ఎంతకాలం పాటు ఇతర దేశాలలో ఉండాలో నిర్ణయించేది ఖలీఫాయే కాబట్టి, ఒక విధంగా ఆమె తన భర్తకు అంతకాలం దూరంగా ఉండటానికి తాను కూడా బాధ్యుడనేనని ఉమర్(రజి) భావించారు. .

ఉమర్(రజి)వారు ఎప్పుడైనా ఏదైనా సమస్యను గుర్తిస్తే వెంటనే దానిని పరిష్కరించ వలసిన అవసరం ఉందని భావించేవారు. కాబట్టి అదే రాత్రి, ఆయన తన కుమార్తె అయిన హఫ్సా(రజి)వారి ఇంటికి వెళ్ళి తలుపు తట్టారు.

ఏమి జరిగిందోనని కంగారుపడుతూ, విశ్వాసుల మాతృమూర్తి అయిన హఫ్సా(రజి)వారు బయటకి వచ్చి అన్నారు, ''ఓ అమీరుల్ మోమినీన్! ఈ అసాధారణమైన సమయంలో ఏది మిమ్మల్ని ఇక్కడకు తీసుకువచ్చింది.''

ఆయన అన్నారు, 'ఓ నా పుత్రీ! ఎంతకాలం ఓ స్త్రీ సహనం వహించగలదు తన భర్త తన దగ్గర లేనప్పుడు?'' ఆమె సమాధానమిచ్చారు, ''ఆమె ఒక నెలపాటు, రెండు నెలలపాటు లేక మూడు నెలలు సహితం సహనం వహించగలదు. కాని 4వ నెల (నుండి భర్త దగ్గర లేకపోవడం వలన) ఆమె సహనం కోల్పోవడం ప్రారంభమౌతుంది.''

ఉమర్(రజి)వారు తన సైన్యాధికారులకి కొత్త విధానం (పాలసీ) తెలియజేస్తూ లేఖలు పంపారు. ఏ సైనికుడు కూడా వేరే ప్రాంతంలో కుటుంబానికి దూరంగా 4 నెలల కంటే ఎక్కువ ఉండకూడదు. ప్రవక్త(స)వారి అనుచరులలోని ఏ ఒక్కరూ కూడా ఈ కొత్త పాలసీని వ్యతిరేకించలేదు.

# హదీస్ విజ్ఞానం
Science of Hadith

( సెప్టెంబర్' 2011 సంచిక తరువాయి )

9

## బుఖారీ (ర)
### ( ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్ )
(194 - 256 హి.)

బుఖారీ(ర)వారి గురించి వెనుకటి వ్యాసంలో పరిచయం చేస్తూ కొన్ని ముఖ్య విషయాలు అందజేశాము. ఆ వ్యాసంపై ఒకరిద్దరు వేరేగా స్పందించారు. సంవత్సరాల తరబడి ప్రజలలో ఎన్నో అపోహలు ఉన్నాయి. ఈ అపోహల ద్వారా ప్రజల మధ్య చీలిక తెస్తున్నారు. ఈ అపోహలు మరెక్కడో కాదు ముస్లిమ్ సమాజంలోనే ఉన్నాయి. అవి తొలగిపోతే, ఈ శీర్షిక పాఠకులకు పూర్తిగా ఉపయోగపడుతుంది, ఇన్షాఅల్లాహ్.

ఎందరో విద్వాంసులు ముస్లిమ్ సమాజానికి అమూల్యమైన సేవలు అందించారు. ఇమామ్ అబూ హనీఫా(ర), ఇమామ్ మాలిక్(ర), ఇమామ్ షాఫ'యి(ర), ఇమామ్ అహ్మద్(ర), ఇమామ్ బుఖారీ(ర), ఇమామ్ ముస్లిమ్(ర) మొదలైన విద్వాంసులెందరి గురించో ఎన్నో పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. వాటిని చదివితే వారు చేసిన సేవలు మరియు త్యాగాలు మనకు అర్థమౌతాయి.

ఇస్లామ్‌ను అర్థం చేసుకుని తదనుగుణంగా ఆచరించే ముస్లిములకు ఈ విద్వాంసుల పట్ల ఎంతో గౌరవాభిమానాలు ఉంటాయి. కాని దురదృష్ట వశాత్తు ప్రజలలో వీరిపై కొందరు అపోహలు కలుగజేశారు. కాబట్టి ఓ విద్వాంసుని గురించి వివరాలు అందిస్తున్నప్పుడు, కొందరికి అది నచ్చడం లేదు. ఒకేసారి ఒక వ్యాసంలో 3, 4 పేజీలలో అందరి గురించి వ్రాయడం జరిగితే, వారిలోని ఏ ఒక్కరి గురించీ పూర్తిగా అర్థం కాదు. ఈ విద్వాంసులలో గురువులూ ఉన్నారు, శిష్యులూ ఉన్నారు.

ఉదాహరణకు ఇమామ్ షాఫ'యి(ర)వారి గురువుగారు ఇమామ్ మాలిక్(ర)వారు. ఇమామ్ ముస్లిమ్(ర)వారి గురువుగారు ఇమామ్ బుఖారీ(ర)వారు. అంతేకాకుండా ప్రతీ ఒక్కరికీ ఎంతోమంది గురువులు ఉన్నారు.

గురువు గొప్పవాడా? లేక శిష్యుడు గొప్పవాడా? అని ఆలోచించ వలసిన అవసరం మనకు లేదు. ఎందుకంటే **వారందరి సంకల్పమూ చాలా గొప్పది.** మన దేశంలో టెక్నాలజీలో అత్యున్నత విలువ గలిగిన విద్యాలయాలు ఐ.ఐ.టి.లు. ఈ విద్యాలయాలలోని గురువులకు చాలా విలువ ఇస్తారు. అంత ప్రఖ్యాతిగల ఈ గురువులు సంపాదించే జీతాల కంటే, చదువు పూర్తి చేసుకొని బయటకొచ్చిన వారి శిష్యుల జీతాలే ఎక్కువుగా ఉంటాయి. అంటే గురువులు తక్కువై పోయినట్లా? **ఎంతమాత్రం కాదు.**

అభివృద్ధి అనేది జరుగుతూనే ఉంటుంది. నేడు సెల్‌ఫోన్‌లలో కూడా హదీస్‌లు సులభంగా లభ్యమౌతున్నాయి. కాని ఆనాడు ఒకటో, రెండో హదీస్‌ల కొరకు **ముహద్దిస్‌**లు వందల కిలోమీటర్ల ప్రయాణం చేసేవారు.

కాబట్టి అలనాటి విద్వాంసులు మనకోసం చేసిన మేలును తెలుసుకుని, వారి కోసం **దుఆ** చేయాలి గాని, వారి స్థాయిని నిర్ణయించే స్థాయిలో మనం లేము. వారు చేసిన సేవలకు తగిన విధంగా అల్లాహ్ వారికి పరలోకంలో ప్రతిఫలాన్ని ఇస్తారు. మనం వారి గురించి తెలుసుకుందాం. వారు చేసిన మేలును మన సాఫల్యం కొరకు ఇన్షాఅల్లాహ్ ఉపయోగించు కుందాం!

ఇమామ్ మాలిక్(ర)వారు '**ముఅత్తా**' హదీస్ గ్రంథాన్ని మనకు అందించారు. అంటే మాలిక్(ర)వారు '**ముహద్దిస్**' అవుతారు. ముహద్దిస్ అంటే హదీస్‌లను సంకలనం చేసి ఓ గ్రంథంగా మనకు అందించేవారు. అంటే హదీస్ విద్వాంసుడు. అంతేగాని హదీస్‌లను రచించినవారు కాదు. ముహమ్మద్(స)వారి బోధనను విని ఓ సహాబీ ఉల్లేఖించిన ఉల్లేఖనం ఇతర సహాబా, తాబయీ మరియు తబే తాబయీల ద్వారా మరియు గురువుల ద్వారా ఈ ముహద్దిస్‌లకు చేరుతుంది.

కాబట్టి **ముహమ్మద్(స)**వారి నుండి ప్రత్యక్షంగా బోధన విన్న **సహాబీ** మరియు గ్రంథస్థం చేసిన **ముహద్దిస్**కూ మధ్య ఎందరో ఉల్లేఖకులు ఉన్నారు. కాబట్టి మనకు ఓ హదీస్ చేరింది అంటే, దానికి వీరందరూ కారణమే.

హదీస్‌ల ప్రామాణికత గురించి రెండవ ఖలీఫా ఉమర్(రజి)వారు చాలా శ్రద్ధ చూపేవారు. కాబట్టి ఓ హదీస్ మాలిక్(ర)వారి ముఅత్తా నుండి మనకు చేరినా లేక ముస్నద్ అహమద్ నుండి చేరినా లేక సహీహ్ బుఖారీ నుండి చేరినా, సహీహ్ ముస్లిమ్ నుండి చేరినా ఒక్కటే. **హదీస్ ప్రామాణికతే మనకు ముఖ్యం.**

బుఖారీ(ర)వారి ముందరికాలంలోని విద్వాంసులు కూడా కొన్ని హదీస్‌ల ప్రామాణికతను సందేహించే వారు. కేవలం బుఖారీ(ర)వారు మాత్రమే సందేహించారని అనుకోవడంలో అర్థం లేదు. హదీస్‌లపై కనీస అవగాహన లేనివారు మాత్రమే ఆ విధంగా అపార్థం చేసుకున్నారు.

కేవలం సహీహ్ హదీస్‌లతో ఓ గ్రంథం ఉంటే బావుంటుందని బుఖారీ(ర)వారి గురువుగారు అభిప్రాయపడ్డారు. ఆ తరువాత బుఖారీ(ర)వారు సహీహ్ హదీస్‌ల సంకలనాన్ని ప్రారంభించారు.

**సహీహ్ బుఖారీ గ్రంథంలోని హదీస్‌లు ఆయనకు ఎందరో గురువుల ద్వారా చేరినవి అని తెలుసుకోవాలి మరియు అవి ఆయన స్వంత రచనకాదు అని కూడా తెలుసుకోవాలి.**

ఈ శీర్షిక ప్రారంభం నుండి చదవండి. హదీస్ విద్వాంసుల గురించి ఈ శీర్షికలో వరుసగా సంక్షిప్తంగా అందిస్తాము, ఇన్షా అల్లాహ్!

**(బుఖారీ(ర)వారి మరికొన్ని విశేషాలు ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో ...)**

### మనిషి కోతినుండి పరిణామం చెందాడనే

THEORY OF EVOLUTION

# డార్విన్ సిద్ధాంతం - శాస్త్రీయ వాస్తవం కాదు.

# రాతి యుగం ఓ చారిత్రక అబద్ధం

**మానవులందరికీ పితామహుడు మరియు అల్లాహ్ యొక్క తొలి ప్రవక్తయైన ఆదమ్(అ)వారి గురించి, బాలబాలికలకు ప్రత్యేకం శీర్షికలో డిశంబర్'10 సంచికలో స్పష్టంగా వివరించాము. ఆయన కాలం నుండే వ్యవసాయం ప్రారంభమైంది. వారు వస్త్రాలు ధరించారు. 3వ ప్రవక్త ఇద్రీస్(అ)వారి ద్వారా టైలరింగ్ మరియు వ్రాయడం మొదలైంది. నూహ్(అ)వారు ఓడను నిర్మించారు. కాబట్టి మానవుడు ఈ భూమిపై అడుగు పెట్టినప్పటి నుండి సంస్కారంతో ఒక విధానం ప్రకారమే జీవనాన్ని ప్రారంభించడం జరిగింది.**

**మనిషి కోతి నుండి రూపాంతరం చెందాడనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన దగ్గర నుండి, ఆ అసత్యాన్ని నిజంగా చూపడానికి చరిత్రను దానికణుగుణంగా మార్చి వ్రాశారు. మన పాఠ్య పుస్తకాల ద్వారా చిన్నతనం నుండి అవే నేర్చుకుంటున్నాము. చిన్నతనం నుండే ఓ అసత్యం మన మనస్సులలో నాటుకు పోయేలా చేస్తున్నారు. ఇటువంటి సిద్ధాంతం ద్వారా మనం ఏ విధంగా మోసగించబడ్డామో స్పష్టంగా తెలుసు కోవడానికి అనువైన ఓ పుస్తకం "A Historical Lie - The Stone Age" దీనిని టర్కీ దేశానికి చెందిన హారున్ యహ్యా వ్రాశారు. శాంతిబాట ప్రారంభంలో ఈయన వ్యాసాలను కొన్నింటిని అందించాము. పాఠకుల నుండి విశేష ఆదరణ లభించింది. ఈ పుస్తకాన్ని పూర్తిగా గాని లేదా ముఖ్యవిషయాలను గాని యథాతథంగా ఈ శీర్షికలో ఇన్షాఅల్లాహ్ అందిస్తాము.**

---

**1** ఏడు లక్షల సంవత్సరాల క్రితం, ప్రజలు చక్కగా నిర్మించ బడిన ఓడలలో సముద్రయానం చేశారని మీకు **తెలుసా?**

ఆది మానవులుగా గుహలలో నివశించేవారు నేటి మేటి కళాకారుల వలే కళాత్మక సామర్థ్యాన్ని మరియు అవగాహనని కలిగి ఉన్నారని మీ రెప్పుడైనా **విన్నారా?**

ఎనభైవేల సంవత్సరాల క్రితం జీవించిన Neanderthals (ప్రాచీన శిలాయుగానికి చెందిన ప్రజలను) "చింపాంజీ-మనుష్యులు" (Ape-men)గా చిత్రీకరించారు. కాని వారు సంగీత సాధనాలను తయారు చేశారని, వారు వస్త్రాలు మరియు వాటికి సంబంధించిన వస్తువుల ద్వారా ఆహ్లాదం పొందారని, వేడి ఇసుకపై నడవడానికి బాధ కలుగకుండా పోతపోసిన చెప్పులను ఉపయోగించారని తెలుసా?

సాధారణంగా ఈ వాస్తవాలలో దేనినైనా మీరు వినే అవకాశాలు చాలా తక్కువ.

ఈ వాస్తవాలకు భిన్నంగా, అప్పటి ప్రజలు సగం Ape (చింపాంజీ) వలే, సగం మనిషి వలే ఉండేవారని, నిట్టనిలువుగా పూర్తిగా నిలుచో లేరని, పదాలు పలికే సామర్థ్యం కూడా వారికి లేదని మరియు వింతయైన గుర్రుమనే శబ్దాలు వారు చేసేవారని మీ మనస్సులలో పొరపాటుగా ముద్ర పడిపోయింది.

గత 150 సంవత్సరాలుగా మీ వంటి ఎంతోమంది అమాయక ప్రజలపై అబద్ధాలను రుద్దేశారు. దీని వెనుకనున్న ధ్యేయం ఏమిటంటే భౌతికవాదుల ఫిలాసఫీని ఉనికిలో ఉంచడానికే.

సృష్టికర్త ఉన్నాడనే విషయాన్ని ఈ ఫిలాసఫీ ఖండిస్తుంది. ఈ ఫిలాసఫీ ప్రకారం విశ్వం మరియు పదార్థం శాశ్వత మైనది. వీరి భావాలకు అడ్డువచ్చే ప్రతీ సత్యం వక్రీకరించబడింది. మరో విధంగా చెప్పాలంటే వాటికి ప్రారంభం లేదని మరియు ఆ విధంగా 'సృష్టికర్త' లేడని చెప్పేదే ఈ ఫిలాసఫీ.

ఈ మూఢ విశ్వాసాన్ని శాస్త్రీయ ఆధారంగా భావించేదే పరిణామ సిద్ధాంతం.

ఈ విశ్వానికి సృష్టికర్త లేడని ప్రకటించే పరిణామాలకు, జీవం మరియు అసంఖ్యాకమైన జాతులు భూమిపై ఎలా వచ్చాయో చెప్పడానికి వారికంటూ ఓ స్వంత వివరణ ఇవ్వవలసి ఉంది.

ఆ ప్రయోజనం కోసమే ఈ పరిణామ సిద్ధాంతం అనే ఓ నాటకానికి తెర లేచింది. ఈ సిద్ధాంతం ప్రకారం ఈ విశ్వంలోని జీవం మరియు మొత్తం క్రమం అంతా అప్రయత్నంగా వాటికవే ఏ ప్రేరణ లేకుండానే ఏర్పడ్డాయని.

ప్రపంచపు ప్రాచీన యుగంలో ఏ ప్రయత్నం లేకుండా నిర్దిష్టమైన కొన్ని జీవంలేని పదార్థాలు అకస్మాత్తుగా కలిసిపోయి మొట్ట మొదటి జీవకణం ఏర్పడిందని, ఈ విధంగానే కాకతాళీయంగా మిలియన్ల సంవత్సరాల పాటు జరిగిన ఫలితంగా జీవులు ఉనికిలోకి వచ్చాయని మరియు ఈ పరిణామ గొలుసులో చివరిదశగా, అన్నింటికంటే చివరిలో

మానవులు వచ్చినట్లు పరిణామవాదుల భావన.

మిలియన్ల సంఖ్యలో జరిగిన ఆకస్మిక పరివర్తనల ఫలితంగా మానవ చరిత్ర ప్రారంభమైందని ఆరోపించబడింది. పరిణామ నాటకానికి సరిపడేలా వక్రీకరించి చెప్పబడింది. ఇది అసాధ్యం.

ఏ సాక్ష్యమూ లేకుండా పరిణామవాదులు చెప్పేదాని ప్రకారం మానవ చరిత్ర ఇలా ఉంది : "జీవం యొక్క రూపాలు ఏ విధంగా అయితే తొలి జీవి నుండి అన్నింటి కంటే బాగా అభివృద్ధి చెందిన మనిషి వరకూ ఏ విధంగా అభివృద్ధి చెందాయో, మానవ చరిత్ర కూడా చాలా ప్రాచీన సమాజం నుండి నేడు బాగా అభివృద్ధి చెందిన సమాజంగా మారింది".

కాని దానిని సమర్ధించే ఎటువంటి సాక్ష్యం లేకుండా పరిణామ వాదులు చేసిన ఈ ఊహ పూర్తిగా విహీనమైనది.

పరిణామ ఫిలాసఫీ మరియు పరిణామ సిద్ధాంతానికి అనుగుణంగానే ఈ మానవచరిత్ర తయారు చేయబడిందని పై విషయమే తెలియ జేస్తుంది.

ఏక కణం నుండి బహు కణాల జీవుల వరకూ మరియు చింపాంజీ (Ape) నుండి మనిషి వరకూ పరిణామం జరిగిందని చెబుతూ వారి విధానాన్ని సమర్ధించడం కోసమే మానవచరిత్రను తిరిగి వ్రాశారు.

ఇలా వ్రాయడంలో వారు **ఊహాజనిత యుగాలను కల్పించారు.** అవే: గుహలలో నివశించే మానవుల యుగం, రాతి యుగం. ఈ యుగాలను పేర్కొని, వాటి ద్వారా ప్రాచీన మానవుల జీవితాల వర్ణనలను మొదలు పెట్టారు.

వారు కల్పించిన అబద్ధాలను సమర్ధించు కోవడానికి మానవులు Ape (చింపాంజీల) నుండి వచ్చినట్లు మరియు వారందరికి మూలం ఒక్కటేనని చెప్పే వారి కల్పితాలను నిరూపించు కోవడానికి శోధించడం మొదలు పెట్టారు.

కాబట్టి పురావస్తు ద్రవ్యకాలలో లభించే ప్రతీ రాయిని, బాణాన్ని, పాత్రలను ఏదీ దొరికినా, దానిని తమ కల్పనలకు అనుగుణంగా వివరించడం మొదలుపెట్టారు.

అయినప్పటికీ 'సగం కోతి, సగం మనిషి' వంటి జీవాలు చీకటి గుహలలో కూర్చున్నట్లు, బొచ్చును ధరించినట్లు, మాట్లాడే సామర్ధ్యం లేనట్లు ఉండే వర్ణ చిత్రాలన్నీ కల్పితాలే.

వీరు మాట్లాడేటటువంటి ఆది మానవుడు ఎప్పుడూ లేడు మరియు **రాతి యుగం అనేది లేనే లేదు.** అవి మరేమిటో కాదు, పరిణామ వాదులు మీడియాలోని ఒక వర్గం వారి సహకారంతో ఆడిన మోసపూరిత నాటకంలోని భాగాలు.

ఈ భావనలన్నీ కూడా మోసపూరితమైనవి. ఎందుకంటే సైన్స్‌లో విశేషంగా బయాలజీ, పేలెంటాలజీ, మైక్రోబయాలజీ మరియు జెనెటిక్స్ సాధించిన అభివృద్ధి ఈ పరిణామవాద ప్రకటనలను దాదాపు పూర్తిగా కొట్టి పారేశాయని చెప్పవచ్చు. కొన్ని జాతులు ఉద్భవించి తరువాత రూపాంతరం చెందినవని చెప్పే విషయాలు విలువలేనివిగా కొట్టి వేయబడ్డాయి.

ఈ విధంగా కోతివంటి జీవి నుండి మానవునిగా పరిణామం అనేది జరగనేలేదు.

**మానవుని యొక్క ఉనికి ఈ భూమిపై ఉన్నప్పటి నుండే మానవునిగా ఉన్నాడు మరియు మంచి సంస్కృతిని అప్పటి నుండే కలిగి ఉన్నాడు. కాబట్టి పరిణామ చరిత్ర అనేది లేనే లేదు.**

హారున్ యహ్యా గారి ఈ పుస్తకంలో మానవ పరిణామ చరిత్ర భావన పూర్తిగా అబద్ధమని తెలియజేసే సైంటిఫిక్ ఆధారాలు వివరించబడ్డాయి. సృష్టి యొక్క వాస్తవాన్ని నేటి ఆధునిక శాస్త్రీయ విజ్ఞాన పరిశోధనలు ఏ విధంగా సమర్ధిస్తున్నాయో చూపించారు.

మానవజాతి ఈ ప్రపంచంలోకి పరిణామం ద్వారా రాలేదు. **సర్వశక్తివంతుడు మరియు సర్వజ్ఞానియైన అల్లాహ్ యొక్క లోపం లేని సృష్టిద్వారా మానవుడు ఈ ప్రపంచంలోకి వచ్చాడు.**

## పరిచయం

మానవజాతి చరిత్రను చాలా పీరియడ్లుగా విభజించి పరిణామ వాదులు మానవ పరిణామ విషయం కొరకు ఏ విధంగా అయితే చేశారో అదే విధంగా మానవచరిత్ర విషయంలోనూ చేశారు.

**రాతి యుగం** (Stone age), **కంచు యుగం** (Bronze age) మరియు **క్రౌర్య యుగం** (Iron age) వంటి కల్పిత భావనలు పరిణామవాద క్రోనాలజీలో ముఖ్యమైన భాగం.

ఇటువంటి ఊహాత్మక చిత్రాన్ని స్కూళ్లలో, టెలివిజన్లలో మరియు వార్తా పత్రికల కథలలో చెప్పడంతో, చాలామంది ఈ ఊహాత్మక చిత్రాన్ని ఎటువంటి ప్రశ్న వేయకుండా స్వీకరించడం జరిగింది మరియు ప్రాచీన కాలంలో ఒక యుగంలో జీవించిన మానవులు ఆ కాలంలో కేవలం రాతి పనిముట్లను మాత్రమే ఉపయోగించారని మరియు వారికి టెక్నాలజీ (సాంకేతిక జ్ఞానం) లేదని తెలియదని ఊహించుకున్నారు.

### రాతి యుగం అనేది అసలు లేనే లేదు

రాతియుగంగా పరిణామవాదులచే పేర్కొనబడి అవమానించ బడిన ఆ కాలంలో, ప్రజలు ఆరాధించేవారు, వారి వైపు పంపబడిన అల్లాహ్ యొక్క సందేశహరులు బోధించే బోధనలను వినేవారు. గృహాలను నిర్మించుకున్నారు. వారి వంటగదులలో ఆహారాన్ని వండుకున్నారు. తమ కుటుంబ సభ్యులతో ముచ్చటించుకునేవారు. టైలర్లచేత తమ వస్త్రాలను కుట్టించుకునేవారు. వైద్యుల చేత వ్యాధులను నయం చేయించు కునేవారు. సంగీతంలో, పెయింటింగ్‌లో మరియు శిల్పాలు చేయడంలో ఆసక్తి చూపేవారు. క్లుప్తంగా చెప్పాలంటే సాధారణ జీవితాలను చక్కగా గడిపేవారు. పురావస్తు పరిశోధనలు చూపినట్లు, చరిత్ర గమనంలో సముపార్జించే వారి జ్ఞానంలోనూ, టెక్నాలజీలోనూ మార్పులు వచ్చాయి.




కాని మానవులు ఎల్లప్పుడూ మానవులగానే జీవించారు. కొత్త రాతి యుగపు చివరి భాగానికి చెందిన రాళ్ళు మరియు షెల్స్‌తో కూడిన నెక్లెస్ చిత్రం పైన ఇవ్వబడింది. ఇది ఆ కాలపు ప్రజల కళా నైపుణ్యాన్ని మరియు అభిరుచిని మాత్రమే కాకుండా, అటువంటి ఆభరణాలను తయారు చేయడానికి అవసరమయ్యే టెక్నాలజీని అప్పటి మానవులు కలిగి ఉన్నారని తెలియజేస్తుంది.

క్రింది చిత్రంలో కుండలు, టేబుల్ వంటివి మరియు గరిటె క్రీస్తు శకానికి పూర్వం 7000 మరియు 11000 సంవత్సరాల మధ్య కాలానికి చెందినవిగా డేటింగ్ ద్వారా తెలుసుకోబడింది. (అంటే ఇప్పటికి 9000 నుండి 13000 సంవత్సరాలకు మధ్య కాలపు వస్తువులు). ఇవి ఆ కాలపు జీవన ప్రమాణాలను తెలియ జేస్తున్నాయి. పరిణామవాదుల సిద్ధాంతం ప్రకారం ఆ కాలపు మానవులు అప్పుడప్పుడే స్థిర జీవనవిధానాన్ని ఏర్పరచుకుని, జస్ట్ నాగరీకులు అయ్యారు. కాని ఆ ప్రజల సంస్కృతిలో ఏమాత్రం లోటు లేదని ఈ వస్తువులు తెలియ జేస్తున్నాయి. వారు సంపూర్ణ నాగరీకులుగానే జీవించారు. మనం ఈరోజు ఆచరిస్తున్నట్లే, వారు టేబుల్స్ దగ్గర కూర్చునేవారు, తినడానికి ప్లేట్లు ఉపయోగించే వారు, స్పూన్లు, ఫోర్కులు, చాకులు మొదలైనవి ఉపయోగించే వారు. వారికున్న కళాత్మక అవగాహన, మెడికల్ జ్ఞానం, నైపుణ్యాన్ని మొత్తంగా చూస్తే, నియోలితిక్ ప్రజలు పూర్తిగా మానవులుగానే జీవించారు వారికి పూర్వపు ప్రజలు మరియు వారి తర్వాత వచ్చిన ప్రజలు జీవించినట్లే.



**12,000 సంవత్సరాల కాలం నాటి పాత బటన్**

ఎముక నుండి తయారుచేయబడిన ఈ బటన్ల వాడకాన్ని బట్టి, ఆ రోజులలో వస్త్రాలకు బటన్లు కుట్టి ఉపయోగించేవారని తెలుస్తుంది. ఒక సమాజం బటన్లను ఉపయోగించింది అంటే, ఆ సమాజంలోని ప్రజలకు కుట్టడం, వస్త్ర తయారీ మరియు వస్త్రాలను నేయడం తెలిసి ఉండాలి.



**12,000 సంవత్సరాలకు పూర్వపు బీడ్లు**

అంత ఖచ్చితమైన గుండ్రని రంధ్రాలను అటువంటి గట్టి రాళ్ళలో చేయగలగడాన్ని ప్రత్యేకంగా గుర్తించాలి. ఉక్కు లేదా ఇనుముతో తయారైన పనిముట్లను ఉపయోగించి అటువంటి రంధ్రాలను చేసి ఉండాలి.



**9,000 నుండి 10,000 సంవత్సరాలకు పూర్వపు సూదులు మరియు చెప్పులు కుట్టే పనిముట్లు**

ఇవి ఆ కాలం నాటి సాంస్కృతిక జీవితాలకి సాక్ష్యాలు. సూదులు మరియు ఇతర పనిముట్లు ఉపయోగించే వారు సాధారణ ప్రజా జీవితాన్ని గడిపారని తెలుస్తుంది. పరిణామ వాదులు చెబుతున్నట్లు వారు జంతువుల వలే బ్రతకలేదు.



### 12,000 సంవత్సరాలకు పూర్వపు రాగి పనిముట్టు

ఆ కాలపు ప్రజలకు లోహాల గురించి తెలుసు. మైనింగ్ గురించి కూడా తెలుసు. ఆ లోహాన్ని కావలిసిన ఆకారంలో మలచడం కూడా తెలుసు. రాగి ఖనిజం సాధారణంగా పౌడర్ రూపంలోగాని లేక స్ఫటిక రూపంలోగాని లభిస్తుంది. ధృఢమైన శిలల మధ్య సందులలో కన్పిస్తుంది.

రాగి పనిముట్లను తయారుచేసే ఏ సమాజమైనా, ఆ సమాజం లోని ప్రజలు రాగి ఖనిజాన్ని గుర్తించారు. దానిని రాయిలోపలి నుండి బయటకి తీయగలగడం తెలుసుకున్నారు. మరియు దానిని కావలిసిన విధంగా ఉపయోగించు కోవడానికి అవసరమైన టెక్నాలజీ వారికి ఉంది. అప్పటి వరకూ ఆదిమానవులుగా జీవించినవారు కేవలం అప్పుడే తెలుసుకున్నారని అనడంలో అర్థం లేదు.



క్రింద ఇవ్వబడిన పిల్లనగ్రోవులు (flutes) 95 వేల సంవత్సరాల పూర్వపు కాలం నాటివి. అప్పటి ప్రజలకు సంగీత సంస్కృతిపై అభిరుచి ఉండేదని తెలుస్తుంది.



ఇంకనూ పురావస్తు శాఖ కనుగొన్నవి మరియు సైంటిఫిక్ వాస్తవాలను పరిశీలిస్తే, చాలా భిన్నమైన చిత్రం బయటపడుతుంది. ఆ శిధిలాలు మరియు అప్పటికాలం నుండి ఇప్పటివరకూ మిగిలి ఉన్నవి : పనిముట్లు, సూదులు, పిల్లనగ్రోవి భాగాలు, వ్యక్తిగత అభరణాలు, అలంకరణలు. ఇవన్నీ వారి సాంస్కృతిక మరియు సామాజిక జీవనాలకు అద్దం పడుతున్నాయి. వీటిని బట్టి తెలిసేది ఏమిటంటే చరిత్రలోని అన్ని కాలాలలోనూ మానవులు నాగరిక జీవనాన్నే సాగించారు.

వేల సంవత్సరాల క్రితమే ప్రజలు ఇండ్లలో నివశించారు. వ్యవసాయం చేశారు. వస్తువులను పరస్పరం మార్చుకున్నారు. వస్త్రాలను ఉత్పత్తి చేశారు. బంధువులను కలవడం, సంగీతం మరియు పెయింటింగ్‌లలో ఆసక్తి చూపడం, క్లుప్తంగా చెప్పాలంటే మనం ఈ రోజు జీవిస్తున్న విధంగా మామూలు జీవనాన్నే వారు కూడా గడిపారు.

వారిలో అల్లాహ్ పంపిన ప్రవక్తల బోధనలు విని విశ్వాసం కలిగిన వారు ఉన్నారు. విగ్రహాలను పూజించేవారున్నారు. ఒక్కరైన అల్లాహ్‌పై విశ్వాసం మరియు నైతిక విలువలను కలిగి ఉండేవారు. ఇక ఇతరులు మూఢ విశ్వాసాలకు పోయి మరో రకంగా ప్రవర్తించేవారు. అన్ని కాలాలలోనూ, నేడు ఉన్నట్లే కొందరు సృష్టికర్త ఉనికిని విశ్వసించినవారు ఉన్నారు, విగ్రహాలను పూజించే వారున్నారు మరియు నాస్తికులు కూడా ఉన్నారు. అప్పుడే కాదు, ఇప్పుడు కూడా నాగరికంగా బ్రతికేవారితో పాటు, అనాగరికంగా బ్రతికేవారు కూడా మన మధ్యలో ఉన్నారు.



ఈ పనిముట్టు obsidian నుండి తయారైంది. నల్లటి గాజు వంటి రాయి. దాదాపు ఇప్పటికి 12000 సంవత్సరాలకు పూర్వం నాటిది. రాళ్ళను పనిముట్లుగా ఉపయోగించారని కల్పించి చెబుతూ ఆ కాలాన్ని రాతియుగం అని పరిణామ వాదులు చెప్పారు. కాని obsidian ను ఏదైనా రాతి పనిముట్టును ఉపయోగించి కావలిసిన ఆకారంలోకి మార్చడం అసాధ్యం. కాబట్టి దీనిని తయారు చేయాలంటే రాళ్ళతో కొట్టడానికి బదులు, వేరే లోహపు పనిముట్లు కావాలి.



స్పూన్లు (చెంచాలు) ఉపయోగించడం టేబుల్ మానర్స్‌ని తెలియజేస్తాయి. అంతేకాకుండా పరిణామవాదులు చెబుతున్నట్లు ఇవి ఆదిమ జీవితాలకు కాకుండా నాగరిక జీవితాలకి సంబంధించినవిగా సాక్ష్యం ఇస్తున్నాయి.



ఆదిమ ఆలోచనలతో చింపాంజీ-మనిషి అనేవాడు ఎన్నడూ చరిత్రలో లేడని చెప్పే సాక్ష్యాలలో ఇది ఒకటి. ఇది 40 వేల సంవత్సరాలకు పూర్వపు పిల్లనగ్రోవి అవశేషం. ఇది ఈనాడు వాడబడుతున్న 7-నోట్ ఫ్లూట్ వంటిదే. మరి ఆనాటి మనుష్యులు అనాగరికులు ఎలా అయ్యారు?

ఈ విధంగా ప్రతీ కాలంలోనూ రెండు రకాల ప్రజలు ఉన్నారు. ఈనాడు ప్రపంచంలో ఒక భాగంలో ఉన్న ప్రజలు అంతరిక్షంలోకి రాకెట్లను, ఉపగ్రహాలను పంపిస్తున్నారు. మన దేశం నుండి అంతరిక్షం లోకి ఎన్నో ఉపగ్రహాలు ప్రవేశపెట్టబడ్డాయి. కాని మన చుట్టూ ఉండే ఎన్నో చిన్న దేశాలకు అటువంటి సామర్థ్యం లేదు. అంటే మనం బాగా అభివృద్ధి చెందిన వారమని, మన చుట్టూ ఉన్న దేశాలు అనాగరికంగా ఉన్నట్లు మరియు వాటిని అభివృద్ధి చెందని వాటిగా భావించాలా?

మనం అంతరిక్షంలోకి ఉపగ్రహాలను పంపించగలిగినా, మన దేశంలో ఎన్నో గ్రామాలకు ఇప్పటికీ కరెంట్ లేదు.

ఈనాడు కూడా వైష్ణవి వంటి చిన్నారి పాపలను కొలిమిలో వేసి కాల్చివేసే కిరాతకులు ఉన్నారు. అంతేకాకుండా నడవలేని కూతురుని భుజాలపై ఎక్కించుకుని, ఎక్కడకు అవసరమైతే అక్కడకు తీసుకెళ్ళి కూతురుని కాలేజీలలో చదివించుకునే గొప్ప మనసున్నవారు కూడా ఉన్నారు. కిరాతకులను మాత్రమే దృష్టిలో ఉంచుకుని మాట్లాడితే మన రాష్ట్రంలోని వారంతా కిరాతుకులే అవుతారు, ఎందుకంటే వైష్ణవి వంటి చిన్నారి మన రాష్ట్రంలోనే కిరాతకంగా కాల్చివేయబడింది గనుక. కాని అటువంటి కిరాతకుల సంఖ్య అతి స్వల్పం.

## పురావస్తు తవ్వకాలలో లభించిన వాటిని పరిణామవాదులు లెక్కలోకి తీసుకోలేదు

పరిణామవాదులు వర్ణించిన మానవజాతి చరిత్రను మీరు పరిశీలిస్తే, వారు తొలి మానవుల దైనందిన జీవితాలను ఎంత అనాగరికంగా వర్ణించారో, దానిలో ఎన్ని కల్పితాలు గుప్పించారో వివరంగా తెలుస్తుంది.

వారి ఊహలకు అనుగుణంగా వారు చూపే కళాత్మక వర్ణచిత్రాలను ఎవరైనా చూస్తే వాటివైపు ఆకర్షింపబడతారు. అవి ఎంత మభ్య పెడతాయంటే, అవన్నీ సైంటిఫిక్ ఆధారాలతో తయారు చేయబడ్డాయని, ప్రామాణికమైనవిగా నమ్మదగినంతగా మభ్యపెడతాయి.

**ఈ పరిణామవాదుల వర్ణనలు ఏ విధంగా ఉంటాయంటే, వేల సంవత్సరాల క్రితం వీరు అక్కడే ఉండి అప్పటి మనుష్యులను దగ్గర నుండి గమనించినట్లుగా ఉంటాయి.**

వారి ఊహాల ప్రకారం మానవుల పూర్వీకునికి రెండు కాళ్ళపై నిలుచోవడం తెలుసుగాని, చేతులతో పనిచేయడం తెలియదు. అటువంటి వారు రాతితోనూ మరియు చెక్కతోనూ పనిముట్లు తయారు చేసుకోవడం ప్రారంభించారట. ఎంతో కాలానికి ఇనుము, రాగి, కంచుతో పనిముట్లు చేయడం ప్రారంభించారు. ఇవన్నీ శాస్త్రీయ విజ్ఞాన ఆధారాలు లేనివి. త్రవ్వకాలలో బయటపడిన వస్తువులు పరిణామవాదుల ఊహలు తప్పుగా నిరూపించాయి.

Paul Bahn - ఓ పురావస్తు శాస్త్రవేత్త. ఈయన ఓ పుస్తకం వ్రాశారు. దాని పేరు : 'Archaeology : A very short introduction'. మానవుని పరిణామ దృశ్యాలను కల్పిత కథలుగా ఆయన ఆ పుస్తకంలో అభిప్రాయ పడ్డారు. ఎంతో సైన్స్ ఆ కల్పిత కథలపైనే ఆధారపడింది అని చెప్పారు. 'కథ' అనే పదాన్ని సరియైన భావంలోనే ఉపయోగించానని ఆయన నొక్కి చెప్పారు. ఇప్పటికీ అవి అలాగే ఉన్నాయి.

మానవ పరిణామంగా పిలవబడుతున్న ఆ సిద్ధాంతపు సాంప్రదాయ లక్షణాలను పరిశీలనలోకి తీసుకోమని ఆయన తన పాఠకులకు చెబుతున్నారు.

వంటలు చేయడం మరియు కాంప్ ఫైర్, చీకటి గుహలు, ఆచారాలు, పనిముట్ల తయారీ, వృద్ధాప్యం, ఘర్షణలు మరియు చావు. ఇవీ వారి లక్షణాలు. వీటన్నింటిని పరిణామవాదులు ఏ విధంగా ఇవన్నీ చెప్పగలిగారు? పుస్తక రచయిత ఆశ్చర్యపోయారు - వారి ఊహలు ఎముకలు మరియు శిథిలాలపై ఎంతవరకూ ఆధారపడ్డాయి? మరియు ఎంతవరకూ సాహిత్యంపై ఆధారపడ్డాయి?

**పాఠకులకు అర్థమై ఉంటుంది. పురావస్తు త్రవ్వకాలలో లభించిన వాటి ఆధారంగానే ఈ ఊహలు వారు చేయలేదని, మనిషి కోతినుండి పుట్టాడనే వారి వాదనకు సరిపోయేలా ఎన్నింటినో వారు కల్పించు కున్నారని.**

ఆయన వేసిన ప్రశ్నకు బహిరంగంగా ఆయన ఎటువంటి సమాధానం ఇవ్వనప్పటికీ, మనిషిపై ఆరోపించబడిన ఈ పరిణామ సిద్ధాంతం సైన్స్‌పై ఆధారపడలేదని కేవలం సాహిత్య లక్షణం పైనే ఆధారపడిందని తెలుస్తుంది.

నిజానికి జవాబులేని ప్రశ్నలు ఎన్నో ఉన్నాయి. వాస్తవాలుగా చెబుతున్న వాటిలో పొందిక లేదు. పరిణామవాదుల కుండే ఆ మూర్ఖపు పట్టుదలతోనే ఎవరైనా ఆలోచిస్తే వీటిని ఎప్పటికీ గుర్తించలేరు.

పరిణామవాదులు రాతియుగం (Stone-Age)ని వివరిస్తారు. ఉదాహరణకు రాతిని చెక్కి, దానినొక రూపంలోకి మరల్చడం అనేది సులభమైన పనికాదు. మనకు లభించిన శిథిలాలలో ఉన్నట్లు ఒకరాతిని మరొక రాతితో చెక్కడం ద్వారా పరిపూర్ణమైన క్రమబద్ధమైన మరియు పదునైన పనిముట్లను చేయడం అసాధ్యమైన పని.

**గ్రనైట్, బసాల్ట్ లేదా డోలమైట్ వంటి గట్టివైన రాళ్ళను అవి నుగ్గు అయిపోకుండా ఒక ఆకారంలోకి మరల్చడం అనేది ఉక్కు(స్టీల్)తో చేసిన ఆకురాళ్ళు (నునుపు చేసే పనిముట్లు), లోహాన్ని నునుపు చేయడానికి వాడే చిత్రిక వంటి పనిముట్లు మరియు లేత్తు ద్వారానే సాధ్యమౌతుంది.**

వేల సంవత్సరాల క్రితం బ్రేస్‌లెట్స్ (చేతి కంకణాలు), చెవి రింగులు, నెక్లెస్‌లు మొదలైన వాటిని రాతి పనిముట్లతో తయారు చేయబడ లేదనేది సుస్పష్టం. రాతి వస్తువులలో చిన్న రంధ్రాలను చేయడమనేది రాళ్ళతో ఎలా సాధ్యం? వాటిపై చేసిన అలంకరణ కేవలం చెక్కడం ద్వారా రాలేదు. వాటిలోని పరిపూర్ణత కొరకు గట్టి లోహాలతో తయారైన పనిముట్లను ఉపయోగిస్తేగాని అది సాధ్యం కాదు.

అటువంటి ప్రాచీన కళాఖండాలు తయారు చేయడం పరిణామ వాదులు చెప్పిన ఊహాజనిత పరిస్థితులలో సాధ్యమవుతుందా అని ఎందరో పురావస్తు శాస్త్రజ్ఞులు పరీక్షలు జరిపారు.

ఉదాహరణకు ప్రొఫెసర్ Klaus Schmidt టర్కీలోని Gobekli Tep వద్ద 11 వేల సంవత్సరాల పూర్వం రాతిపలకలపైన చెక్కే ప్రయోగాలు చేసారు.

ప్రాచీనకాలంలోని వారు ఉపయోగించారని పరిణామవాదులు చెప్పినటువంటి రాతి పనిముట్లను ఆయన కొందరు పనివాళ్ళకి ఇచ్చి, ఆ రాళ్ళపై ప్రాచీనులు చెక్కిన విధంగా చెక్కమని చెప్పడం జరిగింది.

పనివారంతా రెండు గంటలపాటు నిర్విరామంగా పనిచేసాక అస్పష్టంగా ఉండే ఓ గీత మాత్రమే తయారైంది. మీరు కూడా ఇటువంటి ప్రయోగాన్ని మీ ఇంటివద్ద చేయవచ్చు. గ్రనైట్ వంటి ఓ గట్టి రాయిని తీసుకుని దానిని ఓ ఈటె మొనగా మార్చడానికి ప్రయత్నించాడు. ఓ లక్ష సంవత్సరాల క్రితం వాడారని చెప్పుకుంటున్న పనిముట్లు వంటివి మాత్రమే ఉపయోగించాలి. కాబట్టి మీరు ఓ గ్రనైట్ ముక్కను మరియు ఓ రాయిని తప్ప వేరే ఏదీ ఉపయోగించడానికి లేదు.

ఈ ప్రయోగంలో ఎంత వరకూ సఫలీకృతం కాగలరని మీరు అనుకుంటున్నారు? చరిత్ర పొరలలో లభించిన వాటి వలే పూర్వీకులు తయారు చేయగలిగినంత సన్నగా, పొందికగా, నునుపుదనంతో మరియు మెరుపుతో తయారు చేయగలరా?

స్టీల్ లేదా ఇనుప పనిముట్లు లేకుండా ఈటె మొనలను తయారు చేయడం గాని లేదా ఆకర్షణీయంగా రాళ్ళను చెక్కడం గాని చేయలేరు.

రాళ్ళను కోయడం మరియు చెక్కడం అనేవి నైపుణ్యంతో కూడిన రంగాలు. Files, lathes మరియు ఇతర పనిముట్లను తయారు చేసుకునే టెక్నాలజీ ఈ రంగానికి ఉండటం చాలా అవసరం. కాబట్టి ఇవి ఉన్న సమాజం అనాగరిక సమాజం కాదు. బాగా అభివృద్ధి చెందిన సమాజమే అవుతుంది.

ఇటువంటి పనిముట్లు గల టెక్నాలజీ లేకుండా రాతి పనిముట్లను కలిగి ఉండటం అనేది **ఓ కల్పిత కథనం మాత్రమే!**

**అటువంటి రాతియుగం అనే ఓ యుగం ఉనికిలో లేనే లేదు.**

**ఇనుప పనిముట్లను ఉపయోగించి ఉంటే అవికూడా దొరకాలి కదా అని ప్రశ్నించవచ్చు**. కాని ఇనుముతో చేసిన పనిముట్లు ఇన్నివేల సంవత్సరాల వరకూ మిగిలి ఉండలేవు. సహజమైన తేమ మరియు ఆమ్ల వాతావరణంలో లోహపు వస్తువులు ఆక్సిడైజ్ అయిపోయి దాదాపు కనుమరుగై పోతాయి. మన కళ్ళ ముందు బహిరంగంగా ఉండే ఎన్నో ఇనుప వస్తువులు కొంత కాలానికి తుప్పుపట్టి ఎలా శిథిలమై పోతున్నాయో మనం చూస్తూనే ఉన్నాము. కొన్నాళ్ళకే అవి అలా మారిపోతే, మరి వేల సంవత్సరాలకు వాటి ఆనవాలు కూడా ఉండదు. కాని రాళ్ళు ఆ విధంగా కనుమరుగవడం కష్టం.

**కాబట్టి సైన్స్ పరంగా ఆలోచిస్తే కేవలం రాతి పనిముట్లను మాత్రమే అప్పటివారు ఉపయోగించారని అనడం సరికాదు.**

**పురావస్తు త్రవ్వకాలలో బయటపడినవి డార్వినిజాన్ని ఎంతమాత్రం సమర్థించడం లేదని ఇప్పుడు చాలా మంది పరిణామవాదులు అంగీకరిస్తున్నారు.**

Richard Leakey పరిణామ సిద్ధాంతాన్ని నమ్మే ఓ పురావస్తు శాస్త్రజ్ఞుడు. పరిణామ సిద్ధాంతం ప్రకారం త్రవ్వకాలలో బయట పడిన వాటిని, ప్రత్యేకంగా రాతి పనిముట్లను, లెక్కలోకి తీసుకోవడం అసాధ్యమనే విషయాన్ని చివరకు ఆయన ఒప్పుకున్నారు.

In fact, concrete evidence of the inadequacy of the Darwinian hypothesis is to be found in the archeological record. If the Darwinian package were correct, then we would expect to see the simultaneous appearance in the archeological and fossil records of evidence for bipedality, technology, and increased brain size. We don't. Just one aspect of the prehistoric record is sufficient to show that the hypothesis is wrong : the record of stone tools.

వాస్తవానికి డార్విన్ ఊహ యోగ్యమైనది కాదని చెప్పడానికి పురావస్తు రికార్డులలో గట్టి సాక్ష్యం లభిస్తుంది. డార్విన్ పాకేజీ సరియైనదే అయితే, ఒకే కాలానికి చెందిన అన్ని ఆధారాలు లభించాలి. మనకు ఆ విధంగా ఏమీ లభించ లేదు. **వారి ఊహ తప్పు** అని చెప్పడానికి ప్రాచీన రికార్డ్ ఒక్కటి చాలు, అదే రాతి పనిముట్ల రికార్డ్.

## "మెరిసే రాయి" పరిణామవాదుల వంచన



నునుపుగాను మరియు మెరుపుతో కనిపించేలా ఓ రాతిని మలచాలంటే, శక్తివంతమైన లోహపనిముట్లు తప్పనిసరిగా ఉపయోగించాలి. అంతే కాకుండా, చాలా ఖచ్చితంగా వాటిని కోయాలి మరియు ఆకారాన్ని ఇవ్వాలి. పరిణామవాద శాస్త్రవేత్తలు వర్ణించే **'మెరిసే రాతి యుగం'** అనేది పూర్తిగా సైన్స్‌కి విరుద్ధం. ఈ మెరుపు అనేది వేల సంవత్సరాల పాటు ఉండటం అనేది అసాధ్యం.

రాళ్ళు మెరుస్తున్నాయి అంటే అవి చాలా ఖచ్చితంగా కోయబడి ఉంటాయి. ఈ మెరుపు అనేది రాయి లోపలి నుండే వస్తుంది.

పైన చూపిన రాతి కంకణాలలో ఎడమవైపు ఉన్నది మార్బుల్‌తోనూ మరియు కుడివైపున ఉన్నది బసాల్ట్‌తోనూ తయారు చేయబడింది.

అవి ఇప్పటికి 10,500 మరియు 11,000 సంవత్సరాల మధ్య కాలానికి చెందినవి అని డేటింగ్ ద్వారా కనుగొన్నారు. ఇవి ఆ కాలం నాటి ప్రజల కళాభిరుచిని తెలియజేస్తున్నాయి.

క్రింది చిత్రంలో obsidian (లావా శిలవంటి గాజు) మరియు ఎముకలతో చేసిన పనిముట్లు ఉన్నాయి. కేవలం రాళ్ళను ఉపయోగించి అంత క్రమమైన విధంగా వాటి ఆకారాలను తీర్చిదిద్దగలరా?

గట్టిగా కొడితే ఎముక విరిగిపోతుంది. అంతే కాకుండా సూదిగా ఉండే మొనలు తయారుచేయడమూ కష్టమైన పనే!



క్రింది చిత్రంలో రాళ్ళను ఎలా కోసారో చూడండి మనం పండ్లను కోసినట్లు.





5,50,000 సంవత్సరాలకు పూర్వపు గొడ్డలి



ఈ రాయి 11వేల సంవత్సరాల పూర్వ కాలానికి చెందినది. ఏదైనా ఓ రాయిని ఉపయోగించి ఈ రాతిపై చెక్కబడిన బొమ్మను చెక్కడం సాధ్యమౌతుందా?


**రాతితో రాయిని చెక్కడం సాధ్యమా?**




12,000 సంవత్సరాల పూర్వపు రాతి inlays




13,000 సంవత్సరాల పూర్వపు రాతి రోకలి



13,000 సంవత్సరాల పూర్వపు రాతి వస్తువులు



11,000 మరియు 12,000 సంవత్సరాల పూర్వపు మేలకైట్ రాయి inlay



ప్రారంభంలో తొర్ర కలిగి మేకును పోలిన రాయి

12వేల సంవత్సరాల పూర్వపు వస్తువు



12వేల సంవత్సరాల పూర్వపు సుత్తి

## పరిణామవాదుల కల్పిత సంఘటనల క్రమం

చరిత్రను వర్గీకరిస్తూ పరిణామవాదులు తమ స్వంత హేతుబద్ధంకాని సిద్ధాంతాలకు అనుగుణంగా త్రవ్వకాలలో లభించిన వస్తువులను వివరించారు. కంచు కళాఖండాలు తయారు కాబడిన పీరియడ్‌ని కంచు యుగం అన్నారు. మరియు ఇనుమును ఉపయోగించిన కాలాన్ని ఇటీవలి కాలంగా చెప్పారు. అంటే ప్రాచీన నాగరికతలలో పరిణామ వాదులు చెప్పిన ప్రకారం, అప్పటి వారికి లోహాల గురించి తెలియదు. కేవలం రాళ్ళను ఉపయోగించడమే తెలుసు.

ఇప్పటికే ప్రస్తావించడం జరిగింది. ఐరన్, ఉక్కు మరియు ఇతర లోహాలు ఆక్సిడైజ్ అయ్యి రాయి కంటే చాలా వేగంగా క్షీణించి పోతాయి. కంచువంటి లోహాలు ఆక్సిడైజ్ కావడం ఇతర లోహాలతో పోలిస్తే చాలా తక్కువ మరియు దాదాపు చాలా కష్టం. కాబట్టి అవి చాలాకాలం పాటు ఉండే అవకాశం ఉంది. కాబట్టి సహజంగానే త్రవ్వకాలలో లభించిన కంచు వస్తువులు పాతవే అయివుండాలి నేటి ఇనుము కంటే.

అంతేకాకుండా ఇనుము గురించి తెలియకుండా కంచును తయారు చేసారనడంలో హేతువేమీ లేదు. కంచును తయారు చేయగలిగిన సమాజానికి ఇతర లోహాలను ఉపయోగించడం తెలియదని అనడంలో అర్థం లేదు.

కంచు అనేది 'రాగి' లోహానికి టిన్, ఆర్సినిక్ మరియు ఆంటిమొని మరియు కొద్ది పరిమాణంలో జింక్ కలిపితే ఏర్పడుతుంది. కాబట్టి ఎవరైనా కంచు తయారు చేయగలిగారంటే వారికి కాపర్, టిన్, ఆర్సినిక్, జింక్ మరియు ఆంటిమొని గురించి జ్ఞానముందని మరియు అవి ఏ వేడి దగ్గర కరుగుతాయో తెలిసి ఉండాలి. అంతేకాకుండా వారి దగ్గర వీటిని కరిగించి కలపడానికి భట్టీ ఉండాలి. ఈ జ్ఞానమేదీ లేకుండా సరియైన ఓ లోహ మిశ్రమాన్ని ఉత్పత్తి చేయడం అసాధ్యమైన పని.

**ప్రాచీన గట్టి రాళ్ళలో పౌడర్‌గా లేదా స్ఫటికరూపంలో రాగి లభిస్తుంది. దీనినే నేటివ్ రాగి అంటారు. రాగిని ఉపయోగించుకున్నారంటే వారికి రాళ్ళలో ఈ రూపంలో రాగి దొరుకుతుందని తెలిసుండాలి. ఆ తరువాత మైనింగ్ ద్వారా దానిని బయటకు తీయాలి. ఈ పని కొరకు రాతి పనిముట్లు లేదా కర్రతో చేసిన పనిముట్లు పనికిరావు.**

రాగిని కరిగించాలంటే ఎర్రని వేడి జ్వాలలో ఉంచాలి. దానిని కరిగించి శుద్ధి చేయడానికి 1084 డిగ్రీల సెంటీగ్రేడ్ వేడి ఉండాలి. అంతేకాకుండా స్థిరంగా గాలిని కూడా పంపాలి. రాగిని ఉపయోగిస్తూ పనిచేసే ఏ సమాజంలోనైనా భట్టీ నిర్మించబడాలి. అంత ఎక్కువ వేడిని ఏర్పాటు చేయాలి మరియు ఫర్నస్‌తో పనిచేయడానికి క్రూసిబుల్స్ మరియు టాంగ్స్ వంటి పరికరాలు ఉండాలి.

ఇవన్నీ సాంకేతికంగా రాగి తయారు చేయడానికి అవసరమైనవి. రాగి చాలా మెత్తటి లోహం. కాబట్టి దీనికి టిన్, జింక్ మరియు ఇతర మూలకాలను జతచేసి కంచు తయారు చేస్తారు. అయితే ఈ ఇతర లోహాలలోని ప్రతీదానికి వేరే పక్రియ ఉంది. **వీటన్నింటి బట్టి ఈ మొత్తం జ్ఞానం అప్పటివారికి ఉందని తెలుస్తుంది.** అంత జ్ఞానం గలవారికి ఇనుము గురించి తెలియదని ప్రకటించడం హేతుబద్ధం కాదు.



బీడ్స్‌గా ఉపయోగించబడిన 10,000 మరియు 12,000 సంవత్సరాలకు పూర్వపు రాగి పై చిత్రంలో చూపబడింది. అప్పటి ప్రజలకు రాయి నుండి ఈ ఖనిజాన్ని ఏ విధంగా తీయాలి మొదలైన విషయాలపై జ్ఞానం ఉంది.

అల్లాహ్ మట్టితో సృష్టించిన తొలి మానవుడు ఆదమ్(అ). ఖుర్‌ఆన్‌లో మానవులను అల్లాహుతాలా **'ఓ ఆదమ్ సంతానమా'** అని సంబోధించారు. మానవులకు మూలమైన ఆ మొదటి జంట వస్త్రాలు ధరించారు.

**మరియు ఆయన సూచనలలో ఒకటి మిమ్మల్ని మట్టి నుండి సృష్టించాడు. ఆ తరువాత మీరు మానవులుగా వ్యాపిస్తున్నారు.** (ఖుర్‌ఆన్ 30:20)

**మరియు అల్లాహ్ మిమ్మల్ని మట్టితో సృష్టించాడు. తరువాత**

**ఇంద్రియ బిందువుతో, ఆ తరువాత మిమ్మల్ని (ఆడ-మగ) జంటలుగా చేశాడు. మరియు ఏ స్త్రీ కూడా ఆయనకు తెలియకుండా గర్భం దాల్చజాలదు. మరియు ప్రసవించనూ జాలదు. గ్రంథంలో వ్రాయబడనిదే, పెరుగుతున్న వాడి వయస్సు పెరగనూ జాలదు మరియు ఎవని వయస్సు తరగనూ జాలదు. నిశ్చయంగా, ఇదంతా అల్లాహ్‌కు ఎంతో సులభం (ఖుర్'ఆన్ 35:11)**

**ఆయన మానవుణ్ణి పెంకులాంటి శబ్దమిచ్చే మట్టితో సృష్టించాడు (ఖుర్'ఆన్ 55:14)**

**ఓ మానవులారా! నిశ్చయంగా మేము మిమ్మల్ని ఒక పురుషుడు మరియు ఒక స్త్రీ నుండి పుట్టించాము. మరియు మీరు ఒకరినొకరు గుర్తుంచుకోవటానికి మిమ్మల్ని జాతులుగా మరియు తెగలుగా చేశాము. నిశ్చయంగా మీలో ఎక్కువ 'అల్లాహ్ పట్ల భీతి' గలవాడే, అల్లాహ్ దగ్గర ఎక్కువ గౌరవం గలవాడు. నిశ్చయంగా, అల్లాహ్ సర్వజ్ఞుడు, సర్వం తెలిసినవాడు (ఖుర్'ఆన్ 49:13)**

మొదటి మానవుడిని మట్టితోనూ, ఆ తరువాత ఇంద్రియ బిందువుతోనూ సృష్టించాను అని స్పష్టంగా అల్లాహుతాలా ఖుర్'ఆన్‌లో తెలియజేస్తున్నారు.

**ఓ ఆదమ్ సంతానమా! వాస్తవానికి మేము మీ కొరకు వస్త్రాలను కల్పించాము. అవి మీ మర్మాంగాలను కప్పుతాయి మరియు మీకు అలంకారమిస్తాయి మరియు 'అల్లాహ్ పట్ల భీతియే' అన్నిటి కంటే శ్రేష్ఠమైన వస్త్రం. ఇవి అల్లాహ్ సూచనలలో కొన్ని, బహుశా గుణపాఠం నేర్చుకుంటారేమోనని.**

**ఓ ఆదమ్ సంతానమా! షైతాన్ మీ తల్లిదండ్రుల నుండి వస్త్రాలను తొలగించి, వారి మర్మాంగాలను వారికి కనబడేటట్లు చేసి వారిని స్వర్గం నుండి వెడల గొట్టినట్లు మిమ్మల్ని కూడా ఆపదకు గురి చేయకూడదు. నిశ్చయంగా, వాడు మరియు వాని సంతతివారు మిమ్మల్ని కనిపెట్టుకుని ఉన్నారు. కాని, మీరు వారిని చూడలేరు. నిశ్చయంగా మేము షైతాన్‌లను, విశ్వసించని వారికి స్నేహితులుగా చేశాము (ఖుర్'ఆన్ 7:26,27)**

ఖుర్'ఆన్ ప్రకారంగా మానవులు ప్రారంభం నుండే బట్టలు ధరించారు. అంతేగాని చీకటి గుహలలో బొచ్చును ధరించి అనాగరికంగా జీవించలేదు.

**తొలి మానవుడైన ఆదమ్(అ)వారికి అన్ని వస్తువుల జ్ఞానాన్ని అల్లాహ్‌యే ఇచ్చారు.**

రాతియుగ భావనకు సైంటిఫిక్ ఆధారం లేదు. అది ఊహాజనిత మైనది మాత్రమే.

**(తరువాయి భాగం ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో)**

## కొత్తగా చేరిన పాఠకులకు మా విన్నపం

మాకు ఉన్న పోస్టల్ లైసెన్స్ ప్రకారం
ప్రతీ నెల 15వ తారీఖున
శాంతిబాట పోస్ట్ చేయవలసి ఉంది.
ఒకొక్కసారి కొన్ని వ్యాసాల పరిశోధన కొరకు ఎక్కువ సమయం అవసరమౌతుంది. సాంకేతిక సమస్యల వలన కూడా పత్రిక ఆలస్యం కావచ్చు.

**సంవత్సర చందా వివరాలు :**

**రూ. 200/- పోస్టల్ మనియార్డర్ (M.O.) ద్వారా**

**క్రింది ఎడ్రస్‌కు పంపండి.**

**వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ**
2-8-31, కోట బజార్, సామర్లకోట-533440
మనియార్డర్ చేయగానే 9491103017కి ఫోన్ చేసి
తెలియజేయవలసిందిగా కోరుతున్నాము

**ఎక్కువ చందాలను పంపగోరువారు**
**క్రింది ఎకౌంట్‌లో డిపాజిట్ చేయవచ్చు.**
SBI A/c No. 10428633092
Waltair, Visakhapatnam-530003
Contact : Dr. N. Srinivasa Rao, Cell:9491103017
velugubaata@gmail.com
info@saanthibaata.net

**మొదటి సంవత్సరం సంచికలు**
(తొలి సంచిక ఆగష్టు 2009 మినహా)
**మరియు 2వ సంవత్సరం సంచికలు కావలిసిన వారు**
**రూ. 365/- మనియార్డర్ చేయగలరు.**

**కేవలం ఏదో ఒక ఆర్టికల్ మాత్రమే అవసరమైతే**
**మా వెబ్‌సైట్ www.saanthibaata.net నుండి**
**ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.**

మీ కవర్‌పై ఉండే ఎడ్రస్ స్లిప్‌పై మీ ఫోన్ నంబర్ లేకపోయినా లేక మీ నంబర్ మారినా ఆ నంబర్‌ను వెంటనే మాకు తెలియజేయండి.

# ఖుర్ఆన్‌ని అర్థం చేసుకుంటూ చదువుదాం - 22

ఫి'లె సులాసీ ముజర్రద్ | మూలం లోని రెండవ అక్షరం و లేక ي అయినప్పుడు (مادّے کا دوسرا حرف و یا ی ہو) | فِعل ثلاثي مُجَرَّد **أجْوَف**

| فِيلَ، (يُفَالُ) | فَوْل VERBAL NOUN | فَائِل | فُلْ، فِلْ | يُفُولُ، يَفِيلُ | فَالَ |
|---|---|---|---|---|---|
| పశ్చాత్తాపపడుట<br>to repent<br>توبہ کرنا، توبہ قبول ہونا | పశ్చాత్తాపం تَوْبَة (తౌబహ్) | పశ్చాత్తాప పడినవాడు تَائِب (తా'ఇబ్) | పశ్చాత్తాప పడు تُبْ (తుబ్) | పశ్చాత్తాప పడతాడు يَتُوبُ (యతూబు) | పశ్చాత్తాప పడ్డాడు تَابَ (తాబ) |
| రుచి చూచుట<br>to taste<br>چکھنا | ذَوْق (జౌఖ్) | ذَائِق (జా'ఇఖ్) | ذُقْ (జుఖ్) | يَذُوقُ (యజూఖు) | ذَاقَ (జాఖ) |
| విజయం సాధించుట<br>to succeed; to gain victory<br>کامیاب ہونا فتح پانا | فَوْز (ఫౌజ్) | فَائِز (ఫా'ఇజ్) | فُزْ (ఫుజ్) | يَفُوزُ (యఫూజు) | فَازَ (ఫాజ) |
| చెప్పుట<br>to say<br>کہنا | قَوْل (ఖౌల్) | قَائِل (ఖా'ఇల్) | قُلْ (ఖుల్) | يَقُولُ (యఖూలు) | قَالَ (ఖాల) |
| లేచుట<br>to stand up;<br>to raise<br>کھڑا ہونا | قِيَام، قَوْمَة (ఖియామ్) | قَائِم (ఖా'ఇమ్) | قُمْ (ఖుమ్) | يَقُومُ (యఖూము) | قَامَ (ఖామ) |
| ఉండు, అవు<br>to be<br>ہونا، تھا، ہے | كَوْن (కౌన్) | كَائِن (కా'ఇన్) | كُنْ (కున్) | يَكُونُ (యకూను) | كَانَ (కాన) |
| మరణించుట<br>to die<br>مرنا، بے جان ہونا | مَوْت (మౌత్) | مَائِت (మా'ఇత్) | مُتْ (ముత్) | يَمُوتُ (యమూతు) | مَاتَ (మాత) |
| భయపడుట<br>to be afraid<br>ڈرنا | خَوْف (ఖౌఫ్) | خَائِف (ఖా'ఇఫ్) | خِفْ (ఖిఫ్) | يَخَافُ (యఖాఫు) | خَافَ (ఖాఫ) |
| సన్నిహితంగా ఉండుట<br>to become nigh;<br>to be close to قریب تھا ہے کہ | كَوْد (కౌద్) | كَائِد (కా'ఇద్) | كِدْ (కిద్) | يَكَادُ (యకాదు) | كَادَ (కాద) |
| వ్యతిరేకంగా కుట్రపన్నుట<br>to plot against<br>خفیہ تدبیر کرنا | كَيْد ( కైద్) | كَائِد (కా'ఇద్) | كِدْ (కిద్) | يَكِيدُ (యకీదు) | كَادَ ( కాద) |
| పెంచుట<br>to increase<br>زیادہ کرنا | زِيَادَة (జియాదహ్) | زَائِد (జా'ఇద్) | زِدْ (జిద్) | يَزِيدُ (యజీదు) | زَادَ (జాద్) |

**ఖుర్'ఆన్‌లో మొత్తం పదాల సంఖ్య = సుమారు 77,800.** ***ఈ 21నెలల్లో నేర్చుకున్న ఖుర్'ఆన్ పదాల శాతం : 72.1***

ఈ నెల నేర్చుకున్న పదాలు 3590 (అంటే ఈ పేజీలోని పదాలు ఖుర్'ఆన్‌లో 3590 చోట్ల చూడవచ్చు) ***source: www.emuslim.com***




**ప్రతీ స్త్రీ లేదా పురుషునికి తొలి బడి అమ్మ ఒడి. గొప్ప గొప్ప జ్ఞానులు, మేధావుల వెనుక తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉంటుంది. తొలి గురువులు తల్లిదండ్రులే. ఆ తరువాతనే, పాఠశాలలో చేరిన దగ్గరనుండి, మిగిలిన గురువులు పరిచయమౌతారు. వీరందరినీ మీరు గౌరవించాలి. అయితే వీరందరికీ జ్ఞానాన్ని ఇచ్చిన సృష్టికర్తే విశ్వమంతటికీ గురువు - ఆయనే 'అల్లాహ్'. ఏ గురువు చెప్పినా అర్థం కాకపోయినా లేక మరేదైనా చెప్పుకోలేని సమస్య మీకొస్తే డైరెక్టుగా అల్లాహ్‌నే అడగండి. ఆయన వింటాడు. మీకు జవాబు కూడా వస్తుంది. ఆరాధ్యుడిని అర్థం చేసుకుంటే మీరే టాప్ రేంకర్స్.**

## దైవప్రవక్త **హూద్**(అ)

గత కొన్ని సంచికల నుండి ఒక్కొక్కరిగా అల్లాహ్ పంపిన ప్రవక్తల జీవితచరిత్రను అందించడం ప్రారంభించాము.

**గమనిక :** ఈ వ్యాసం పిల్లలకు అర్థమయ్యే విధంగా ఉండాలని సులభతరం చేసి అందిస్తున్నాము.

(గత సంచిక తరువాయి భాగం)

చారిత్రక రికార్డులను బట్టి హద్రామౌత్‌లు సాంబ్రాణి (frankincense) వ్యయసాయాన్ని బాగా అభివృద్ధి పరిచారు. ఆ కాలంలో అది చాలా విలువైన మొక్క. ఆ మొక్క యొక్క ఉపయోగాన్ని తెలుసు కున్నారు. దానిని ఎన్ని విధాలుగా ఉపయోగిస్తారో తెలుసుకున్నారు. ఆ రోజుల్లో ఆ మొక్కనే ఎక్కువుగా పండించేవారు.

షబ్‌వాహ్‌లో జరిపిన త్రవ్వకాలు చాలా ఆసక్తిని రేకెత్తించాయి. లోతైన ఇసుకతిన్నెల కారణంగా 1975లో మొదలైన ఈ త్రవ్వకాలలో పురావస్తు శాస్త్రజ్ఞులకు ఈ నగర శిధిలాలను చేరుకోవడం చాలా కష్టమైంది. చివరకు త్రవ్వకాలు పూర్తయ్యేసరికి, వారి లభించినది చూశాక ద్రిగ్భాంతి కలిగింది.

**పురాతన నగరం బయటపడింది. అప్పటి నుండి అది అందరినీ ఆసక్తిలో ముంచెత్తింది. చుట్టూ గోడలతో నిర్మించబడిన ఆ పట్టణం ఇతర యెమనీ సైట్‌ల కంటే చాలా విశాలంగా ఉంది మరియు ఆ కోట వాస్తవంగా చాలా ఘనమైన భవనం.**

గొప్పదైన భవన నిర్మాణ శైలిని ఈ హద్రామౌత్‌లు తమ పూర్వీకులైన ఆద్ జాతి నుండి వారసత్వంగా పుణికిపుచ్చుకున్నారనడంలో ఎటువంటి సందేహం లేదు.

హూద్(అ) తన జాతి ప్రజలైన 'ఆద్'వారిని హెచ్చరిస్తూ ఇలా చెప్పారు:

**"ఏమీ? మీరు కేవలం ఆడంబరానికి ప్రతి ఎత్తైన స్థలం మీద ఒక స్మారకాన్ని నిర్మిస్తారా? మరియు మీరు శాశ్వతంగా ఇక్కడే ఉండి పోతారన్నట్లు పెద్దపెద్ద కోటలు కడతారా?"** (ఖుర్'ఆన్ 26:128-129)

ఈ భవనాల యొక్క ఆసక్తికరమైన మరో లక్షణం ఏమిటంటే సర్వాంగ సుందరమైన స్తంభాలు. షబ్‌వాహ్‌లోని స్తంభాలు సాటిలేనివిగా ఉన్నాయి. గుండ్రంగా ఉంటూ వృత్తాకార మండపంగా అవి వరుసలో పెట్టబడ్డాయి. యెమెన్ సైట్లలో ఇంతవరకూ లభించినవి చతురస్రాకారం లోని ఏకశిల స్తంభాలు.

9వ శతాబ్దంలోని గ్రీకు బైజాన్‌టైన్ కాన్‌స్టంట్‌నోపుల్ మతగురువు, Photius దక్షిణప్రాంత అరబ్బులపై మరియు వారి వాణిజ్య వ్యవహారాలపై విస్తృత పరిశోధన చేశారు. ఆయన పురాతన గ్రీకు పత్రాలు చదవగలిగారు. అందులో ఎరిత్రేయన్ (ఎర్ర) సముద్రానికి సంబంధించిన ముఖ్యమైన గ్రంథం : Agatharachides (క్రీ.పూ. 132).

పోటియస్ తన వ్రాతలలోని ఒకదానిలో ఇలా చెప్పారు : వారు (దక్షిణ ప్రాంత అరబ్బులు) చాలా స్తంభాలను నిర్మించి వాటిని బంగారం లేదా వెండితో కప్పారని చెప్పబడింది. ఆ స్తంభాల మధ్య ఉండే దూరం విస్మయాన్ని కలిగిస్తుంది.

గ్రీకు ప్రామాణిక రచయితలైన ప్లినీ మరియు స్ట్రాబో ఈ నగరాలను ఇలా వర్ణించారు : 'సుందరమైన దేవాలయాలు మరియు రాజ మందిరాలతో నగరాలు అలంకరించబడ్డాయి.

ఈ పట్టణాలకు యజమానులు ఆద్ జాతి వారసులు అను కున్నప్పుడు, ఆద్ జాతి నివాసాన్ని ఉన్నతమైన స్తంభాలతో ఉండే **ఇరమ్** పట్టణంగా ఖుర్'ఆన్ ఎందుకు నిర్వచించిందో స్పష్టంగా అర్థమౌతుంది.

**ఎత్తైన స్తంభాల** (భవనాలు గల) **ఇరమ ప్రజల పట్ల? వారివంటి జాతి భూమిలో ఎన్నడూ సృష్టించబడలేదు.** (ఖుర్'ఆన్ 89:7-8)

## నీటి చెలమలు మరియు తోటలు

ఈ రోజున దక్షిణ అరేబియాలో ప్రయాణించే వారికెవరికైనా తరచుగా విశాల ఎడారిని దాటవలసి ఉంటుంది. వీటిలోని చాలా ప్రదేశాలు ఇసుకతో నిండి ఉంటాయి. కొన్ని ప్రదేశాలలో మరియు పట్టణాలలో మాత్రం తరువాయి కాలాలలో చెట్లను పెంచడం జరిగింది.

ఈ ఎడారులు అక్కడ వందలు మరియు వేల సంవత్సరాల నుండి ఉండవచ్చు. కాబట్టి అక్కడ ఒకప్పుడు చెట్లు ఉండేవని ఊహించలేము.

కాని ఖుర్ఆన్‌లో ఆద్‌జాతి గురించి గుర్తు చేసే ఆయత్‌లలో ముఖ్య సమాచారం ఇవ్వబడింది. హూద్(అ)వారు తన జాతి ప్రజలను హెచ్చరించే టప్పుడు అల్లాహ్ వారిపై అనుగ్రహించిన నీటి చెలమలు మరియు తోటలవైపు వారి దృష్టిని మరలించారు.

**ఇకనైన మీరు అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి మరియు నన్ను అనుసరించండి. మరియు మీకు తెలిసివున్న (మంచి) వస్తువులను, మీకు విస్తారంగా ఇచ్చిన ఆయన (అల్లాహ్) యందు భయభక్తులు కలిగి ఉండండి. ఆయన విస్తారంగా మీకు పశువులను మరియు సంతానాన్ని అనుగ్రహించాడు. మరియు తోటలను మరియు చెలమలను. నిశ్చయంగా, మీపై ఒక మహాదినమున (పడబోయే) శిక్షకు భయపడుతున్నాను** (ఖుర్ఆన్ 26:131-135)

ఈ ఆయత్ చదివాక ఒకప్పుడు అక్కడ నీటి చెలమలు ఉన్నాయా అని ఎవరికైనా ఆశ్చర్యం కలుగుతుంది. కాని ఇది నిజం.

ముందుగా తెలుసుకున్న ఇరమ్ పట్టణంతోపాటు గుర్తించిన ఉబర్ మరియు అంతకుపూర్వం ఆద్ జాతివారి నివాసమైన ఇతర ఏ ప్రదేశమైనా సరే నేడు పూర్తిగా ఇసుకతో కప్పబడి ఉంది.

**అటువంటప్పుడు హూద్(అ)వారు తన ప్రజలను హెచ్చరించ డానికి నీటి చెలమల గురించి మరియు తోటల గురించి ఎందుకు ప్రస్తావించి ఉంటారు?**

చారిత్రక వాతావరణ మార్పులలో దీని సమాధానం దాగి ఉంది. ఈ రోజు ఎడారులుగా ఉన్న ఈ ప్రాంతాలు ఒకప్పుడు సారవంతమైన పచ్చని భూములని చారిత్రక రికార్డులు తెలియజేస్తున్నాయి.

ఖుర్ఆన్‌లో చెప్పబడినట్లు ఈ ప్రాంతంలోని చాలా భాగం పచ్చటి పొలాలతో మరియు నీటి చెలమలతో కప్పబడి ఉండేది. కొన్ని వేల సంవత్సరాల క్రితం ఆ ప్రాంత ప్రజలు అల్లాహ్ అనుగ్రహించిన వాటిని ఉపయోగించుకునేవారు.

ఆ ప్రాంతపు కఠోరమైన వాతావరణాన్ని అడవులు మృదువుగా మార్చాయి మరియు జీవనానికి చాలా అనువైనవిగా చేశాయి. ఎడారులు ఉండేవిగాని నేడు ఉన్నంత విశాలంగా ఉండేవి కావు.

దక్షిణ అరేబియాలో ఆద్ జాతివారు నివశించిన ప్రాంతాలలో లభించిన కొన్ని ముఖ్యమైన ఆధారాలు ఈ విషయాలను వెలుగులోకి తెచ్చాయి. వీటిని బట్టి ఆ ప్రాంత ప్రజలు బాగా అభివృద్ధి చెందిన నీటి పారుదల వ్యవస్థను కలిగి ఉన్నారని తెలుస్తుంది.

ఉపగ్రహ ఛాయాచిత్రాల ద్వారా ప్రాచీన నీటి కాలువలు మరియు ఆనకట్టలు నీటిపారుదల కోసం విస్తారంగా ఉపయోగించినట్లు తెలుస్తుంది. దాదాపు 2 లక్షల మందికి సరిపోయే విధంగా పట్టణాలు ఉన్నాయని అంచనా వేశారు.

మరో పరిశోధకుడు (Doe) చెప్పినదానిని బట్టి, మ'అరిబ్ చుట్టూ ఉండే ప్రాంతం చాలా సారవంతమైనది. మ'ఆరిబ్ మరియు హద్రామౌత్ మధ్య ఉండే ప్రాంతం ఒకప్పుడు వ్యవసాయానికి ఉపయోగించ బడింది"

ప్లినీ వర్ణన ప్రకారం ఈ ప్రాంతం చాలా సారవంతమైనది. పొగమంచుతో కప్పబడి దట్టమైన అడవులతో నిండిన పర్వతాలు మరియు నదులు కలిగి ఉండేవి.

హద్రామౌత్‌ల ముఖ్య పట్టణం షబ్‌వాహ్‌కు సమీపంలోని పురాతన దేవాలయాల్లో లభించిన శిలాశాసనాలలో జంతువులను వేటాడేవారని మరియు కొన్నింటిని బలి ఇచ్చేవారని వ్రాయబడింది.

వీటన్నింటిని బట్టి ఒకప్పుడు ఈ ప్రాంతంలో ఎడారులే కాకుండా సారవంతమైన భూమి ఉండేదని తెలుస్తుంది.

ఈ ఎడారి ఎంతవేగంగా చుట్టుప్రక్కల ప్రాంతాలకు విస్తరిస్తుందో ఇటీవల పాకిస్తాన్‌లోని స్మిత్‌సోనియన్ ఇన్సిట్యూట్ వారు చేసిన పరిశోధన ద్వారా తెలుస్తుంది. రోజుకి 6 అంగుళాల వేగంతో ఈ ఎడారి విస్తరిస్తుంది. ఈ స్పీడుతో ఇది పెద్దపెద్ద బిల్డింగులను సైతం మింగేస్తుంది ఒకప్పుడు అవి అక్కడ లేనట్లుగా.

ఈజిప్టులోని పిరమిడ్లు కూడా ఒకప్పుడు పూర్తిగా ఇసుకలో కప్పబడిపోయి ఉండేవి. సుదీర్ఘ త్రవ్వకాల ద్వారా అవి బయటపడ్డాయి. కాబట్టి క్లుప్తంగా చెప్పాలంటే ఈనాటి ఎడారులు గతించిన కాలంలో మరో రూపంలో ఉండేవి.

## ఆద్ జాతి ఏవిధంగా నాశనమైంది?

ఈ జాతి ప్రచండమైన గాలి ద్వారా నాశనమైందని ఖుర్ఆన్ ద్వారా తెలుస్తుంది. ఖుర్ఆన్ ఆయత్‌లో ప్రస్తావించిన దానిని బట్టి ఆ ప్రచండమైన గాలి 7 రాత్రులు మరియు 8 పగళ్ళు వీచింది. ఆద్ జాతిని సమూలంగా నాశనం చేసింది.

**నిశ్చయంగా, మేము పూర్తిగా దురదృష్టమైన ఒక రోజున తీవ్రమైన ఎడతెగని తుఫానుగాలిని పంపాము. అది ప్రజలను, వేళ్ళతో పెళ్ళగింప బడిన ఖర్జూరపు చెట్లవలె పెళ్ళగించి వేసింది.** (ఖుర్ఆన్ 54:18-20)

**(ఇన్షా అల్లాహ్, హూద్(అ)వారి చివరి భాగం వచ్చే సంచికలో..)**

# జిన్నులు మరియు చేతబడి

(2) సీరియల్

## మనిషికుండే బలహీనతలే కొందరికి జీవనాధారం

***శారీరక లేదా మానసిక సమస్యలతో బాధపడేవారు సంబంధిత డాక్టర్‌ని సంప్రదించండి.***

క్రిందటి సంచికలో అల్లాహ్‌కు తప్ప దేనికీ భయపడనవసరం లేదని ఖుర్‌ఆన్ వాక్యాల ద్వారా వివరించడం జరిగింది. మనకు కీడు చేసేవి ఏమిటో మరియు మేలు చేసేవి ఏమిటో మనల్ని సృష్టించిన అల్లాహ్‌కే బాగా తెలుసు. అంతేకాకుండా మనకు జరిగే కీడు మరియు మేలు కూడా అల్లాహ్ ఆధీనంలోనే ఉన్నాయి. కాబట్టి అల్లాహ్‌కు మాత్రమే భయపడాలి. ఇక్కడ భయం అంటే అర్థం - అల్లాహ్ ఆదేశించినట్లు మన ఆచరణ లేకపోతే ఆయనచేత శిక్షించబడతామనే భయం. మరియు ఆయన కరుణను కోల్పోతామనే భయం.

జిన్నులపై ప్రజలలో ఉండే భయం రెండు రకాలుగా ఉంటుంది.

**భయంలో మొదటి రకం :** తన చుట్టూ తనకు కనబడకుండా ఏదో జరుగుతుందని, ఏవేవో శబ్దాలు వినిపిస్తున్నాయని కొందరు భావిస్తుంటారు. అదే ఆలోచనతో ఉంటే అన్నీ అలాగే అనిపిస్తాయి. అంటే జిన్నులు ఆ విధంగా చెయ్యవని మీ అభిప్రాయమా? అని మమ్మల్ని ప్రశ్నించవచ్చు. మా భావం అది కాదు. ఆ విషయం ఇక్కడ ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. ఎందుకంటే, ఆ విధంగా జిన్నులు చేస్తున్నాయని నమ్ముతున్నారు కనుక.

జిన్నులు గాక వేరే విషయాల వలన అటువంటి పరిస్థితి ఏర్పడుతుందా? లేదా? అనే విషయాన్ని ఇక్కడ చెప్పదలచుకున్నాము. సెల్‌ఫోన్ బాగా ఉపయోగించేవారిలో, అది తన దగ్గర లేకపోయినా, ఒకొక్కసారి రింగ్ వస్తున్నట్లు కొందరికి అనిపిస్తుంది. అది ఒక రకమైన భ్రమ.

ఒకవేళ మీది భ్రమ మాత్రమే అయితే, దాని వలన బాగా ఇబ్బందిగా ఉంటే సైక్రియాట్రిస్ట్ (మానసిక వైద్య నిపుణుడి) ద్వారా దానిని నయం చేసుకునే అవకాశం ఉంది. ఒకవేళ అది జిన్న్ చేసే పని అయితే, మీ ఇంటిలో ప్రతీరోజూ ఖుర్‌ఆన్‌ను పఠిస్తూ ఉండండి. అజ్‌కార్ ఉదయం, రాత్రి చదువుతూ ఉండండి. ఇది కష్టమైన పని కాదు.

రోజులో ఎంతో భాగం పేపర్ చదవడంలో, మరియు టి.వి. చూడటంలో గడుపుతారు. అదే విధంగా కాస్త సమయం మీరు ఖుర్‌ఆన్ గ్రంథం కూడా పఠించ గలరు. ఇది ఎంతమాత్రం కష్టమైన పని కాదు.

ఈ విధంగా పఠించడం వలన మీ తోటివారికి గాని సమాజానికి గాని ఎటువంటి ఇబ్బంది ఎంతమాత్రం కలుగదు. కాని మీకు కనిపించని వాటిలో దేని వల్లనైనా మీకు కీడు కలిగే అవకాశముంటే ఆ కీడు నుండి రక్షణ పొందుతారు, ఇన్షా అల్లాహ్!

ఇక్కడ ఓ ముఖ్యమైన విషయం చెప్పాలి.

ఆ విధంగా రోగిపై ఖుర్‌ఆన్ ఆయత్‌లు చదవడం వలన ఉపయోగం ఏదీ ఉండదని ఎవరైనా అనవచ్చు. ఆ విధంగా ఓ డాక్టర్ గారే మీతో స్వయంగా చెప్పవచ్చు. కాని ఇస్లామ్ వైద్యం చేయించు కోమంటుంది. డాక్టర్ దగ్గరికి వెళ్ళమని బోధిస్తుంది. దవా(మెడిసిన్)తో పాటు 'దుఆ' (అల్లాహ్‌ను వేడుకోవడం) యొక్క ప్రాముఖ్యతను కూడా తెలియజేసింది. కాబట్టి విమర్శకు ఎటువంటి అవకాశమూ లేదు.

ఒక రోగి ఆరోగ్యం బాగా క్షీణించిందని డాక్టర్ గారికి స్పష్టంగా తెలిసినా సరే, ఆయన ఆ రోగితో నిజం చెప్పకుండా, **"ఏం ఫర్వాలేదు, పెద్ద ప్రమాదమేమీ లేదు. ఈ మందులు వాడండి. సులభంగా తగ్గిపోతుంది."** అని చాలా ఆప్యాయంగా చెబుతారు. ఆ విధంగా చెబితే రోగం యొక్క తీవ్రత తగ్గిపోతుందా? అది సైంటిఫిక్‌గా సరియైనదేనా?

అవును. అది సరియైనదే! అది కూడా సైన్సే (విజ్ఞానమే!). అది మానసిక విజ్ఞానానికి సంబంధించినది. రోగికి డాక్టర్‌పై విశ్వాసం ఉంటుంది. ఆ మాటలు రోగికి ధైర్యాన్నిస్తాయి. అలా కాకుండా ఉన్నది ఉన్నట్లుగా చెబితే రోగి మరింత మానసికంగా కృంగిపోవడంతో వ్యాధి తీవ్రత మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఒకవేళ వ్యాధి తీవ్రత పెరగకపోయినా మరో కొత్త సమస్య ఏదైనా రావచ్చు.

ఇస్లామ్ ప్రకారం ఆచరించే ఏ ముస్లిమ్‌కైనా ఖుర్‌ఆన్‌పై పూర్తి విశ్వాసం ఉంటుంది. కాబట్టి ఆ ఖుర్‌ఆన్‌లోని కొంత భాగం అతనిపై చదివినప్పుడు అల్లాహ్ ఇష్టపడితే తనకు మేలు జరుగుతుందని రోగి అనుకోవడంలో కూడా జ్ఞానముంది. ఈ విధంగా చేయడం వలన రోగికి మేలే జరుగుతుందిగాని, కీడు జరిగే అవకాశం ఎంతమాత్రం లేదు.

సహీహ్ ముస్లిమ్‌లోని ఒక ఉల్లేఖనం (5745) ప్రకారం తెలిసింది ఏమిటంటే, అల్లాహ్ యొక్క సందేశహరులు(స)వారు ఉబయ్ బిన్ కా'బ్(రజి) దగ్గరకు డాక్టర్‌ని పంపారు.

సహీహ్ ముస్లిమ్ గ్రంథంలోని ఆయిషా(రజి)వారు ఉల్లేఖనం (5761) ద్వారా మరొక విషయం తెలుస్తుంది. అదేమిటంటే, **ముహమ్మద్(స)వారు అనారోగ్యంగా ఉన్నప్పుడు ఆయనకు ఔషధం ఇవ్వబడింది.**

అంటే ముహమ్మద్(స)వారు వైద్యం చేయించుకున్నారు మరియు ఇతరులకు వైద్యం చేయించారు. కాబట్టి మనం కూడా ఇలా చేయడం సున్నత్ (ప్రవక్తగారి సాంప్రదాయం) అవుతుంది.

ఆయిషా(రజి)వారి ఉల్లేఖనం. "మాలో ఎవరైనా జబ్బు పడితే అల్లాహ్ యొక్క సందేశహరులు(స) అతనిని తన చేత్తో తుడిచి తరువాత ఆయన(స) చెప్పేవారు :

أَذْهِبِ الْبَاسَ رَبَّ النَّاسِ، وَاشْفِ أَنْتَ الشَّافِي،
لَا شِفَاءَ إِلَّا شِفَاؤُكَ، شِفَاءً لَا يُغَادِرُ سَقَمًا

"అజ్హిబిల్ బాస రబ్బన్నాసి వష్ఫి 'అన్తష్షాఫీ లా షిఫాఅ ఇల్లా షిఫాఉక, షిఫాఅన్ లా యుగాదిరు సఖమ"

**"బాధను తొలగించండి ఓ మానవుల ప్రభూ! స్వస్థత నివ్వండి, స్వస్థతనిచ్చేవారు మీరే మరియు స్వస్థత లేదు, రోగం యొక్క ఆనవాలు మిగల్చని మీ స్వస్థత తప్ప"**

(సహీహ్ ముస్లిమ్, 5707)

ఒక ఉల్లేఖనం (5708)లో తన కుడిచేత్తో తుడిచినట్లు ఉంది.

పైన చెప్పిన విధంగా ముహమ్మద్(స)వారు రోగిపై 'రుఖ్యా' చదివేవారు.

మరో ఉల్లేఖనం (5712)లో ఉన్న రుఖ్యాను కూడా ఇక్కడ అందిస్తున్నాము.

ఆయిషా(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) ఈ రుఖ్యాను పఠించేవారు :

أَذْهِبِ الْبَاسَ، رَبَّ النَّاسِ، بِيَدِكَ الشِّفَاءُ،
لَا كَشِفَ لَهُ إِلَّا أَنْتَ

(అజ్హిబిల్ బాస రబ్బన్నాసి బియదిక ష్షిఫాఉ,
లా కాషిఫ లహు ఇల్లా అన్త)

**"బాధను తొలగించండి, ఓ మానవుల ప్రభూ! స్వస్థత మీ చేతిలోనే ఉంది, ఎవరూ దాని నుండి విముక్తి కలిగించలేరు మీరు తప్ప".**

ఆయిషా(రజి)వారి ఉల్లేఖనం. "తన కుటుంబంలో ఎవరైనా జబ్బు పడితే, అల్లాహ్ యొక్క సందేశహరులు(స) అతనిపై **అల్-ము'అవ్విదాత్** (ఖుర్'ఆన్ గ్రంథంలోని ఆఖరి 3 సూరహ్‌లు) పఠించి ఊదేవారు. చివరి వ్యాధితో ఆయన(స)వారు జబ్బు పడినప్పుడు నేను ఆయనపై ఊదడం ప్రారంభించాను మరియు ఆయన చేతితో ఆయనను తుడిచే దానిని, ఎందుకంటే అది నా చేతికంటే అనుగ్రహం పొందిన చేయి. (సహీహ్ ముస్లిమ్, 5714)

భార్యాభర్తలలో భర్త జబ్బుపడినప్పుడు భార్య మరియు భార్య జబ్బు పడినప్పుడు భర్త ఊది ఈ మూడు సూరహ్‌లు పఠించడం సున్నత్.

కాబట్టి ముహమ్మద్(స)వారి బోధనల ప్రకారం, ఆయనను ప్రేమించే వారెవరైనా సరే, 'దుఆ' చేస్తారు మరియు వారి వీలును బట్టి వైద్యాన్ని కూడా చేయించుకుంటారు. ఒకప్పుడు ఏ రోగమొచ్చినా దాదాపు ఒకే డాక్టర్ దగ్గరకి వెళ్ళవలసి వచ్చేది. ఇప్పుడు సౌకర్యం పెరిగింది. రోగాన్ని బట్టి దానికి సంబంధించిన వైద్య నిపుణుడు (స్పెషలిస్ట్) దగ్గరికి వెళ్ళే అవకాశం ఉంది.

మానసిక వైద్యం అనేది ఎప్పటి నుండో అందుబాటులో ఉంది. అది కొత్తదేమీ కాదు. ఈ వైద్యం చేసే డాక్టర్‌ని 'సైక్రియాట్రిస్ట్' అంటారు. అయితే వీరు ప్రతీ పట్టణంలోనూ అందుబాటులో లేకపోవచ్చు. ఈ వైద్యంలో కూడా ఎంతో అభివృద్ధి జరిగింది. ఎందరో రోగులు వీరి ద్వారా నయం చేయబడి మామూలుగా ఆరోగ్యంగా జీవిస్తున్నారు. ఈ వైద్యం గురించి ప్రజలను ఎడ్యుకేట్ చేయడానికి, ప్రతీ నెల కొన్ని వివరాలను వ్యాసం చివరిలో ఇన్షా అల్లాహ్ అందించాలని అనుకుంటున్నాము.

**భయంలో రెండవ రకం :** కల్పిత కథలు వినడం లేదా చదవడం వలన మనస్సులో కలిగే భయం. మన రాష్ట్రంలో 'అరుంధతి' 'చంద్రముఖి' వంటి సినిమాలు ఎంత పెద్దగా హిట్ అయ్యాయో, అంతటి భయాన్ని అవి ప్రేక్షకులలో పెంచాయి అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

ఆ సినిమాలలో గాని, ఆ కథలలోగాని ఉన్న సిట్యుయేషన్‌ని పోలిన పరిస్థితి మనకు ఏర్పడినప్పుడు, కొందరు సినిమాలోని సన్నివేశాలని మనస్సులో పెట్టుకుని, ఆ సినిమాలో జరిగిన విధంగా తమకు కూడా జరుగుతుందని లేదా జరగవచ్చని భయపడతారు.

ఇటువంటి భయానికి లోనవడానికి గల కారణం తౌహీద్ అంటే ఏమిటో వారికి తెలియక పోవడమే!

**జిన్నులకు అగోచర జ్ఞానం లేదు.**

మన మనస్సులలో ఏముందో వాటికి తెలియదు. క్రింది ఖుర్'ఆన్ వాక్యం చూడండి :

"మేము అతని (సులైమాన్)పై మృత్యువును విధించినప్పుడు, అతని చేతికర్రను తింటూ ఉన్న పురుగు తప్ప, మరెవ్వరూ! అతని మరణ విషయం, వారికి (జిన్నులకు) తెలుపలేదు. ఆ తరువాత అతను పడిపోగా **జిన్నులు తమకు అగోచర విషయాలు తెలిసి ఉంటే, తాము అవమానకరమైన ఈ బాధలో పడిఉండేవారం కాము కదా అని తెలుసుకున్నారు."** (ఖుర్'ఆన్ 34:14)

సాధారణంగా దెయ్యాలు, భూతాలపై అల్లిన కట్టు కథలకు ఎక్కువగా గురి అయ్యేది **స్త్రీలు మరియు పిల్లలే!** మీ ఇంటిలోని స్త్రీలకు మరియు

పిల్లలకు తౌహీద్ అంటే ఏమిటో వివరించండి. ఆయతల్ కుర్సీ, సూరహ్ అల్-ఫలఖ్ (ఖుల్ అవుజుబి రబ్బిల్ ఫలక్ ....), సూరహ్ అన్-నాస్ (ఖుల్ అవుజుబి రబ్బిన్నాస్....) మొదలైనవి మరియు చిన్నవైన ఇతర సూరహ్‌లు కూడా నేర్పించండి.

దెయ్యాలపై మనుష్యులలో భయాన్ని పెంచడంలో భూతవైద్యుల పాత్ర కూడా చాలా ఎక్కువగా ఉంటుంది. ఎన్నో కల్పిత కథల ద్వారా భయాన్ని పెంచి, తద్వారా తమ వ్యాపారాన్ని బాగా చేసుకుంటారు.

## ఎలక్ట్రీషియన్ స్విచ్ వేస్తేనే బల్బు వెలుగుతుందా?

మానసిక రోగిపై గాని, జిన్ను ఆవహించిందని భావించే వ్యక్తిపై గాని ఏయే ఖుర్‌ఆన్ ఆయత్‌లు పఠించాలో, వాటిని మీరే స్వయంగానూ సులభంగానూ చదవగలరు. అవి మీకు చదవడం వచ్చినా సరే, చదవకుండా ఎవరో గురువుగారిని పిలిపించి చదివించడం చేస్తుంటారు. అంటే మీరు చదివే ఖుర్‌ఆన్ ఆయత్‌లకు ప్రభావం ఉండదని పరోక్షంగా మీ మనస్సులోనే ఓ భావన ఉంది.

ఇంటిలో ఉండే ఎలక్ట్రిక్ బల్బులు మరియు ఫ్యాన్‌ల గురించి ఎలక్ట్రీషియన్లకు బాగా తెలుసు. మరియు వాటిలో సమస్యలొస్తే వారు రిపేర్లు కూడా చేస్తుంటారు. కాబట్టి మీ ఇంట్లో ఏదైనా బల్బు వెలగడానికి స్విచ్ వేయవలసి వస్తే ఎలక్ట్రీషియన్‌ని పిలిపిస్తారా? **మీరు స్విచ్ వేస్తే బల్బు వెలగదా?**

మీ కంటే ఎక్కువ ఈమాన్ ఉన్నవారు ఖుర్‌ఆన్ చదివితే, ఫలితం ఇంకా ఎక్కువ ఉండవచ్చు అని మీరు భావించవచ్చు. దానిని తప్పు పట్టడం లేదు. కాని ఎవరిలో ఎక్కువ ఈమాన్ ఉందో అల్లాహ్‌కే తెలుసు. మనకు తెలియదు.

**ప్రస్తుతం ఖుర్‌ఆన్ మరియు హదీస్‌ల ద్వారా భూతవైద్యం చేస్తామని ప్రకటిస్తూ, వేలకు వేలు వసూలు చేసేవారికి, మీ కంటే ఎక్కువ ఈమాన్ ఉందని ఎలా భావిస్తున్నారు? అల్లాహ్‌పై విశ్వాసం ఉన్నవారు, ఇస్లామ్ ప్రకారం ఆచరించేవారు దీనిని ఓ వ్యాపారంగా ఎలా చేసుకోగలరు?**

**భూతవైద్యులచేత కాకుండా మీరే స్వయంగా ఖుర్‌ఆన్ ఆయత్‌లను రోగిపై చదివితే, పఠించిన వారిపై దాడి జరుగుతుందని, చాలా ప్రమాదం జరుగుతుందని కొంతమంది భయపెడుతున్నారు. ఇటువంటి వాటిని నమ్మి, ఖుర్‌ఆన్ పఠించగలిగేవారు మరియు కొందరు హాఫిజ్‌లు కూడా వారే స్వయంగా చదవకుండా భూతవైద్యులను పిలిపిస్తున్నారు. ఆ విధంగా వారి భూతాల వ్యాపారం సాగుతుంది.**

ఒకవేళ మీకు చదవడం రాకపోతే మస్జిద్‌లో మీ ఇమామ్‌గారి దగ్గర నేర్చుకోండి. ఒకవేళ మీరు ఇంకనూ నేర్చుకునే స్థితిలోనే ఉంటే, ఖుర్‌ఆన్ ఆయత్‌లను పఠించడానికి డబ్బు తీసుకోకుండా పఠించే వ్యక్తి దగ్గరకు వెళ్ళండి.

## జిన్నులు ఏమి చేస్తాయి?

**విశ్వసించినవారు, అల్లాహ్ మార్గంలో పోరాడుతారు. మరియు సత్య తిరస్కారులు షైతాన్ మార్గంలో పోరాడుతారు. కావున మీరు షైతాన్ అనుచరులకు విరుద్ధంగా పోరాడండి.**

**నిస్సందేహంగా షైతాన్ యొక్క కుట్ర ఎల్లప్పుడూ బలహీనమైనదే!**

(ఖుర్‌ఆన్ 4:76)

పై ఖుర్‌ఆన్ ఆయత్ ద్వారా షైతాన్ పన్నే ప్రతీ కుట్ర ఎల్లప్పుడూ బలహీనమైనదేనని స్పష్టంగా తెలుస్తుంది. కాని **మనలో ఉండే భయం 'షైతాన్'ని బలమైన శక్తిగా భావించేలా చేస్తుంది.**

షైతాన్ ఎటువంటి కుట్రలు చేస్తాడు?

మనిషి కలతలు లేకుండా ప్రశాంతంగా బ్రతకాలనుకుంటాడు. మనిషికి శతృవు షైతాన్. మనిషికి షైతాన్ ఏ విధంగా శతృవయ్యాడో డిశంబర్'2010 సంచికలో బాలబాలికల ప్రత్యేక వ్యాసంలో వివరంగా చెప్పాము. **అల్లాహ్ మార్గంలో జీవించేవ్యక్తి ఎల్లప్పుడూ ప్రశాంతత కలిగి ఉండి సంతోషంగా ఉంటాడు.**

ఆ ప్రశాంతతను అతని నుండి దూరం చేయడానికి షైతాన్ ఎన్నో విధాలుగా ప్రయత్నిస్తాడు. ఎన్నో కుట్రలు చేస్తాడు. మనిషిని నిద్రలో ఉన్నప్పుడు కూడా వదలడు. అయితే నిద్రలో షైతాన్ నుండి అల్లాహ్ రక్షణ పొందడానికి ముహమ్మద్(స)వారు స్పష్టమైన విధానాన్ని తెలియజేశారు. ముహమ్మద్(స)వారు బోధించినట్లు ఆచరిస్తే, **షైతాన్ కుట్ర అతి సులభంగా భగ్నమై పోతుంది.**

షైతాన్ మానవులపై కుట్రలను పన్నడం ఆపడు. ప్రయత్నం చేస్తూనే ఉంటాడు. ఎప్పుడో ఒకసారి ముస్లిమ్ దొరకకపోతాడా అని ప్రయత్నిస్తూనే ఉంటాడు. ఉమర్(రజి)వారు ఓ వీధి గుండా వస్తుండటం చూసి, మరో వీధి గుండా షైతాన్ పోయేవాడు. అంటే ఉమర్(రజి)వారిపై వాడి కుట్ర పనిచేయదని వాడికి పూర్తిగా నమ్మకం ఏర్పడింది. కారణం : ఉమర్(రజి)వారికి ఉండే తఖ్వా (అల్లాహ్ పట్ల ఉండే భీతి) ఆ స్థాయిలో ఉండేది. అల్లాహ్ శిక్షల గురించి వింటేనే ఆయన సొమ్మసిల్లి పడిపోయే వారు. ఒకసారైతే అలా విన్నప్పుడు జ్వరం వచ్చింది. అది నెలరోజుల పాటు ఉంది. అంతటి తఖ్వా ఆయనది. **అల్లాహ్‌పై మనకు ఉండే విశ్వాసం** షైతాన్‌ని భయపెడుతుంది.

**షైతాన్ మిమ్మల్ని భయపెట్టడం కాదు,**
**మీ తఖ్వాతో ఆ షైతాన్‌నే భయపెట్టండి.**

షైతాన్ పన్నే కుట్రలలో ఒక కుట్ర గురించి ఇక్కడ తెలుసుకుందాం.

## 1. చెడు కలల ద్వారా మానవులలో భయాన్ని కలిగించడం

కొందరికి భయంకరమైన కలలు (పీడ కలలు) వస్తాయి. ఆ కలల వలన తీవ్ర భయభ్రాంతులకు లోనయ్యి నిద్ర నుండి సడన్‌గా లేస్తారు. గుండె వేగంగా కొట్టుకుంటుంది. కాస్సేపు తీవ్ర మానసిక ఒత్తిడికి

లోనవుతారు. ఆ సమయంలో ప్రత్యక్షంగానూ భౌతికంగానూ వారిపై ఎవరూ ఎటువంటి దాడి చేయలేదు. వారికి ఏ విధమైన గాయమూ చేయలేదు. వారి ముందుకు వచ్చి ఎవ్వరూ వారిని భయపెట్టలేదు. ఆ సమయంలో వారు నిద్రలో విశ్రాంతి తీసుకుంటున్నారు.

అయినాసరే ఏదీ జరగకపోయినా ఏదో జరిగిపోయినట్లు తీవ్ర భయానికి లోనయ్యారు.

ఈ విధంగా రోజూ జరుగుతూ ఉంటే, మానసికంగా మనిషి బలహీన మౌతాడు. మనిషిని ఆ విధంగా బలహీనంగా చేసి, సన్మార్గం నుండి తప్పించి షైతాన్ ఆనందిస్తాడు. మనిషిని బలహీన పరచడం కంటే షైతాన్‌కి కావలసింది ఏముంది?

షైతాన్ యొక్క ఈ కుట్ర నుండి సులభంగా తప్పించుకొని, షైతాన్‌నే గాయపరచవచ్చు. అది తెలుసుకోవడానికి క్రింది హదీస్‌లు చదవండి.

అబూ సలమా(రజి) ఉల్లేఖనం. నాకు భయం కలిగించే కలలు వస్తుండేవి. కాని నేను నాపై దుప్పటి కప్పుకునేవాన్ని కాదు అబూ ఖతాదాని కలిసి ఆయనకు దాని గురించి చెప్పేవరకూ. ఆయన చెప్పారు: ''నేను అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పగా విన్నాను : ''మంచి కలలు అల్లాహ్ నుండి వస్తాయి మరియు చెడు కలలు షైతాన్ నుండి వస్తాయి. మీలో ఎవరైనా అతనికి ఇష్టంకాని కల వస్తే, అతడు తన ఎడమవైపు మూడుసార్లు (పొడిగా) ఉమ్మాలి (అంటే నోటిలో నుండి ఉమ్మి నేలపై పడే విధంగా కాకుండా) మరియు దాని కీడు నుండి అల్లాహ్ రక్షణ వేడుకోవాలి. **అది అతనికి ఎన్నటికీ కీడు చేయదు.** (సహీహ్ ముస్లిమ్, 5897, పుస్తకం 42, సంపుటి 6)

ఈ ఉల్లేఖనం తరువాత దీనికి కొనసాగింపుగా మరికొన్ని ఉల్లేఖనాలు ఇదే విషయానికి సంబంధించినవి ఉన్నాయి.

ఒక ఉల్లేఖనం ప్రకారం (నెం. 5900), **అది ఎన్నటికీ హాని చేయదు.** పర్వతం కంటే ఎక్కువ బరువైనది తనపై ఉన్నంతగా నాకు కలలు వస్తుండేవి. కాని హదీస్ విన్న తరువాత నేను వాటిని పట్టించుకోలేదు.

మరో ఉల్లేఖనంలో (5902) 'మరియు అతడు దాని (కల) గురించి ఎవరికీ చెప్పకూడదు. అతనికి మంచి కల వస్తే, సంతోషించనివ్వండి కాని అతనికి ప్రియమైన వారికి తప్ప ఇంకెవ్వరికీ చెప్పకూడదు''

ఉల్లేఖనం (5903)లో ఇలా ఉంది : 'కాని అతనిని దాని గురించి ఎవ్వరికీ చెప్పనివ్వకండి. అది అతనికి కీడు చేయకుండా ఉండేందుకు'.

(5904) 'జాబిర్(రజి) ఉల్లేఖనం. అతడు పడుకుని ఉన్నవైపు నుండి తిరగమనండి (అంటే ఒకవైపు పడుకున్నప్పుడు చెడు కలవచ్చి, మూడుసార్లు ఉమ్మిన తరువాత మరలా ఆ వైపునే పడుకోకుండా మరో వైపు తిరిగి పడుకోనివ్వండి.

5905: (అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనంలో) ''**కలలు మూడు రకాలు.** మంచి కల అనేది అల్లాహ్ నుండి శుభవార్త. షైతాన్ నుండి వచ్చే కల అది ఆందోళనకు కారణమౌతుంది. మరియు (మరొక) కల మనిషి తన గురించి ఏది ఆలోచిస్తున్నాడో అది వస్తుంది. మీలో ఎవరైనా కలలో తనకు ఇష్టపడనిది చూస్తే, లేచి సలాత్ చేయండి మరియు ప్రజలకు దాని గురించి చెప్పకండి.''

5920 : అబూహురైరా ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పగా విన్నాను : ఎవరైనా నన్ను కలలో చూస్తే మెళకువ వచ్చినప్పుడు నన్ను చూస్తాడు (లేదా) మెళుకువగా ఉన్నప్పుడు నన్ను చూసినట్లుగా అది ఉంటుంది. షైతాన్ నా పోలికతో కనిపించలేడు.

5921 : అబూ ఖతాదా(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు చెప్పారు : ఎవరైతే నన్ను చూసారో సత్యాన్ని చూశారు.

జాబిర్(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స)వారి వద్దకు ఓ ఎడారివాసి వచ్చి చెప్పాడు : ''నేను కలగన్నాను నా తల తెగిపడింది మరియు నేను దానిని వెంబడిస్తున్నాను. ప్రవక్త(స)వారు అతనిని మందలించి చెప్పారు : '**మాట్లాడవద్దు షైతాన్ నీతో ఎలా ఆడుకున్నాడో నీ నిద్రలో**'' (సహీహ్ ముస్లిమ్, 5925, అధ్యా 2, పుస్తకం 42, సంపుటి 6)

పగలంతా కష్టపడి పనిచేసి, విశ్రాంతి కోసం రాత్రివేళ పడుకుంటారు. ఆ నిద్రలో ఎటువంటి పీడకలలూ రాకపోతే ఉదయం ప్రశాంతంగా నిద్ర నుండి లేవడం జరుగుతుంది. ముందుగానే అల్లాహుతాలా చెప్పిన విషయాలను తెలుసుకున్నాము. మనకు జరిగే కీడు మరియు మేలు గురించి అల్లాహ్‌కే తెలుస్తుందని.

షైతాన్ ద్వారా జరిగే ఈ కీడు నుండి రక్షణ కోసం ప్రవక్త(స)వారు ఎన్నో ముఖ్య విషయాలను బోధించారు. చెడుకల వస్తే లేచి ఎడమవైపున మూడుసార్లు ఉమ్మాలి. 'అవుజుబిల్లాహి మినష్ షైతానిర్రజీం' అని చెబుతూ అల్లాహ్ రక్షణను వేడుకోవాలి. సలాత్ చేస్తే మంచిది.

ఆ కల కీడు కలిగించేది కావచ్చు. ఆ కీడు ఎన్నటికీ జరగకుండా ఉండేందుకు దాని గురించి ఎవ్వరికీ చెప్పకూడదు. మనకు బాగా సన్నిహితుల దగ్గర కూడా. **షైతాన్ పేరు ప్రస్తావించ కూడదు.** షైతాన్ నిద్రలో మనతో ఆడుకుంటాడు. ఆ విషయాలను మనం ఎవ్వరికీ చెప్పకూడదు. ఒకవైపు పడుకుని ఉండగా కలవచ్చి ఉంటే, తిరిగి పడుకునేటప్పుడు అటువైపు కాకుండా రెండవ వైపు తిరిగి పడుకోవాలి. ఆందోళనకు గురి చేయడానికే షైతాన్ నుండి మనకు అటువంటి కల వస్తుంది.

షైతాన్ మనకు ఎన్నో రూపాలలో కనిపించవచ్చు. కాని ముహమ్మద్(స)వారి రూపంలో షైతాన్ కనిపించలేడు.

చెడు కలలకు భయపడి పడుకోవడానికి కొందరు జంకుతారు. పడుకోక పోతే విశ్రాంతి ఉండక నీరసం వస్తుంది. అబూ సలమా(రజి) గారు ఏమన్నారో చూడండి : "**పర్వతం కంటే ఎక్కువ బరువైనది తనపై ఉన్నంతగా నాకు కలలు వస్తుండేవి. కాని హదీస్ విన్న తరువాత వాటిని నేను పట్టించుకోలేదు**".

అంటే ఆ కలలు ఆయనపై ప్రభావం చూపించలేక పోయాయి. కాబట్టి ఎవరికైనా చెడుకలలు వస్తే ముహమ్మద్(స)వారు చెప్పినట్లు చెయ్యండి. ఏ ఆందోళనా లేకుండా ప్రశాంతంగా పడుకో గలుగుతారు.

**మూడుసార్లు మీ ఎడమవైపు ఉమ్మడానికి గాని, సలాత్ చేయడానికి గాని మీరు ఏమీ ఖర్చు పెట్టనవసరం లేదు కదా! ఎవరో గురువుగారిని పిలిపించ నవసరం లేదు కదా! నయాపైసా సైతం ఖర్చు పెట్టనవసరం లేదు. మీ తోటివారికి ఆ కల గురించి చెప్పనవసరం కూడా లేదు.**

ఇంతవరకూ చెప్పుకున్న విషయాలను బట్టి ఒక విషయం తెలుసుకోవాలి. ప్రజలను భయభ్రాంతులను చేసే కల్పిత కథలు గాని, కలలు గాని చెప్పి వారిలో ఆందోళన కలిగించకూడదు. ఈ విధంగా అందరూ జాగ్రత్తలు తీసుకుంటే, **ప్రజలలో ఉండే భయాలు, మూఢనమ్మకాలు తగ్గిపోతాయి, ఇన్షా అల్లాహ్!**

కీడు అనేది మానసికంగా గాని, శారీరకంగాగాని కావచ్చు. ఏదైనా గాయమైతేనే కీడు కాదు. మానసిక ప్రశాంతత కోల్పోవడం మన మనస్సుకు జరిగే కీడు. కల్పిత కథలను, పీడకలలను ప్రజలలో వ్యాపింప జేయకండి. భూతాల సినిమాలను ప్రోత్సహించకండి.

**ధైర్యాన్ని పెంచుకోవాలిగాని, ఇటువంటి విషయాలలో భయాన్ని పెంచుకోవడం వలన అంతా నష్టమే!**

## 2. అన్నిటికంటే పెద్ద ఉపద్రవం - భార్యభర్తలను విడదీయడం

చెడు కలల ద్వారా మనుష్యులను ఆందోళనకు గురి చేసి బలహీన పడేలా చేయడం గురించి ఇప్పటి వరకూ చెప్పుకున్నాం. ఒకవేళ అది షైతాన్‌కు సాధ్యం కాకపోతే అంటే ముస్లిమ్‌లు ప్రవక్త(స)వారు బోధించి నట్లు చెడుకలలు వచ్చినప్పుడు జాగ్రత్తలు తీసుకుంటే, మరో విధంగా ఆందోళనకు గురిచేయడానికి ప్రయత్నిస్తాడు.

చెడుకలల ద్వారా ఆందోళనకు గురికాని వారి మీదే కాకుండా అందరిపైనా ఈ కుట్ర అమలు చేస్తాడు. **ఇది చాలా ప్రమాదకరమైన కుట్ర.** దీని వలన కుటుంబం, తరువాత సమాజం నాశనమౌతుంది. ప్రజలు సన్మార్గం తప్పే అవకాశాలు ఎక్కువ ఉంటాయి. షైతాన్ యొక్క ధ్యేయం కూడా అదే. ఈ విషయంలో కూడా అల్లాహుతాలా ఖుర్‌ఆన్ ద్వారా మరియు తన సందేశహరుని బోధనల ద్వారా రక్షణ మార్గాన్ని ముందుగానే తెలియజేశారు. ఈ మార్గం కూడా ప్రతీ ముస్లిమ్ సులభంగా ఆచరించదగినదే.

భార్యభర్తల మధ్య అనురాగబంధం ఉంటుంది. సమాజంలో ఇద్దరో, ముగ్గురో లేక ఎక్కువ మంది కలిసి భాగస్వాములుగా వ్యాపారం చేసుకుంటారు. వారికి పరస్పరం ఒకరిపై మరొకరికి నమ్మకం ఉండాలి. ఈ వ్యాపార భాగస్వాములు మరియు జీవితభాగస్వాముల మధ్య షైతాన్ కలతలు రేకెత్తిస్తాడు. చిన్న చిన్న కారణాల వల్లనే వారి మధ్య గొడవలు వస్తాయి. ఈ విధంగా గొడవలు సృష్టించడానికి షైతాన్ భౌతికంగా మన మధ్యలోకి వచ్చి ఇదంతా చేయడు. చేయిస్తాడు. ఎలా అంటే, మనలో అటువంటి ఆలోచనలు కలిగేలా చేయడమే! మన ఆలోచనలను ప్రభావితం చేస్తాడు.

అందువల్లనే ప్రవక్త(స)వారు ముస్లిము లందరినీ కలిసి సలాత్ చేయమన్నారు. సలాత్ సమయంలో భుజం భుజం కలిసేలా ముస్లిముల మధ్య ఎడం లేకుండా దగ్గరగా ఉండి చేయమన్నారు. సలాత్ సమయంలో వారి మధ్య ఖాళీ ఉంటే, ఆ ఖాళీలోకి షైతాన్ చొరబడతాడు. ప్రజలంతా కలిసి ఉండాలి. మన మధ్యలోకి షైతాన్ రాకుండా ఉండాలి.

జాబిర్(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెప్పగా విన్నాను : "ఇబ్లీస్ యొక్క ఆసనం సముద్రంపై ఉంది మరియు అతడు ప్రజలను ప్రలోభ పెట్టడానికి తన సమూహాన్ని పంపుతాడు మరియు అతని దృష్టిలో వారిలో గొప్పవాడెవడంటే బాగా ఉపద్రవం కలగజేసినవాడే. (సహీహ్ ముస్లిమ్, 7105, సంపుటి 7)

జాబిర్(రజి)వారిదే మరో ఉల్లేఖనం ఉంది. అల్లాహ్ యొక్క సందేశ హరులు(స) చెప్పారు : ఇబ్లీస్ తన ఆసనాన్ని నీటిపై ఉంచుతాడు, తరువాత అతని సమూహాన్ని బయటికి పంపుతాడు మరియు అతడికి హోదాలో బాగా సన్నిహితంగా ఉండేవాడు అతడే (ప్రజల మధ్య) చాలా ఎక్కువ ఉపద్రవాన్ని కలుగజేసినవాడు. వారిలో ఒకడు వచ్చి చెబుతాడు : నేను ఫలానా ఫలానా పనిచేశాను. తరువాత వారిలో ఒకడు వచ్చి చెబుతాడు : **నేను అతనిని (భర్తని) వదలలేదు అతడు తన భార్య నుండి విడిపోయేవరకూ.** అప్పుడు అతడు (ఇబ్లీస్) వానిని తనకు దగ్గరగా తీసుకుని చెబుతాడు : "నీవెంత మంచివాడివో". 'అమాష్ చెప్పారు నేను అనుకుంటున్నాను, "ఆయన(స) చెప్పారు : మరియు అతడు (ఇబ్లీస్) వానిని కౌగలించుకుంటాడు". (7106, ముస్లిమ్, సంపుటి 7)

పై హదీస్‌ని బట్టి స్పష్టంగా తెలిసేది ఏమిటంటే షైతాన్ తన అనుచరుల ద్వారా చేయించే అతి పెద్ద ఉపద్రవం "**భార్యాభర్తలను విడదీయడం**". కాబట్టి షైతాన్ ద్వారా జరిగే అతిపెద్ద కీడు ఇదే. మరి ఈ విషయాన్ని షైతాన్ ప్రభావంగా ఎందుకు పట్టించుకోరు? భార్యాభర్తల మధ్య స్పర్థలను తగ్గించడానికి ఖుర్‌ఆన్ మరియు హదీస్‌ల ద్వారా వారికి మంచి కౌన్సిలింగ్ ఇస్తే, **ఇన్షా అల్లాహ్ ఎన్నో జంటలు విడిపోకుండా కలిసి బ్రతికే అవకాశం ఉంది.**

ఒక అమ్మాయికి మరియు ఒక అబ్బాయికి పెళ్ళి చేయాలను కున్నప్పుడు ఇరువైపుల వారు ఇస్లామ్‌కి విరుద్ధమైన కట్నాల గురించి మాట్లాడు కుంటారు. ప్రిస్టేజీ కోసం అలంకరణలకు, విందులకు

ప్రాధాన్యత నిస్తారు. అంతేగాని భార్యపై భర్తకు ఎటువంటి హక్కులు ఉన్నాయో ఆ హక్కుల గురించి పెళ్ళి కూతురుకి మరియు భర్తపై భార్యకు ఎటువంటి హక్కులు ఉన్నాయో ఆ హక్కుల గురించి పెళ్ళి కుమారునికి చెబుతున్నారా?

ఈ హక్కుల గురించి పెళ్లి చేసుకోబోయే వారికి మరియు పెళ్లి చేసుకున్నవారికి తెలిస్తే, ఇన్షా అల్లాహ్ ఎన్నో కుటుంబాలు గొడవలు లేకుండా జీవించగలుగుతాయి. ఇన్షా అల్లాహ్! తెగతెంపులు చేసుకునేటంత పరిస్థితి కాదు.

భార్యభర్తల మధ్యకి షైతాన్ వచ్చి ఏదో మంత్రం వేసి విడదీయడం జరగదు. భౌతికంగా షైతాన్ ఏమీ చేయడు. వారిద్దరి మధ్య జరిగే పట్టించు కోనవసరం లేని ప్రతీ చిన్న విషయాన్ని పెద్దదిగా భావించేలా వారి మనస్సులో ఆలోచనలు రేకెత్తాస్తాడు. అటువంటి ఆలోచనలు వస్తూ ఉంటే **'అవూజుబిల్లాహి మినష్ షైతానిర్రజీమ్'** అని చెప్పి అల్లాహ్‌కు దుఆ చేసుకుని, అల్లాహ్ సహాయాన్ని అర్థించాలి.

ఇస్లామ్‌లో ఓ జంట విడాకులు తీసుకోవాలంటే మూడు తలాఖ్‌లు చెప్పవలసి ఉంది. ప్రతీ రెండు తలాఖ్‌ల మధ్య ఒక నెల వ్యవధి ఉంది. అంతేకాకుండా తొలి తలాఖ్ చెప్పడానికి ముందు చాలా వ్యవహారమే ఉంది. అందువలన చిన్న చిన్న తగాదాలు వస్తే, ఆ వ్యవహారం మూలానా భార్యభర్తల గొడవులు సమసిపోతాయి. తొలి తలాఖ్ వరకూ వచ్చే అవకాశమే ఉండదు. **భార్యాభర్తల మధ్య అనురాగ బంధం ఉంటుంది.** ఇద్దరి మధ్య ఏదైనా తేడా వస్తే, కాస్త వ్యవధికే వారు దూరంగా ఉండలేని పరిస్థితి ఏర్పడుతుంది.

ఈ వ్యవహారంలో ఇస్లామ్ భార్యాభర్తలిద్దరికీ స్వేచ్ఛనిచ్చింది. అయితే సైకలాజికల్‌గా వారి మధ్య దూరం తగ్గిపోయేలా, మరలా వారి బంధం గట్టిపడేలా అల్లాహుతాలా 3 తలాఖ్‌ల వ్యవస్థ ద్వారా మంచి ఏర్పాటు చేశారు. ధర్మపరాయణులైన భార్యాభర్తల మధ్య కూడా చిన్న చిన్న గొడవలు రావడం సహజం. ఆ మాత్రం దానికే వెంటనే విడిపోతే సమాజం అల్లకల్లోలమై పోతుంది.

ఒక విశ్వాసి మరో విశ్వాసితో మూడు రోజులకు మించి మాట్లాడకుండా ఉండకూడదని ప్రవక్త(స)వారి బోధనల ద్వారా తెలుస్తుంది. కాబట్టి విశ్వాసులైన భార్యాభర్తలు 3 రోజలకి మించి మాట్లాడుకోకుండా మౌనంగా ఉండకూడదు. ఈ మౌనానికి 3 రోజుల పరిమితి లేకపోతే వారి మధ్య దూరం పెరిగిపోయి ఉండేది. **మనిషి యొక్క సైకాలజీ గురించి మనిషిని సృష్టించిన అల్లాహ్‌కే బాగా తెలుసు.** కాబట్టి ఏమాత్రం కఠినం కాని ఇస్లామీయ ఆచరణ ప్రకారం జీవిస్తే షైతాన్ ప్రభావం ఉండదు. షైతాన్ అవమానానికి గురౌతాడు.

ఈ ఆచరణ కోసం కూడా మీరు నయాపైసా ఖర్చు చేయ నవసరం లేదు.

ఈ వ్యవహారానికి సంబంధించి ఎన్నో విషయాలను చాలా వివరంగా **'ముస్లిమ్ మహిళ'** అనే కొత్త సీరియల్‌లో అందిస్తాము, ఇన్షా అల్లాహ్. 'ముస్లిమ్ మహిళ' ఈ సంచిక నుండే మొదలైంది.

### జిన్నులు ఎలా ఉంటాయి?

కథలలోనూ మరియు సినిమాలలో వర్ణించినట్లు జిన్నులన్నీ వికృతంగా ఉండవు మరియు నల్లగానూ ఉండవు. జిన్నులలో కొన్ని మానవుల కంటే ఎక్కువ ధర్మపరాయణతను కలిగి ఉంటాయి. అంతేకాకుండా ఇతరులను అల్లాహ్ మార్గంవైపు పిలుస్తాయి. ఈ విషయం ఖుర్'ఆన్‌లో ప్రస్తావించబడింది.

ముహమ్మద్(స)వారి నోటి నుండి సుమధురమైన ఖుర్'ఆన్ పఠనాన్ని జిన్నులు విని వెనక్కి వెళ్ళాయి మరియు తమ వారిని హెచ్చరించాయి.

క్రింది 3 ఆయత్‌లు ఆ విషయాన్ని తెలియజేస్తున్నాయి.

**(ఓ ప్రవక్తా!) ఇలా అను : "నాకు ఈ విధంగా దివ్య సందేశం పంపబడింది. నిశ్చయంగా ఒక జిన్నాతుల సమూహం, ఈ (ఖుర్'ఆన్‌ను) విని, తమ జాతివారితో ఇలా అన్నారు : 'వాస్తవానికి మేము ఒక అద్భుతమైన పఠనం (ఖుర్'ఆన్‌ను) విన్నాము! అది సరైన మార్గం వైపునకు మార్గదర్శకత్వం చేస్తుంది. కావున మేము దానిని విశ్వసించాము. మరియు మేము మా ప్రభువుకు ఎవ్వడిని కూడా భాగస్వామిగా సాటి కల్పించలేము." (ఖుర్'ఆన్ 72:1-2)**

**మరియు (ఓ ముహమ్మద్!) జిన్నాతుల ఒక సమూహాన్ని మేము - ఖుర్'ఆన్‌ను వినటానికి - నీ వైపునకు మొగ్గునట్లు చేసినపుడు, వారు అక్కడ చేరిన తరువాత పరస్పరం ఇలా మాట్లాడుకున్నారు : "నిశ్శబ్దంగా వినండి!" దాని (పఠనం) ముగిసిన తరువాత, వారు హెచ్చరిక చేసేవారిగా, తమ జాతివారి వైపునకు మరలిపోయారు. (ఖుర్'ఆన్ 46:29)**

జిన్నులు తమ జాతివారితో ఏమి చెప్పారో క్రింది 3 ఖుర్'ఆన్ ఆయత్‌ల ద్వారా తెలుస్తుంది.

**వారు (జిన్నాతులు) ఇలా అన్నారు : "ఓ మా జాతి వారలారా! వాస్తవంగా మేము మూసా తరువాత అవతరింప జేయబడిన ఒక గ్రంథాన్ని విన్నాము. అది దానికి పూర్వం వచ్చిన దానిని ధృవీకరిస్తుంది. సత్యం వైపునకు మరియు ఋజుమార్గం (ఇస్లామ్)వైపునకు మార్గదర్శకత్వం చేస్తుంది.**

**మా జాతి వారలారా! అల్లాహ్ వైపునకు పిలిచేవానిని అనుసరించండి. మరియు ఆయన(అల్లాహ్)ను విశ్వసించండి. ఆయన మీ పాపాలను క్షమిస్తాడు మరియు మిమ్మల్ని బాధాకరమైన శిక్ష నుండి కాపాడుతాడు. మరియు అల్లాహ్ వైపునకు పిలిచే వానిని అనుసరించనివాడు భూమిలో (అల్లాహ్ నుండి) తప్పించుకోలేడు. మరియు అతడికి, ఆయన తప్ప మరొక సంరక్షకుడు లేడు. అలాంటివారు స్పష్టంగా మార్గభ్రష్టత్వంలో పడిఉన్నట్లే!" (ఖుర్'ఆన్ 46:30-32)**

**కాబట్టి జిన్నులలో కూడా మంచివారు, విశ్వాసులూ ఉంటారు.** వారి వలన మనకు నష్టం జరగదు. కనిపించకుండా ఉన్నవి ఏవో చేస్తాయని **భయమెందుకు?** సృష్టికర్తయైన అల్లాహ్ చెప్పినట్లు ఆచరిస్తే ఏ భయమూ లేదు.

కేవలం మెడలో ఉన్న బంగారం కోసం, ఆడవాళ్ళను చంపేసే దొంగలు మన సమాజంలో ఉన్నారు. వైష్ణవి వంటి అమ్మాయిని కుటుంబ కలహాల విషయంలో డబ్బు కోసం కొలిమిలో వేసి కాల్చివేసే కిరాతకులైన మనుష్యులను మన రాష్ట్రంలో చూశాము.

కాబట్టి కనిపించని వాటి గురించి విపరీతంగా భయాందోళనలు పెంచుకుని, మనశ్శాంతిని దూరం చేసుకుని భూతవైద్యుల చుట్టూ తిరిగి నష్టపోవద్దని కోరుతున్నాము.

ప్రతీ మనిషితోపాటు జిన్ను ఉంటాడా?

ఈ విషయంలో ముహమ్మద్(స)వారు చెప్పిన విషయాలను **ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో అందిస్తాము.**

## ఆయత్ అల్-కుర్సీ

అబూహురైరా(రజి) ఉల్లేఖనం. రమదాన్ సదఖాత్‌కు కాపలాగా నన్ను అల్లాహ్ యొక్క సందేశహరులు నియమించారు. ఒకడు వచ్చి చేతుల నిండుగా ఆహారాన్ని (దొంగతనంగా సదఖా నుండి) తీసుకోవడం మొదలుపెట్టాడు. నేను అతనిని పట్టుకుని చెప్పాను, "అల్లాహ్ సాక్షి! నేను నిన్ను అల్లాహ్ యొక్క సందేశహరుని(స) దగ్గరకు తీసుకు వెళతాను'. అతనన్నాడు, "నేను అవసరంలో ఉన్నవాణ్ణి, మరియు నాపై చాలామంది ఆధారపడ్డారు మరియు నేను చాలా అవసరంలో ఉన్నాను." నేను అతనిని వదిలేశాను, మరియు ఉదయం అల్లాహ్ యొక్క సందేశహరులు(స) నన్ను అడిగారు, "నిన్న నీ ఖైదీ ఏం చేశాడు?". "ఓ అల్లాహ్ యొక్క సందేశహరుడా! ఆ వ్యక్తి బాగా అవసరంలో ఉన్నానని మరియు చాలా మంది అతనిపై ఆధారపడ్డారని ఫిర్యాదు చేశాడు. నేను అతనిపై జాలిపడి వెళ్ళిపోనిచ్చాను". అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు, "నిశ్చయంగా అతడు అబద్ధం చెప్పాడు మరియు అతడు మరలా వస్తాడు". నాకు నమ్మకముంది అతడు మరలా కనిపిస్తాడని, (ఎందుకంటే) అల్లాహ్ యొక్క సందేశహరులు(స) అతడు మరలా వస్తాడని చెప్పారు కాబట్టి. నేను అతని కొరకు కాపలాగా నిరీక్షిస్తున్నాను. అతడు (కనిపించి) చేతుల నిండుగా ఆహారాన్ని తీసుకుంటూ దొంగతనం మొదలెట్టినప్పుడు, నేను అతనిని మరలా పట్టుకుని చెప్పాను, "నేను ఖచ్చితంగా  నిన్ను అల్లాహ్ యొక్క సందేశహరులు(స) వారి వద్దకు తీసుకు వెళతాను". అతడు చెప్పాడు, "నన్ను వదిలెయ్యి, నేను అవసరంలో ఉన్నాను మరియు నాపై చాలామంది ఆధారపడ్డారు. నేను వాగ్దానం చేస్తున్నాను మరోసారి నేను రాను". నేను అతనిపై జాలిపడి అతనిని వెళ్ళి పోనిచ్చాను. ఉదయం అల్లాహ్ యొక్క సందేశహరులు(స) నన్ను అడిగారు, "నీ ఖైదీ ఏమి చేశాడు?" నేను సమాధాన మిచ్చాను, "ఓ అల్లాహ్ యొక్క సందేశహరుడా(స)! అతడు బాగా అవసరంలో ఉన్నాడని మరియు చాలామంది ఆధారపడిన వారున్నారని ఫిర్యాదు చేశాడు. కాబట్టి నేను అతనిపై జాలిపడి స్వేచ్ఛగా అతనిని వదిలేశాను." అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు, "నిశ్చయంగా అతడు అబద్ధం చెప్పాడు మరియు అతడు మరలా వస్తాడు". నేను అతని కొరకు జాగ్రత్తగా మూడవసారి నిరీక్షిస్తున్నాను మరియు అతడు (వచ్చి) చేతుల నిండుగా ఆహారాన్ని దొంగిలించడం మొదలు పెట్టగానే, నేను అతనిని పట్టుకుని చెప్పాను, "నేను నిన్ను తప్పనిసరిగా అల్లాహ్ యొక్క సందేశహరుడు(స) వద్దకు తీసుకు వెళతాను, తిరిగి రానని వాగ్దానం చేయడం ఇది మూడవసారి, అయినప్పటికీ నీ వాగ్దానాన్ని భంగపరచి వచ్చావు". అతడు చెప్పాడు, "నేను నీకు కొన్ని మాటలు నేర్పుతాను వాటితో అల్లాహ్ నీకు మేలు చేస్తారు". నేను అడిగాను, "అవి ఏమిటి?" అతడు సమాధాన మిచ్చాడు, "నీవు నిద్రపోవడానికి వెళ్ళినప్పుడల్లా, ఆయత్ అల్-కుర్సీ పఠించు - 'అల్లాహు లా ఇలాహ ఇల్లా హువల్ హయ్యుల్-ఖయ్యూమ్' మొత్తం ఆయత్ పూర్తి చేసేవరకూ. అల్లాహ్ నీ కొరకు నీతోపాటు ఉండేలా ఓ రక్షకుడిని నియమిస్తాడు మరియు ఉదయం వరకూ ఏ షైతాన్ నీ దగ్గరకు రాడు". కాబట్టి నేను అతడిని వదిలేశాను. ఉదయం అల్లాహ్ యొక్క సందేశహరులు(స) అడిగారు, "నీ ఖైదీ నిన్న ఏమి చేశాడు?" నేను సమాధానమిచ్చాను, "అతడు ప్రకటించాడు అతడు నాకు కొన్ని మాటలు నేర్పుతానని, వాటితో అల్లాహ్ నాకు మేలు చేస్తాడని, కాబట్టి నేను అతనిని పోనిచ్చాను".

అల్లాహ్ యొక్క సందేశహరులు(స) అడిగారు, "అవి ఏమిటి?" నేను సమాధానమిచ్చాను, "అతడు నాకు చెప్పాడు, నీవు పడుకోవడానికి వెళ్ళినప్పుడల్లా, ఆయత్ అల్-కుర్సీ మొదటి నుండి చివరి వరకూ పఠించు. అల్లాహు లా ఇలాహ ఇలాహ ఇల్లా హువల్ హయ్యుల్ ఖయ్యూమ్-" అతడు ఇంకనూ నాతో చెప్పాడు, "అల్లాహ్ నీతోపాటు ఉండే ఓ రక్షకుడిని నీ కొరకు నియమిస్తాడు మరియు ఉదయం వరకూ ఏ షైతాన్ నీ దగ్గరకు రాడు".

ప్రవక్త(స)వారు చెప్పారు, "అతడు నిజంగా సత్యమే చెప్పాడు, అతడు అబద్ధాలకోరు అయినప్పటికీ. ఈ మూడు రాత్రులు నీవు ఎవనితో మాట్లాడుతున్నావో తెలుసా, ఓ అబూహురైరా?". అబూహురైరా(రజి) చెప్పారు, "లేదు". ఆయన(స) చెప్పారు, "వాడు షైతాన్". **(సహీహ్ బుఖారీ, 2311, పుస్తకం 40, అధ్యా. 10, సంపుటి 3)**

కాబట్టి ఆయత్ అల్-కుర్సీ రాత్రి పడుకునే ముందు పఠిస్తే, ఉదయం వరకూ అల్లాహుతాలా ఒక రక్షకుడిని (గార్డ్‌ని) నియమిస్తారు. జీతమివ్వవలసిన అవసరం లేకుండా పైసా ఖర్చు లేకుండా రాత్రి నుండి ఉదయం వరకూ మీ కొరకు ఉచితంగా పనిచేసే ఓ గార్డుని అల్లాహ్ ఏర్పాటు చేస్తున్నారు. ఆ గార్డు ఉండటం వలన మీ దగ్గరికి షైతాన్ రాడు. ఈ ఆయత్ అల్-కుర్సీ మీరు చాలా సులభంగా కంఠస్థం చేయగలరు, ఇన్షా అల్లాహ్!

## క్రింది 10 ఖుర్‌ఆన్ ఆయత్‌లను రాత్రి పడుకునే ముందు చదవండి

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

الٓمّٓ ۝١ ذٰلِكَ الْكِتٰبُ لَا رَيْبَ ۛ فِيْهِ ۛ هُدًى لِّلْمُتَّقِيْنَ ۝٢ الَّذِيْنَ يُؤْمِنُوْنَ بِالْغَيْبِ وَيُقِيْمُوْنَ الصَّلٰوةَ
وَمِمَّا رَزَقْنٰهُمْ يُنْفِقُوْنَ ۝٣ وَالَّذِيْنَ يُؤْمِنُوْنَ بِمَآ اُنْزِلَ اِلَيْكَ وَمَآ اُنْزِلَ مِنْ قَبْلِكَ ۚ وَبِالْاٰخِرَةِ هُمْ
يُوْقِنُوْنَ ۝٤ [1 - 4] اَللّٰهُ لَآ اِلٰهَ اِلَّا هُوَ ۚ اَلْحَيُّ الْقَيُّوْمُ ۚ لَا تَاْخُذُهٗ سِنَةٌ وَّلَا نَوْمٌ ۭ لَهٗ مَا فِي
السَّمٰوٰتِ وَمَا فِي الْاَرْضِ ۭ مَنْ ذَا الَّذِيْ يَشْفَعُ عِنْدَهٗٓ اِلَّا بِاِذْنِهٖ ۭ يَعْلَمُ مَا بَيْنَ اَيْدِيْهِمْ وَمَا
خَلْفَهُمْ ۚ وَلَا يُحِيْطُوْنَ بِشَيْءٍ مِّنْ عِلْمِهٖٓ اِلَّا بِمَا شَاۗءَ ۚ وَسِعَ كُرْسِيُّهُ السَّمٰوٰتِ وَالْاَرْضَ ۚ وَلَا
يَـــُٔـوْدُهٗ حِفْظُهُمَا ۚ وَهُوَ الْعَلِيُّ الْعَظِيْمُ ۝٢٥٥ لَآ اِكْرَاهَ فِي الدِّيْنِ ڐ قَدْ تَّبَيَّنَ الرُّشْدُ مِنَ الْغَيِّ ۚ
فَمَنْ يَّكْفُرْ بِالطَّاغُوْتِ وَيُؤْمِنْۢ بِاللّٰهِ فَقَدِ اسْتَمْسَكَ بِالْعُرْوَةِ الْوُثْقٰى ۤ لَا انْفِصَامَ لَهَا ۭ وَاللّٰهُ سَمِيْعٌ
عَلِيْمٌ ۝٢٥٦ اَللّٰهُ وَلِيُّ الَّذِيْنَ اٰمَنُوْا ۙ يُخْرِجُهُمْ مِّنَ الظُّلُمٰتِ اِلَى النُّوْرِ ڛ وَالَّذِيْنَ كَفَرُوْٓا اَوْلِيٰۗـــُٔهُمُ
الطَّاغُوْتُ ۙ يُخْرِجُوْنَهُمْ مِّنَ النُّوْرِ اِلَى الظُّلُمٰتِ ۭ اُولٰۗىِٕكَ اَصْحٰبُ النَّارِ ۚ هُمْ فِيْهَا خٰلِدُوْنَ ۝٢٥٧ [255-257]
لِلّٰهِ مَا فِي السَّمٰوٰتِ وَمَا فِي الْاَرْضِ ۭ وَاِنْ تُبْدُوْا مَا فِيْٓ اَنْفُسِكُمْ اَوْ تُخْفُوْهُ يُحَاسِبْكُمْ بِهِ اللّٰهُ ۭ
فَيَغْفِرُ لِمَنْ يَّشَاۗءُ وَيُعَذِّبُ مَنْ يَّشَاۗءُ ۭ وَاللّٰهُ عَلٰي كُلِّ شَيْءٍ قَدِيْرٌ ۝٢٨٤ اٰمَنَ الرَّسُوْلُ بِمَآ
اُنْزِلَ اِلَيْهِ مِنْ رَّبِّهٖ وَالْمُؤْمِنُوْنَ ۭ كُلٌّ اٰمَنَ بِاللّٰهِ وَمَلٰۗىِٕكَتِهٖ وَكُتُبِهٖ وَرُسُلِهٖ ۣ لَا نُفَرِّقُ بَيْنَ
اَحَدٍ مِّنْ رُّسُلِهٖ ۣ وَقَالُوْا سَمِعْنَا وَاَطَعْنَا ڭ غُفْرَانَكَ رَبَّنَا وَاِلَيْكَ الْمَصِيْرُ ۝٢٨٥ لَا يُكَلِّفُ اللّٰهُ نَفْسًا
اِلَّا وُسْعَهَا ۭ لَهَا مَا كَسَبَتْ وَعَلَيْهَا مَا اكْتَسَبَتْ ۭ رَبَّنَا لَا تُؤَاخِذْنَآ اِنْ نَّسِيْنَآ اَوْ اَخْطَاْنَا ۚ
رَبَّنَا وَلَا تَحْمِلْ عَلَيْنَآ اِصْرًا كَمَا حَمَلْتَهٗ عَلَي الَّذِيْنَ مِنْ قَبْلِنَا ۚ رَبَّنَا وَلَا تُحَمِّلْنَا مَا لَا
طَاقَةَ لَنَا بِهٖ ۚ وَاعْفُ عَنَّا ۪ وَاغْفِرْ لَنَا ۪ وَارْحَمْنَا ۪ اَنْتَ مَوْلٰىنَا فَانْصُرْنَا عَلَي الْقَوْمِ الْكٰفِرِيْنَ ۝٢٨٦

[284-286]

అబూ హురైరా(రజి) ఉల్లేఖనం: ప్రవక్త(స) చెప్పారు, ‘మీ ఇండ్లను సమాధులుగా మార్చకండి. నిస్సందేహంగా, **షైతాన్ సూరతుల్ బఖరా చదివిన ఇంటిలో ప్రవేశించడు.** (తిర్మిదీ, సహీహ్, 2877, పుస్తకం 42, అధ్యా. 2, సంపుటి 5)

## ముందరి పేజీలోని 10 ఖుర్'ఆన్ ఆయత్‌లకు తెలుగు అనువాదం

అలిఫ్-లామ్-మీమ్. ఇది ఒక దివ్య గ్రంథం, ఇందులో ఏ మాత్రం సందేహం లేదు. అల్లాహ్ పట్ల భీతి గలవారికి ఇది మార్గదర్శకత్వము. (వారికి) ఎవరైతే అగోచర యథార్థాన్ని విశ్వసిస్తారో, సలాత్(నమాజ్)ను స్థాపిస్తారో మరియు మేము ప్రసాదించిన జీవనోపాధి నుండి (మా మార్గంలో) ఖర్చు చేస్తారో. మరియు ఎవరైతే (ఓ ముహమ్మద్!) నీపై అవతరింపజేయబడిన దానిని (ఈ ఖుర్'ఆన్‌ను) మరియు నీకు పూర్వం అవతరింపజేయబడిన వాటినీ విశ్వసిస్తారో మరియు పరలోక జీవితాన్ని దృఢంగా నమ్ముతారో!

ఆయత్ అల్-కుర్సీ

అల్లాహ్! ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. ఆయన సజీవుడు. విశ్వవ్యవస్థకు ఆధారభూతుడు. ఆయనకు కునుకూరాదు మరియు నిదురా రాదు. భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ ఆయనకు చెందినదే. ఆయన సమ్ముఖంలో - ఆయన అనుజ్ఞ లేకుండా - సిఫారసు చేయగల వాడెవడు? వారి ముందున్నదీ మరియు వారి వెనుక నున్నదీ అన్నీ ఆయనకు బాగా తెలుసు. మరియు ఆయన కోరితే తప్ప, ఆయన జ్ఞానవిశేషాలలో ఏ విషయమునూ వారు గ్రహింపజాలరు. ఆయన కుర్సీ ఆకాశాలనూ మరియు భూమినీ పరివేష్టించి ఉన్నది. వాటి సంరక్షణ ఆయనకు ఏ మాత్రం అలసట కలిగించదు. మరియు ఆయన అత్యున్నతుడు, సర్వోత్తముడు.

ధర్మం విషయంలో బలవంతం లేదు. వాస్తవానికి రుష్ద్ (సన్మార్గం), దుర్మార్గం నుండి స్పష్టంగా కనిపిస్తుంది. కావున కల్పిత దైవాల (తాగూత్)ను తిరస్కరించి, అల్లాహ్‌ను విశ్వసించిన వాడు, సుస్థిరమైన, ఎన్నటికీ విడిపోని ఆధారాన్ని పట్టుకున్నట్లే. మరియు అల్లాహ్ సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు.

అల్లాహ్ విశ్వసించినవారి సంరక్షకుడు, ఆయన వారిని చీకటి నుండి తీసి వెలుగులోకి తెస్తాడు. మరియు సత్యాన్ని తిరస్కరించినవారి రక్షకులు కల్పిత దైవాలు (తాగూత్), అవి వారిని వెలుగునుండి తీసి చీకటిలోనికి తీసుకొనిపోతాయి. అలాంటివారు నరకాగ్నివాసులు. అందులో వారు శాశ్వతంగా ఉంటారు.

ఆకాశాలలో మరియు భూమిలో ఉన్నదంతా అల్లాహ్‌దే! మీరు మీ మనస్సులలో ఉన్నది, వెలుబుచ్చినా లేక దాచినా అల్లాహ్ మీ నుంచి దాని లెక్క తీసుకుంటాడు. మరియు ఆయన తాను కోరినవానిని క్షమిస్తాడు మరియు తాను కోరినవానిని శిక్షిస్తాడు. మరియు అల్లాహ్ ప్రతీదీ చేయగల సమర్థుడు.

ఈ ప్రవక్త తన ప్రభువు తరపునుండి, తనపై అవతరింప జేయబడిన దానిని విశ్వసించాడు మరియు (అదేవిధంగా) విశ్వాసులు కూడా (విశ్వసించారు). వారంతా అల్లాహ్‌ను, ఆయన దూతలను, ఆయన గ్రంథాలను మరియు ఆయన ప్రవక్తలను విశ్వసించారు. వారంటారు: ''మేము ఆయన ప్రవక్తల మధ్య ఎలాంటి బేధభావాలను చూపము. మరియు మేము (ఆదేశం) విన్నాము మరియు దానిని శిరసా వహించాము, నీ క్షమాభిక్షను అర్థిస్తున్నాము, ఓ మా ప్రభూ! మా గమ్యస్థానం నీ వైపుకే ఉంది.

''అల్లాహ్ ఏ ప్రాణిపైననూ దాని శక్తికి మించిన భారం వేయడు. తాను సంపాదించిన (పుణ్య ఫలితం) దానికి లభిస్తుంది మరియు తాను చేసిన దుష్కర్మల శిక్ష అది అనుభవిస్తుంది. ఓ మా ప్రభూ! మేము మరచినా లేక తప్పు చేసినా మమ్మల్ని పట్టకు! ఓ మా ప్రభూ! పూర్వం వారిపై మోపినట్టి భారం మాపై మోపకు. ఓ మా ప్రభూ! మేము సహించలేని భారం మాపై వేయకు. మమ్మల్ని మన్నించు, మమ్మల్ని క్షమించు మరియు మమ్మల్ని కరుణించు. నీవే మా సంరక్షకుడవు. కావున సత్య తిరస్కారులపై మాకు విజయాన్ని ప్రసాదించు.

**అక్కడ ఏమీ లేదు.**

**అంతా శూన్యం**

**ఒకే ఒక్కరున్నారు**

**ఆయనే అల్లాహ్!**

**(హువల్లాహ్ - هُوَاللهُ - He is ALLAH)**

**"ఆయనే ఆకాశాలను మరియు భూమిని ఏమీ లేని శూన్యం నుండి సృష్టించాడు .....**" (ఖుర్'ఆన్ 6:101)

అల్లాహ్ తన దూతలను (పరిస్తాలను) కాంతితో సృష్టించాడు.

- జిన్నులను ఆయన అగ్నితో సృష్టించాడు.
- మానవులను ఆయన మట్టితో సృష్టించాడు.

(ఖుర్'ఆన్ 15:26-27 ఆయత్‌లను చూడండి)

"..... మరియు ప్రతిదానిని **ఆయనే సృష్టించాడు. మరియు ఆయనే ప్రతి విషయం గురించి బాగా తెలిసినవాడు.**" (ఖుర్'ఆన్ 6:101)

ఖుర్'ఆన్‌లో సృష్టికర్తయైన అల్లాహ్ గురించి తెలియజేసే వాక్యాలు ఎన్నో ఉన్నాయి. అవి అన్నీ ఇక్కడ అందిస్తే పత్రికలో పేజీలు సరిపోవు. కాబట్టి కొన్ని వాక్యాలను ఇక్కడ అందిస్తున్నాము.

**ఆయనే అల్లాహ్!** ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. ఆయనకు అగోచర మరియు గోచర విషయాలన్నీ తెలుసు. ఆయన **అర్-రహమాన్** (అనంత కరుణామయుడు), **అర్-రహీమ్** (అపార కరుణా ప్రదాత) (ఖుర్'ఆన్ 59:22)

**ఆయనే అల్లాహ్!** ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. ఆయన **అల్-మలిక్** (విశ్వ సార్వభౌముడు), **అల్-ఖుద్దూస్** (పరమ పవిత్రుడు), **అస్-సలామ్** (శాంతికి మూలాధారుడు), **అల్-ము'మిన్** (శాంతి ప్రదాత), **అల్-ముహైమిన్** (సంరక్షకుడు), **అల్-అజీజ్** (సర్వశక్తివంతుడు), **అల్-జబ్బార్** (గొప్ప ప్రాబల్యం కలవాడు), **అల్-ముతకబ్బిర్** (సర్వాధికారి). వారు కల్పించే భాగస్వాములకు అల్లాహ్ అతీతుడు. (ఖుర్'ఆన్ 59:23)

**ఆయనే అల్లాహ్! అల్-ఖాలిఖ్** (సృష్టికర్త), **అల్-బారీ** (ప్రతిదాని నిర్మాత) మరియు **అల్-ముసవ్విర్** (రూపమిచ్చేవాడు). ఆకాశాలలో మరియు భూమిలో ఉన్న సమస్తమూ ఆయన పవిత్రతనూ కొనియాడు తుంటాయి. మరియు ఆయనే **అల్-అజీజ్** (సర్వ శక్తివంతుడు), **అల్-హకీమ్** (మహా వివేకవంతుడు). (ఖుర్'ఆన్ 59:24)

పై ఆయత్‌లలో సృష్టికర్తయైన అల్లాహ్ యొక్క గుణాలను తెలియజేసే 15 విశేషణ నామాలు అండర్‌లైన్ చేయబడ్డాయి. ఇవి కూడా అల్లాహ్ యొక్క పేర్లే. అల్లాహ్ అనేది ఆయన పేరు (Proper Noun). మిగిలిన 99 పేర్లు ఆయనను వర్ణించే పేర్లు.

"**అల్లాహ్! ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. ఆయనకు అత్యుత్తమ మైన పేర్లు ఉన్నాయి.**" (ఖుర్'ఆన్ 20:8)

క్రింది ఆయత్‌లు ఖుర్'ఆన్ గ్రంథంలోని 112వ సూరహ్‌లోనివి. ఈ సూరహ్‌కి ఖుర్'ఆన్‌లో ప్రత్యేకత ఉంది. అల్లాహ్ గురించి చాలా క్లుప్తంగానూ మరియు చాలా స్పష్టంగానూ ఈ సూరహ్‌లో చెప్పబడింది.

"ఇలా అను :
**ఆయనే అల్లాహ్!** అహద్ (ఒక్కడు)!
**అల్లాహ్ ఎవరి అక్కరా లేనివాడు.**
**ఆయనకు సంతానం లేదు. మరియు**
**ఆయన కూడా ఎవరి సంతానమూ కాడు. మరియు**
**(సర్వలోకాలలో) ఆయనతో పోల్చదగినది ఏదీ లేదు.**"

(ఖుర్'ఆన్ 112:1-4)

ఇంతవరకూ పైన తెలిపిన ఖుర్'ఆన్ ఆయత్‌ల ద్వారా స్పష్టమయ్యేది:

**సృష్టికర్త పేరు అల్లాహ్. ఆయన ఒక్కడు. ఆయనకు పూర్వం ఎవరూ లేరు. ఆయనకు సంతానమూ లేదు. ఫలానా విధంగా ఉంటారేమోనని అనుకోవడానికి అవకాశమే లేదు, ఎందుకంటే సృష్టిలో ఆయనను పోలినది ఏదీ లేదు. కాబట్టి అల్లాహ్ అనేది పేరు మరియు ఆ పేరుకు బహు వచన పదం లేదు. ఆయన రూపం గురించి మనకు తెలియదు. మనం ఆయనను చూడలేము.**

ఏ చూపులు కూడా ఆయనను అందుకోలేవు. కాని ఆయన (అన్ని) చూపులను అందుకుంటాడు. మరియు ఆయన **అల్-లతీఫ్** (సూక్ష్మగ్రాహి), **అల్-ఖబీర్** (సర్వం తెలిసినవాడు) (ఖుర్ఆన్ 6:103)

"మరియు **ఆయనే అల్లాహ్!** ఆయన తప్ప మరొక ఆరాధ్యదైవం లేడు! మొదట మరియు చివరి స్తుతింపదగినవాడు కేవలం ఆయనే! మరియు విశ్వన్యాయాధిపత్యం ఆయనదే. మీరంతా ఆయన వైపునకే మరలింప బడతారు." (ఖుర్ఆన్ 28:70)

మనందరి సృష్టికర్తయైన అల్లాహ్ గురించి అవగాహన కోసం మరికొన్ని ఆయత్‌లను ఇక్కడ అందిస్తున్నాము. ఖుర్ఆన్‌లో మొత్తం ఆయత్‌ల సంఖ్య 6236.

**అల్లాహ్!** ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. ఆయన సజీవుడు. విశ్వవ్యవస్థకు ఆధారభూతుడు. ఆయనకు కునుకూ రాదు మరియు నిదురా రాదు. భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ ఆయనకు చెందినదే. ఆయన సమ్ముఖంలో - ఆయన అనుజ్ఞ లేకుండా - సిఫారసు చేయగల వాడెవడు? వారి ముందున్నదీ మరియు వారి వెనుక నున్నదీ అన్నీ ఆయనకు బాగా తెలుసు. మరియు ఆయన కోరితే తప్ప, ఆయన జ్ఞానవిశేషాలలోని ఏ విషయమునూ వారు గ్రహింపజాలరు. ఆయన కుర్సీ ఆకాశాలనూ మరియు భూమినీ పరివేష్టించి ఉన్నది. వాటి సంరక్షణ ఆయనకు ఏ మాత్రం అలసట కలిగించదు. మరియు ఆయన అత్యున్నతుడు, సర్వోత్తముడు. (ఖుర్ఆన్ 2:255)

**అల్లాహ్! ఆయనే భూమ్యాకాశాలను సృష్టించాడు** మరియు ఆకాశం నుండి నీటిని కురిపించి, దాని నుండి మీ కొరకు ఆహారంగా ఫలాలను పుట్టించాడు. మరియు తన ఆజ్ఞతో, ఓడలను మీకు ఉపయుక్తంగా చేసి సముద్రంలో నడిపించాడు. మరియు నదులను కూడా మీకు ఉపయుక్తంగా చేశాడు. మరియు ఎడతెగకుండా, నిరంతరం పయనించే సూర్యచంద్రులను మీకు ఉపయుక్తంగా చేశాడు మరియు రాత్రింబవళ్ళను కూడా మీకు ఉపయుక్తంగా ఉండేటట్లు చేశాడు. (ఖుర్ఆన్ 14:32,33)

అల్లాహ్‌చే సృష్టించబడిన వాటిలో ప్రతీదీ ఆయన ఆరాధనలో గడప వలసిందే.

"ఏమీ? నీకు తెలియదా? నిశ్చయంగా, భూమ్యాకాశాలలో ఉన్న **సర్వమూ రెక్కలు విప్పి ఎగిరే పక్షులు సైతం అల్లాహ్ పవిత్రతను కొనియాడుతూ ఉంటాయని?** వాస్తవానికి ప్రతిదానికి తన సలాత్ (నమాజ్) మరియు అల్లాహ్‌ని స్తుతించడం తెలుసు. మరియు అవి చేసేదంతా అల్లాహ్‌కు బాగా తెలుసు.

మరియు భూమ్యాకాశాల మీద సర్వాధిపత్యం కేవలం అల్లాహ్‌దే! మరియు అల్లాహ్ వైపునకే (అందరికీ) మరలి పోవలసి ఉన్నది. ఏమీ? మీకు తెలియదా? నిశ్చయంగా అల్లాహ్‌యే మేఘాలను మెల్ల మెల్లగా నడుపుతూ, వాటిని ఒకదానితో ఒకటి కలుపుతాడని. ఆ తరువాత వాటిని ప్రోగుచేస్తాడని! ఆ పిదప వాటి నుండి వర్షాన్ని కురిపించేది నీవు చూస్తున్నావు కదా! మరియు ఆయనే ఆకాశంలో ఉన్న కొండల వంటి (మేఘాల) నుండి వడగండ్ల చల్లని (వర్షాన్ని) తాను కోరినవారిపై కురిపిస్తాడు. మరియు తాను కోరిన వారిని వాటినుండి తప్పిస్తాడు. వాటి పిడుగు యొక్క మెరుపు కంటి చూపులను దాదాపు హరించేలా ఉంటుంది.

అల్లాహ్‌యే రేయింబవళ్ళను మార్చుతున్నాడు. **నిశ్చయంగా, కన్నులు గలవారికి ఇందులో గొప్ప గుణపాఠం ఉంది.** మరియు అల్లాహ్ ప్రతీ ప్రాణిని నీటి నుండియే సృష్టించాడు. వాటిలో కొన్ని తమ కడుపు మీద ప్రాకేవి ఉన్నాయి మరియు వాటిలో కొన్ని రెండు కాళ్ళమీద నడిచేవి ఉన్నాయి మరియు వాటిలో మరికొన్ని నాలుగు (కాళ్ళ)మీద నడిచేవి ఉన్నాయి. **అల్లాహ్ తాను కోరిన దానిని సృష్టిస్తాడు. నిశ్చయంగా, అల్లాహ్ ప్రతీదీ చేయగల సమర్థుడు.**

వాస్తవంగా మేము సుస్పష్టమైన సూచన (ఆయత్)లను అవతరింప జేశాము. మరియు అల్లాహ్ తానుకోరిన వానికి ఋజుమార్గం వైపునకు మార్గదర్శకత్వం చేస్తాడు. (ఖుర్ఆన్ 24:41-46)

## శిక్షణ

మనం పుట్టిన తరువాత తల్లిదండ్రులు మన ఆలనా పాలనా చూసుకుంటారు. మనకు తొలి గురువులు కన్నవారే! వారే మనకు చెబుతారు, తల్లిదండ్రులను ఏ విధంగా గౌరవించాలో మరియు తోటివారి పట్ల ఏ విధంగా ప్రవర్తించాలో.

అంటే కన్న తల్లిదండ్రుల ద్వారానే తల్లిదండ్రుల పట్ల ఏ విధంగా వ్యవహరించాలో తెలుసుకుంటున్నాము.

కుడిచేతితో భోజనం చేసే విధంగా మన తల్లిదండ్రులు చిన్నప్పటి నుండే మనకు అలవాటు చేస్తారు. ఇంకా ఇటువంటివి ఎన్నో వారి శిక్షణలో మనం నేర్చుకున్నాము.

**మరి వారికెవ్వరు ఇవన్నీ నేర్పారు?**

ఈ విషయం ఖుర్ఆన్‌లో చాలా స్పష్టంగా వివరించబడింది. ఈ జవాబు కంటే ముందుగా తెలుసుకోవలసిన విషయం ఒకటుంది. అదేమిటంటే మానవులంతా ఒకే ఒక్క జంట నుండి వచ్చారని. మరి ఈ తొలి జంటకు సర్వమూ నేర్పినది ఎవరు? ఎందుకంటే వారికి తల్లిదండ్రులు లేరు కదా!

తొలి మానవ జంటకు సర్వ సృష్టికర్తయైన అల్లాహ్‌యే ధర్మాన్ని నేర్పారు. వారి నుండి వారి పిల్లలకు, ఆ పిల్లల నుండి వారికి పుట్టిన వారికి, ఈ విధంగా అల్లాహ్ యొక్క సందేశం మానవులకు చేరింది. ఆ

తరువాయి కాలాలలో మానవుల నుండే కొందరిని తన ప్రవక్తలుగా, తన సందేశహరులుగా అల్లాహ్ ఎన్నుకుని వారికి తన దూత ద్వారా సందేశాన్ని పంపించేవారు.

ఈ విషయాలను ఖుర్ఆన్ వాక్యాల ద్వారా తెలుసుకుందాము.

## సృష్టికర్త తన ఆదేశాలను మానవులకు ఏ విధంగా చేరవేస్తారు?

**అల్లాహ్ మన యజమాని. మనమంతా ఆయన దాసులం.**

..... తన దాసులలో **తనకు ఇష్టమైన వారిపై, తన ఆజ్ఞ ప్రకారం దివ్య జ్ఞానాన్ని అవతరింపజేస్తాడు**, ఆయనతో సమావేశమయ్యే దినమును గురించి హెచ్చరించడానికి. ఆ రోజు వారందరూ బయటికి వస్తారు. **వారి ఏ విషయం కూడా అల్లాహ్ నుండి రహస్యంగా ఉండదు.** ఆ రోజు విశ్వసామ్రాజ్యాధికారం ఎవరిది? ఒక్కడూ, ప్రబలుడూ అయిన అల్లాహ్‌దే! (ఖుర్ఆన్ 40:15,16)

మరియు వారి వద్దకు ఏదైనా సూచన వచ్చినప్పుడు వారు : **"అల్లాహ్ యొక్క సందేశహరులకు ఇవ్వబడినట్లు మాకు కూడా ఇవ్వబడ నంతవరకూ మేము విశ్వసించము"** అని అంటారు. తన సందేశాన్ని ఎవరిపై అవతరింపజేయాలో అల్లాహ్‌కు బాగా తెలుసు ..... (ఖుర్ఆన్ 6:124)

**అల్లాహ్ తన సందేశహరునిగా ముహమ్మద్(స)వారిని ఎన్నుకున్నారు.**

**ముహమ్మద్ అల్లాహ్ యొక్క సందేశహరుడు**
(ఖుర్ఆన్ 48:29)

**మరియు మేము ప్రతీ ప్రవక్తను అతని జాతివారి భాషతోనే పంపాము. అతను వారికి స్పష్టంగా బోధించడానికి** ... (ఖుర్ఆన్ 14:4)

ముహమ్మద్(స)వారి భాష అరబీ అని అందరికీ తెలిసినదే! ముహమ్మద్(స)వారు అరబ్ జాతిలో జన్మించారు. ఆయన మాట్లాడే భాష అరబీ కాబట్టి, అల్లాహుతాలా తన సందేశాన్ని ఆ భాషలోనే ముహమ్మద్(స)వారిపై అవతరింపజేశారు. క్రింది ఖుర్ఆన్ ఆయత్ చూడండి :

**అలిఫ్-లామ్-ర. ఇవి స్పష్టమైన ఆయత్‌లు. వాస్తవంగా మీరు బాగా అర్థం చేసుకోవాలని మేము ఈ ఖుర్ఆన్‌ను అరబీ భాషలో అవతరింప జేశాము** (ఖుర్ఆన్ 12:1-3)

కాబట్టి అరబీ భాష మాట్లాడే అల్లాహ్ యొక్క సందేశహరుడైన ముహమ్మద్(స)వారిపై ఆ భాషలోనే ఖుర్ఆన్ అవతరించ బడింది.

మరో సందేశహరుడైన మూసా(అ)వారి మాతృభాష హెబ్రూ. కాబట్టి ఆయనపై హెబ్రూ భాషలోనే 'తౌరాత్' గ్రంథం అవతరించబడింది.

మరొక సందేశహరుడైన ఈసా(అ)ఆరి మాతృభాష అరమాయిక్. కాబట్టి ఆయనపై 'ఇంజీల్' అరమాయిక్ భాషలో అవతరించబడింది.

**యా-సీన్. వివేకంతో నిండి ఉన్న ఖుర్ఆన్ సాక్షిగా! నిశ్చయంగా, నీవు సందేశహరులలో ఒకడవు. ఋజుమార్గంపై ఉన్నావు. ఇది అల్-అజీజ్ (సర్వ శక్తివంతుడు), అర్-రహీమ్ (అపార కరుణా ప్రదాత) ద్వారానే అవతరింప జేయబడింది.** (ఖుర్ఆన్ 36:1-5)

పై ఆయత్ ద్వారా ఖుర్ఆన్ అల్-అజీజ్ మరియు అర్-రహీమ్‌చే అవతరింపజేయబడింది అని స్పష్టంగా తెలుస్తుంది. అల్-అజీజ్ మరియు అర్-రహీమ్ అనేవి అల్లాహ్ గుణాలను తెలిపే పేర్లు అని ఇప్పటికే తెలుసుకున్నాము. క్రింది ఆయత్‌లు చూడండి :

హా-మీమ్. ఈ గ్రంథ అవతరణ **అల్-అజీజ్** (సర్వ శక్తివంతుడు), **అల్-అలీమ్** (సర్వజ్ఞుడు) అయిన **అల్లాహ్** తరపునుండి జరిగింది. (ఖుర్ఆన్ 40:1-2)

హా-మీమ్. ఈ గ్రంథ అవతరణ అల్-అజీజ్ (సర్వ శక్తివంతుడు), **అల్-హకీమ్** (మహా వివేకవంతుడు) అయిన **అల్లాహ్** తరపునుండి జరిగింది. (ఖుర్ఆన్ 40:1-2)

అంటే ఖుర్ఆన్‌ను అవతరింప జేసింది - **అల్లాహ్**. అల్లాహ్ యొక్క సందేశహరుడు - ముహమ్మద్(స).

**ముహమ్మద్(స)వారిని తన సందేశహరుడుగా అల్లాహుతాలా ఎన్నుకుని తన తరపునుండి ఖుర్ఆన్‌ను ముహమ్మద్(స)పై అవతరింపజేశారని పై ఆయత్‌లు స్పష్టం చేస్తున్నాయి.**

## అల్లాహ్ ప్రసంగం - ఖుర్ఆన్

అరబీ భాషలో అల్లాహ్ చేసిన ప్రసంగమే - ఖుర్ఆన్. చదవడం, వ్రాయడం తెలియని ముహమ్మద్(స)వారి హృదయంపై ఇది అవతరించ బడింది. దానిని ముహమ్మద్(స)వారి ద్వారా విని ఎందరో తమ హృదయాలలో ఆ గ్రంథాన్ని ఉంచుకున్నారు (ఖుర్ఆన్‌ను కంఠస్థం చేశారు).

ముహమ్మద్(స)వారు తన హృదయంపై అవతరించబడిన దానిని పఠిస్తుండగా, ఆ మాటలను యథాతథంగా అంటే వాటిలో ఒక అక్షరాన్ని కలపడమో లేక తీయడమో చేయకుండా సహాబీలు లిఖించారు. ఇది మానవ రచన కాదు. ఖుర్ఆన్ కల్పన కాదు. ప్రవక్త(స)వారి సమక్షంలోనే అల్లాహ్ ప్రసంగం లిఖించ బడింది.

ఖుర్ఆన్ వాక్యాల ద్వారా అల్లాహ్ యొక్క ప్రసంగం ముహమ్మద్(స) వారిపై ఎలా అవతరించ బడిందో తెలుసుకుందాం. అల్లాహుతాలా మాట్లాడిన మాటలు ప్రత్యక్షంగా ఎటువంటి మాధ్యమం లేకుండానే ముహమ్మద్(స)వారు విన్నారా?

మాధ్యమం ఉంది. (ఎటువంటిమాధ్యమం లేకుండా వినడం కూడా జరిగింది. అయితే ఆ విషయం తరువాత చెప్పుకుందాం).

మరియు ఈ విధంగా మేము నీపై ఈ ఖుర్'ఆన్‌ను అరబీ భాషలో, **వహీ** (దివ్యసందేశం) ద్వారా అవతరింపజేశాము. దానితో నీవు **ఉమ్ముల్-ఖురా (మక్కా)** మరియు దాని చుట్టుప్రక్కల వారిని హెచ్చరించటానికి మరియు - దానిని గురించి ఎలాంటి సందేహం లేని - ఆ సమావేశ దినాన్ని గురించి హెచ్చరించేందుకు కూడా.... (ఖుర్'ఆన్ 42:7)

పై ఆయత్‌లో సమావేశ దినం గురించి హెచ్చరించడమంటే 'తీర్పు దినం' గురించి హెచ్చరించడం. ప్రళయం తరువాత వచ్చే ఈ తీర్పు దినాన మానవులంతా తిరిగి లేపబడతారు. వారు చేసిన కర్మలకు అల్లాహ్ తీర్పునిస్తారు. ప్రతీ ఒక్కరికీ ఆ రోజు తెలుస్తుంది తమ శాశ్వత నివాస స్థలం స్వర్గమో లేక నరకమో.

అల్లాహుతాలా నుండి ముహమ్మద్(స)వారికి వహీ అందింది.

## వహీ

ఈ వహీ కేవలం ముహమ్మద్(స) వారికి మాత్రమే కాకుండా పూర్వం అల్లాహ్‌చే పంపబడిన ఎందరో సందేశహరులకు కూడా అందిందని క్రింది ఖుర్'ఆన్ ఆయత్‌ల ద్వారా తెలుస్తుంది.

అల్-అజీజ్ (సర్వ శక్తివంతుడూ), అల్-హకీమ్ (మహా వివేకవంతుడూ) అయిన **అల్లాహ్**, ఈ విధంగా **నీకూ మరియు నీకంటే ముందు వచ్చిన వారికి కూడా** వహీ (దివ్య సందేశం) అవతరింపజేశాడు. (ఖుర్'ఆన్ 42:3)

వారితో ఇలా అను : "**నేను మొట్టమొదటి ప్రవక్తనేమీ కాను.** నాకూ మరియు మీకు ఏమి కానున్నదో నాకు తెలియదు. నేను అనుసరించేది నాపై అవతరింపజేయబడిన 'వహీ'ని మాత్రమే. మరియు నేను కేవలం స్పష్టంగా హెచ్చరిక చేసేవాడను మాత్రమే. (ఖుర్'ఆన్ 46:9)

ఈ వహీ ఎన్ని రకాలుగా వస్తుందో ముహమ్మద్(స)వారి జీవిత చరిత్ర శీర్షికలో ఇంతకు పూర్వమే శాంతిబాటలో అందించాము.

## జిబ్రీల్(అ)

అల్లాహ్ నుండి ఆయన సందేశహరులకు వహీ దూతల (పరిష్తాల) ద్వారా అందింది.

సర్వ స్తోత్రాలకు అర్హుడు అల్లాహ్ మాత్రమే! ఆకాశాలు మరియు భూమి యొక్క సృష్టికి మూలాధారి. ఆయనే **మలా'ఇకను సందేశాలు అందజేసేవారిగా నియమించాడు.** (ఖుర్'ఆన్ 35:1) (మలా'ఇక అంటే అల్లాహ్ యొక్క దూతలు)

ఈ దూతలలో ముఖ్యుడు మరియు అల్లాహ్ యొక్క సందేశ హరులకు వహీ తీసుకువచ్చే దూత - జిబ్రీల్(అ).

(ఓ ప్రవక్తా!) వారితో ఇలా అను : "జిబ్రీల్ పట్ల విరోధమున్న ప్రతివాడూ ఈ యథార్థాన్ని గ్రహించాలి. **అల్లాహ్ ఆజ్ఞతోనే ఈ ఖుర్'ఆన్‌ను నీ హృదయంపై అవతరింపజేశాడు.** (ఖుర్'ఆన్ 2:97)

దివ్య సందేశాన్ని తీసుకు వచ్చిన ఈ దూత పేరు 'జిబ్రీల్'(అ) అని పై ఆయత్‌లో చెప్పబడింది. మరికొన్ని ఆయత్‌లలో ఈయననే '**రూహుల్ ఖుదుస్**' (16:102) అని మరో చోట '**రూహుల్ అమీన్**' అని పిలవడం జరిగింది.

మరియు నిశ్చయంగా, ఇది సర్వలోకాల ప్రభువు అవతరింప జేసినది. దీనిని **రూహుల్ అమీన్** అవతరింప జేశాడు. నీ హృదయం మీద నీవు హెచ్చరిక చేసేవారిలో చేరిపోవాలని స్పష్టమైన అరబీ భాషలో. నిశ్చయంగా దీని (ప్రస్తావన) పూర్వపు అల్లాహ్ గ్రంథాలలో ఉంది. (ఖుర్'ఆన్ 26:192-196)

ఇంతవరకూ తెలుసుకున్నది క్లుప్తంగా :

- **ఖుర్'ఆన్ - అల్లాహ్ యొక్క ప్రసంగం**
- **ఆ ప్రసంగం ముహమ్మద్(స)వారి హృదయంపై అవతరించబడింది.**
- **అంటే ప్రసంగించినవారు - అల్లాహుతాలా**
- **వింటున్నవారు - ముహమ్మద్(స)వారు**
- **కాబట్టి ప్రతీ సందర్భంలోనూ వింటున్న ముహమ్మద్(స)వారితో "ఓ ప్రవక్తా!" అని గాని "ఓ ముహమ్మద్!" అనిగాని సంబోధించి చెప్పవలసిన అవసరం లేదు. వినేది ఆయనే కాబట్టి.**
- **అందువల్లనే చాలా ఆయత్‌లలో ప్రజలకు చెప్పమని ముహమ్మద్(స)కి చెప్పే సందర్భంలో "(ఇలా) అను :" అని అల్లాహ్ సంభోధించేవారు. "(ఇలా) అను" అంటే అర్థం "ఓ ప్రవక్తా ప్రజలతో ఇలా అను" అని అర్థం చేసుకోవాలి. అల్లాహ్‌పై కనీస విశ్వాసాన్ని కలిగి ఉండి, కనీస జ్ఞానమున్న వారెవరికైనా ఈ విషయంలో ఎటువంటి సందేహమూ కలుగదు.**

## ఖుర్'ఆన్
### ఎందుకు అవతరించబడింది?

- **అంధకారం నుండి వెలుగులోకి తీసుకురావడానికి**

తన దాసునిపై స్పష్టమైన సూచనలు అవతరింప జేసినవాడు ఆయనే! అతను వాటిద్వారా మిమ్మల్ని **అంధకారం నుండి వెలుతురులోకి తీసుకు రావడా**నికి మరియు నిశ్చయంగా, అల్లాహ్ మిమ్మల్ని ఎంతో కనికరించేవాడు, అపార కరుణా ప్రదాత (ఖుర్'ఆన్ 57:9)

- **మానవులందరికీ సన్మార్గం చూపడానికి**

నిశ్చయంగా మేము మానవులందరి కొరకు ఈ గ్రంథాన్ని సత్యంతో నీపై అవతరింప జేశాము. కావున సన్మార్గంపై నడిచేవాడు తన

మేలు కొరకే అలా చేస్తాడు. మరియు నిశ్చయంగా, మార్గభ్రష్టుడైన వాడు తన కీడు కొరకే మార్గభ్రష్టుడౌతాడు మరియు నీవు వారి కొరకు బాధ్యుడవు కావు. (ఖుర్'ఆన్ 39:41)

కాబట్టి ఖుర్'ఆన్ మానవులందరి కొరకూ అవతరించబడింది. ప్రపంచంలో ఎక్కడ పుట్టిన వారైనా లేక ఏ భాష మాట్లాడేవారైనా, ఎవరైనా సరే మొత్తం మానవాళి కొరకు ఈ గ్రంథం పంపబడింది. ఇది సన్మార్గాన్ని బోధిస్తుంది. కాబట్టి సన్మార్గాన్ని అనుసరించినవారు మేలు పొందుతారు. ఇక మార్గభ్రష్టుడెలా అవుతాడో తరువాయి పేజీలలో వివరించబడింది.

- **సర్వలోకాలకు హెచ్చరిక చేయడానికి**

ఖుర్'ఆన్‌లోని తొలి సూరహ్ ప్రారంభంలోనే '**అల్-హమ్‌దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్**'' (సకలలోకాలకు ప్రభువైన అల్లాహ్‌కే సమస్త పొగడ్తలు మరియు కృతజ్ఞతలన్నీ) అని చదువుతాము. ఎన్ని లోకాలున్నాయో, వాటిలో ఏమేమి ఉంటాయో మనకు తెలియవు. అంటే అవి అగోచర విషయాలు. వాటి జ్ఞానం అల్లాహ్‌కే ఉంది. ఈ విషయాన్ని అల్లాహ్‌పై విశ్వాసంగలవారు మాత్రమే విశ్వసిస్తారు.

''**ఇది సర్వలోకాలకు ఒక జ్ఞాపిక** (హితోపదేశం)'' (ఖుర్'ఆన్ 81:27)

''**సర్వలోకాలకు హెచ్చరిక చేసేదిగా** ఈ పుర్ఖాన్‌ను (గీటురాయిని) తన దాసునిపై క్రమక్రమంగా అవతరింప జేసిన ఆయన ఎంతో శుభదాయకుడు. (ఖుర్'ఆన్ 25:1)

పుర్ఖాన్ అనేది ఖుర్'ఆన్‌ని వర్ణించే పదం.

- **హెచ్చరికను మాత్రమే కాకుండా శుభవార్తను కూడా ఇవ్వడానికి**

ఇది సక్రమంగా స్థిరంగా ఉండి, ఆయన నుండి వచ్చే కఠిన శిక్షను గురించి హెచ్చరిస్తుంది మరియు విశ్వసించి సత్కార్యాలు చేసేవారికి మంచి ప్రతిఫలం తప్పక ఉంటుందనే **శుభవార్త**నూ ఇస్తుంది. (ఖుర్'ఆన్ 18:2)

నిశ్చయంగా ఈ ఖుర్'ఆన్ పూర్తిగా సరైన మార్గం వైపునకు మార్గదర్శ కత్వం చేస్తుంది మరియు సత్కార్యాలు చేస్తుండే విశ్వాసులకు తప్పక గొప్ప ప్రతిఫలం ఉందని **శుభవార్త**నూ అందజేస్తుంది. (ఖుర్'ఆన్ 17:9)

త-సీన్. ఇవి ఖుర్'ఆన్ ఆయత్‌లు మరియు ఒక స్పష్టమైన గ్రంథము. ఇవి విశ్వాసులకు మార్గదర్శకత్వంగానూ మరియు **శుభవార్త**లు ఇచ్చేవిగానూ ఉన్నాయి. (ఖుర్'ఆన్ 27:1,2)

నీపై గ్రంథం అవతరింప జేయబడింది. కావున నీ హృదయంలో దాని నుండి అవరోధం ఉండనివ్వకు దీని ద్వారా నీవు హెచ్చరించ టానికి మరియు విశ్వాసులకు జ్ఞాపికగా (ఖుర్'ఆన్ 7:2)

- **విశ్వసించినవారికి కారుణ్యంగా**

''... ఇందులో విశ్వసించే వారికొరకు, మీ ప్రభువు తరపునుండి అనేక బోధనలు, మార్గదర్శకత్వం మరియు **కారుణ్యమున్నాయి**'' (ఖుర్'ఆన్ 7:203)

''... ప్రతి విషయాన్ని వివరిస్తుంది మరియు ఇది విశ్వసించే వారికి మార్గదర్శిని మరియు **కారుణ్యం కూడానూ**'' (ఖుర్'ఆన్ 12:111)

''మరియు మేము ఈ గ్రంథాన్ని నీపై అవతరింపజేసింది, వారు విభేదాలకు గురిఅయిన విషయాన్ని వారికి నీవు స్పష్టం చేయటానికీ మరియు విశ్వసించే జనులకొరకు మార్గదర్శకత్వం గానూ మరియు **కారుణ్యంగానూ ఉంచటానికి!**'' (ఖుర్'ఆన్ 16:64)

''... ప్రతీ విషయాన్ని స్పష్టపరచటానికి నీపై ఈ దివ్యగ్రంథాన్ని అవతరింపజేశాము మరియు ఇందులో ముస్లిములు (అల్లాహ్‌కు విధేయులు) అయిన వారికి మార్గదర్శకత్వం, **కారుణ్యం** మరియు శుభవార్తలూ ఉన్నాయి. (ఖుర్'ఆన్ 16:89)

''... మరియు నిశ్చయంగా ఇది విశ్వాసులకు మార్గదర్శిని మరియు **కారుణ్యం**'' (ఖుర్'ఆన్ 27:77)

''సజ్జనులకు మార్గదర్శకత్వమూ మరియు కారుణ్యమూ ఉన్నాయి'' (ఖుర్'ఆన్ 31:3)

''ఇది మానవులకు పరిజ్ఞానం ఇచ్చేదిగానూ మరియు విశ్వసించే జనులకు మార్గదర్శకత్వంగానూ మరియు కారుణ్యంగానూ ఉంది. (ఖుర్'ఆన్ 45:20)

- **స్వస్థత నిచ్చేదిగా**

ఇది విశ్వసించినవారికి మార్గదర్శకత్వం మరియు **స్వస్థత** నిచ్చేది. మరియు విశ్వసించని వారి చెవులకు అవరోధం మరియు వారి కళ్ళకు ఒక గంత. అలాంటివారి పరిస్థితి ఎంతో దూరం నుండి పిలువబడినవారి అరుపులాంటిది!'' (ఖుర్'ఆన్ 41:44)

- **ఆలోచించేవారి కొరకు**

ఏమీ? వారు ఖుర్'ఆన్‌ను గురించి **ఆలోచించరా?** ఒకవేళ ఇది అల్లాహ్ తరపునుండి గాక ఇతరుల తరపునుండి వచ్చి వుంటే, అందులో ఎన్నో పరస్పర విరుద్ధమైన విషయాలను చూసేవారు (ఖుర్'ఆన్ 4:82)

మేము ఎంతో శుభవంతమైన ఈ గ్రంథాన్ని నీపై అవతరింప జేశాము. ప్రజలు దీని సూచనలను గురించి ఆలోచించాలని మరియు బుద్ధిమంతులు దీనినుండి హితబోధ గ్రహించాలని. (ఖుర్'ఆన్ 38:29)

- **ప్రతీ విషయాన్ని స్పష్టపరచటానికి**

ఇది ప్రజల కొరకు ఒక **స్పష్టమైన వ్యాఖ్యానం** ... (ఖుర్'ఆన్ 3:138)

... ప్రతి **విషయాన్ని విపులంగా వివరిస్తుంది** ... (ఖుర్'ఆన్ 12:111)

మరియు మేము ఈ గ్రంథాన్ని నీపై అవతరింపజేసింది, వారు విభేదాలకు గురి అయిన విషయాన్ని వారికి **నీవు స్పష్టం చేయటానికీ** మరియు విశ్వసించే జనుల కొరకు మార్గదర్శకత్వం గానూ మరియు కారుణ్యంగానూ ఉంచటానికి! (ఖుర్ఆన్ 16:64)

... **ప్రతి విషయాన్ని స్పష్టపరచటానికి** నీపై ఈ దివ్యగ్రంథాన్ని అవతరింపజేశాము ... (ఖుర్ఆన్ 16:89)

నిశ్చయంగా ఈ ఖుర్ఆన్ ఇస్రాయీల్ సంతతివారు విభేదిస్తూ వున్న పెక్కు **విషయాల వాస్తవాన్ని** వారికి తెలుపుతున్నది.(27:76)

**ఇప్పటి వరకూ ప్రస్తావించబడిన విషయాలపై**

## ఓ విశ్లేషణ

**ఆలోచించేవారి కొరకా?**

అవును. వారు ఆలోచించారు. కొందరు ఒక విధంగా ఆలోచిస్తే, మరికొందరు మరికొన్ని విధాలుగా ఆలోచించారు. అంతేకాకుండా, తమ ఆలోచనలను కొందరు కార్యరూపంలో పెట్టారు. వారు,

ఖుర్ఆన్‌లోని క్రింది వాక్యాన్ని చదివారు :

**నిశ్చయంగా మేమే ఈ ఖుర్ఆన్‌ను అవతరింపజేసిన వారము మరియు నిశ్చయంగా మేమే దీనిని కాపాడేవారము.** (ఖుర్ఆన్ 15:9)

పై వాక్యం సత్యమేనా? అని వారు సందేహించారు, ఖుర్ఆన్ స్వయంగా సత్యంతో అవతరించబడినట్లు చెబుతున్నప్పటికీ. దాదాపు 50వేల ఖుర్ఆన్ కాపీలను సేకరించారు. వాటిలో పురాతనమైనవి, చేతితో వ్రాయబడినటువంటివి మరియు అచ్చయినవి కూడా ఉన్నాయి. దాదాపు ఓ 50 సంవత్సరాల పాటు వాటిపై జర్మనీలో ఓ యూనివర్శిటీలో పరిశోధన జరిగింది. చివరికి అందులో మార్పులు జరగలేదని, ఖుర్ఆన్ లో అల్లాహ్ చేసిన వాగ్దానం సత్యమేనని తెలుసుకున్నారు.

ఇటువంటి పరిశోధన జరగకపోయినా కూడా, ఆ కాలం నాటి రెండు ఒరిజనల్ కాపీలలో ఒకటి ఇస్తాంబుల్ (టర్కీ)లోనూ, మరొకటి తాష్కెంట్ (రష్యా)లోనూ భద్రంగా ఉన్నాయి.

ఓ గణితశాస్త్ర ఆచార్యుడు ఖుర్ఆన్ చదివాడు. ఆలోచించాడు. తన శాస్త్రదృష్టితో చదివి ఆలోచించాడు. గ్రంథంలో ఆయనకు సత్యం కనిపించింది.

డేవిడ్ కీత్ మూర్ అనే ఓ డాక్టర్‌గారు పిండాభివృద్ధి విషయంలో ఖుర్ఆన్‌లోని 96వ సూరహ్‌ను మరియు మరికొన్ని అటువంటి ఆయత్‌లను చదివి, తదనుగుణంగా తాను పూర్వం వ్రాసిన పుస్తకాన్ని సవరించి తిరిగి అచ్చు వేయించారు. ఆ వర్క్‌కి ప్రశంసగా ఓ పురస్కారాన్ని కూడా అందుకున్నారు.

ఓ డెర్మటాలజిస్ట్ ఖుర్ఆన్‌లో ఓ వాక్యాన్ని చదివి, ఆశ్చర్యపోయి ఇస్లామ్ సత్యమని తెలుసుకుని వెంటనే ఇస్లామీయ జీవన విధానాన్ని తన విధానంగా చేసుకున్నారు.

ఖుర్ఆన్ ప్రకారంగా ఆచరించే ముస్లిముల జీవనవిధానంలోని నైతిక విలువలను ప్రత్యక్షంగా చూసి, ఎన్నో సంస్కృతులతో అలరారే ఈజిప్టు దేశం పూర్తిగా ఇస్లామ్‌ను స్వీకరించడం జరిగింది.

ఇంకా ఇటువంటివి ఎన్నో!

ఏ రంగంలో జ్ఞానం సంపాదించుకున్నా సరే, ఆ జ్ఞానదృష్టిలో ఖుర్ఆన్ చదివిన ప్రతీ ఒక్కరికీ సత్యం స్పష్టంగా కనిపిస్తుంది.

సామాజిక పరిస్థితుల కారణంగా కొందరు వారు తెలుసుకున్న సత్యాన్ని ప్రకటించక పోవచ్చు. ఖుర్ఆన్ ఆలోచించే వారికి అల్లాహ్ సూచనలను చూపుతుంది.

### హెచ్చరికగా ఖుర్ఆన్‌ను పంపడం అంటే, చేసే ఆ హెచ్చరిక ఏమిటి?

భయం కలిగించే ఆ హెచ్చరికల గురించి మాట్లాడుకునే ముందు మనం నిత్య జీవితంలో వినే హెచ్చరికల గురించి ఓసారి మననం చేసుకుందాం!

- తుఫాన్ హెచ్చరికల కేంద్రం చేపల వేటకు సముద్రంలోకి వెళ్ళ వద్దని మత్స్యకారులకు హెచ్చరిక జారీ చేస్తుంది.
  వారు వెళ్ళడం మానివేస్తారు. వెళితే ప్రాణాలు పోవచ్చు.
- కామెర్లు వచ్చిన వారిని చికెన్ తినవద్దని డాక్టర్ హెచ్చరిస్తారు.
  మానివేయాలి. తప్పదు. లేకపోతే ప్రాణానికే ప్రమాదం.

ఈ హెచ్చరికలు కేవలం మన క్షేమం కోసమే. ఈ హెచ్చరికలు మనం పాటిస్తే తుఫాను హెచ్చరికల కేంద్రం వారికిగాని, డాక్టరు గారికి గాని జరిగే మేలు ఏమీ లేదు.

ఈ హెచ్చరికలు విని తదనుగుణంగా జాగ్రత్త పడకపోతే, నష్టపోయేది మనమే. సమాజంలో శాంతిభద్రతలు సక్రమంగా ఉండటానికి పోలీసులు కొన్ని హెచ్చరికలు చేస్తారు. ఆ హెచ్చరికలు పాటించని వారిని కఠినంగా శిక్షిస్తారు.

**కాబట్టి ఈ హెచ్చరికలు మనకు, మన సమాజానికి మేలు చేయడం కోసమే!**

ఖుర్ఆన్ సర్వలోకాలకు హెచ్చరికగా పంపబడింది అంటే; దానర్థం ఏమిటో ఇప్పుడు స్పష్టమై ఉంటుంది. **సర్వలోకాలు శాంతిగా ఉండ టానికి ఖుర్ఆన్ కొన్ని హెచ్చరికలు చేసింది.**

హెచ్చరికల వలన భయం కలుగుతుంది. అల్లాహ్ పట్ల భయం (తఖ్వా) ఉండాలి. ఎందుకని? అల్లాహ్ ఆదేశించినట్లుగా మన ఆచరణ లేకపోతే, ఆయన నుండి అందే కరుణను కోల్పోతామేననే భయం. పాపకార్యాలకు శిక్షింపబడతామనే భయం.

### ఇక శుభవార్త విషయం

మీరు బాగా చదివి ఫలానా టెస్ట్ పాసయితే, మా కంపెనీలో

ఉన్నతమైన ఉద్యోగం ఇస్తామని ఓ ప్రముఖ కంపెనీ వాగ్దానం చేస్తే, అది ఓ శుభవార్త!

ఊహించడానికి కూడా సాధ్యం కానటువంటి ఓ గొప్పదైన శాశ్వతమైన సుఖమయ జీవితాన్ని ఖుర్'ఆన్ వాగ్దానం చేస్తుంది. అంతకు మించిన శుభవార్త ఏముంటుంది? అల్లాహ్ పెట్టే పరీక్ష కష్టమైనది కూడా కాదు.

## మరో విషయం - మార్గదర్శకత్వం

ఖుర్'ఆన్ అవతరణకు పూర్వం అల్లాహ్ నుండి మార్గదర్శకత్వం లేదా? ఉంది. ఆ విషయం ఖుర్'ఆన్ స్వయంగా చెబుతుంది. మరి ఖుర్'ఆన్ అవసరమెందుకు? పూర్వపు గ్రంథాలు కేవలం ఒక జాతికో, ఒక ప్రాంతానికో ఉద్దేశించబడినవి. ఇది కేవలం ఓ జాతికో, ఓ ప్రాంతానికో కాకుండా సర్వలోకాల కోసం పరిపూర్ణం గావించబడిన మార్గదర్శకత్వం.

ఈ మార్గదర్శకత్వం ప్రకారం ఆచరిస్తే, సమాజాన్ని నాశనం చేసే త్రాగుడు, జూదం, వ్యభిచారం, అశాంతి మొదలైనవి సమాజం నుండి దూరమౌతాయి. మానసిక ఒత్తిడులకు గురికావడం, ఆత్మహత్యలు మొదలైనవి అన్నీ సన్మార్గంలో లేకపోవడం వల్లనే జరుగుతున్నాయి.

ఖుర్'ఆన్ అరబీ భాషలో ఉంది. సర్వమానవులకు ఎలా అర్థమౌతుంది? అని ఎవరైనా ప్రశ్నించవచ్చు. ఆ భాష నేర్చుకుని అర్థం చేసుకోవాలి. అది మన అవసరం. **తెలుగు రాష్ట్రంలో పుట్టిన వారెందరో మాతృ భాషయైన తెలుగు మీడియంలో కాకుండా ఇంగ్లీష్ మీడియంలో చదువుకుంటున్నారు.** దానికి కారణం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. మరి మీ జీవిత సౌఖ్యానికి అవసరమయ్యే మార్గదర్శకత్వాన్ని ఇచ్చేది మరో భాషలో ఉన్నప్పుడు, అది నేర్చుకోవాలి కదా! ఆసక్తి ఉంటే, కొన్ని రోజులు కష్టపడితే సులభంగా నేర్చుకోవచ్చు.

క్రింది ఆయత్‌లు మరోసారి గమనించండి.

**వాస్తవంగా మీరు బాగా అర్థం చేసుకోవాలని, మేము ఈ ఖుర్'ఆన్‌ను అరబీ భాషలో అవతరింపజేశాము** (ఖుర్'ఆన్ 12:2)

**అసత్యం దాని ముందు నుండి గానీ లేదా దాని వెనుక నుండి గానీ దానిపైకి రాజాలదు. అది మహా వివేకవంతుడు, సర్వస్తోత్రాలకు అర్హుడు తరఫునుండి అవతరింప జేయబడింది.** (ఖుర్'ఆన్ 41:42)

**సత్యాన్ని అసత్యం నుండి వేరు పరుస్తుంది.** (ఖుర్'ఆన్ 2:185)

కేవలం అరబ్బులకే కాదు. అందరికీ స్పష్టంగా అర్థమౌతుంది ఈ ఖుర్'ఆన్. ఆ భాష అటువంటిది. అరబీ భాష ఔన్నత్యం గురించి ఇదివరకు చాలా సార్లు శాంతిబాటలో చెప్పడం జరిగింది.

ఖుర్'ఆన్‌లో చేసిన అరబీ భాషా పద ప్రయోగం అసమానమైనది. పదాలను వక్రీకరించడం సాధ్యం కాదు.

పై ఖుర్'ఆన్ ఆయత్ (41:42) చూడండి. **అసత్యాన్ని** ఏ విధంగానూ ఖుర్'ఆన్‌లో కలపలేరు. మహా వివేకవంతుడైన అల్లాహ్ ఆ విధంగా ఖుర్'ఆన్‌ను అవతరింప జేశారు. కాబట్టి వక్రబుద్ధి గలవారు అరబీ భాష జోలికి పోరు. అందువల్లనే వక్రీకరించి చెడు ప్రచారం చేస్తున్న వారందరూ ఒరిజినల్‌పై కాకుండా అనువాదాలపైనే ఆధారపడ్డారు.

**వక్రీకరించవలసిన అవసరమేమిటి అంటారా?**

- ఖుర్'ఆన్ నిర్ద్వంద్వంగా త్రాగుడును నిషేధించింది. కాని మద్యం అమ్ముకునే దుకాణదారుడికి ఈ నిషేధం నచ్చదు. వ్యతిరేకిస్తాడు.
- ఖుర్'ఆన్ వ్యభిచారాన్ని నిషేధించింది. వ్యభిచార గృహాలను నడిపేవారికి, వ్యభిచారులకు అది నచ్చదు.
- వడ్డీ వ్యాపారం చేసుకునేవారికి వడ్డీ నిషేధమని చెబితే మంటగా ఉంటుంది.
- నిజమే మాట్లాడమని ఖుర్'ఆన్ చెబుతుంది. అబద్ధాలరాయుళ్లకి ఆ విధంగా చెప్పడం అస్సలు నచ్చదు.
- అసాంఘిక కార్యకలాపాలన్నింటినీ ఖుర్'ఆన్ ఎటువంటి సందేహానికి తావులేకుండా నిషేధించింది.

కాబట్టి ఆ కార్యకలాపాలు సాగించేవారంతా ఖుర్'ఆన్ పట్ల శతృత్వం వహించారు. ఒరిజినల్ అరబీ జోలికిపోకుండా అనువాదాలపై దృష్టి కేంద్రీకరించారు. మన రాష్ట్రంలో ఖుర్'ఆన్ యొక్క తెలుగు అనువాదాన్ని ఉపయోగించుకుని ఎటువంటి ప్రచారం చేస్తున్నారో కొన్ని ఉదాహరణలు ఇక్కడ అందిస్తున్నాము.

**మన రాష్ట్రంలో అచ్చయిన ఒకటీ రెండు తెలుగు అనువాదాలని దృష్టిలో పెట్టుకుని, ఖుర్'ఆన్‌లో అల్లాహ్ అనే పదమే లేదని కొందరు ప్రచారం మొదలు పెట్టారు.**

ఇది ఎంత హాస్యాస్పదంగా ఉందో ఈ వ్యాసాన్ని ఇప్పటి వరకూ చదివిన మీకు అర్థమై ఉంటుంది. ఖుర్'ఆన్ ప్రారంభమే '**బిస్మిల్లా** హిర్రహ్మా నిర్రహీమ్'తో జరిగింది. ప్రతీ మస్జిద్ స్పీకర్ల నుండి '**అల్లాహ్**' అనే మాటను ప్రతీ రోజూ దాదాపు ప్రతీ ఊరిలో ప్రతీ సలాత్(నమాజ్)కి ముందు ఇచ్చే ప్రార్థనా పిలుపులో ఎందరో వింటారు. అయినప్పటికీ కొందరు వికృత ప్రయత్నం చేస్తున్నారు. వీరు ఏమని చెప్పాలని ప్రయత్నిస్తున్నారంటే, 'అల్లాహ్' అనే పదం ఖుర్'ఆన్‌లో లేనప్పటికీ ముస్లిములు ఆ పదాన్ని సృష్టించు కున్నారని చెప్పాలని. కాని **ఖుర్'ఆన్‌లో ఆ పదం ఎన్నోసార్లు చెప్పబడింది అనే నిజం వారికి తెలుసు.**

ఈసా(అ)వారి మాతృభాషయైన అరమాయిక్‌లో సృష్టికర్త పేరు 'అల్లాహ్'. ఆ భాష ఇప్పటికీ వాడుకలోనే ఉంది. అదే విధంగా హెబ్రూ భాషలో కూడా ఆ పేరు 'అల్లాహ్'యే. ఈ భాషల లిపితో సహా ఒక పరిశోధనను పూర్తి వివరాలతో 'సకల లోకాలను సృష్టించిన సృష్టికర్త పేరు ఏమిటి?' పుస్తకంలో వివరించాము. మా వెబ్‌సైట్‌లో చూడవచ్చు. ఆ పుస్తకాన్ని ఉచితంగా మీరు డౌన్‌లోడ్ కూడా చేసుకోవచ్చు.

వక్రీకరించే వారికి తప్పించుకోలేని పరిస్థితి ఎదురైంది. మరో ఎత్తు వేశారు. 'అల్+ఇలాహ్=అల్లాహ్' అనే ఓ స్లోగన్‌ని అవగాహనలేని కొందరు ముస్లిముల చేత ప్రచారం చేయించారు. అరబీ జ్ఞానం లేని వారందరూ అది నిజమని నమ్మారు.

ఈ స్లోగన్ ద్వారా 'అల్లాహ్' అనేది పేరు కాదని చెప్పడం వారి ముఖ్య ఉద్దేశ్యం.

అరబీ గ్రామర్ ప్రకారం 'అల్+ఇలాహ్=అల్లాహ్' అనేది తప్పు. అరబీ భాష తెలుసుకున్న ప్రైమరీ పాఠశాల కుర్రాడు కూడా ఇది తప్పని చెప్పగలడు. ఈ విషయాన్ని కూడా సృష్టికర్త పేరు ఏమిటి? పుస్తకంలో వివరించాము.

**'అల్లాహ్'** అని ఖుర్‌ఆన్‌లో చెప్పి ఉండవచ్చేమోగాని, అది సృష్టికర్త పేరు కాదని వితండవాదం చేస్తూ '**నా పేరు అల్లాహ్**' అని ఖుర్‌ఆన్‌లో ఎక్కడైనా అల్లాహ్ చెప్పారా? అని మూర్ఖంగా మాట్లాడటం మొదలు పెట్టారు.

'బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్' అంటే "**అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన 'అల్లాహ్' పేరుతో**" అని అర్థం. **అల్లాహ్ పేరుతో అనేది స్పష్టం.** అర్-రహమాన్ మరియు అర్-రహీమ్ అనేవి అల్లాహ్ గుణాలను తెలిపే పేర్లు అని ఇప్పటికే చెప్పుకున్నాం. అప్పుడు బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్‌లో మూడు పేర్లు ఉన్నట్లు. కాని పేర్లతో అని చెప్పలేదు, 'అల్లాహ్ పేరుతో' అని మాత్రమే చెప్పడం జరిగింది.

పాఠకులకు మరికాస్త వివరంగా అర్థం కావడానికి 'అల్లాహుతాలా మరియు ఆయన సందేశహరుడైన మూసా(అ) వారి మధ్య జరిగిన సంభాషణ ఇక్కడ ఇస్తున్నాము.

> అతను ఒక మంటను చూసినపుడు తన ఇంటివారితో ఇలా అన్నాడు : ఆగండి! నిశ్చయంగా నాకొక మంట కనబడుతుంది. బహుశా నేను దాని నుండి మీ కొరకు ఒక కొరివిని తీసుకుని వస్తాను లేదా ఆ మంట దగ్గర నాకేదైనా మార్గదర్శకత్వం లభించవచ్చు.'
>
> అతడు దాని దగ్గరకు చేరినప్పుడు ఇలా పిలువబడ్డాడు : "ఓ మూసా! **నిశ్చయంగా నేను ప్రభువును.** కావున నీవు నీ చెప్పులను విడువు. వాస్తవానికి నీవు పవిత్రమైన తువా లోయలో ఉన్నావు.
>
> మరియు నేను నిన్ను (ప్రవక్తగా) ఎన్నుకున్నాను. నేను నీపై అవతరింప జేసే దివ్యజ్ఞానంని జాగ్రత్తగా విను. **నిశ్చయంగా నేనే అల్లాహ్‌ను!** నేను తప్ప మరొక ఆరాధ్యుడు లేడు! కావున నన్నే ఆరాధించు మరియు నన్ను స్మరించడానికి సలాత్ (నమాజ్)ను స్థాపించు. (20:10-14)

**'నేనే ప్రభువును. నేనే అల్లాహ్‌ను'** అని పై ఆయత్‌లలో అల్లాహ్ ఎంతో స్పష్టంగా చెప్పారు. అదే విధంగా **'ఆయనే అల్లాహ్'** అని తెలిపే ఆయత్‌లు ఎన్నో ఉన్నాయి ఖుర్‌ఆన్‌లో. ఈ వ్యాసం ప్రారంభంలో వాటిలో కొన్నింటిని తెలియజేశాము.

**'నేనే అల్లాహ్‌ను'** అని చెబితే **'నా పేరు అల్లాహ్'** అని చెప్పినట్లు కాదట. "నా పేరు అల్లాహ్" అని చెప్పి ఉండాలి అని మూర్ఖత్వపు వాదన ప్రారంభించారు.

వీరి మూర్ఖత్వం ఏ స్థాయిలో ఉందో క్రింది ఉదాహరణ ద్వారా తెలుసుకోవచ్చు.

ఒకరు 'ఇబ్రాహీమ్' అనే పేరుగల ఓ వ్యక్తిని కలవడానికి వెళ్ళాడు. ఆయన ఎలా ఉంటారో అతనికి తెలియదు అనుకుందాం. ఇబ్రాహీమ్ ఉండే ప్రాంతానికి వెళ్ళి, **'ఇక్కడ ఇబ్రాహీమ్ అనే పేరుగల ఆయన ఎక్కడ ఉంటారో చెప్పగలరా?'** అని ఎవరినైనా అడిగినప్పుడు, అక్కడే గనుక ఇబ్రాహీమ్ అనే వ్యక్తి ఉండి ఉంటే అతడు వెంటనే **'నేనే ఇబ్రాహీమ్‌ని'** అని అంటాడు. ఒకవేళ ఇబ్రాహీమ్ అనే వ్యక్తి అక్కడ లేకుండా కాస్త దూరంగా ఉంటే, అక్కడ ఉన్నవారు 'ఆయనే ఇబ్రాహీమ్' అని చూపుతారు.

**'ఆయనే ఇబ్రాహీమ్'** అన్నారుగాని **'అతని పేరు ఇబ్రాహీమ్'** అని అనలేదని ఆ వ్యక్తి అక్కడి నుండి ఇబ్రాహీమ్‌ని కలవకుండా వెళ్ళిపోతే, ఆ వ్యక్తిని **ఏమనాలి?**

**'నేనే ఇబ్రాహీమ్‌ని'** అని అతడు స్వయంగా చెప్పినా, **'ఆయనే ఇబ్రాహీమ్'** అని వేరే వ్యక్తులు చెప్పినా ఆ వ్యక్తి పేరు ఇబ్రాహీమ్ అని తెలుసుకోలేక పోయాడంటే, ఎంతటి మూర్ఖుడు ఆ వ్యక్తి?

ఇటువంటి మూర్ఖులు మరియు కొంతమంది మునాఫిక్‌లు (కపట విశ్వాసులు) నేడు ముస్లిమ్ సమాజంలో ధర్మప్రచారం ముసుగులో ఇస్లామ్‌ని మరియు ముస్లిములకు నష్టం కలిగించడానికి పనిచేస్తున్నారు.

ముస్లిములకు అరబీ భాష తెలియదనే ధైర్యంతో, ముస్లిములలో అనుమానాలు కలిగించాలని ఎంత కుటిల ప్రయత్నం చేస్తున్నారో చూశారా!

అల్లాహ్ పేరును తొలగించడం వీరికి సాధ్యమా? వీరు ఎన్ని సర్కస్ ఫీట్లు చేసినా అది వారికి సాధ్యం కాదు. ఖుర్‌ఆన్‌ను కంఠస్థం చేసిన కోట్లాదిమంది హృదయాల నుండి ఆ పేరును తొలగించడం ఎవరికీ సాధ్యం కాదు.

సలాత్ (నమాజ్)కోసం మస్జిద్ నుండి ఇచ్చే పిలుపు (అజాన్)లో గాని, సలాత్(నమాజ్)లో గాని వేరే భాషను ఉపయోగించకుండా అరబీ భాషనే ఎందుకు ఉపయోగిస్తారో ఇప్పటికైనా అర్థమై ఉండాలి. ఒకవేళ సలాత్ (నమాజ్)లలో ఒరిజినల్ అరబీకి బదులుగా భాషానువాదాలు గనుక వాడి ఉంటే, **ఈ పాటికి ధర్మం యొక్క రూపు రేఖలు ఎలా ఉండేవో!** అందుకే అల్లాహుతాలా అరబీ భాషలో ఖుర్‌ఆన్‌ను అవతరింప జేసి, దానిని రక్షిస్తానని వాగ్దానం చేశారు.

(الله) ఈ పదమే అల్లాహ్. మీకు అరబీ రాకపోయినా సరే, ఈ పదాన్ని పోలిన పదాన్ని ఖుర్‌ఆన్‌లో మీరు సులభంగా గుర్తించగలరు.

‘అల్లాహ్’ అనే పదాలు ఖుర్’ఆన్‌లో చాలా చాలా ఉన్నాయి.

ఖుర్’ఆన్‌లో మొత్తం ఆయత్‌ల సంఖ్య 6,236. అయితే **వాటిలోని 1873 ఆయత్‌లలో ‘అల్లాహ్’ అనే పదాలు ఉన్నాయి.** కొన్ని ఆయత్‌లలో ఒకటి కంటే ఎక్కువ సార్లు ‘అల్లాహ్’ అనే పదాలు ఉన్నాయి. మేము లెక్కించిన దాని ప్రకారం 2,766 సార్లు అల్లాహ్ అనే పదం ఖుర్’ఆన్‌లో చూడవచ్చు. ప్రతీ సూరహ్‌కి ప్రారంభంలో ఉండే **‘బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్’**లోని అల్లాహ్ పదాలను కూడా కలుపుకుంటే మొత్తం ‘అల్లాహ్’ పదాల సంఖ్య **2,879**. పొరపాటున మేము ఎక్కడైనా కొన్ని పదాలను వదిలేసి ఉండవచ్చేమో! కాబట్టి మొత్తం పదాల సంఖ్య 2,879 కంటే ఎక్కువే కావచ్చు గాని తక్కువ ఉండటానికి అవకాశం లేదు.

**ఇన్ని వేల సంఖ్యలో ‘అల్లాహ్’ పదాలను ఖుర్’ఆన్ కలిగి ఉండగా, ఖుర్’ఆన్‌లో ఎక్కడైనా అల్లాహ్ అనే పదం ఉందా అని ఏ విధంగా అడగగలుగు తున్నారు ?**

ఈ రోజుల్లో ధర్మం పేరుతో మోసం చేసేవారున్నారని చెప్పడం విని ఎవరికీ పెద్దగా ఆశ్చర్యమేమీ కలగదు. ఎందుకంటే పసిపిల్లలు త్రాగే పాలలో కూడా కల్తీ చేసే దుర్మార్గులున్న సమాజంలో ధర్మప్రచారం చేస్తున్నామని చెబుతూ దుష్ప్రచారం చేసే మోసగాళ్ళు ఉండటంలో వింత ఏమీ లేదు కదా!

వీరందరూ ఇంతగా బరితెగించ గలిగారంటే, ముస్లిములు ఖుర్’ఆన్‌కు ఎంత దూరంగా ఉన్నారో స్పష్టంగా అర్థమౌతుంది. మొదటి రెండు సూరహ్‌లలో అల్లాహ్ అనే పదాన్ని కలిగిన ఆయత్‌ల నంబర్లు పాఠకుల ఉపయోగార్థం ఇక్కడ ఇస్తున్నాము. క్రింది ఆయత్‌లలో అల్లాహ్ పదాన్ని గుర్తించడానికి ప్రయత్నించండి.

[001:001][001:002][002:007][002:008][002:009][002:010]
[002:015][002:017][002:019][002:020][002:022][002:023]
[002:026][002:027][002:028][002:036][002:055][002:060]
[002:061][002:062][002:064][002:067][002:070][002:072]
[002:073][002:074][002:075][002:076][002:077][002:079]
[002:080][002:083][002:085][002:088][002:089][002:090]
[002:091][002:094][002:095][002:096][002:097][002:098]
[002:098][002:101][002:102][002:103][002:105][002:106]
[002:107][002:109] [002:110][002:112][002:113][002:114]
[002:115][002:116] [002:118][002:120][002:126][002:132]
[002:136][002:137][002:138][002:139][002:140][002:142]
[002:143][002:144][002:148][002:149][002:153][002:154]
[002:156][002:158][002:159][002:161][002:164][002:165]
[002:167][002:169][002:170][002:172][002:173][002:174]
[002:176][002:177][002:181][002:182][002:185][002:186]
[002:187][002:189][002:190][002:192][002:193][002:194]
[002:195][002:196][002:197][002:198][002:199][002:200]
[002:202][002:203][002:204][002:205][002:206][002:207]
[002:209][002:210][002:211][002:212][002:213][002:214]
[002:215][002:216][002:217][002:218][002:219][002:220]
[002:221][002:222][002:223][002:224][002:225][002:226]
[002:227][002:228][002:229][002:230][002:231][002:232]
[002:233][002:234][002:235][002:237][002:238][002:239]
[002:240][002:242][002:243][002:244][002:245][002:246]
[002:247][002:249][002:251][002:252][002:253][002:255]
[002:256][002:257][002:258][002:260][002:261][002:262]
[002:263][002:264][002:265][002:266][002:267][002:268]
[002:270][002:271][002:272][002:273][002:275][002:276]
[002:278][002:279][002:281][002:282][002:283][002:284]
[002:285][002:286]

**అల్లాహ్ అనే పదం పు:లింగానికి చెందినదా? స్త్రీ లింగానికా?**

“భూమి సూర్యుని చుట్టూ తిరుగు**తుంది**” అంటారు. అంతేగాని భూమి సూర్యుని చుట్టూ తిరుగు**తున్నాడు**” అని ఎవరైనా అనడం మీరు విన్నారా?

అంటే భూమిని స్త్రీ అని అనుకోవాలా?

“సూర్యుడు అస్తమించా**డు**” అంటారు. అంతేగాని సూర్యుడు అస్తమిం**చింది** అని అనరు.

అంటే సూర్యుడు పురుషుడు అని అనుకోవాలా?

ఇక చంద్రుడు గురించి అయితే చెప్పనవసరమే లేదు. ‘మామా! చందమామా!’ అంటూ ఎన్నో రకాల పాటలు కూడా ఉన్నాయి.

## ఆయన!

ఖుర్’ఆన్‌లో ‘అల్లాహ్’ను ‘ఆయన’ అని సంబోధించడం జరిగింది. అది గౌరవార్థమే గాని, ఆ పదానికి జెండర్‌ని ఆపాదించడం సరికాదు. ఎందుకంటే అల్లాహ్‌ను పోలినదేదీ విశ్వంలో లేదని చెప్పినప్పుడు ‘స్త్రీ’ లింగంతోగాని, పు:లింగంతోగాని ఏ విధంగా కలపగలం?

## మేము!

ఖుర్’ఆన్‌లో అల్లాహ్ కొరకు ‘మేము’ అనే పదం ఎందుకు ఉపయోగించబడింది? ఇది అర్థం కావాలంటే మన నిత్యజీవితంలో జరిగే సామాన్య విషయాలను ఓసారి మననం చేసుకుంటే స్పష్టంగా అర్థమౌతుంది.

మీరు ఆఫీసు నుండి ఇంటికి చేరేసరికి, మీ ఇంటి దగ్గర మీ నౌకరు మీ కోసం ఎదురు చూస్తున్నాడని అనుకుందాం. మీరు ఏమి అంటారు?

“**నువ్వు ఎప్పుడొచ్చావు?**” (నువ్వు - అంటే ఏకవచనం)

ఒకవేళ ఇద్దరు నౌకర్లు ఉంటే,

“**మీరు ఎప్పుడు వచ్చారు?**” (మీరు - అంటే బహువచనం)

సరే, నౌకర్లు కాకుండా, మీ కోసం మీ ఇంటి దగ్గర మీ పై అధికారి (బాస్) ఎదురు చూస్తుంటే ఏమంటారు?

“**మీరు ఎప్పుడు వచ్చారు, సార్?**” అని గౌరవంగా పలకరిస్తారా? లేక మీరు అని సంబోధిస్తే బహువచనం అవుతుంది కాబట్టి,

“**నువ్వు ఎప్పుడు వచ్చావు, సార్?**” అని అంటారా?

ఆ సందర్భములో మీకు ఏకవచనమా, బహువచనమా అనేది ముఖ్యంగా అనిపించదు. గౌరవించడాన్నే ముఖ్యంగా భావిస్తారు. మీరు

మీ బాస్‌కే ఇంత గౌరవమిస్తే దేశాధినేతకు ఇంకెంత గౌరవమిస్తారు?

మరి వీరందరిని సృష్టించిన 'అల్లాహ్' 'మేము' అని గౌరవార్థం ఉపయోగించడంలో ఎందుకు అభ్యంతరం కలిగింది?

కాబట్టి 'అల్లాహ్' అనేది ఒక ప్రత్యేకమైన పదం. ఏకవచనం, బహువచనం వంటి వచనాలకు ఈ పదం అతీతమైనది. అదే విధంగా ఈ పదానికి స్త్రీ లేదా పురుష లింగాలను తెలియజేసే విధంగా జెండర్‌ని కలపలేము. ''**అల్లాహ్ అనేది సృష్టికర్త పేరు**''. **ఆయన ఒక్కడు.** సర్వశక్తివంతుడు, అనంత కరుణామయుడు, మహా వివేకవంతుడు, సర్వజ్ఞాని .....

## ప్రవక్తలు

ప్రవక్తల గురించి అల్లాహ్ స్పష్టంగా ముహమ్మద్(స)వారికి వినిపించారు. ఆ విషయాలు అల్లాహ్ నుండి వచ్చిన సత్యాలు.

''... **ముహమ్మద్ కేవలం ఓ సందేశహరుడు మాత్రమే! వాస్తవానికి అతనికి పూర్వం అనేక సందేశహరులు గడిచిపోయారు** ... అల్లాహ్ అనుమతి లేనిదే, ఏ ప్రాణి కూడా మరణించజాలదు ....'' (ఖుర్'ఆన్ 3:144-145)

(ఓ మానవులారా!) ముహమ్మద్ మీ పురుషుల్లో ఎవ్వడికీ తండ్రి కాడు. కాని అతను అల్లాహ్ యొక్క సందేశహరుడు మరియు ప్రవక్తలలో చివరివాడు మరియు వాస్తవానికి అల్లాహ్‌యే ప్రతీ విషయపు జ్ఞానం గలవాడు. ఓ విశ్వాసులారా! **అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించండి.** మరియు ఉదయం మరియు సాయంత్రం ఆయన పవిత్రతను కొనియాడుతూ ఉండండి. (ఖుర్'ఆన్ 33:40-41)

మరియు (ఓ ప్రవక్తా!) నీ హృదయాన్ని స్థిరపరచటానికి, మేము ప్రవక్తల గాథలను నీకు వినిపిస్తున్నాము. మరియు ఇందులో నీకు సత్యం వచ్చింది మరియు విశ్వాసులకు హితబోధ మరియు జ్ఞాపిక. (11:120)

(ఓ ప్రవక్తా!) మేము ఈ ఖుర్'ఆన్ ద్వారా అవతరింపజేసిన కథలలో ఉత్తమమైన గాథను నీకు వినిపించ బోతున్నాము మరియు ఇంతకు ముందు నీవు దీనిని ఎరుగవు. (12:3)

మరియు (ఓ ముహమ్మద్!) వాస్తవానికి నీకు పూర్వం అనేకమంది ప్రవక్తలను పంపాము. మరియు వారికి భార్యా పిల్లలను ప్రసాదించాము. **అల్లాహ్ అనుమతి లేకుండా, ఏ అద్భుత సంకేతాన్ని తెచ్చి చూపేశక్తి ఏ ప్రవక్తకూ లేదు** ..... (ఖుర్'ఆన్ 13:38)

నిశ్చయంగా మేము నూహ్‌కు మరియు అతని తరువాత వచ్చిన ప్రవక్తలకు వహీ పంపినట్లు, నీకు కూడా సందేశం పంపాము. మరియు మేము ఇబ్రాహీమ్‌కు, ఇస్మాయీల్‌కు, ఇస్‌హాఖ్‌కు, యాఖూబ్‌కు మరియు అతని సంతతివారికి మరియు ఈసా, అయ్యూబ్, యూనుస్, హారూన్ మరియు సులైమాన్‌లకు కూడా వహీ పంపాము. మరియు మేము దావూద్‌కు జబూర్ గ్రంథాన్ని ప్రసాదించాము. మరియు వాస్తవంగా మేము పంపిన ప్రవక్తలలో కొందరి గాథలను నీకు తెలిపాము. మరియు ఇతర ప్రవక్తలను గురించి మేము నీకు తెలుపలేదు. మరియు అల్లాహ్ మూసాతో నేరుగా మాట్లాడాడు. ప్రవక్తలను శుభవార్తలు ఇచ్చేవారిగా మరియు హెచ్చరికలు చేసేవారిగా పంపాము. (4:163-165)

### ప్రవక్తలంతా ఏ పేరుతో ఆరాధించారు?

తొలి మానవుడు ఆదమ్(అ)వారి నుండి చిట్టచివరి సందేశహరుడైన ముహమ్మద్(స)వారి వరకూ, ప్రతీ ప్రవక్త మరియు సందేశహరుడు 'అల్లాహ్'నే ఆరాధించారు, ఆయననే వేడుకున్నారు. 'అల్లాహ్ పేరుతోనే (బిస్మిల్లాహ్) ప్రారంభించారు.

### నూహ్(అ)

మరియు (**నూహ్**) అన్నాడు : ఇందులోకి ఎక్కండి **అల్లాహ్ పేరుతో** (బిస్మిల్లాహ్) దీని పయనం మరియు దీని ఆగటం. నిశ్చయంగా నా ప్రభువు క్షమాశీలుడు అపార కరుణా ప్రదాత. (ఖుర్'ఆన్ 11:41)

### సులైమాన్(అ)

(సులైమాన్) అన్నాడు : ''నీవు సత్యం పలుకుతున్నావో, లేదా అబద్ధాలాడే వారిలో చేరినవాడవో, మేము ఇప్పుడే చూస్తాము. నా ఈ ఉత్తరం తీసుకొని పో! దీనిని వారి వద్ద పడవేయి. తరువాత వారి నుండి ఒకవైపుకు తొలగిపోయి వారేమి సమాధానమిస్తారో చూడు.'' (రాణి) అన్నది : ''ఓ నా ఆస్థాన నాయకులారా! ఇదిగో నా వైపుకు ఒక విశేషమైన ఉత్తరం పంపబడింది. నిశ్చయంగా, ఇది సులైమాన్ దగ్గర నుండి వచ్చింది.
మరియు ఇది : **'బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్'** తో ప్రారంభించ బడింది.'' (ఖుర్'ఆన్ 27:27-30)

### హూద్(అ)

మరియు 'ఆద్ జాతివారి దగ్గరకి వారి సహోదరుడు హూద్‌ను పంపాము. అతను ఇలా అన్నాడు : ''**నా జాతి ప్రజలారా! మీరు అల్లాహ్‌నే ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరొక ఆరాధ్యుడు లేడు.** మీరు కేవలం అబద్ధాలు కల్పిస్తున్నారు. (ఖుర్'ఆన్ 11:50)

### సాలిహ్(అ)

ఇక స'మూద్ వారి వద్దకు వారి సహోదరుడు సాలిహ్‌ను పంపాము. అతను అన్నాడు : ''**నా జాతి ప్రజలారా! అల్లాహ్‌నే ఆరాధించండి. ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు లేడు.** ఆయనే మిమ్మల్ని భువినుండి పుట్టించి దానిలో మిమ్మల్ని నివశింప జేశాడు. కనుక మీరు ఆయన క్షమాభిక్ష వేడుకోండి (ఖుర్'ఆన్ 11:61)

ముందరి పేజీలలో మూసా(అ)వారితో అల్లాహ్ జరిపిన సంభాషణ చదివారు. మూసా(అ)వారిని అనుసరించిన వారు యూదులు. మూసా(అ)వారు అల్లాహ్‌నే ఆరాధించారు. యూదులు కూడా అల్లాహ్‌నే ఆరాధించారు.

ఒకవేళ యూదులు వాదనకు దిగితే, వారితో ఏమి మాట్లాడమని ప్రవక్త(స)వారికి అల్లాహుతాలా చెప్పారో క్రింది ఆయత్‌లో చూడండి :

"... **మా ఆరాధ్యుడు మరియు మీ ఆరాధ్యుడు ఒక్కడే మరియు మేము ముస్లిములమై** (అల్లాహ్‌కు విధేయులమై) **ఉన్నాము** ..." (ఖుర్'ఆన్ 29:46)

ఇది విని ఏ ఒక్క యూదుడు కూడా అభ్యంతరం తెలపలేదు. "మీ ఆరాధ్యుడు 'అల్లాహ్' మరియు మా ఆరాధ్యుని పేరు వేరే ఉంది" అని వారెన్నడూ చెప్పలేదు. ఖుర్'ఆన్ విని అబ్దుల్లాహ్ బిన్ సలామ్(రజి) ఇస్లామ్ స్వీకరించారు. ఈయన పూర్వం యూదుడు. మరో యూద నాయకుడైన అబ్దుల్లాహ్ బిన్ సబా ముహమ్మద్(స)వారిని వ్యతిరేకించాడు.

వీరి పేర్లను గమనించండి. ఇద్దరి పేర్లలో 'అబ్దుల్లాహ్' అని ఉంది. అబ్దుల్లాహ్ అంటే అల్లాహ్ యొక్క దాసుడు.

ఈసా(అ)వారి మాతృభాషయైన అరమాయిక్‌లో ఈసా(అ)వారి తల్లిగారి పేరు 'మర్యమ్'. అరమాయిక్ డిక్షనరీ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంది. ఆ భాషలో కూడా సృష్టికర్త పేరు **అల్లాహ్**. ఆ భాష ఇంకా వాడుకలో ఉంది.

అల్లాహ్ పేరు విషయంలో ఆ కాలంలో ఎటువంటి అభ్యంతరాలు లేవు. ఈ మధ్యనే కొన్ని సంవత్సరాల క్రితం నుండే అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రంథాలను అవి ఏ భాషలలో అవతరించబడ్డాయో ఆ భాషలలో చదివితే సృష్టికర్త పేరు 'అల్లాహ్' అని తెలుస్తుంది. ఈ విషయంలో ఎంతో ఆసక్తికరమైన పరిశోధనను మేము పబ్లిష్ చేయడం జరిగింది. మా వెబ్‌సైట్ www.saanthibaata.net లో చూడవచ్చు.

అరేబియా ప్రాంతానికి చుట్టు ప్రక్కల దేశాలలో జరిపిన పురావస్తు త్రవ్వకాలలో కొన్ని ప్రార్థనా మందిరాలు బయటపడ్డాయి. వాటి గోడలపై **బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్** అని వ్రాసి ఉన్నాయి. అవి ఏ కాలానికి చెందినవో తెలుసా మీకు? అప్పటికింకా ముహమ్మద్(స)వారు జన్మించలేదు. ముహమ్మద్(స)వారి జననానికి దాదాపు 200 సంవత్సరాల పూర్వానికి చెందినవి అవి.

## అల్లాహ్ నామస్మరణ

- **అత్యధికంగా స్మరించాలి**

ఓ విశ్వాసులారా! **అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించండి** (ఖుర్'ఆన్ 33:41) O you who have believed, remember ALLAH with much remembrance

- **గొప్పది** (The remembrance of ALLAH is greater)

(ఓ ప్రవక్తా!) నీపై వహీ ద్వారా అవతరింప జేయబడిన గ్రంథాన్ని చదివి వినిపించు మరియు సలాత్‌ను స్థాపించు. నిశ్చయంగా, సలాత్ (నమాజ్) అసహ్యాకరమైన పనుల నుండి నిరోధిస్తుంది. మరియు **అల్లాహ్ ధ్యానమే గొప్పది**. మరియు వారు చేసేదంతా అల్లాహ్‌కు బాగా తెలుసు. (ఖుర్'ఆన్ 29:45)

( وَلَذِكْرُ اللهِ أَكْبَرُ వలజిక్‌రుల్లాహి అక్బర్)

- **కేవలం ఇది మాత్రమే హృదయలకు తృప్తినిస్తుంది**

ఎవరైతే విశ్వసించారో, వారి హృదయాలు అల్లాహ్ ధ్యానం వలన తృప్తి పొందుతాయి. జాగ్రత్తగా వినండి. **కేవలం అల్లాహ్ ధ్యానమే హృదయాలకు తృప్తినిస్తుంది.** (ఖుర్'ఆన్ 13:28)

క్రింది ఆయత్‌ను గమనించండి :

అల్లాహ్ సర్వశ్రేష్ఠమైన బోధనను ఒక గ్రంథ రూపంలో అవతరింప జేశాడు. దానిలో ఒకే రకమైన (వచనాలు) మాటిమాటికి ఎన్నో విధాలుగా (విశదీకరించాడు). తమ ప్రభువుకు భయపడే వారి శరీరాలు దాని (పఠనంతో) గజగజ వణుకుతాయి. కాని తరువాత వారి చర్మాలు మరియు **వారి హృదయాలు "అల్లాహ్ ధ్యానం" వలన మెత్తబడతాయి.** ఇది అల్లాహ్ మార్గదర్శకత్వం. ఆయన దీనితో తాను కోరినవారికి మార్గదర్శకత్వం చేస్తాడు ..." (ఖుర్'ఆన్ 39:23)

- **సలాత్ (నమాజ్) కూడా అల్లాహ్ స్మరణే**

ఓ విశ్వాసులారా! శుక్రవారం రోజు సలాత్ కొరకు పిలుపు ఇవ్వబడి నప్పుడు, మీరు మీ వ్యాపారాలను విడిచి అల్లాహ్ స్మరణ వైపునకు పరుగెత్తండి. మీరు తెలుసుకోగలిగితే, ఇది మీకు ఎంతో ఉత్తమ మైనది (ఖుర్'ఆన్ 62:9)

(మూసా(అ) వారితో)

నిశ్చయంగా నేనే అల్లాహ్‌ను! నేను తప్ప మరొక ఆరాధ్యుడు లేడు! కావున నన్నే ఆరాధించు మరియు నన్ను స్మరించడానికి సలాత్‌ను స్థాపించు (ఖుర్'ఆన్ 20:14)

- **అల్లాహ్ స్మరణ మరియు సలాత్ (నమాజ్)**

సలాత్ కూడా అల్లాహ్ స్మరణే! అయితే సలాత్ ఒక్కటే అల్లాహ్ స్మరణ కాదు. రోజులో కొంత భాగం మాత్రమే సలాత్‌కి కేటాయిస్తాం. అయితే అల్లాహ్ స్మరణ అనేది నిద్రలో తప్ప మిగతా సమయంలో ఎక్కువగా చేయబడుతుంది.

ప్రజలలో కొందరిని - వారి వ్యాపారం గానీ మరియు క్రయ విక్రయాలు గానీ - **అల్లాహ్ స్మరణ నుండీ, సలాత్ స్థాపించడం నుండీ** మరియు జకాత్ (విధిదానం) ఇవ్వడం నుండీ తప్పించ లేవు. ... (ఖుర్'ఆన్ 24:37)

- **అల్లాహ్ ధ్యానం నుండి తప్పించడానికి షైతాన్ చేసే ప్రయత్నం**

నిశ్చయంగా షైతాన్ మద్యపానం మరియు జూదం ద్వారా మీ మధ్య విరోధాలు మరియు విద్వేషాలు రేకెత్తించాలని మరియు మిమ్మల్ని **అల్లాహ్ ధ్యానం నుండి** మరియు **సలాత్ నుండి** తొలగించాలని కోరుతున్నాడు. అయితే మీరు ఇప్పుడైనా మానుకోరా? (ఖుర్'ఆన్ 5:91)

చూశారా! 'అల్లాహ్' నామస్మరణ వలన కలిగే మేలు గురించి ఖుర్'ఆన్ ఎంత స్పష్టంగా చెప్పిందో!

సలాత్ (నమాజ్) పూర్తయ్యాక 33 సార్లు సుబహానల్లాహ్ (**అల్లాహ్ పరమ పవిత్రుడు**), 33 సార్లు అల్-హమ్‌దులిల్లాహ్ (**అల్లాహ్‌కే సమస్త పొగడ్తలన్నీ మరియు కృతజ్ఞతలన్నీ**), 33 సార్లు అల్లాహు అక్బర్ (**అల్లాహ్ గొప్పవాడు**) అని అల్లాహ్‌ని స్మరిస్తాము.

ఆగష్టు'2011 సంచికలో 'దుఆ' ప్రత్యేక వ్యాసాన్ని అందించాము. ఆ వ్యాసం ఇంకా పూర్తి కాలేదు. 'దుఆ' కూడా ఆరాధనే! అది కూడా అల్లాహ్ స్మరణ వంటిదే! 'దుఆ'లు కూడా అధికంగా చేసుకోవాలి.

'అల్లాహ్' పేరును తొలగించి ఆ స్థానంలో 'దేవుడు'అనో లేక మీకు ఇష్టమైన మరేదో పేరును చెప్పుకోవడం వలన మీరు కోల్పోయేదేమిటో అర్థం చేసుకున్నారు కదా?

**మీ చేత 'అల్లాహ్' నామస్మరణ జరగకుండా ఆపించి, అల్లాహ్ అనుగ్రహాల నుండి మిమ్మల్ని దూరం చేయడానికి ధర్మ ప్రచారం పేరుతో ఎంత వికృతమైన పనిచేస్తున్నారో ఇప్పటికైనా అర్థం చేసుకోండి.**

**షైతాన్** వారిపై ప్రాబల్యం పొందినందు వలన వారిని **అల్లాహ్ ధ్యానం నుండి మరపింప జేశాడు.** అలాంటివారు **షైతాన్ పక్షానికి చెందిన వారు.** జాగ్రత్త! షైతాన్ పక్షానికి చెందినవారు, వారే! నిశ్చయంగా నష్టపోయేవారు (ఖుర్'ఆన్ 58:19)

కాబట్టి షైతాన్ పక్షంవారు మిమ్మల్ని అల్లాహ్ ధ్యానం నుండి తొలగించడానికి ప్రయత్నిస్తున్నారు. వారి వలలో పడకుండా జాగ్రత్త పడండి.

**మీ దగ్గరున్న తెలుగు అనువాదపు ఖుర్'ఆన్‌లో అల్లాహ్ అని లేకపోతే 'అల్లాహ్' పేరును కలిగిన సరియైన తెలుగు ఖుర్'ఆన్‌ను తీసుకోండి. లేకపోతే మీ దగ్గరున్న ఖుర్'ఆన్‌లో 'అల్లాహ్'అని ఉండవలసిన స్థానంలో మరేదైనా ఉంటే, ఆ పదాన్ని పెన్‌తో కొట్టివేసి అక్కడ 'అల్లాహ్' అని వ్రాసుకోండి. అల్లాహ్ పదం లేని ఖుర్'ఆన్ కాపీలను ఇతరులకు ఇవ్వకండి.**

### ఖుర్'ఆన్ పారాయణం

మరియు ఖుర్'ఆన్ పారాయణం జరిగేటప్పుడు దానిని శ్రద్ధగా వినండి మరియు నిశ్శబ్దంగా ఉండండి. **అప్పుడు మీరు కరుణింప బడవచ్చు** (ఖుర్'ఆన్ 7:204)

కరుణింపబడే అవకాశం అంటే అదేమైనా సామాన్య విషయమా? స్వర్గాన్ని పొందడానికి కేవలం మన మంచి ఆచరణలొక్కటే సరిపోవు. వాటికి తోడుగా అల్లాహ్ కరుణ కూడా మనం పొందగలగాలి. అప్పుడే స్వర్గం లభిస్తుంది.

కాబట్టి కరుణ ఎంత అవసరమో చూశారా! ఖుర్'ఆన్ పారాయణం వలన కరుణించబడే ఒక అవకాశం ఉంది. దయచేసి కనీసం ఓ 10 నిమిషాలైనా ఖుర్'ఆన్ చదవండి. సమయం లేదని సమర్థించుకోవద్దు.

ఓ 10 నిమిషాల పాటు అల్లాహుతాలా మానవులకు తాను అనుగ్రహిస్తున్న ఆక్సిజన్‌ను గాలిలో లేకుండా చేస్తే, ఆ పది నిమిషాల పాటు ఆక్సిజన్ కోసం సిలిండర్‌ను గనుక ఉపయోగిస్తే మనకు ఎంత ఖర్చవుతుంది? తరువాత ఆ ఖర్చును భర్తీ చేసుకోవడానికి మనం ఎంత సమయం కష్టపడాలి? జీవించడానికి అల్లాహ్ ఏర్పాటు చేసిన ఎన్నింటినో ఉచితంగా ఉపయోగించు కుంటున్నాము. ఆలోచించగలిగే వారికి ఇది అర్థమౌతుంది. **అయినాసరే, కృతజ్ఞత చూపడం లేదు.** అయినా సరే ఆయన ఆక్సిజన్‌ను ఆపేసి మన ఊపిరి ఆగిపోయేలా చేయడం లేదు. అల్లాహ్ అనంత కరుణామయుడు.

ఎంతో డబ్బు ఖర్చు పెట్టి ప్రోగ్రాములకు వెళ్ళేవారున్నారు. ఎవరో కొందరు ఇచ్చే ప్రసంగాల కోసం ఒక రోజో, రెండు రోజులో తమ జీవితంలోని విలువైన సమయం కేటాయిస్తారు. కాని ఖుర్'ఆన్ చదవడానికి మాత్రం సమయం ఉండదు. **అల్లాహ్ ప్రసంగమైన ఖుర్'ఆన్, అందరి ప్రసంగాల కంటే చాలా ఉత్తమమైనది.**

**అవివేకం** : చదువుకున్న వారిలో మరియు చదువుకోని వారిలో ఇరువురిలోనూ మంచివారు మరియు చెడ్డవారు ఉంటారు. అదేవిధంగా ధార్మిక చదువు పూర్తి చేసుకుని ఆలిమ్ అని చెప్పుకునేవారిలో కూడా కొందరు చెడ్డవారుంటారు. వారు డబ్బు కోసం ఏదైనా మాట్లాడుతారు. ఖుర్'ఆన్‌లో స్పష్టంగా ఉన్న విషయాలను కూడా చదవకుండా, అటువంటి అవినీతి ఆలిమ్‌లను ప్రశ్నించడం మరియు ఒకవేళ ఆ ఆలిమ్ ఖుర్'ఆన్‌కి వ్యతిరేకంగా చెప్పినా సరే, దానిని అంగీకరించడం వివేకం అనిపించు కుంటుందా? అవివేకం అనిపించుకుంటుందా?

హితబోధ సులభంగా అర్థం కావడానికి ఖుర్'ఆన్‌ను సులభతరం చేసానని అల్లాహ్‌యే స్వయంగా ఖుర్'ఆన్‌లో చెప్పారు. సులభంగా ఉన్నదానిని వదిలేస్తున్నారు.

## ఖుర్'ఆన్ చాలదా?

ఈ ప్రశ్న వేసింది మేము కాదు. ఖుర్'ఆన్‌లో అల్లాహ్‌యే స్వయంగా ఈ ప్రశ్న వేశారు.

ఏమీ? వాస్తవానికి మేము నీపై అవతరింప జేసిన ఈ గ్రంథం వారికి వినపించబడుతోంది కదా! **ఇది వారికి చాలదా?** నిశ్చయంగా ఇందులో విశ్వసించే ప్రజలకు కారుణ్యం మరియు హితబోధలున్నాయి. (ఖుర్'ఆన్ 29:51)

వాస్తవానికి అల్లాహ్ విశ్వాసులకు మహోపకారం చేశాడు. వారి నుండియే వారి మధ్య ఒక ప్రవక్త (ముహమ్మద్)ను లేపాడు. అతను, ఆయన (అల్లాహ్) సందేశాలను వారికి వినిపిస్తున్నాడు. మరియు వారి జీవితాలను సంస్కరించి పావనం చేస్తున్నాడు. మరియు **వారికి గ్రంథాన్ని మరియు వివేకాన్ని బోధిస్తున్నాడు** మరియు వాస్తవానికి వారు ఇంతకు ముందు **స్పష్టమైన మార్గభ్రష్టత్వంలో** పడి ఉన్నారు. (ఖుర్'ఆన్ 3:164)

కాస్తో కూస్తో మార్గభ్రష్టత్వం కాకుండా, స్పష్టమైన మార్గభ్రష్టత్వంలో పడి ఉన్నవారికి సైతం అల్లాహ్ సందేశాలను వినిపించి వారి జీవితాలనే సంస్కరించి పావనం చేయగలిగేవి ఖుర్'ఆన్ మరియు వివేకం (ముహమ్మద్(స)వారి బోధనలు) అని 'అల్లాహ్'యే స్వయంగా చెబుతుంటే, వాటికంటే కావలిసినవి ఇంకేమి ఉంటాయి?

ఆకలితో ఉన్నవాడికి, రకరకాల రుచికరమైన కూరలతో ఓ పదిమంది తినగలిగే పరిమాణంలో ఆహారాన్ని అతని ముందు ఉంచితే, అది తినడం ప్రారంభించకుండానే ఆ ఆహారం చాలదు అని అనేవాణ్ణి చూస్తే మనకు ఆశ్చర్యం కలుగుతుంది కదా! **'ఇది చాలదా?'** అని ప్రశ్నిస్తాం. మనకు అవసరమైన దానికంటే ఎంతో ఎక్కువే ఈ ఖుర్'ఆన్.

ఉమర్(రజి)వారి వంటి సహాబీలు ఖుర్'ఆన్ చదువుతూ స్పృహ తప్పి పడిపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. వారి తఖ్వా అటువంటింది. ఖుర్'ఆన్‌పై వారి అధ్యయనం అటువంటిది.

విశ్వాసులకు ఖుర్'ఆన్ అంటే ప్రాణం. ఈ గ్రంథం చదివేకొద్దీ ఇంకా ఇంకా చదవాలనే ఆసక్తి వారిలో పెరుగుతూనే ఉంటుంది. ప్రతీ రోజూ ఖుర్'ఆన్ పాఠాన్ని చెప్పే గురువులు సైతం తమ వయస్సు 80 సంవత్సరాలు దాటినా సరే, కొత్త కొత్త విషయాలు ఖుర్'ఆన్ నుండి గ్రహిస్తూనే ఉన్నారు. చిన్నతనంలో వారు ఖుర్'ఆన్‌ను నేర్చుకోవడం ప్రారంభించి నప్పుడు వారికి అది ఎంత కొత్తగా అనిపించిందో దానిలోని జ్ఞానం తెలుసుకునే కొద్దీ వారికి అది కొత్తగా తాజాగానే అనిపిస్తుంది.

ఖుర్'ఆన్‌లోని 2వ సూరహ్ 'అల్-బఖరా' అర్థం చేసుకోవడానికి మంచి ఇల్మ్ ఉండి మరియు ముహమ్మద్(స)వారికి బాగా సన్నిహితులైన ఇద్దరు సహాబీలకు 8 నుండి 12 సంవత్సరాలు పట్టింది. అరబీ భాషలో మంచి ప్రావీణ్యంతో పాటు, సందేహమొచ్చిన ప్రతీ విషయాన్ని విడమరచి చెప్పే 'సకల లోకాలకు కారుణ్యమైనటువంటి ముహమ్మద్(స)వారు' దగ్గరగా ఉన్నాసరే, వారికి ఆ సూరహ్ సంపూర్ణంగా అర్థం కావడానికి అన్ని సంవత్సరాలు పట్టింది.

**చదవడం వేరు. అధ్యయనం చేయడం వేరు.**

నేడు మదరసాలలో ఆలిమ్ కోర్సు పూర్తి చేసినవారికి ప్రాథమిక అవగాహన మాత్రమే ఉంటుంది. కోర్సు పూర్తి అయిన తరువాత నేర్చుకున్న వాటిని అధ్యయనం చేయవలసి ఉంటుంది. దురదృష్ట వశాత్తూ కోర్సు పూర్తి కాగానే ఏదో మస్‌జిద్‌లో ఇమామ్‌గా చేరిపోయి ఇమామత్ చేయడం, ఖుత్బా కొరకు ఏదో ఒక ప్రసంగంతో సరి పెట్టేస్తున్నారు. కొందరే ఖుర్'ఆన్ మరియు హదీస్ గ్రంథాలను అధ్యయనం చేస్తున్నారు. ఈ కోర్సు చేయకపోయినా ఇతర విద్యలలో నిపుణులైనవారు కూడా విద్వాంసులు అందించిన తఫ్సీర్ మరియు హదీస్ గ్రంథాలను అధ్యయనం చేస్తున్నారు.

ఖుర్'ఆన్ విషయాలపై ఇల్మ్ లేని కొందరు ఆలిమ్‌లకు మరియు దాయీలమని చెప్పుకుంటూ తిరిగే వారికి మాత్రమే ఈ **ఖుర్'ఆన్ చాలడం లేదు.** వారు ఖుర్'ఆన్ ద్వారా చెప్పలేరు. ఎందుకంటే వారు ఖుర్'ఆన్‌ని అర్థం చేసుకోలేదు. అర్థం చేసుకోవాలనే తలంపు కూడా వారికి లేనట్లుంది.

అల్లాహ్ మార్గం వైపు పిలుస్తున్నామని వారు ప్రచారం చేసుకుని డబ్బులు దండుకుంటూ ఉంటారు. కాని అల్లాహ్ మార్గంవైపు మార్గదర్శకత్వం చేసేదేమిటో వారికి తెలియడం లేదు.

క్రింది ఆయత్ చూడండి :

"... **ఆయన** (అల్లాహ్) **దీనితో** (ఖుర్'ఆన్‌తో) **తాను కోరిన వారికి మార్గదర్శకత్వం చేస్తాడు** ..." (ఖుర్'ఆన్ 39:23)

ఖుర్'ఆన్‌తో మార్గదర్శకత్వం చేస్తానని అల్లాహ్‌యే స్వయంగా చెబుతుంటే వీరు మాత్రం వేరే గ్రంథాలతో అల్లాహ్ మార్గం వైపు పిలుస్తారట. ఇది ఎలా ఉంది అంటే 'సైన్స్' పాఠాన్ని బోధించడానికి సైన్స్ మాష్టారు 'హిందీ కవితలను నేర్పే పాఠ్య పుస్తకాన్ని' ఉపయోగించి సైన్స్ చెప్పడానికి ప్రయత్నించినట్లు ఉంది. ఇటువంటి అవివేకులు ధర్మాన్ని ఎలా బోధించగలరు?

## తులనాత్మక అధ్యయనం (Comparative Study) ద్వారా దావా - ఓ మూర్ఖత్వపు స్లోగన్

ఎవరైనా ఆలిమ్ ఈ విధంగా చేయవచ్చు అని చెబితే, అతనికి ఖుర్'ఆన్ మరియు హదీస్‌ల పట్ల సరియైన అవగాహన లేదని తెలుసుకోండి. కేవలం డిగ్రీ మాత్రమే ఉండి ఇల్మ్‌లేని ఆలిమ్‌లను మరియు తఖ్వాలేని దాయీలను దూరంగా ఉంచండి.

(ఓ ప్రవక్తా!) ఇవన్నీ అగోచరమైన వార్తలు. వాటిని మేము నీకు వహీ ద్వారా తెలుపుతున్నాము. మర్యమ్ సంరక్షకుడు ఎవరు కావాలని వారు తమ కలములను విసిరినప్పుడు, **నీవు వారి దగ్గర లేవు.** మరియు వారు వాదించుకున్నప్పుడు కూడా **నీవు వారి దగ్గర లేవు.** (ఖుర్'ఆన్ 3:44)

**సముద్రం రెండుగా చీలడం మరియు దానిపై విశ్వాసం :** మూసా(అ)వారు అల్లాహ్ అనుగ్రహంతో సముద్రాన్ని రెండుగా చీల్చారని ఖుర్'ఆన్ ద్వారా తెలుసుకున్నాము. ఆ విధంగా సముద్రం రెండుగా చీలడం మనం చూడలేదు. ఆ సంఘటన జరిగినప్పుడు మనం అక్కడ లేకపోయినా సరే ఆ వాస్తవాన్ని మనకున్న ఈమాన్ సత్యమేనని ఎటువంటి సందేహం లేకుండా విశ్వసించేలా చేసింది.

గతించిన కాలంలో జరిగిన విషయాలు సర్వం చూడగల అల్లాహ్‌కు మాత్రమే తెలుసు. ఆయన చెబితే అవి నూటికి నూరు శాతం సత్యాలు. ఆయన చెప్పిన విషయాలు కాకుండా ఇతరులు చెప్పిన మరే విషయాలైనా సరే అవి నిజమో, అబద్ధమో మనకు తెలియదు.

**నిజమో, అబద్ధమో తెలియని విషయాలపై అధ్యయనం ఎలా చేస్తారు? చేయవలసిన అవసరమేమిటి?**

ముహమ్మద్(స)వారికి తెలియని ఎన్నో విషయాలను అల్లాహ్ నేర్పారని విశ్వాసులకు తెలుసు. ఎందుకంటే క్రింది ఖుర్'ఆన్ ఆయత్‌లు ఆ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

... మరియు అల్లాహ్ నీపై గ్రంథాన్ని మరియు వివేకాన్ని అవతరింప జేశాడు. **మరియు నీకు తెలియని విషయాలను నీకు నేర్పాడు.** మరియు నీపై ఉన్న అల్లాహ్ అనుగ్రహం చాలా గొప్పది. (ఖుర్'ఆన్ 4:113)

మరియు మేము **ఈ గ్రంథాన్ని నీపై అవతరింప జేసింది**, వారు

విభేదాలకు గురి అయిన విషయాన్ని వారికి **నీవు స్పష్టం చేయటానికీ** మరియు విశ్వసించే జనుల కొరకు మార్గదర్శకత్వం గానూ మరియు కారుణ్యంగానూ ఉంచటానికి! (ఖుర్ఆన్ 16:64)

**ప్రతి విషయాన్ని స్పష్టపరచటానికి** నీపై ఈ దివ్యగ్రంథాన్ని అవతరింప జేశాము ... (ఖుర్ఆన్ 16:89)

**నిశ్చయంగా, ఈ ఖుర్'ఆన్ ఇస్రాయీల్ సంతతివారు విభేదిస్తూ వున్న పెక్కు విషయాల వాస్తవాన్ని వారికి తెలుపుతున్నది.** (ఖుర్ఆన్ 27:76)

(పూర్వపు ప్రవక్తలను) మేము స్పష్టమైన నిదర్శనాలతో మరియు గ్రంథాలతో పంపాము. మరియు (ఓ ప్రవక్తా!) ఇప్పుడు ఈ జ్ఞాపికను (ఖుర్ఆన్‌ను) నీపై అవతరింప జేసింది, **వారి వద్దకు అవతరింప జేయబడిన దానిని వారికి నీవు స్పష్టంగా వివరించడానికి మరియు బహుశా వారు ఆలోచిస్తారేమోనని!** (ఖుర్ఆన్ 16:44)

వారి గ్రంథాలలోని విషయాలను వారికి స్పష్టంగా వివరించడానికి ఖుర్ఆన్ అవతరింపజేశారు **కాబట్టి వారు ఖుర్'ఆన్‌ను అధ్యయనం చేయాలిగాని. వారి గ్రంథాన్ని అధ్యయనం చేయవలసిన అవసరం వీరికెందుకు వచ్చిందో!**

ఖుర్ఆన్ ప్రతీ విషయాన్ని స్పష్టం చేస్తుందని, గతించిన కాలానికి సంబంధించిన వివాదాస్పదమైన విషయాలకు చెందిన వాస్తవాలను కూడా స్పష్టంగా వివరిస్తుందని చెప్పినా కూడామరో గ్రంథ అధ్యయనానికి పూనుకున్నామని చెబుతున్నారంటే, వీరు విశ్వాసులేనా? వీరు నిజంగా ఖుర్ఆన్ చదివిన వారేనా? అని ఎవరికైనా అనుమానం కలుగక మానదు.

ధర్మం పేరు చెప్పుకుని వ్యాపారం చేసుకునే దాయీలు, మరియు కొందరు ఆలిమ్‌లు చెప్పేటటువంటి తులనాత్మక అధ్యయనాలు విశ్వాసులకు అవసరం లేదు.

మీరు అల్లాహ్‌కు విధేయులై ఉండండి మరియు సందేశహరుణ్ణి అనుసరించండి. ఒకవేళ మీరు మరలిపోతే, వాస్తవానికి **మా సందేశ హరుని బాధ్యత కేవలం** (మా సందేశాన్ని) **మీకు స్పష్టంగా అందజేయటం మాత్రమే** (ఖుర్ఆన్ 64:12)

## బలవంతం లేదు :

**కావున (ఓ ముహమ్మద్!) నీవు హితోపదేశం చేస్తూ ఉండు. వాస్తవానికి నీవు కేవలం హితోపదేశం చేసేవాడవు మాత్రమే! నీవు వారిని బలవంతం చేసేవాడవు కావు.** (ఖుర్ఆన్ 88:21-22)

ముహమ్మద్(స)వారి బాధ్యత కేవలం ఖుర్ఆన్ సందేశాన్ని అందజేయడం వరకే. దానిని విశ్వసింప జేయడం ఆయన బాధ్యత కాదు. ఒక వ్యక్తి మార్గదర్శకత్వం పొందడమనేది అల్లాహ్ అధీనంలో ఉంది.

సర్వలోకాలకు కారుణ్యంగా పంపబడిన ముహమ్మద్(స)వారికే మనుష్యులను మార్చే శక్తిని లేనప్పుడు, మరి దాయీలు ఎలా మార్చేయగలం అని అనుకుంటున్నారు? ఖుర్ఆన్‌పైనే అవగాహన లేనివారు మరియు అరబీ భాష యొక్క గొప్పతనం గురించి తెలియని వారు, వేరే భాషలలో ఉన్న గ్రంథాలను అధ్యయనం చేస్తారా? దాని ద్వారా ఇతర ధర్మాల వారిని నమ్మిస్తారా?

**అల్లాహ్ తన ప్రియసందేశహరుడైన ముహమ్మద్(స)వారిపై ఉంచిన బాధ్యత కంటే, మనపై ఎక్కువ బాధ్యతను ఏదీ ఉంచలేదు.**

వేరే గ్రంథాల ద్వారా ఎవరినీ నమ్మించ వలసిన అవసరం లేదు. ఖుర్ఆన్ వినిపిస్తే చాలు. క్రింది ఆయత్‌లు చదివితే వారికి జ్ఞానోదయం కావచ్చు, ఇన్షా అల్లాహ్!

ఈ విధంగా మేము **నీపై ఈ గ్రంథాన్ని అవతరింప జేశాము.** కావున మేము గ్రంథాన్ని ఇచ్చిన వారిలో **కొందరు దీనిని విశ్వసిస్తారు.** మరియు ఇతర ప్రజలలో నుండి కూడా **కొందరు దీనిని విశ్వసిస్తారు.** మరియు మా సూచనలను సత్యతిరస్కారులు తప్ప, మరెవ్వరూ తిరస్కరించరు.

ఖుర్ఆన్ వినిపిస్తే సత్య తిరస్కారులు తప్ప అందరూ విశ్వసిస్తారు. కొందరు ఆలస్యంగా విశ్వాసాన్ని ప్రకటించవచ్చు.

మరియు (ఓ ముహమ్మద్!) ఇంతకు పూర్వం నీవు ఏ గ్రంథాన్ని కూడా చదువగలిగేవాడవు కావు. మరియు దేనిని కూడా నీ కుడిచేతితో వ్రాయగలిగే వాడవూ కావు. అలా జరిగివుంటే ఈ అసత్యవాదులు తప్పక అనుమానానికి గురి అయి ఉండేవారు. (ఖుర్ఆన్ 29:47-48)

పై ఆయత్ ద్వారా ముహమ్మద్(స)వారు ఎటువంటి తులనాత్మక అధ్యయనం చేయలేదని తెలుస్తుంది. ఆ అవసరం ఆయనకు లేదు. మరి ఆ అవసరం మనకెందుకు వచ్చింది?

**వివిధ ధర్మాల మధ్య ఉండే సామరస్యాన్ని మంటగలిపే వ్యాపారమే ఈ తులనాత్మక అధ్యయనాలు మరియు డిబేట్‌లు ఇది ఓ ధర్మం వారు పన్నిన దుష్టపన్నాగం**

ఓ విశ్వసించిన ప్రజలారా! మీరు గ్రంథ ప్రజలలో కొందరిని అనుసరిస్తే (కొందరి మాటలు విని అనుసరిస్తే)! వారు **మిమ్మల్ని విశ్వసించిన తరువాత కూడా సత్య తిరస్కారులుగా మార్చివేస్తారు.** (ఖుర్ఆన్ 3:100)

ప్రస్తుతం అదే జరుగుతుంది. వారిని అనుసరిస్తున్నారు. వారు ఏది చేస్తే అది చేస్తున్నారు. వారు ఛాలెంజ్ చేస్తే వీరు ఛాలెంజ్ చేస్తారు. వారు ఉడుం కన్నంలోకి దూరితే వీరూ దూరుతారు.

తులనాత్మక అధ్యయనం పేరుతో వీరు ఇతర ధర్మాల వారితో వాదనలు (డిబేట్‌లు) చేయడం వలన వివిధ ధర్మాల మధ్య ఉండ వలసిన సామరస్యానికి ముప్పు వాటిల్లుతుంది.

**ఎవరైనా వాదనకు దిగితే ఏమి చెప్పాలో ఖుర్'ఆన్ వివరించింది.**

ఇలా అను : "ఓ గ్రంథ ప్రజలారా! మాకూ మరియు మీకూ మధ్య ఉమ్మడిగా ఉన్న ధర్మ విషయం వైపునకు రండి. అది ఏమిటంటే : **మనం అల్లాహ్ తప్ప మరెవ్వరినీ ఆరాధించకూడదు**, ఆయనకు భాగస్వాములను ఎవ్వరినీ నిలబెట్ట కూడదు మరియు అల్లాహ్ తప్ప, మనవారిలో నుండి ఎవ్వరినీ ప్రభువులుగా చేసుకోరాదు." వారు తిరిగిపోతే : మేము నిశ్చయంగా ముస్లిములము (అల్లాహ్‌కు విధేయులం). దీనికి మీరు సాక్షులుగా ఉండండి." అని పలుకు (ఖుర్ఆన్ 3:64)

(ఓ ముహమ్మద్!) వారితో అను : "ఏమీ? అల్లాహ్ విషయంలో మీరు **మాతో వాదిస్తారా? ఆయన మా ప్రభువు మరియు మీ ప్రభువు కూడాను.** మా కర్మలు మాకు మరియు మీ కర్మలు మీకు. మరిము మేము ఆయనకు మాత్రమే మన:పూర్వకంగా (విధేయులమయ్యాము)." (ఖుర్ఆన్ 2:139)

ఈ జ్ఞానం నీకు అందిన తరువాత కూడా ఎవడైనా నీతో అతనిని గురించి వివాదానికి దిగితే ఇలా అను : "రండి! మేము మరియు మీరు కలిసి, మా కుమారులను మరియు మీ కుమారులను, మా స్త్రీలను మరియు మీ స్త్రీలను పిలుచుకుని, అందరమూ కలిసి : **'అసత్యం పలికే వారిపై అల్లాహ్ శాపం పడుగాక!'** అని హృదయపూర్వకంగా ప్రార్థిద్దాము. (ఖుర్ఆన్ 3:61)

ఈ వాక్యం ఇస్లామ్ ప్రారంభంలో అవతరించినదేమీ కాదు. 9వ హిజ్రీలో అవతరించింది. అంటే ప్రవక్త(స)వారి మరణానికి దాదాపు ఒక సంవత్సరం ముందు జరిగిన విషయం.

మీ గ్రంథంలో చూసుకోమని ప్రత్యేకంగా ఎవ్వరికీ చెప్పనవసరం లేదు. క్రింది ఆయత్ చూడండి :

**మేము గ్రంథాన్ని ప్రసాదించిన వారు తమ కుమారులను ఏ విధంగా గుర్తిస్తారో ఇతనిని (ముహమ్మద్‌ను) ఆ విధంగా గుర్తిస్తారు. మరియు వాస్తవానికి వారిలోని ఒక వర్గంవారు తెలిసి కూడా సత్యాన్ని దాస్తున్నారు.** (ఖుర్ఆన్ 2:146)

వారితోపాటు ఉంటూ వారిని అనుసరించడం వలన **దాయీలు** మరియు కొందరు **అవినీతి ఆలిమ్‌లు** కూడా సత్యాన్ని దాయడం అలవాటు చేసుకున్నారు. 'జకాత్' గురించి మేము వాస్తవాలు తెలియజేసే వరకూ, వీరు సత్యాన్ని దాచి ఉంచారనే విషయం సామాన్య ప్రజలకు తెలియలేదు.

ఇస్లామ్ పట్ల సరియైన అవగాహన లేకపోవడం వలన, కష్టపడి పనిచేయడం మానివేశారు. ధర్మ ప్రచారం పేరుతో దాయీలుగా ప్రజల దగ్గర నుండి డబ్బు దండుకుంటున్న వీరిని సంస్కరించ వలసిన బాధ్యత మనందరిపై ఉంది. వారికి డబ్బు ఇచ్చి పాడుచేయకండి. వారికి కష్టపడాలనే ఆలోచన కలిగేలా కౌన్సిలింగ్ ఇవ్వండి. ఇదంతా వారి మేలు కొరకే! వారికి ఇహలోకంలోనూ మరియు పరలోకంలోనూ మేలు కలగాలనేది మా కోరిక. వారు కూడా అందరిలాగ కష్టపడి పనిచేసి స్వంత సంపాదనతో తినేలా ఇన్షా అల్లాహ్ ప్రయత్నిద్దాం!

జాఫర్ బిన్ అబీతాలిబ్(రజి)వారు అబీసీనియా దేశంలో క్రైస్తవ రాజు నజాషీ దర్బారులో కేవలం ఖుర్ఆన్ వాక్యాలను పఠించి వారి హృదయాలను గెలుచుకున్నారు.

వ్యక్తిగత ప్రతిష్ఠల కోసం, తద్వారా లభించే ధనం కోసం చేస్తున్న వీరి ఛాలెంజ్‌లను ఖండించాలి. వారి మూర్ఖత్వం ముస్లిమ్ సమాజానికి కీడు చేయకుండా మనం జాగ్రత్త పడాలి. మీ ఏరియాల్లో డిబేట్లు జరుగుతున్నా, అటువంటి డిబేట్లను వీడియో షూటింగ్ చేస్తున్నా వారిని ఆపడానికి, ఇన్షా అల్లాహ్, ప్రయత్నించండి. ఖుర్ఆన్ వాక్యాలను వక్రీకరించేవారికి, కపట విశ్వాసులకు మాత్రమే ఈ తులనాత్మక అధ్యయనం యొక్క అవసరముంటుంది.

**విశ్వాసులకైతే ఖుర్ఆన్ మరియు ముహమ్మద్(స)వారి బోధనలు చాలు.**

## విధేయత

**మరియు మీరు కరుణింపబడటానికి అల్లాహ్‌కు మరియు ఆయన సందేశహరునికి విధేయులై ఉండండి.** (ఖుర్ఆన్ 3:132)

విశ్వాసులు అల్లాహ్ పట్ల మరియు ఆయన సందేశహరుడైన ముహమ్మద్(స)వారి పట్ల విధేయత చూపాలి. అలా చేయకపోతే వారు విశ్వాసులు కారు. విశ్వాసులు (మోమిన్) కానివారికి స్వర్గం లేదు.

మరి అల్లాహ్‌కు విధేయత చూపడం అంటే, ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఆదేశించిన ప్రకారం అనుసరించాలి.

ముహమ్మద్(స)వారికి విధేయత ఎలా చూపాలి మరియు ఆయన(స) ఏమి చేయమని చెప్పారు?

ఏమి చేయమని చెప్పారో ముందుగా తెలుసుకోవాలి. ఆ తరువాత దాని ప్రకారం ఆచరించాలి. అప్పుడే ఆయన(స)కు విధేయత చూపినట్లు అవుతుంది.

ముహమ్మద్(స)వారు చెప్పిన విషయాలు ఎక్కడ లభ్యమౌతాయి?

హదీస్ గ్రంథాలలో లభ్యమౌతాయి.

**ప్రతీ రోజూ ఖుర్ఆన్ చదవండి.**
**వివేకంతో మరియు సత్యంతో అవతరించబడిన**
**ఖుర్ఆన్‌ను రోజుకు కనీసం 10 నిమిషాలైనా చదవండి.**
**అన్ని ప్రసంగాల కంటే ఉత్తమమైనది**
**అల్లాహ్ ప్రసంగం.**

**ఈ వ్యాసంలో హదీస్‌లను ఉపయోగించ లేదు. పూర్తిగా ఖుర్ఆన్ వాక్యాల ద్వారానే తెలియజేయడం జరిగింది. ఇదే వ్యాసాన్ని, ఇన్షా అల్లాహ్, రాబోవు సంచికలలో హదీస్‌ల ద్వారా వివరిస్తాము.**

భార్యాభర్తల నుద్దేశించి ఖుర్'ఆన్‌లో అల్లాహ్ ఇలా తెలియజేస్తున్నారు :

వారు మీకు వస్త్రాలు, మీరు వారికి వస్త్రాలు (2:187) | They are clothing for you and you are clothing for them | هُنَّ لِبَاسٌ لَّكُمْ وَأَنتُمْ لِبَاسٌ لَّهُنَّ




అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పారు : (సహీహ్ ముస్లిమ్, 3649, పుస్తకం 17, అధ్యా.19, సంపుటి 4)

**"ఈ ప్రపంచం తాత్కాలిక సుఖం. ప్రపంచంలోని తాత్కాలిక సుఖాలన్నింటికంటే ఉత్తమమైనది ధర్మపరాయణురాలైన స్త్రీ (భార్య)"**

***వస్త్రాలు నగ్నత్వం నుండి కాపాడుతూ మనకు గౌరవాన్నిస్తాయి. అదే విధంగా భార్య గౌరవాన్ని భర్త మరియు భర్త గౌరవాన్ని భార్య కాపాడాలి. కుటుంబంలో భార్యాభర్తలకు వేర్వేరు బాధ్యతలున్నాయి. వారి మధ్య హెచ్చుతగ్గుల గురించి ఆలోచించ వలసిన అవసరం లేదు. ఇద్దరిలో ఎవరికీ ఎక్కువ తఖ్వా ఉంటుందో, ఎవరు తమ బాధ్యతను అల్లాహ్ ఆదేశించిన దాని ప్రకారం నిర్వర్తిస్తారో వారికే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ విలువ ఉంటుంది. కాబట్టి భార్యాభర్తలు ధర్మ పరాయణతలో, బాధ్యతలను నిర్వహించడంలో, ఒకరి గౌరవాన్ని మరొకరు కాపాడటంలో పోటీపడాలి. భార్యాభర్తల సంబంధంలో > (ఎక్కువ), < (తక్కువ), = (సమానం) వంటి గుర్తులు ఉండవలసిన అవసరం లేదు. కొన్ని విషయాలలో భర్త అధికుడైతే, మరికొన్ని విషయాలలో భార్య ఆధిక్యత వహిస్తుంది. సంతోషంగా బ్రతకవలసిన ఎన్నో కుటుంబాలు చీలిపోయి విడాకుల కోసం పరితపించడమో, మానసిక క్షోభకు గురికావడమో జరుగుతుంది. సలాత్ (నమాజ్) ఎలా చేయాలీ, సౌమ్ (ఉపవాసం) ఎలా ఉండాలీ, ఖుర్'ఆన్‌ను అరబీలో ఎలా చదవాలీ, ఈ విషయాలు తెలుసుకుంటే చాలు అని నేటి ముస్లిమ్ సమాజంలోని స్త్రీలు అనుకుంటున్నారు. వివాహం జరిగినప్పుడో లేక జరిగిన తరువాతైనా సరే ఒక ఇల్లాలిగా తాను నిర్వహించవలసిన బాధ్యతలేమిటో, వాటి గురించి అల్లాహ్ ఏమి ఆదేశించారో తెలుసుకోవడానికి ప్రయత్నించడం లేదు. తల్లి తన కుమార్తెకు బంగారు నగలు, బట్టలు, ఇతర సామాన్లు ఇవ్వడం గురించి ప్రాధాన్యత ఇస్తుంది గాని, తన కూతురు ఇహలోకంలోనూ పరలోకంలోనూ సంతోషంగా బ్రతకడం కోసం అవసరమైన శిక్షణ ఇవ్వడం లేదు. ఓ మాతృమూర్తి తన కుమార్తె వివాహ సమయాన ఎటువంటి విషయాలు చెప్పి, భర్తతో పంపారో ఈ వ్యాసంలో చదవండి. మహిళ తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తే ఓ గొప్ప సమాజం మన ముందుంటుంది.***




ఖుర్'ఆన్ మరియు హదీస్‌లు ఎంతో స్పష్టంగా స్త్రీ స్వేచ్ఛ గురించి తెలియజేశాయి. కాని ఈ విషయాలు నేటి స్త్రీలకు తెలియవు. వారు తమ చిన్నప్పటి నుండి చదువుకున్న పాఠ్యపుస్తకాలు, సినిమాలు మరియు మీడియా వలన ఎక్కువ ప్రభావితం అవుతున్నారు. ఇస్లామ్‌ను అపార్థం చేసుకుంటున్నారు. ఇస్లామ్‌లో స్త్రీకి స్వేచ్ఛ లేదని భావిస్తున్నారు.

మక్కాలో మరియు మదీనాలో ముస్లిములు చాలా కష్టాలకు గురి అయ్యారు. కష్టాలు భరించి, భరించి అల్లాహ్ అనుగ్రహంతో ఓ మహా సామ్రాజ్యాన్ని ఏర్పరచుకోగలిగారు.

ఈ మహా నిర్మాణంలో స్త్రీల పాత్ర లేదా? **ఎంతో ఉంది.**

స్త్రీల ధైర్య సాహసాలు, ప్రేమానురాగాలు మరియు వారి త్యాగాల గురించి చదువుతూ ఉంటే హృదయాలు ద్రవిస్తాయి. ఈ విషయాలు

'తిరిగి గూటికి' శీర్షికలో ఇన్షా అల్లాహ్ అందిస్తాము. ఇస్లామీయ సామ్రాజ్యంలో స్త్రీలను ఎన్నడూ చులకన చేయలేదు. వారు పేదవారైనా లేక ఐశ్వర్యవంతులైనా సరే వారి గౌరవ మర్యాదలకు ఏమాత్రం భంగం కలిగించ లేదు. 7వ శతాబ్దం నుండి 12వ శతాబ్దం వరకూ గల మధ్యకాలం ముస్లిముల స్వర్ణయుగం. ఆ కాలంలో మదరసాలలో మహిళలు విద్యను బోధించారు. వారికి ధర్మంపై మంచి అవగాహన ఉండేది. ఆ కాలంలోనే అత్యధిక సంఖ్యలో శాస్త్రవేత్తలు తయారవడమే కాకుండా, ఎన్నో శాస్త్రాలకు వారే పితామహులయ్యారు.

## విద్యావేత్తలు

స్త్రీ చదువుకుంటే సమాజమంతా చదువుకున్నట్లేననే ప్రవక్త(స)వారి బోధనను అనుసరించి ముస్లిమ్ స్త్రీలలో ఎందరో విద్యావంతులు తయారయ్యారు. **స్త్రీ చదువుకు అన్నిటికంటే ఎక్కువ ప్రాధన్యతనిచ్చిన ధర్మమే ఇస్లామ్.** ఆ విధంగా ధర్మం పట్ల స్త్రీలకు మంచి అవగాహన ఉండేది. సన్మార్గం పొందిన ఖలీఫాల కాలంలో ధార్మిక తీర్పరిగా మహిళను నియమించడం జరిగింది. ఈ విషయం మరింత వివరంగా ఇన్షా అల్లాహ్ రాబోవు సంచికలలో చెప్పుకుందాం.

## స్త్రీలకు ప్రశ్నించే హక్కు

శుక్రవారం సలాత్(నమాజ్)లకు స్త్రీలు కూడా మస్జిద్‌లలో హాజరై, ఇమామ్ గారి ప్రసంగం వినేవారు. వారికున్న అవగాహన ప్రకారం ఏదైనా ధర్మ సందేహం కలిగితే నిలదీసి అడిగేవారు. అయితే ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం చెప్పాలి.

ఈ విధంగా స్త్రీకి ప్రశ్నించే హక్కు ఇస్లామ్ కలిగించిందని చెప్పడానికి, అమీరుల్ మోమినీన్ ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)వారి జీవిత సంఘటనలను ఎందరో ఉదాహరిస్తారు. అయితే కొన్ని పత్రికలలో, పుస్తకాలలో మరియు పేపర్లలో ఈ విషయాలను వ్రాసే రైటర్స్ ఉమర్(రజి)వారిని అపార్థం చేసుకునేలా వ్రాశారు. వారందరి సంకల్పం అది కాకపోవచ్చు. కాని వారి ప్రేజెంటేషన్ సంపూర్ణంగా సవ్యంగా లేదు. వారి అసంపూర్తి వ్రాతల వలన ఉమర్(రజి)వారు తప్పు చేసినట్లు మరియు స్త్రీలు ఆయనను నిలదీసినట్లు భావించే విధంగా ఉన్నాయి.

ఇస్లామ్‌ను అనుసరిస్తూ అమోఘమైన తఖ్వా కలిగి ఉండి ఎంతో న్యాయంగా పరిపాలించే మహాసామ్రాజ్య నాయకుడైన ఉమర్(రజి) వారు ఆ విధంగా ప్రశ్నించే అవకాశాన్ని స్త్రీలకు ఇచ్చారు. ఆయన పరిపాలనలో ఒక మామూలు స్త్రీ కూడా పాలకుడిని ప్రశ్నించగలిగే హక్కు కలిగి ఉండేది. న్యాయం అందరికీ ఒక్కటే అని ఇస్లామ్ బోధించింది. దాని ప్రకారమే ఉమర్(రజి)వారి పరిపాలన సాగింది.

**ఒక దేశపాలకుడే ఒక మామూలు స్త్రీకి ప్రశ్నించగలిగే స్వేచ్ఛను ఇచ్చినప్పుడు, ఓ ముస్లిమ్ భర్త తన భార్య స్వేచ్ఛను ఎలా హరించగలడు? ఆలోచించండి!**

**ఎవరో దుర్మార్గంతో చేసే పనులను ఇస్లామ్‌కి ఆపాదిస్తే ఎలా?** ఉమర్(రజి)వారిని స్త్రీలు ప్రశ్నించేవారు. ప్రశ్నించబడ్డారంటే దాని అర్థం ఆయన పొరపాటు చేశారని కాదు. ఉమర్(రజి)వారి జీవిత చరిత్రను సీరియల్‌గా శాంతిబాటలో అందిస్తున్నాము.

ఈ సందర్భంగా ఇక్కడ రెండు సంఘటనలను తెలియజేస్తున్నాము. వీటి ద్వారా ఇస్లామ్ ధర్మం ప్రకారం పరిపాలించే నాయకుని ఔన్నత్యం మరియు ఇద్దరి స్త్రీల ఔన్నత్యం కూడా తెలుస్తుంది.

ఒకరోజు ఉమర్(రజి)వారు మదీనా బయట ఉండే రాతి ప్రదేశమైన హుర్రా వాఖమ్‌కు వెళ్ళారు. ఈ పర్యటనలో ఆయనకు తోడుగా ఉన్నది అస్లమ్(రజి), స్వేచ్ఛ నొసంగబడిన బానిస. మదీనా దాటి 3 మైళ్ళ దూరంలో సిరార్ అని పిలవబడే ప్రదేశానికి చేరినప్పుడు దూరంలో చిన్న మంటను గమనించారు.

ఎవరైనా కొందరు ఆ ఎడారిలో బయట విడిది చేసి ఉంటారని మరియు వారికి ఏదైనా సహాయం ఏదైనా అవసరం ఉండవచ్చని భావించి ఉమర్(రజి)వారు అస్లమ్(రజి)ను తనతో పాటు ఆ మంట దిశగా రమ్మని ఆదేశించారు.

ఉమర్(రజి)వారు మరియు అస్లమ్(రజి) ఇద్దరూ ఆ విడిది ప్రాంతం వైపు వడివడిగా వెళ్ళారు. దానికి దగ్గరగా వచ్చేసరికి, బిగ్గరగా ఏడుస్తున్న పిల్లలను సముదాయిస్తున్న ఓ మహిళను వారు చూచారు.

మరియు ఆ మహిళ ప్రక్కన ఒక కుండ మంటపై వ్రేలాడుతూ ఉంది. ఉమర్(రజి)వారు ఆమెను 'అస్సలాము అలైకుమ్ ఓ కాంతి ప్రజలారా!' అని పలుకుతూ పిలిచారు. ఈ వృత్తాంతాన్ని ఉల్లేఖించిన అస్లమ్(రజి)వారు ఇలా సూచించారు, ఉమర్(రజి)వారు 'ఓ అగ్ని ప్రజలారా!' అని వారిని పిలవడానికి ఇష్టపడలేదని, ఒకవేళ అలా అని పిలిచిఉంటే రాజేసిన మంట గురించి కాకుండా, నరకాగ్ని గురించి మాట్లాడినట్లు అనుకోవచ్చు.

"వ అలైకుము స్సలామ్" ఆ మహిళ జవాబిచ్చింది.

**"నేను దగ్గరకు రావచ్చా?"** ఉమర్(రజి) అడిగారు.

"(మాకు) **మంచి చేసే సంకల్పంతో దగ్గరకైనా రావచ్చు** లేక (మమ్మల్ని ఒంటరిగా) **వదలవచ్చు**" ఆ మహిళ సమాధానమిచ్చింది.

గట్టిగా పలకవలసిన దూరంలో కాకుండా ఆమెకు తన మాటలు వినబడగలిగేటంత దూరంలోకి వచ్చి 'మీ విషయమేమిటి?'అని అడిగారు. రాత్రి యొక్క కఠిన పరిస్థితి మరియు బయటి చలి వాతావరణ విషయాన్ని ఫిర్యాదు చేశారామె. తరువాత ఉమర్(రజి) అడిగారు, 'మరి ఈ పిల్లల సంగతి ఏమిటి? వారెందుకు గట్టిగా ఏడుస్తున్నారు?'

"**ఆకలి**" ముక్తసరిగా సమాధానం చెప్పింది ఆ మహిళ.

"(ఒకవేళ పిల్లలు ఆకలితో బాధపడుతుంటే) మరి కుండలో వండుతున్నది ఏమిటి?" ఉమర్(రజి) అడిగారు.

**"అది కేవలం నీరు"**, మహిళ చెప్పింది. 'పిల్లలు పడుకునే వరకూ వారిని శాంతపరచడానికి ఆ మంటపై కుండ ఉంచినట్లు వివరిస్తూ చెప్పారామె.

ఆమె చెప్పడం కొనసాగిస్తూ, ''అల్లాహ్ సాక్షి! ఉమర్(రజి)వారితో మాకు తీవ్రమైన ఇబ్బందు లున్నాయి.'' ఆ క్షణంలో తాను మాట్లాడుతున్నది ఉమర్(రజి)వారితోనే ననే విషయం ఆమెకు స్పష్టంగా తెలియదు.

''అల్లాహ్ మీపై కరుణ చూపుగాక!'' ఉమర్(రజి) అన్నారు.

''ఉమర్‌కు మీ పరిస్థితి గురించి తెలియదు''.

''ఆయనకు మాపై అధికారం ఇవ్వబడింది మరియు ఆయన మమ్మల్ని మరచిపోయారు'' అన్నది ఆ మహిళ దు:ఖంతో.

ఉమర్(రజి)వారు తన కోసం నిరీక్షిస్తున్న అస్లమ్(రజి) ఉన్న చోటుకు తిరిగివచ్చారు మరియు ఆ ఇద్దరూ ఆ దూరమంతా పరుగెట్టారు మరియు పిండిమర చేరేవరకూ పరుగెట్టారు. ఉమర్(రజి)వారు పిండి సంచిని మరియు నెయ్యి కొని ఆ వస్తువులను తన భుజంపైకి ఎత్తమని అస్లమ్(రజి)వారిని అడిగారు.

''మీకోసం వాటిని నేను మోస్తాను'' అన్నారు అస్లమ్(రజి).

ఒక సామెత చెప్పి ''మరియు నా కోసం నా పాపభారాన్ని పునరుత్థాన దినమున మోస్తావా?'' అని ఉమర్(రజి) అన్నారు.

ఇక చేసేదేమీ లేక, అస్లమ్(రజి) బరువైన సంచిని ఉమర్(రజి)వారి భుజంపైకి ఎత్తారు మరియు ఆయన మోసేది ఎంత బరువైనదైనప్పటికీ, తిరిగి వెనక్కి ఆ స్త్రీ ఉన్న చోటికి వడివడిగా వెళ్ళారు.

అస్లమ్(రజి) ఉల్లేఖించారు, ''ఆ స్త్రీ విడిది చేసిన చోటు చేరగానే ఆ స్త్రీ యొక్క కుండను పిండి మరియు నెయ్యితో నింపారు మరియు పెద్ద పరిమాణంలో ఆహారాన్ని ఆమె కొరకు మరియు ఆమె పిల్లల కొరకు వండారు. కుండ క్రింద (మంట రాజేయడానికి) ఉమర్(రజి) ఏ విధంగా ఊదారో అస్లమ్(రజి) వర్ణించారు, పొగ ఉమర్(రజి)వారి గడ్డం వెంట్రుకల మధ్య నుండి వస్తూ ఉండగా ఉమర్(రజి)వారు వంట చేశారు. మరియు ఆ స్త్రీ మరియు ఆమె పిల్లల కడుపు నిండి వారు తినడం ఆపేవరకూ ఆయన ఉన్నచోటనే ఉన్నారు.

తరువాత ఉమర్(రజి)వారు మరియు అస్లమ్(రజి)వారు వెళ్ళడానికి లేచినప్పుడు, ఆ స్త్రీ ఉమర్(రజి)వారితో చెప్పారు, ''**అల్లాహ్ మిమ్మల్ని బాగా అనుగ్రహించుగాక!. విశ్వాసుల నాయకునిగా ఉండటానికి మీరే ఎక్కువ అర్హులు.**''

అప్పటికినీ ఉమర్(రజి)వారు తన గురించి చెప్పకుండా చాలా అణుకువగా సమాధాన మిచ్చారు, ''బాగా మాట్లాడండి మరియు విశ్వాసుల నాయకుని దగ్గరకు వెళ్ళినప్పుడు, ఇన్షా అల్లాహ్ మీరు నన్ను అక్కడ చూస్తారు''.

అయితే ఉమర్(రజి)వారు అక్కడి నుండి కదలలేదు. ఉమర్(రజి) ఇంకా బయలుదేరక పోవడం చూసి ఆసక్తితో అస్లమ్(రజి)వారు అడిగారు ''మీరు ఇంకా ఇక్కడ ఏదైనా చేసే అవసరముందా?''

కాని ఉమర్(రజి)వారు సమాధానమివ్వలేదు. బదులుగా, ఉమర్(రజి)వారు నిశ్శబ్దంగా పిల్లలు మామూలు స్థితికి వచ్చి నిద్రపోయే వరకూ గమనించారు. ఆ పిల్లలు పూర్తిగా నిద్రలోకి వెళ్ళారని నమ్మకం కుదిరాక ఉమర్(రజి)వారు లేచి, అల్లాహుతాలాను స్తుతించి అస్లమ్(రజి)వారి వైపు తిరిగి చెప్పారు, ''ఓ అస్లమ్! ఆకలి వారిని మెలకువగా ఉండేలా మరియు ఏడ్చేలా చేసింది. మరియు అందుకే (వారు ప్రశాంతంగా, సంతోషంగా ఉండటం) నేను చూసేవరకు కదల కూడదనుకున్నాను.''

ఈ నాయకునికి ఉన్నటువంటి గొప్ప లక్షణాలు మన చరిత్ర పుస్తకాలలో కనిపించవు. అన్యాయాన్ని ఎంత కఠినంగా అణిచివేచారో, న్యాయం పట్ల మరియు అభాగ్యుల పట్ల అంత సున్నిత హృదయుడు.

ఆమెకు ఖలీఫా ఎవరో తెలియదు. ఖలీఫాకు ఎటువంటి లక్షణాలు ఉంటే బావుంటుందో ఆమె తెలుసుకున్నారు. ఆ విషయాన్ని ఖలీఫాకే చెప్పడానికి ఆమె నిర్ణయించుకున్నారు. దీనిని బట్టే తెలుస్తుంది, ఆమెకు ఇస్లామీయ పరిపాలన ఎంత స్వేచ్ఛ నిచ్చిందో!

**ఇస్లామీయ పరిపాలనలో కాకుండా మరెక్కడైనా ఇటువంటి ప్రజాస్వామ్యం ఉందా? అమలు జరిగిందా? కథలలో కాదు, వాస్తవంగా జరిగిందా? ఉమర్(రజి)వారి పరిపాలన చారిత్రక వాస్తవం.**

ఇక్కడ మరో ముఖ్యవిషయాన్ని మీరు గమనించే ఉంటారు. **ఆ స్త్రీ యొక్క ఆర్థిక పరిస్థితి ఏమిటి?** పిల్లలకు కడుపునిండా తిండి పెట్టగలిగే స్థితిలో ఆ మాతృమూర్తి లేదు. అంటే ఆమె ఒక నిరుపేద స్త్రీ. ఒక నిరుపేద స్త్రీకి అంతటి స్వేచ్ఛను మరియు ధైర్యాన్ని ఇచ్చిన ధర్మమే - ఇస్లామ్.

**మరో సంఘటన**

ఉమర్(రజి)వారు ప్రజల ఆరోగ్యం గురించి చాలా శ్రద్ధ తీసుకునే వారు. మామూలు ప్రజలతో అంటువ్యాధిగలవారిని కలిసిపోయి తిరగడాన్ని నిరోధించేవారు. ఒకవేళ ఎవరైనా అంటు వ్యాధితో కనిపిస్తే, ఆ వ్యాధి నుండి కోలుకునే వరకూ ఇంటిలోనే ఉండమని ఆదేశించేవారు.

ఒక రోజు కుష్ఠు వ్యాధితో ఉన్న ఒకామె కాబా చుట్టూ తవాఫ్ చేస్తుండగా ఆమె ప్రక్కనుండి వెళ్ళారు.

ఆయన(రజి) ఆమెను, ''ఓ అల్లాహ్ దాసురాలా!'' అని సంబోధించి పిలుస్తూ ఆమె వలన ఎవరికీ హాని కలగకుండా ఆమెను తన ఇంటిలోనే ఉండమని చెప్పారు. ఆ మహిళ విశ్వాసుల నాయకుడైన ఉమర్(రజి)వారు ఆదేశాన్ని పాటించారు. అమీర్‌కి విధేయత చూపారు.

ఉమర్(రజి)వారు మరణించిన తరువాత, ఓ వ్యక్తి ఆమె ఇంటి ప్రక్క నుండి వెళుతూ ఆమెతో అన్నాడు, “నిశ్చయంగా (ప్రజలతో కలవకుండా) ఎవరైతే నిన్ను నిరోధించారో ఆయన మరణించారు, కాబట్టి ఇప్పుడు నీవు బయటికి రావచ్చు”. ఆమె ధర్మాపరాయణురాలైన ముస్లిమ్‌గా సమాధానమిచ్చారు, “అల్లాహ్ సాక్షి! ఆయన బ్రతికుండగా ఆయనకు విధేయత చూపి, ఇప్పుడు ఆయన మరణించాక ఆయనకు అవిధేయత చూపడం సరికాదు”.

నాయకునికి విధేయత చూపమని ఇస్లామ్ ఆదేశించింది. ఆ ఆదేశాన్ని ఆ నాయకుడు మరణించినపుడు కూడా పాటించడాన్ని బట్టి ఆ స్త్రీకి ధర్మంపై ఎంత అవగాహన ఉందో తెలుస్తుంది.

ఈ ముస్లిమ్ మహిళకు విధేయత గురించి ఉన్నంత అవగాహన నేటి ముస్లిములలో ఏ కొద్దిమందికో తప్ప లేదు.

సెప్టెంబర్, 2011 సంచికలో అమీర్‌కు చూపవలసిన విధేయత గురించి వివరించాము. ఈ సందర్భానికి సరిపోయే హదీస్‌ను క్రింద ఇస్తున్నాము.

ఇబ్నె ఉమర్ (రజి) ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెప్పారు : “మీలో ప్రతీ ఒక్కరూ ఓ కాపరి మరియు మీలో ప్రతీ ఒక్కరూ తన గుంపు గురించి అడగబడతాడు. ప్రజల నాయకుడు ఓ కాపరి మరియు తన గుంపు కొరకు అడగబడతాడు. ఓ పురుషుడు తన కుటుంబానికి కాపరి మరియు తన వారి కొరకు అడగబడతాడు. **ఓ మహిళ తన భర్త ఇంటికి మరియు సంతానానికి కాపరి మరియు ఆమె తన వారి కొరకు అడగబడుతుంది.** ఓ బానిస తన యజమాని ఐశ్వర్యానికి కాపరి మరియు దాని కొరకు అడగబడతాడు. మీలో ప్రతీ ఒక్కరూ ఓ కాపరి మరియు మీలో ప్రతీ ఒక్కరూ తన గుంపు కొరకు అడగబడతారు. **(సహీహ్ ముస్లిమ్, 4724, పుస్తకం 33, అధ్యా.5, సంపుటి 5)**

ఐసిఐసిఐ బ్యాంక్ సి.ఇ.ఓ. ఓ స్త్రీ. ఆమె పేరు శ్రీమతి చందా కొచర్. ఆమె ఆ బ్యాంకుకు అధికారి. అంటే ఆ కంపెనీ బాగోగుల కోసం నియమించబడిన కాపరి. ఆమెను వేనోళ్ళ పొగుడుతారు. ప్రపంచంలోని శక్తివంతమైన తొలి 100 మంది స్త్రీలలో ఈమె ఒకరు.

ఇస్లామ్ ప్రకారం ఒక ఇంటికి ఇల్లాలు కాపరిగా ఉంటుంది. ఇంటి బాగోగులు చూసుకుంటూ, పిల్లలను ప్రేమిస్తూ భర్తపట్ల శ్రద్ధ చూపుతుంది. మరి ఇల్లాలి హోదా తక్కువైనదేమీ కాదు. ఈమెనెవ్వరూ పొగడరు. ఈమె సాధించిన విజయాలు ఇహలోకంలో కంటే పరలోకంలోనే స్పష్టంగా తెలుస్తాయి. ఆలోచించగలిగే వారు ఇహ లోకంలో కూడా ఇల్లాలి విజయాన్ని స్పష్టంగా చూస్తారు.

ఐసిఐసిఐ బ్యాంకు వ్యాపారాన్ని స్థాపించిన యజమానులు, శ్రీమతి చందా కొచర్ గారికి ఎంతో జీతం ఇస్తున్నారు. ఆమె తన యజమానులు ఆదేశించినట్లు బాధ్యత తీసుకున్నారు.

అల్లాహుతాలా ఓ ఇల్లాలికి ఓ ఇంటి బాధ్యత అప్పగించి ఆదేశించారు. ఆమె ఆ ఆదేశం ప్రకారం ఆచరిస్తే ఇహలోకంలో గౌరవం, భర్త మరియు పిల్లల నుండి గౌరవం మరియు ప్రేమను పొందగలుగు తుంది. పరలోకంలో ఊహించనటువంటి ప్రతిఫలాన్ని ఆమె పొందుతుంది. ఈ ప్రతిఫలాన్ని ఇహలోకంలోని డబ్బుతో పోలిస్తే, ఇప్పటివరకూ ప్రజలంతా సంపాదించినదంతా ఒకచోట చేర్చినా అది సరిపోదని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

ఇల్లాలి బాధ్యత చాలా గొప్పది. ఆ బాధ్యత ఏ కార్పోరేట్ కంపెనీ సి.ఇ.ఓ. బాధ్యత కంటే తక్కువైనదేమీ కాదు. తన పిల్లలను జ్ఞాన కాంతులు వెదజల్లగలిగేలా సంస్కారవంతులుగా తీర్చి దిద్దడంలో ఆమె కృషి చాలా గొప్పది.

ఉదాహరణకు షాఫ'యి(ర)వారి తల్లిగారి గురించి తెలుసు కుందాము. ఈ మాతృమూర్తి తన భర్తను కోల్పోయింది. భర్త మరణించే సమయానికి ఆమె కుమారుడు షాఫ'యి(ర)వారి వయస్సు కేవలం 2 సంవత్సరాలు. షాఫ'ఇ(ర) 7 సంవత్సరాల వయస్సులోనే మొత్తం ఖుర్'ఆన్‌ను కంఠస్థం చేశారు మరియు ముహమ్మద్(స)వారి ఎన్నో బోధనలను (హదీస్‌లను) కూడా. ఇమామ్ షాఫ'యి(ర)వారి గురించి ఇన్షా అల్లాహ్ మరొక వ్యాసంలో వివరంగా అందిస్తాము. ప్రస్తుత వ్యాసానికి సరిపోయే విధంగా చాలా క్లుప్తంగా వివరించ దలచాము.

షాఫ'యి(ర)వారి మాతృమూర్తి పేదరాలు. ఒక్కడే కుమారుడు. కుమారుడు వ్రాసుకోవడానికి పేపర్‌వంటిదేమీ కొనివ్వగలిగే స్థోమత ఆమెకు లేదు. కుమారుడు అల్లాహ్ అనుగ్రహంతో చిన్న వయస్సులోనే గురువుగారు లేని సమయంలో పిల్లలకు బోధించేవారు. ఆ కుర్రవాని ప్రతిభ చూసి డబ్బు తీసుకోకుండానే గురువుగారు పాఠాలు నేర్పుతానని అన్నారు.

కుమారుడిని మరింత జ్ఞానం కోసం దూరంగా పంపవలసి వచ్చింది. చేతిలో చిల్లిగవ్వ లేదు. ఉన్న ఒక్కగానొక్క కొడుకును జ్ఞానకాంతిని పొందడానికి పంపిస్తున్నారామె. కొడుకుకు ఇవ్వడానికి ఏమీ లేదు. కాని ఎంతో విలువైనదే ఆయనకిచ్చి పంపారు, అదే 'దుఆ'.

**“ఓ అల్లాహ్! విశ్వాన్ని పాలించే ప్రభూ! నా కుమారుడు నన్ను వదిలి నీ అనుగ్రహం కోరుతూ సుదూర ప్రయాణం వెళుతున్నాడు. అందుకే ఓ అల్లాహ్ మీ సహాయాన్ని అర్థిస్తున్నాను అతని అన్ని వ్యవహారాలలో జ్ఞానాన్ని కలిగించు. అతనిని క్షేమంగా ఉండేలా రక్షించండి మరియు అతనికి ఎక్కువ జీవితాన్ని ప్రసాదించండి అతని హృదయం ప్రయోజన కరమైన జ్ఞానంతో నిండి ఉండటాన్ని నేను చూసేందుకు, ఆమీన్.”**

ఎటువంటి వేడుకోలు ఇది. ఇంతకంటే విలువైనది ఇంకేముంటుంది!

షాఫ'యి(ర)వారు తనకు ఊహ తెలియని వయస్సులో తండ్రిని కోల్పోవడం ఆయన దురదృష్టమా? లేక ఇటువంటి మాతృమూర్తి లభించడం అదృష్టమా?

ఆ మాతృమూర్తి అల్లాహ్‌ను వేడుకున్న తరువాత, తన చిన్నారి షాఫ'యి(ర)వారిని ప్రేమానురాగాలతో, కళ్ళ నిండా నీళ్ళతో దగ్గరకు తీసుకున్నారు. ఒక్కగానొక్క ప్రియమైన మరియు ప్రాణ సమానమైన కుమారుడు దూరంగా వెళుతున్నందుకు విచారం వలన.

ఆమె మెల్లగా షాఫ'యి(ర)వారితో చెప్పారు : **"నీవు వెళుతున్నావు అల్లాహ్‌ను నీ తోడుగా చేసుకుని. ఇన్షా అల్లాహ్! నీవు జ్ఞాన నక్షత్రానివి అవుతావు. అది భవిష్యత్తులో ఎంతో వెలుగుతో ప్రకాశిస్తుంది. ఇప్పుడు వెళ్ళు. ఎందుకంటే నీవు వెళ్ళడానికి నేను ఇష్టపడుతున్నాను. గుర్తు పెట్టుకో, నీవు సహాయం కొరకు రక్షణకొరకు అర్థించడానికి ఉత్తమ స్థానం అల్లాహ్‌యే!"**

షాఫ'యి(ర) తన మాతృమూర్తి చేతిని ముద్దాడి వీడ్కోలు తీసుకున్నారు. తాను ఎంతగానో ప్రేమించే తల్లిని బరువైన హృదయంతో వదిలి వెళుతూ వీడ్కోలుగా చేతిని ఊపారు. తన తల్లి తన కొరకు అల్లాహ్‌ను వేడుకుంటూ ఉంటుందని ధృడంగా విశ్వసిస్తూ.

ఓ పేద విద్యార్థి జ్ఞానం కోసం తల్లి నుండి ఓ విలువైన దుఆ తీసుకు వెళుతున్నారు. ఇమామ్ షాఫ'యి(ర)వారు తన తల్లి నుండి విడిపోవడాన్ని ఇలా చెబుతూ వర్ణించారు.

ఎన్నోసార్లు నేను వెనక్కి తిరిగాను నా తల్లికి చేయి ఊపడానికి. ఆమె మా ఇంటి బయట అలాగే స్థిరంగా నిలుచుని ఉన్నారు నావైపే చూస్తూ. నెమ్మది నెమ్మదిగా ఉదయకాలపు పొగమంచులో దృశ్యం మసకబారినట్లు ఆమె రూపం కనుమరుగైంది. అనుగ్రహించబడిన నగరమైన మక్కాను విడిచాను డబ్బు లేకుండా, నా దగ్గరున్నది కేవలం స్థిరమైన **విశ్వాసం**, అల్లాహ్‌పై విశ్వాసంతో నిండిన ఓ **హృదయం** మరియు నా తల్లి **'దుఆ'**. నన్ను నేను విశ్వప్రభువు అల్లాహ్‌కు సంపూర్ణంగా సమర్పించుకున్నాను.''

విశ్వాసంతో నిండిన ఆ తల్లీకొడుకుల దుఆ అనంత కరుణామయుడైన అల్లాహ్‌చే అంగీకరించబడింది. షాఫ'యి(ర) గురువుల దగ్గర ఎంతో జ్ఞానాన్ని సంపాదించారు. జ్ఞానంతో పాటు గురువుగారిచ్చిన వ్యాపార భాగస్వామ్యం ద్వారా ధనం కూడా సంపాదించారు. తల్లిని చూడటానికి సంతోషంగా బయలుదేరారు. ఆయనతో పాటు సంపద కూడా ఉంది. తల్లి మరియు బంధువులు స్వాగతం పలకడానికి ఎదురు చూస్తున్నారు.

చివరికి ఆ తల్లీకొడుకులు ఒకరినొకరు సమీపించే సమయం ఆసన్నమైంది. హఠాత్తుగా తల్లి కళ్ళలో సంతోషం పోయింది. కారణం ఆయనతో పాటు తీసుకువచ్చిన సంపద. తల్లి సంతోషం కోసం ఆయన ఆ సంపదను అవసరంలో ఉన్నవారికి పంచిపెట్టారు. ఉన్న అతికొద్ది సొమ్మును కూడా ఓ బానిస స్త్రీకి ఇచ్చేలా చేశారు ఆ మాతృమూర్తి.

ఆ తల్లికొడుకులు ఇంటికి చేరారు.

ఏ ఇంటి నుండి అయితే జ్ఞానకాంతి కోసం చిల్లిగవ్వ లేకుండా బయలుదేరారో, తిరిగి అదే ఇంటికి చిల్లి గవ్వలేకుండా జ్ఞానకాంతితో చేరుకున్నారు. ఆ తల్లి సంతోషానికి అవధుల్లేవు. తాను కోరుకున్నట్లు తన కుమారుడు జ్ఞానకాంతితో తిరిగి వచ్చాడు.

## జ్ఞానం యొక్క విలువ ఆ మాతృమూర్తికి ఎంత చక్కగా అర్థమైంది!

ఈ సంఘటన ద్వారా మనం ఎన్నో పాఠాలు నేర్చుకోవచ్చు.

- ఉన్నత స్థితికి చేరుకోవడానికి ధనమొక్కటే ప్రధానం కాదు.
- అల్లాహ్‌పై సంపూర్ణ విశ్వాసంతో వేడుకునే 'దుఆ' ఉన్నత స్థానానికి చేరుస్తుంది.
- **నిజమైన జ్ఞానం కలవాడు ఏదైనా ఒక ధర్మసమ్మతమైన వ్యాపారమో లేక ఏదైనా పనిచేసి సంపాదించుకో గలుగుతాడు.**

ఈ పై విషయం నేటి మన మదరసాలలో పొందే శిక్షణ ఎంత తక్కువ స్థాయిలో జరుగుతుందో తెలియజేస్తుంది. **ఇక్కడ ఓ చిన్న చర్చ అవసరం.**

మదరసా నుండి బయటికి రాగానే, తనకున్న ఆలిమ్ సర్టిఫికెట్ చూపించి మస్‌జిద్‌లో ఇమామ్‌గానో లేక నేడు అమలులో ఉన్న బిద్'అత్ వ్యవస్థ అయిన దావా వ్యవస్థ వైపు పోవడమో జరుగుతుంది. ఎవరో ఒకరిపై ఆధారపడి, సత్యం చెప్పడానికి భయపడుతున్నారు. సత్యం చెబితే మస్‌జిద్ ఇమామ్ పోస్ట్ నుండి తీసేస్తారేమోననే భయం. ఆ విధంగా ఇస్లామ్ యొక్క ప్రాథమిక ఆదేశమైనటువంటి **'మంచిని బోధించడం మరియు చెడును నిరోధించడాన్ని'** అమలు చేయలేకపోవడం వలన సామాన్య ముస్లిమ్ చేయగలిగిన పని కూడా చేయలేని పరిస్థితికి లోనవుతున్నాడు. ఇక ఇతని ఆలిమ్ సర్టిఫికెట్ విలువ ఓ తెల్ల కాగితానికి ఉన్న విలువ కంటే ఎక్కువేమీ కావడం లేదు.

**ప్రయోజనకరంకాని జ్ఞానం వలన ఎవరూ జ్ఞాని కాలేరు.**

ఓ మనిషి దగ్గర ధనం ఉన్నప్పుడు అతడు ధనవంతుడు అవుతాడు. ఆ ధనం పోగొట్టుకుంటే అతడు బికారి అవుతాడు. ధనవంతుడు తన ధనాన్ని సత్కార్యాల కోసం ఖర్చు చేస్తే ఆ ధనం వలన ప్రయోజనం ఉంటుంది. ఆ విధంగా కాకుండా చెడుకోసం ఖర్చు పెట్టినా లేక ఉపయోగించ లేకపోయినా ఆ డబ్బుకు విలువలేదు.

జ్ఞానం కూడా అంతే! తఖ్వా ఉన్నవాడు జ్ఞాని అవుతాడు. తఖ్వా (అల్లాహ్ పట్ల భయం) జ్ఞానికి సత్యాన్ని నిర్భయంగా చెప్పగలిగే ధైర్యాన్నిస్తుంది. తద్వారా అల్లాహ్ అనుగ్రహం లభిస్తుంది. జ్ఞానం పెరుగుతుంది. దానితోపాటు తఖ్వా పెరుగుతుంది. ఈ విధంగా ఊహించలేనంత స్థాయిలో ప్రయోజనం ఉంది జ్ఞానికి. కాని ఆ తఖ్వాయే లేకపోతే అంటే ఆ తఖ్వా అతని నుండి దూరమైతే అతడు జ్ఞానిగా పిలుచుకోబడే అర్హత కోల్పోతాడు ఏ విధంగా ధనవంతుడు తన డబ్బంతా పోగొట్టుకున్నాక 'ధనవంతుడు' అనే పేరు కోల్పోతాడో ఆ విధంగా.

ఆనాడు చిన్న వయస్సులోనే ఖుర్ఆన్‌తో పాటు హదీస్‌లు కూడా కంఠస్థం చేసేవారు. కాని నేడు హదీస్‌లను కంఠస్థం చేయడం వరకూ అవసరం లేదు. కనీసం ఓ హదీస్ గ్రంథాన్ని అయినా పూర్తిగా చదవడం లేదు. తఫ్సీర్ ఇబ్నె కసీర్ వంటి ఒక ఖుర్ఆన్ తఫ్సీర్ అయినా పూర్తిగా చదవడం లేదు. చదవడమే రానప్పుడు అధ్యయనం ఇంకెప్పుడు చేస్తారు? అందుకే నేడు జ్ఞానమున్న ఆలిమ్‌లు తక్కువగానూ, జ్ఞానం లేని ఆలిమ్‌లు ఎక్కువగానూ ఉన్నారు.

బుఖారీ(ర)వారు తన తండ్రి ఐశ్వర్యాన్ని వ్యాపారంలో పెట్టుబడిగా ఉంచి, ఆ వచ్చిన సొమ్మును జ్ఞానాన్ని సంపాదించు కోవడానికి ఉపయోగించుకున్నారు. షాఫ'యి(ర)వారి దగ్గర పెట్టుబడి పెట్టడానికి ధనం కూడా లేదు. ఆయన కూడా వ్యాపారం చేసి సంపాదించారు.

అందుకే కొడుకు బాగుకోరే అలనాటి మాతృమూర్తి, తన కుమారుడు జ్ఞానకాంతితో ప్రకాశించాలని కోరుకుంది. జ్ఞానం ఉంటే కుటుంబాన్ని బాగా చూసుకుంటాడు.

పిల్లలకు లక్షలు ఖర్చు చేసి చదివించి విదేశాలకు పంపి, కొడుకు సంపాదన చూచి నేటి తల్లులు ముందు గర్వపడినా, ఆ తరువాత తమ కుమారులు తమను పట్టించుకోకుండా, వృద్ధాప్యంలో ఆసరాగా లేకపోవడంతో చివరిదశలో ఎంతో రోదిస్తున్నారు. అంటే,

**నేటి మాతృమూర్తి నాగరీకంగా ఆలోచిస్తుందా?** లేక

**అలనాటి మాతృమూర్తి నాగరీకంగా ఆలోచించిందా?**

ఆనాటి మాతృమూర్తికి ధర్మం పట్ల అవగాహన ఉంది. కాని నేటి మాతృమూర్తులలో చాలమందికి ధర్మం అంటేనే తెలియని పరిస్థితి నెలకొని ఉంది.

**ఈ పరిచయం వ్యాసం ఇన్షా అల్లాహ్ వచ్చేసంచికలోనూ కొనసాగుతుంది.**

రాబోవు సంచికలో ఇన్షా అల్లాహ్ ఉండబోయే ముఖ్యాంశాలు :

- ఒక స్త్రీపై అందరికంటే హక్కు ఎవరికి ఎక్కువ ఉంటుంది?
- ఒక పురుషునిపై అందరికంటే ఎక్కువ హక్కు ఎవరు కలిగి ఉంటారు?
- తల్లిదండ్రులు బిడ్డ అనురాగాన్ని పొందడంలో మొదటి ప్రాధాన్యత తల్లిదా? లేక తండ్రిదా?
- స్త్రీ తన భర్తకు విధేయత చూపాలి. భర్తకంటే ఎక్కువ విధేయత చూపవలసింది ఎవరికి?
- స్త్రీలు చేసిన త్యాగాలలో గొప్ప త్యాగం చేసిన మాతృమూర్తి ఎవరు?

తరువాయి పేజీలో వధువుకు ఉండవలసిన ఆణిముత్యాల వంటి లక్షణాల గురించి చెప్పడం జరిగింది. ముందుగా అది చదివి, ఆ తరువాత క్రింది విషయాలు చదవండి. ఇంతకు పూర్వం శాంతిబాటలో చాలాసార్లు అరబ్ జాతి వారి గురించి విశ్లేషిస్తూ చెప్పడం జరిగింది. వారు తమ చరిత్రను గ్రంథాల రూపంలో ఉంచుకోలేదు. అవన్నీ పద్యాల రూపంలో కంఠస్థం చేయబడి వారి మనస్సులలోనే భద్రపరచబడ్డాయి.

నేడు చాలామంది తమ ప్రసంగాలలో అరబ్బుల గురించి మాట్లాడేటప్పుడు 'కుఫ్ఫారె మక్కా' అని వారిని సంబోధిస్తూ చెబుతారు. ఇస్లామ్‌కి పూర్వం వారిది అజ్ఞాన కాలమే! నిజమే! అయితే ఆ అజ్ఞానకాలంలో ఓ మాతృమూర్తి తన కుమార్తెకు ఎటువంటి సలహా ఇచ్చారో చూశారా! ఎప్పుడో 1400 సంవత్సరాలకు పూర్వమే అజ్ఞానకాలానికి చెందిన మహిళ ఇంత గొప్పగా కూతురుకి శిక్షణ ఇస్తే, మరి నేటి మహిళలు ఏ కాలంలో ఉన్నట్లు?

**ఆనాటి మహిళలే నిజమైన నాగరీకులుగా కనిపిస్తున్నారు.**

నేడు ఎన్నో వివాహబంధాలు నాశనం కావడానికి ముఖ్య కారణం, భార్యాభర్తల రెండువైపుల ఉన్న పెద్దలు వారి జీవితంలో ప్రతి దశలోనూ జోక్యం చేసుకోవడమే!

తన కూతురి సుఖం కోసమే చేస్తున్నామని అమ్మాయి తరఫు తల్లిదండ్రులు సమర్థించుకుంటారు గాని అల్లుడికి సుఖం లేకుండా చేస్తే కూతురు ఎలా సుఖపడుతుందో వారి అనాగరిక బుర్రలకు అర్థం కాదు. భార్యాభర్తలిరువురిలో ఏ ఒక్కరైనా సంతోషంగా ఉండాలంటే, రెండవవారి సంతోషాన్నికూడా కోరినప్పుడే అది సాధ్యమవుతుంది.

తల్లిదండ్రుల ఐశ్వర్యాన్ని చూసుకుని అహంకారంతో మెలగ కూడదని, భర్తకు సేవకురాలిగా ఉండమని కూతురుకి ఓ తల్లి బోధించింది. ఆ విధంగా చేస్తే భర్త సేవకునిగా మారతాడు అని ఎంత చక్కగా చెప్పిందామె! తన కూతురి ఆలోచనలో అహంకారం లేకుండా చేసింది.

ఒక వివాహ బంధం విడాకుల వరకూ వచ్చిందంటే, దానికి రెండు వైపులా కారణం ఉండవచ్చు. లేదా ఒకవైపే బలమైన కారణం ఉండవచ్చు.

ఇస్లామ్‌లో వరకట్నం లేదు. అమ్మాయికే మహర్‌గా కొంత చెల్లించి అబ్బాయి పెళ్లిచేసుకుంటాడు. కాబట్టి పెళ్ళి కూతురు తన ఇంటి నుండి ఏదీ తీసుకురావలసిన అవసరం లేదు. ఇస్లామ్ ఆదేశాల ప్రకారంగా ఓ మహిళ వ్యవహరిస్తే ఆమె జీవితం సంతోషమయం అవుతుంది. భర్త నుండి మరియు పిల్లల నుండి ఇన్షా అల్లాహ్ ప్రేమను గౌరవాన్ని పొందుతుంది.

**షైతాన్ వలలో పడి జీవితాన్ని దు:ఖమయం చేసుకుంటున్న నేటి మహిళలు తెలుసుకోవలసిన బాధ్యతల గురించి మరియు వారి జీవితాన్ని సంతోషమయం చేసే విషయాల గురించి ప్రతీ సంచికలో కొద్ది కొద్దిగా అందించాలని అల్లాహ్ పేరుతో మొదలుపెట్టిన ఓ చిన్న సీరియల్ ఇది. మాతృసమానులు మరియు సోదరీ సమానులైన మా పాఠక మహిళలను తమ అభిప్రాయాలు వ్రాసి పంపవలసిందిగా కోరుతున్నాము. - శాంతిబాట టీమ్**

## వధువుకు ఉండవలసిన ఆణిముత్యాల వంటి లక్షణాలు

భర్తపట్ల గౌరవమర్యాదలు కలిగి ఉండడం ఈ ఉమ్మత్ యొక్క ఒక ప్రధాన లక్షణం. అది మంచి నడవడికలో ఒక భాగం. అజ్ఞానకాలంలో కూడా ఇది ఆచరణలో ఉండేది. ఇస్లామ్ దీనిని ధృవపరిచింది. మరియు ఇస్లామ్ స్వీకరించాక అరబ్బులు పూర్వపు ఆచరణను శాశ్వతం చేసుకున్నారు.

అరబ్ సంస్కృతి అంతా వాక్చటిమతో కూడిన పదాలతో నిండి ఉంది. తల్లులు తమ కుమార్తెల వివాహ సమయంలో భర్త పట్ల ఉండ వలసిన గౌరవమర్యాదల గురించి మరియు అతనిపై చూపవలసిన శ్రద్ధ గురించి సలహాలిచ్చేవారు. ఇవి అమూల్యమైనవి.

ఇటువంటి వాటిలో బాగా ప్రఖ్యాతి చెందిన ఓ ఉల్లేఖనం అబ్దుల్ మాలిక్ బిన్ ఉమైర్ బిన్ అల్-ఖురేషి గ్రంథస్థం చేశారు. ఈయన హిజ్రీ శకం 2వ శతాబ్దానికి చెందిన ప్రముఖ విద్వాంసుడు. ఈయన గ్రంథస్థం చేసిన మాటలు ఉమామా బిన్త్ హారిస్‌గారివి. ఆమె మంచి వాక్చటిమ మరియు జ్ఞానం కలిగిన మహిళ. ఆమె గొప్ప వివేకం మరియు మానసిక పరిపక్వతతో తన కుమార్తె వివాహ సమయాన వివాహం విజయవంతం కావడానికి సలహా ఇచ్చారు.

ఆ మాతృమూర్తి మాటలు నిజంగా ఆణిముత్యాలే! ఆమె భర్తపేరు ఔఫ్ బిన్ ముహల్లమ్ అష్-షైబాని, ఈయన అజ్ఞాన కాలంలో అరబ్ ఉన్నత వంశానికి చెందిన గౌరవ ప్రతిష్టలు కలిగిన నాయకులలో ఒకరు. ఆయన తన కుమార్తె ఉమ్మె ల్యాస్‌ను హారిస్ బిన్ అమ్ర్ అల్-కిందీకి ఇచ్చి వివాహం చేసారు. ఆమెను అల్లుడితో పంపడానికి సిద్ధం చేశారు.

సరిగ్గా ఆ సమయంలో పెళ్ళి కుమార్తెకు సలహా ఇవ్వడానికి తల్లిగారు దగ్గరికి వచ్చి ఇలా చెప్పారు:

ఓ నా పుత్రీ! నీవు ఓ ఉన్నత వంశానికి వారసురాలివి మరియు మంచి నడవడిక కలదానివి కాబట్టి ఈ సలహా నీకు అనవసరమా అని తలిస్తే ఇది నీకు అనవసరమే అవుతుంది. ఎందుకంటే ఈ గుణాలను నీవు కలిగి ఉన్నావు. కాని ఇది మరచిపోయిన వారికి జ్ఞాపకంగానూ మరియు తెలివైన వారికి సహాయంగానూ ఉంటుంది.

ఓ నా పుత్రీ! తన తండ్రి ఐశ్వర్యం ఉందన్న స్థైర్యంతో భర్త లేకుండా ఓ స్త్రీ అన్నీ చేసుకోగలిగితే మీరంతా భర్త లేకుండానే అన్నీ చేసుకోగలుగుతారు. కాని స్త్రీలు పురుషులకోసం సృష్టించబడ్డారు, పురుషులు వారి కొరకు సృష్టించబడ్డారు. (భార్యాభర్తలు ఒకరికోసం మరొకరు సృష్టించ బడ్డారు).

ఓ నా పుత్రీ! నీవు ఏ ఇంటిలో పెరిగావో, ఎక్కడ నడక నేర్చుకున్నావో ఆ ఇంటిని వదలబోతున్నావు నీకు తెలియని చోటుకి, నీకు సుపరిచితం కాని ఓ సహచరుని దగ్గరకు వెళ్ళడానికి.

నిన్ను వివాహం చేసుకోవడం ద్వారా, అతడు నీకు యజమాని అయ్యాడు కాబట్టి అతనికి సేవకురాలివలే ఉండు, మరియు అతడు నీకు సేవకుని వలే మారతాడు.

నా నుండి పది లక్షణాలను తీసుకో. అవి నీకు ఇచ్చే వస్తుసామాగ్రి మరియు నీ కోసం జ్ఞాపికగా.

వాటిలోని మొదటిది మరియు రెండవది **1 & 2 :** అతని సహచర్యంలో తృప్తిగా ఉండు మరియు అతని మాటవిని అతనికి విధేయురాలిగా ఉండు. సంతృప్తి మనశ్శాంతినిస్తుంది మరియు భార్య తన భర్త మాట విని విధేయత చూపడం అల్లాహ్‌ను సంతోషపెడుతుంది.

**3 & 4 :** నీవు సువాసనతో మరియు బాగా కనిపించేలా ఉండు, అతడు నీలో ఏ విధమైన వికారాన్ని చూడకూడదు. మరియు నీ నుండి ఆహ్లాదకరమైన వాసన తప్ప మరేదీ రాకూడదు. కాజల్ (కాటుక) అలంకరణకి ఉత్తమ రకమని తెలుసుకో మరియు నీటిని అరుదైన వాటిలో కెల్లా అరుదైన పరిమళద్రవ్యమని తెలుసుకో!

**5 & 6 :** అతనికి భోజనం సమయానికి సిద్ధపరచు. మరియు అతడు నిద్రలో ఉండగా చప్పుడు చేయకు. ఆకలి తీవ్రత మండుతున్న జ్వాల వంటిది మరియు నిద్రాభంగం అతనికి కోపం తీసుకురావచ్చు.

**7 & 8 :** అతని నౌకర్ల పట్ల మరియు పిల్లల పట్ల శ్రద్ధ వహించు మరియు అతని ఐశ్వర్యాన్ని జాగ్రత్తగా చూడు. అతని ఐశ్వర్యం విషయంలో తీసుకునే జాగ్రత్త అతనిని మెచ్చుకున్నట్లు అవుతుంది. మరియు అతని పిల్లలు మరియు నౌకర్ల పట్ల చూపే శ్రద్ధ మంచి నిర్వహణను తెలియజేస్తుంది.

**9 & 10 :** భర్త రహస్యాలలో దేనినీ ఎన్నటికీ బయట పెట్టకు మరియు అతని ఆదేశాలకు అవిధేయత ఎన్నటికీ చూపకు. నీవు అతని రహస్యాలను బహిర్గతం చేస్తే అతనికి చేసిన ద్రోహభావం నుండి నీవెన్నటికీ క్షేమాన్ని అనుభూతి చెందవు. మరియు నీవు అతనికి అవిధేయత చూపితే అతని హృదయం నీపట్ల ద్వేషంతో నిండి పోతుంది.

జాగ్రత్త! ఓ నా పుత్రీ! అతడు విచారంలో ఉన్నప్పుడు అతని ముందు సంతోషాన్ని చూపకు మరియు అతడు సంతోషంగా ఉన్నప్పుడు అతని ముందు విచారాన్ని చూపకు. ఎందుకంటే మొదటిది యుక్తాయుక్త పరిజ్ఞానం లేకపోవడాన్ని చూపిస్తే, తరువాతది బాధ కలిగిస్తుంది.

నీకు సాధ్యమైనంత స్థాయిలో అతని పట్ల గౌరవమర్యాదలు చూపు మరియు వీలైనంత ఎక్కువగా నీవు అతనికి అనుకూలంగా ఉండు. **అప్పుడు నీ సహచర్యం నీతో సంభాషణ అతనిని ఆనందింప జేస్తుంది.**

తెలుసుకో, ఓ నా పుత్రీ! నీవిష్టపడింది నీవెప్పుడూ సాధించలేవు అతని సంతోషాన్ని నీ సంతోషానికంటే ముందుగా మరియు అతని కోరికలను నీ కోరికలకంటే ముందుగా ఉంచేవరకూ, అది ఏదైనా సరే నీకు నచ్చినా నచ్చకపోయినా. నీకేది ఉత్తమమో మరియు నీకేది రక్షణో అల్లాహ్ ఎంచుగాక!

ఆమె తన భర్త దగ్గరకు తీసుకెళ్ళబడింది మరియు ఆ వివాహం విజయవంతం అయింది. ఆమెకు జన్మించినవారు తరువాత రాజులై (kings) పరిపాలించారు.

# పాఠకుల అభిప్రాయాలు

**అరబీలో కూడా ఇవ్వమని ...**

'శాంతిబాట'లో ఖుర్ఆన్ ఆయత్‌లకు తెలుగు అనువాదాన్ని మాత్రమే ఇస్తున్నాము. ఆ ఆయత్ యొక్క అరబీ మూలాన్ని ఇవ్వడం లేదు. వాటికి అరబీ మూలాన్ని కూడా అందిస్తే బావుంటుందని సౌదీ నుండి ఓ సోదరుడు మెస్సేజ్ పంపారు. ఖుర్ఆన్ వాక్యాలను అరబీలో చదివితేనే పుణ్యం వస్తుందని మరియు హదీస్‌లకు అరబీ మూలం ఇవ్వకపోయినా ఫర్వాలేదని సోదరుడు అభిప్రాయపడ్డారు.

ఖుర్ఆన్ ప్రతీ ఇంట్లో లేకపోయినా ప్రతీ ఊరిలో కనీసం మస్జిద్ లోనైనా లభిస్తుంది. మేము అందించే తెలుగు అనువాద వాక్యానికి సంబంధించి అరబీ మూలాన్ని ఖుర్ఆన్‌లో చూసుకోగలరు. కాని ప్రముఖ నగరాల్లో ఉండే అతి పెద్ద మస్జిద్‌లలో కూడా ముఖ్య హదీస్ గ్రంథాలు దొరకడం కష్టంగా ఉంది. కాబట్టి కొన్ని హదీస్‌లకు అరబీ మూలాన్ని తప్పనిసరిగా అందించాలి. అరబీ భాష తెలిసిన వారు ఆ హదీస్ అనువాదాన్ని చెక్ చేసుకోవడానికి వీలవుతుంది. పుణ్యం కోసం మరియు కరుణింపబడటానికి ప్రతీరోజూ ఖుర్ఆన్ చదువుతూ ఉండాలి. 'శాంతిబాట' కేవలం ఓ పత్రిక మాత్రమే. ఖుర్ఆన్ మరియు ముహమ్మద్(స)వారి బోధనల గురించి తెలియజేస్తూ, వాటిని చదవమని ప్రోత్సహించడమే శాంతిబాట ప్రధానోద్దేశ్యం. 'శాంతిబాట' ప్రతీ రోజూ చదవడం కోసం కాదు. ప్రతీరోజూ ఖుర్ఆన్ మరియు హదీస్‌లనే చదవండి.

**పాఠకులకు కృతజ్ఞతలు**

సత్యాన్ని నిర్భయంగా చెప్పే పత్రిక - శాంతిబాట. పాఠకులు కూడా సత్యానికి మద్దతుగా నిలిచారు. ఇది ఒక శుభపరిణామం. వారికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు. సివిల్ సర్వీసెస్ కోసం ఎంతో కష్టపడి చదివి ఐఏఎస్ అధికార్లు అవుతారు. పాలనా యంత్రాంగానికి సంబంధించి అన్ని నియమాలు వారికి తెలుసు. మంచి జ్ఞానం మరియు దానితో పాటు అధికారం కూడా ఉంటుంది. జ్ఞానం మరియు అధికారం కలిగిన వీరి వలన మన సమాజానికి మంచి జరగాలి. కాని 2011 సంవత్సరంలో 11 మంది ఐఏఎస్ ఆఫీసర్లు అవినీతి కేసుల్లో అరెస్ట్ గావించబడ్డారు. ఇంత కష్టపడి చదివింది అవినీతి ద్వారా సంపాదించ డానికా? సమాజాన్ని అవినీతిమయం చేయడానికా?

ఈ అవినీతి కేవలం వీరికి మాత్రమే పరిమితమా? కాదు అవినీతి అన్ని రంగాలలోకి ప్రాకింది. ధర్మం పేరుతో జరిగే మోసం వేల సంవత్సరాల నుండి జరుగుతూనే ఉంది. ధర్మం గురించి అవగాహన ప్రజలలో లేనంత వరకూ ఈ దోపిడీ జరుగుతూనే ఉంటుంది. ప్రజలలో ధర్మంపై అవగాహన రాకుండా ప్రయత్నాలు జరుగుతూనే ఉంటాయి. సత్యం ప్రజల ముందుకు రాకుండా కొందరు విద్వాంసులు దాచిపెడతారు. వారు దాచిపెట్టిన సత్యాన్ని ఇతర విద్వాంసులు ప్రజలకు తెలపాలి. అది వారి కనీస బాధ్యత. కాని వారు ధైర్యం చేయలేక పోతున్నారు. ప్రవక్త(స)వారి కాలంలో సత్యాన్ని ప్రజలకు తెలపడానికి మరియు తెలిపినందుకు ఎందరో ఎన్నో త్యాగాలను చేయవలసి వచ్చింది. ప్రాణాలు కూడా కోల్పోయారు.

సత్యాన్ని ప్రేమించే కొందరు విద్వాంసులు జరుగుతున్న ఈ దోపిడీలను బయటపెట్టడానికి ధైర్యం చేయలేకపోవడానికి కారణం ఏదైనా కావచ్చు. వారు 'శాంతిబాట' ధైర్యాన్ని చూసి అభినందిస్తున్నారు. సత్యాన్ని దాచివేయడానికి ఎంతమంది ఎన్ని విధాల ప్రయత్నించినా, **అల్లాహ్ ఏదో రూపంలో సత్యాన్ని ప్రజలకు తెలియజేస్తారు.** క్రిందటి సంచికలో 'జేబుదొంగలున్నారు జాగ్రత్త' అని బ్యాంకులలో ఉండే బోర్డులను ఉదాహరించి ఓ వివరణ ఇచ్చాము. ఇది ఇచ్చిన వెంటనే ఇద్దరు తోడుదొంగలు భుజాలు తడుముకుంటూ బయటపడ్డారు. మేము ముహమ్మద్(స)వారి బోధనలను అనుసరించేవారము కనుక, **ఆ బోధనల ప్రకారం వారి పేర్లు ఇక్కడ చెప్పడం లేదు.** ఆ ఇద్దరిలో ఒకరు దాయీ, మరొకరు ఆలిమ్. వారి కారెక్టర్ ఎటువంటిదో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అందరికీ తెలుసు. 'శాంతిబాట' ద్వారా వీరి అధర్మ వ్యాపారానికి కొంతమేర దెబ్బ తగిలింది.

"శాంతిబాట" చదవవద్దని ప్రతీ మస్జిద్‌లో ప్రకటించడానికి ఓ పథకం వేసుకుని దానిని వేరే ప్రోగ్రామ్‌గా అందరినీ నమ్మిస్తూ తూర్పు మరియు పశ్చిమ గోదావరి జిల్లాలలో పర్యటించారు. ఏదో ఒక కొత్త ప్రోగ్రామ్ పెట్టడం, దాని గురించి చెప్పుకుని విదేశాల నుండి డబ్బు గుంజడం బాగా అలవాటయిపోయింది వీరికి. ఇతర మస్జిద్‌లలో చెప్పినట్లు వీరు సామర్లకోట మస్జిద్‌కి వచ్చినప్పుడు 'శాంతిబాట' గురించి ఏ విషయమూ ప్రస్తావించలేదు. మునాఫిక్‌లకు ఎటువంటి లక్షణాలుంటాయో ఒక వ్యాసంలో మేము తెలియజేశాము. పాఠకులకు ఆ వ్యాసం ఓసారి జ్ఞప్తికి వచ్చి ఉండవచ్చని అనుకుంటున్నాము.

శాంతిబాట టీమ్‌లోని ఎవరి ముందైనా నిలబడి చెప్పగలిగే ధైర్యం వీరికి లేదు. **'శాంతిబాట ఎందుకు చదవకూడదు? సత్యాలు చెబుతున్నందుకా?'** అని వారిని అక్కడి పాఠకులు నిలదీసి అడిగి వారి నోరు మూయించారు. ధర్మం పేరుతో వీరు చేస్తున్న దోపిడీ గురించి ప్రజల ముందుకు తీసుకు వచ్చామని ఈ విధంగా వారు బరితెగించారు. పేదవారికి అందవలసిన జకాత్ సొమ్మును దోచుకుని తింటున్న వీరికి, శాంతిబాట ద్వారా సత్యం తెలిశాక చాలామంది జకాత్ ఇవ్వడం మానివేశారు. 'శాంతిబాట'లో వ్రాసినది 'తప్పు' అని నమ్మించడానికి విశ్వ ప్రయత్నం చేసి భంగపడ్డారు. 'శాంతిబాట'లో చెప్పినవి తప్పు అని అనడానికి **ఎవరి దగ్గర ఆధారాలు లేవు.**

'శాంతిబాట' కేవలం అల్లాహ్ అనుగ్రహంతో మాత్రమే నడిచే పత్రిక. జమాత్‌లకు అతీతంగా నడిచే పత్రిక. ఏ జమాత్‌కూ ఇది అనుబంధ

**మీ అభిప్రాయాలను, విమర్శలను కార్డుపై వ్రాసి 'వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ' ఎడ్రస్‌కు గాని లేదా** velugubaata@gmail.com **కు పంపండి.**

పత్రిక ఎంతమాత్రం కాదు. జమాత్‌ల మధ్య ఐక్యత కోసం కృషి చేసే పత్రిక. మేము ఐక్యత కోసం పనిచేయడం చూసి ఉపద్రవాలకు కారణమయ్యే వారు సహించలేకపోతున్నారు. వారు కలిసి ఉన్న జమాత్‌లను రెండేసి ముక్కలుగా చేసుకుంటూ పోతారు. సత్యాన్ని దాచి ప్రజలను మోసగించి లాభపడదామని అనుకుంటున్నారు.

**నిశ్చయంగా ఎవరైతే అల్లాహ్‌ గ్రంథంలో అవతరింపజేసిన సందేశాలను దాచి, దానికి బదులుగా అల్ప లాభం పొందుతారో, అలాంటివారు తమ కడుపులను కేవలం అగ్నితో నింపుకుంటున్నారు. మరియు అల్లాహ్‌ పునరుత్థాన దినమున వారితో మాట్లాడడు. మరియు వారిని శుద్ధి పరచడు మరియు వారికి బాధాకరమైన శిక్ష ఉంటుంది.** (ఖుర్‌ఆన్‌ 2:174)

అల్లాహ్‌ను మరియు ఆయన సందేశహరుడైన ముహమ్మద్‌(స)వారిని ప్రేమించేవారికి 'శాంతిబాట' నచ్చింది. ఆంధ్రప్రదేశ్‌, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో తెలుగు చదవగలిగే ముస్లిములు 'శాంతిబాట'ను ఆదరిస్తున్నారు. ఇండియాలో మాత్రమే కాకుండా మరో 22 దేశాలలో తెలుగు చదివే వారు మా వెబ్‌సైట్‌ www.saanthibaata.net ద్వారా ఉచితంగా 'శాంతిబాట' పత్రికను డౌన్‌లోడ్‌ చేసుకుని చదువుతున్నారు. వారి నుండి ఎన్నో అభినందనలు అందుతున్నాయి. అల్‌హమ్దులిల్లాహ్‌!

ఏ అవినీతిపరుడైనా 'శాంతిబాట'లో చెప్పింది తప్పు అంటే, ఆధారం చూపమనండి. సరియైన నిజమైన ఆధారం చూపకపోతే అటువంటి వారిని దూరంగా ఉంచడం మీకు మంచిది. అటువంటి వారి కొరకు మరియు ప్రోగ్రామ్‌ల కొరకు అల్లాహ్‌ మీకనుగ్రహించిన విలువైన డబ్బును మరియు విలువైన సమయాన్ని వృథా చేయకుండా అనాథలకు, అభాగ్యులకు, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు మీ శక్తిమేర సహాయం చేయమని మనవి చేసుకుంటున్నాము. దావా వ్యవస్థ ఓ బిద్‌అత్‌ వ్యవస్థ. దావా పేరుతో యువకుల కెరీర్‌ను పాడుచేస్తున్నారు. **ప్రతీరోజూ ఖుర్‌ఆన్‌ చదవండి మరియు ఇతరుల చేత చదివించండి.**

**పత్రిక పంపడం ఆపినందుకు .....**

పాఠకులలో కొందరికి అక్టోబర్‌ 2011 సంచిక పంపలేదు. అందువలన కొందరు సోదరులు నొచ్చుకున్నారు. కట్టిన చందా మొత్తం అయిపోతే డబ్బు పంపమని ఫోన్‌ చేసి చెప్పవచ్చు కదా అని ఫీల్‌ అవుతూ చెప్పారు. కేవలం తొలి ఆరు నెలలు కొరకు మాత్రమే చందా కట్టినవారికి సైతం 2 సంవత్సరాల పాటు పత్రికను ఆపకుండా పంపాము. పత్రికా ముఖంగా ఎన్నోసార్లు విజ్ఞప్తి కూడా చేశాము. దాదాపు 800 మందికి క్రిందటి సంవత్సరం ఫోన్‌ చేసి కూడా చెప్పాము. అయినప్పటికీ చాలా మంది బద్ధకించారు. చందా 200 రు॥లు వారికి తక్కువే కావచ్చు. కాని ఓ 500 మంది చందా కట్టకపోతే అది లక్ష రూపాయలవుతుంది. అది మాకు చిన్న మొత్తమేమీ కాదు.

నేడు పత్రికలు నడుస్తున్నది వ్యాపారప్రకటనల ద్వారా లభించే ఆదాయంతోనే. కొన్ని పత్రికలకు ఆర్థికంగా సపోర్ట్‌ చేసే సంస్థలు కూడా ఉన్నాయి. 'శాంతిబాట'లో వ్యాపార ప్రకటనలు ఉండవు మరియు ఆర్థిక వనరులు సమకూర్చే సంస్థలేమీ లేవన్న విషయం మీకందరకు తెలిసిన విషయమే! సర్వశక్తివంతుడైన అల్లాహ్‌ అనుగ్రహంతోనే ఈ ప్రతిక నడుస్తుంది. వాస్తవాన్ని ప్రజలకు తెలియజేయాలనే సంకల్పంతో అల్లాహ్‌ పట్ల భీతితో కొందరు సోదరులు నడుపుతున్న పత్రిక ఇది. ఆర్థిక భారం పెరిగింది. పత్రికలోని మా విజ్ఞప్తి చదివి వెంటనే స్పందించి కొందరు చందా రెన్యువల్‌ చేశారు. చందాదారులు అందరూ మాకు ఒక్కటే! పరిస్థితిని అర్థం చేసుకోమని కోరుతున్నాము. ఫోన్‌లు చేస్తూనే ఉన్నాము. కొన్ని నంబర్లు మారిపోవడం వలన గాని లేక అవి రెస్పాండ్‌ కాకపోవడం వలన గాని అందరితో ఫోన్‌లో మాట్లాడటం కుదరలేదు. మేము పత్రికా ముఖంగా విజ్ఞప్తి చేసినప్పుడు సందేహమున్న పాఠకులు మాకు ఫోన్‌ చేసి తెలుసుకోవచ్చు. కొందరు సోదరులు అవసరమైతే ఆర్థికంగా సహకరిస్తామని చెప్పారు. మేము ఆర్థిక సహాయం కొరకు ఎవరినీ కోరలేదు. 'శాంతిబాట'కు చందాదారులుగా మీ ఊరి నుండి కొంతమందిని చేర్చండి. చందాదారులను చేర్చడం ద్వారా మీరు మాకు ఎంతైనా సహాయం చేయవచ్చు.

**పరిశోధన**

కొన్ని వ్యాసాల కోసం పరిశోధన అవసరమౌతుంది. దాని కొరకు ఒకొక్క సారి చాలా సమయం కేటాయించవలసి వస్తుంది. ఏ వ్యాసానికి ఎంత సమయం అవసరమౌతుందో చెప్పలేని పరిస్థితి. అందువలన పత్రిక ఆలస్యం అవుతుంది. పత్రిక కోసం నిరంతరం పని జరుగుతూనే ఉంటుంది. పత్రిక ఆలస్యం మా అలక్ష్యం వలన కాదని మనవి చేసుకుంటున్నాము.

**చేతబడి ...**

ఈ సీరియల్‌ గురించి మంచి స్పందన వచ్చింది. కొందరు కొన్ని సందేహాలు వ్యక్తం చేశారు. ఈ శీర్షిక తొలి వ్యాసంలోనే ఒక విషయం స్పష్టం చేశాము. అదేమిటంటే, సీరియల్‌ పూర్తి అయ్యేవరకూ ఈ సబ్జక్టుపై మమ్మల్ని ఏమీ అడగవద్దని. చాలా ముఖ్యమైన విషయాలు చెప్పవలసి ఉంది. అవన్నీ పూర్తి అవగానే మీకే స్పష్టం అవుతుంది. ఈ సీరియల్‌లో తౌహీద్‌ గురించి చెప్పిన విషయాలు బాగున్నాయని చెప్పారు. మూఢ నమ్మకాలకు ఇస్లామ్‌లో చోటు లేదు. ఈ సీరియల్‌ పూర్తి అయ్యేసరికి ఇన్షాఅల్లాహ్‌ అనవసర భయాలకు పాఠకులు లోనవరని మా నమ్మకం.

**శాంతిబాట వెనుకటి సంచికలు చూడండి....**

కొందరు దావా గురించి మరియు దాయీల గురించి మరియు తులనాత్మక అధ్యయనాల గురించి మమ్మల్ని అడుగుతున్నారు. వాటికోసమయితే శాంతిబాట వెనుకటి సంచికలు చూసుకోమని ఇంతకు పూర్వమే పత్రికాముఖంగా ప్రకటించాము. వాటి గురించి ఎటువంటి సందేహాలనైనా మమ్మల్ని అడగవద్దు. ఖుర్‌ఆన్‌ మరియు హదీస్‌ల వెలుగులో స్పష్టంగా ఇంతకు పూర్వమే వివరించాము. ఫోన్‌లో సందేహాలన్నీ తీర్చడం మాకు వీలు కాదు. అంత సమయం కూడా మాకు ఉండదు. దయచేసి గమనించమని కోరుతున్నాము.

**ఇల్మ్‌ లేకపోతే తఖ్వా లేదు. తఖ్వా లేని ఆలిమ్‌ ఎంత పెద్ద మదరసాలో చదివినా ప్రయోజనమేమీ లేదు. అటువంటి అవినీతి ఆలిమ్‌లపై ఆధారపడితే సమాజం పతనం అవుతుంది. ఆలోచించండి!**

**Printed by** Md. Athaharullah, **Published by** Md. Athaharullah **Owned by** Velugubaata Educational Society (Regd.No. 569/2008), Samalkot and **Printed at** Saanthibaata Printing House, 19-1-447, Hanuman Statue Center, Samalkot - 533440 and **Published at** 2-8-31, Kota Bazar, Samalkot - 533440, **Editor:** Md. Athaharullah , Phone : 9347046090, Email: velugubaata@gmail.com, RNI Regd. No. APTEL/2009/29650



www.saanthibaata.net
New Look!
saanthibaata
శాంతిబాట
హోమ్
The first Islamic Research Magazine in Telugu.
A source for the most authentic information about Islam in Telugu
SAANTHIBAATA
CLICK HERE
www.saanthibaata.com
saanthibaata
డౌన్‌లోడ్ మేగజైన్
FIRST YEAR
Location
website visited from 23 countries
బుక్స్
FREE BOOKS
దుష్ప్రచారం
Download Free
www.saanthibaata.net
www.saanthibaata.com
Designed & Maintained by SAANTHIBAATA TEAM

**SAANTHIBAATA MONTHLY** **November & December, 2011** Samalkot-533440 (East Godavari Dist.)
**Registered with Registrar of News Papers for India** **RNI Reg. No. APTEL/2009/29650**
**Postal Concessional Registration No. AP/KD/140/2011-2013**

ఖురైష్‌లోని మఖ్జూమ్ తెగకు చెందిన ఒక ఉన్నత వంశపు స్త్రీ దొంగతనం చేసింది. వారు అన్నారు : "ఆమె గురించి ఎవరు మాట్లాడతారు?" అంటే ముహమ్మద్(స)వారితో. వారు అన్నారు :

"ఎవరు ధైర్యం చేయగలరు, ప్రవక్త(స)వారికి ప్రియమైన ఉసామా బిన్ జైద్(రజి) తప్ప?" కాబట్టి ఉసామా ఆయన(స)తో మాట్లాడారు మరియు అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : "ఓ ఉసామా! అల్లాహ్ శిక్షలలోని ఒక దాని గురించి సిఫారసు చేస్తున్నావా?" తరువాత ఆయన నిలుచుని ప్రసంగించి చెప్పారు:

"మీ ముందు వచ్చినవారు (పూర్వపు జాతులు) వారిలో ఉన్నత వంశస్థుడు దొంగతనం చేస్తే, వారు అతనిని వదిలేసేవారు మరియు వారిలో ఒక సామాన్యుడు దొంగతనం చేస్తే, వారు అతనిపై శిక్షను అమలు చేసేవారు. కేవలం అందుకే వారు నాశనమయ్యారు. అల్లాహ్ సాక్షి! ఒకవేళ ఫాతిమా బిన్త్ ముహమ్మద్(రజి) దొంగతనం చేసినా, నేను ఆమె చేతిని ఖండిస్తాను" (అబూదావూద్, సహీహ్ హదీస్, నెం. 4373, పుస్తకం 37, అధ్యా.4, సంపుటి 5)

---

## ఉన్నత కుటుంబం వారికి ఒక న్యాయం
## సామాన్యులకు మరొక న్యాయం
## అమలు చేసే జాతులు నాశనమై పోతాయి

---

Visit
www.saanthibaata.net

23 దేశాలలోని తెలుగు పాఠకులచే వీక్షించబడుతున్న
తెలుగు ఇస్లామీయ వెబ్‌సైట్